సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 109

బుధవారం 3-1-2024



'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'



సమం చేస్తారా...అప్పగిస్తారా!

కేప్‌టౌన్‌లో నేటి నుంచి దక్షిణాఫ్రికాతో భారత జట్టు రెండో టెస్టు - 12లో



రూ.70 వేలకు పుత్తడి

10 గ్రాముల బంగారం ధర గరిష్ట స్థాయిని తాకుతుందని అంచనా - 13లో

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



జపాన్‌లో 155 ప్రకంపనలు

జపాన్‌లో సోమ, మంగళవారం సంభవించిన వరుస భూ ప్రకంపనలతో 50 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు.

వివరాలు 6లో ▸



రాష్ట్రాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి

రాష్ట్రాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని.. 2047కల్లా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దుదామని ప్రధాని మోదీ అన్నారు.

వివరాలు 6లో ▸



కొరియా ప్రతిపక్ష నేతకు కత్తిపోట్లు

దక్షిణ కొరియాలో మీడియాతో మాట్లాడుతున్న ప్రతిపక్ష డెమొక్రాటిక్ పార్టీ నేత లీ జే మ్యుంగ్‌ను ఓ ఆగంతకుడు కత్తితో మెడపై పొడిచాడు.

వివరాలు 6లో ▸



వలసలను అడ్డుకున్నాం

చిన్నచిన్న పడవల ద్వారా దేశంలోకి అక్రమంగా ప్రవేశించే వారిని 36% మేర అడ్డుకున్నట్లు బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ చెప్పారు.

వివరాలు 6లో ▸

'పెద్ద' భరోసా..!

బోధనాస్పత్రుల్లో గణనీయంగా పెరిగిన సేవలు

అరుదైన రుగ్మతలకు విజయవంతంగా చికిత్స

- కార్పొరేట్‌ను తలదన్నేలా సదుపాయాలు
- గత సర్కారు హయాంతో పోలిస్తే మైనర్ సర్జరీలు 73 శాతం, మేజర్ సర్జరీలు 52 శాతం పెరుగుదల
- 2023-24వ సంవత్సరంలో ఇప్పటికే 4.76 లక్షలు దాటిన మేజర్ సర్జరీలు
- రికార్డు స్థాయిలో ఐపీ, ఓపీ, ల్యాబ్ టెస్టులు
- సీఎం జగన్ చర్యలతో సర్కారు వైద్యం బలోపేతం.. ప్రభుత్వాస్పత్రులపై ప్రజల్లో పెరిగిన విశ్వాసం

సాక్షి, అమరావతి: ఉమ్మడి కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లా వాసులకు పెద్దాస్పత్రి అంటే విజయవాడ జీజీహెచ్! 2019కి ముందు వరకూ ఇక్కడ న్యూరో విభాగంలో వైద్యులు అరకొరగా ఉండటంతో సేవలపై తీవ్ర ప్రభావం పడేది. రోజంతా కలిపినా కేవలం వంద లోపే ఓపీలు నమోదు అయ్యేవి. ఐపీలు అంతంత మాత్రంగానే ఉండేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక న్యూరో విభాగంలో మంజూరైన పోస్టులన్నింటిలో

మిగతా 2వ పేజీలో ▶



విజయవాడ ప్రభుత్వాస్పత్రిలోని న్యూరాలజీ వార్డులో అత్యాధునిక పరికరాలతో వైద్య సేవలు

> కడుపు కింద భాగంలో జిస్ట్ అనే కణితి సమస్యతో బాధపడుతున్న విజయవాడకు చెందిన సునీల్‌కు గతేడాది మార్చిలో గుంటూరు జీజీహెచ్‌లో క్లిష్టమైన సర్జరీ విజయవంతంగా పూర్తైంది. బాధితుడికి చిన్న పేగు డ్యూడెనమ్, జెజునమ్ జంక్షన్ దగ్గర కణితి ఉన్నట్లు జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ కిరణ్ కుమార్ గుర్తించారు. మెడికల్ జర్నల్స్ ప్రకారం ప్రపంచంలో ఇటువంటి కేసులు రెండు మాత్రమే నమోదయ్యాయి. అరుదైన ఈ సమస్యకు ఎలా ఆపరేషన్ చేయాలో నిర్దిష్ట విధానాలు లేకున్నా జనరల్ సర్జరీ విభాగం వైద్యులంతా చర్చించుకుని సాహసోపేతంగా నిర్వహించారు.

జన బలమే గీటురాయి..

- 24 అసెంబ్లీ, 3 ఎంపీ స్థానాలకు పార్టీ సమన్వయకర్తలను నియమించిన సీఎం జగన్
- 11 శాసనసభ స్థానాలకు సమన్వయకర్తలతో ఇప్పటికే తొలి జాబితా

- మొత్తం 35 శాసనసభ, మూడు లోక్‌సభ స్థానాలకు నూతన సమన్వయకర్తలు
- సామాజిక న్యాయం, మహిళలు, యువతకు పెద్దపీట
- గతంలో అగ్రవర్ణాలకు కేటాయించిన ఏడు శాసనసభ స్థానాల్లో తాజాగా ఐదు చోట్ల బీసీలు, రెండు చోట్ల మైనార్టీలకు అవకాశం
- 175కు 175 స్థానాల్లోనూ విజయమే లక్ష్యంగా అవసరమైన చోట్ల మార్పులు



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

సాక్షి, అమరావతి: నిరంతరం ప్రజాక్షేత్రంలో గడుపుతూ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను సమర్థంగా ముందుకు తీసుకెళ్లి ప్రజల మనసులకు మరింత చేరువైన నేతలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారు. సామాజిక న్యాయంలో మరో అడుగు ముందుకేశారు. బీసీలు, మహిళలకు ప్రాధాన్యమిస్తూ సామాజిక సాధికార ఛాంపియన్ అని మరోసారి రుజువు చేసుకున్నారు. మహిళలు, యువతకు మరింత ప్రాధాన్యం ఇస్తూ 24 శాసనసభ స్థానాలు, 3 లోక్‌సభ స్థానాలకు పార్టీ సమన్వయకర్తలను నియమిస్తూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండో జాబితాను ఖరారు చేశారు. గతంలో అగ్రవర్ణాలకు అవకాశం కల్పించిన ఏడు అసెంబ్లీ స్థానాల్లో తాజాగా ఐదు చోట్ల బీసీలను సమన్వయకర్తలుగా నియమించడం

మిగతా 10వ పేజీలో ▶

ఫ్యాక్ట్‌చెక్

'కట్టలు' తెగిన అక్కసు

- దుర్భిక్ష రాయలసీమ పచ్చబడుతుంటే జీర్ణించుకోలేని రామోజీ?
- గాలేరు–నగరి, హంద్రీ–నీవా ద్వారా కృష్ణా జలాలను గరిష్ఠంగా రాయలసీమకు తరలిస్తున్న సీఎం జగన్
- రైతుల్లో సీఎం జగన్‌కు రోజురోజుకు పెరుగుతున్న మద్దతు
- అందుకే 'ఈనాడు' తప్పుడు కథనాలు

14లో

అన్నంపై 'ఘోర' అబద్ధాలు

- పేద పిల్లలకు రోజుకో మెనూ రుచించని రామోజీ
- నిత్యం సగటున 34.90 లక్షల మందికి 'గోరుముద్ద'
- 6రోజులకు 16రకాల వంటకాలు
- పిల్లల భోజనానికి బాబు పాలనలో ఏటా రూ.450 కోట్లు.. నీళ్ల సాంబారే దిక్కు
- ఇప్పుడు సగటున రూ.1,450 కోట్లు.. రోజుకో మెనూతో పౌష్టికాహారం

3లో

హైదరాబాద్ నాంపల్లిలో పెట్రోల్ బంక్ వద్ద బారులుతీరిన వాహనదారులు



రోజంతా అల్లాడించి.. రోడ్డెక్కిన ట్రక్కులు

- హిట్ అండ్ రన్ కేసుల్లో ప్రతిపాదిత కఠిన చట్టాలను నిరసిస్తూ లారీలు, ట్రక్కుల డ్రైవర్లు చేపట్టిన సమ్మె దేశవ్యాప్తంగా అత్యవసర సేవల్లో తీవ్ర అంతరాయానికి దారి తీసింది. సమ్మె కొనసాగుతుందన్న ప్రచారంతో దేశమంతటా వాహనదారులు పెట్రోల్ బంకులకు పోటెత్తారు. దీంతో నగరాలు, పట్టణాల్లో భారీ ట్రాఫిక్ జామ్‌లకు దారితీసింది. మరోవైపు కేంద్రంతో ఆలిండియా మోటార్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ జరిపిన చర్చలు ఫలించాయి.

6లో

పింఛనే కాదు.. పెన్షనర్లూ పెరిగారు

- కొత్తగా మరో 1,17,161 మందికి పింఛన్లు మంజూరు చేసిన వైఎస్ జగన్ ప్రభుత్వం
- ఇప్పటికే 2 రోజులుగా జరుగుతున్న పెన్షన్ల పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొంటున్న ప్రజాప్రతినిధులు
- నేడు కాకినాడలో జరిగే కార్యక్రమంలో పాల్గొననున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- పింఛన్ల మొత్తం రూ.1,967.34 కోట్ల మెగాచెక్ ఆవిష్కరణ
- అభివృద్ధి పనులకూ ప్రారంభం
- పెన్షన్ల పంపిణీపై రాష్ట్రానికి దక్కిన స్కోచ్ ప్లాటినం అవార్డును కార్యక్రమంలో చూపించనున్న సీఎం జగన్



ఒంగోలులో పందిళ్ల వెంకట సుబ్బమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ఆమని

సాక్షి, అమరావతి/కాకినాడ: అవ్వాతాతలతో పాటు వితంతు, వివిధ రకాల చేతివృత్తిదారులకు నెలనెలా ఇచ్చే పెన్షన్ మొత్తం ఈనెల నుంచి రూ.మూడు వేలకు సీఎం వైఎస్ జగన్ సర్కారు పెంచిన సందర్భాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న పింఛను పెంపు ఉత్సవాలు కోలాహలంగా సాగుతున్నాయి. వలంటీర్లు ఓ వైపు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్ల పంపిణీ కార్యక్రమం కొనసాగిస్తుండగా.. మరోవైపు రెండ్రోజులుగా

మిగతా 2వ పేజీలో ▶



మంటల్లో విమానం!

- జపాన్‌లోని టోక్యో ఎయిర్‌పోర్టులో కోస్ట్‌గార్డు విమానాన్ని ఢీకొట్టిన ప్రయాణికుల విమానం
- ల్యాండ్ అవుతుండగా ప్రమాదం.. వెంటనే వ్యాపించిన మంటలు
- ప్రాణాలతో బయటపడిన 379 మంది ప్రయాణికులు
- కోస్ట్‌గార్డు విమానంలోని ఆరుగురు సిబ్బందిలో ఐదుగురు మృతి
- భూకంప బాధితుల కోసం సహాయక సామగ్రి తీసుకెళ్లకముందే దుర్ఘటన

6లో

మున్సిపల్ సమ్మె వాయిదా

- సీఐటీయూ మినహా మిగిలిన సంఘాల నిర్ణయం
- పారిశుధ్య కార్మిక సంఘాల నేతలతో మంత్రుల బృందం సుదీర్ఘ చర్చలు
- ఇప్పటికే కొన్ని డిమాండ్లు పరిష్కరించిన రాష్ట్ర ప్రభుత్వం
- మరికొన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ

- వివరాలు 3లో

సదరం స్లాట్‌ల విడుదల

- జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు స్లాట్‌లు
- రేపటి నుంచి గ్రామ, వార్డు సచివాలయాల్లో బుకింగ్‌కు అవకాశం

- వివరాలు 2లో

ఇదండీ సంగతి



ప్చ్! కనీసం డిపాజిట్లు సంపాదించుకొని ఉండాల్సింది!



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

అప్పు చేయకుండా బతుకుతున్నాం

మాది కిరాణా వ్యాపారం. పశ్చిమగోదావరి జిల్లా తణుకు మండలం మండపాక గ్రామంలో నేను, మా ఆయనా కలసి వ్యాపారం సాగిస్తున్నాం. 30 ఏళ్లుగా డ్వాక్రా సభ్యురాలిగా ఉండటంతో లక్ష రూపాయలు బ్యాంకు రుణం తీసుకుని వ్యాపారం చేస్తున్నాను. తద్వారా వచ్చిన ఆదాయంతో అతి కష్టమ్మీద రుణం తీర్చాం. మళ్లీ పెట్టుబడికి చాలా ఇబ్బంది పడ్డాం. మళ్లీ అప్పు చేయాలేమోనని సతమతం అవుతున్న సమయంలో ఈ ప్రభుత్వం వచ్చింది. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా ఇప్పటి వరకూ రూ.71 వేలు అందింది. దాంతో పెట్టుబడికి ఇబ్బంది లేకుండా పోయింది. దీంతోపాటు స్త్రీ నిధి నుంచి కూడా రూ.50 వేలు సహాయం అందడంతో కుటుంబానికి ఆధారంగా ఉన్న కిరాణా షాపు నిర్వహణ మరింత సులభమైంది. ఇప్పుడు దానితోనే



రొటేషన్ చేస్తూ అప్పు చేయనవసరం లేకుండా వ్యాపారం సాగుతోంది. మా ఏకైక కుమార్తెకు వివాహం అయింది. ఆమెకు కూడా డ్వాక్రా రుణమాఫీ (ఆసరా) వర్తించింది. జగనన్న సాయంతో ఇప్పుడు మేము చాలా ఆనందంగా ఉన్నాం.

– గన్నమని అచ్చాయమ్మ, డ్వాక్రా మహిళ, మండపాక
(కొడమంచిలి కృష్ణ, విలేకరి, తణుకు)

భవిష్యత్‌పై బెంగ లేదు

ఏడాది వయసులో నాకు పోలియో సోకింది. రెండు కాళ్లు చచ్చుబడి పోయాయి. నా పరిస్థితి చూసి మా అమ్మ, నాన్న చాలా ఆవేదన చెందారు. నా భవిష్యత్తుపై ఆందోళన చెందారు. మా నాన్న పదిహేనేళ్ల క్రితమే కాలం చేశారు. అమ్మ ఒక్కతే కుటుంబ పోషణ చేయడం చూడలేకపోయాను. నాలో పట్టుదల పెరిగి ఏదైనా వ్యాపారం చేసుకుని సొంతంగా ఎలాగైనా జీవించాలని నిర్ణయించుకున్నాను. నా సంకల్పం ముందు వైకల్యం ఓడిపోయింది. ఈ ప్రభుత్వం వచ్చాక మా అమ్మకు అందించిన సంక్షేమ పథకాలు నాకు అండగా నిలిచాయి. వాటిని సద్వినియోగం చేసుకుని నా ప్రయాణం పూలబాట వైపు సాగించాను. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం లొద్దపుట్టి గ్రామంలోని ధనరాజుల తులసమ్మ ఆలయం సమీపంలో పూజా సామగ్రి, పూలు అమ్ముకునేందుకు చిన్నపాటి బడ్డీ కొట్టు ఏర్పాటు చేసుకున్నాను. మా అమ్మ లక్ష్మమ్మ డ్వాక్రా సంఘ సభ్యురాలు కావడంతో బ్యాంకు లింకేజీ ద్వారా లక్ష రూపాయలు రుణం తీసుకుని



వ్యాపారం ప్రారంభించాను. మా అమ్మకు వైఎస్సార్ ఆసరా కింద ఏడాదికి రూ.12 వేల వంతున వచ్చింది. ఆ మొత్తాన్ని కూడా వ్యాపారానికి పెట్టుబడిగా వాడుకుంటున్నాను. వ్యాపారం బాగుంది. నా జీవనానికి ఇప్పుడు ఎలాంటి ఢోకా లేదు. నాకు వివాహమైంది. ఇద్దరు పిల్లలు. నాకు ప్రతి నెల అందుతున్న దివ్యాంగ పింఛన్ రూ.3 వేలు నా పిల్లల పేరున పొదుపు చేస్తున్నా. భవిష్యత్తుపై బెంగ తీరింది.

– దువ్వు జగ్గారావు, లొద్దపుట్టి, ఇచ్ఛాపురం మండలం
(మద్దిలి కేశవరావు, విలేకరి, ఇచ్ఛాపురం రూరల్)

ఉన్నత చదువు కల తీరింది

మాది పేద కుటుంబం. విజయనగరం జిల్లా రామభద్రపురం మండలం రొంపిల్లి గ్రామం. నా చదువు కోసం, బతుకు దెరువు కోసం విశాఖ నగరానికి వలస వచ్చాం. మా నాన్న శ్రీనివాసరావు ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అమ్మ సత్యవతి గృహిణి. ఇద్దరు అక్కలకు వివాహమైంది. నేను ఇంటర్ తర్వాత ఇంజినీరింగ్ చదవాలనుకున్నాను. కానీ అంత ఆర్థిక స్తోమత మాకు లేదు. చదువు అంతటితో ఆగిపోతుందేమోనని భయపడ్డాను. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా చదువుకోవచ్చని స్నేహితులు ప్రోత్సహించారు. దీంతో తగరపువలస వద్ద అనిట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ చేరాను. ఇప్పుడు నాలుగో సంవత్సరం చదువుతున్నాను. ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి రూ.85 వేలు అందిస్తోంది. వసతి దీవెన పథకం కింద కూడా సాయం అందుతోంది. దీంతో నా చదువు ప్రశాంతంగా సాగిపోతోంది. నాకు ఆరు నెలల క్రితం భరించలేని కడుపు నొప్పి (అపెండిసైటిస్) వచ్చింది. అత్యవ



సరంగా 24 గంటల్లో ఆపరేషన్ చేయాలని డాక్టర్ చెప్పారు. ఆపరేషన్ కోసం డబ్బులు సమకూర్చే పనిలేకుండా ఆరోగ్యశ్రీ ఆదుకొంది. రూపాయి ఖర్చు లేకుండా ఆపరేషన్ జరిగింది. ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నాను. ఫైనల్ పరీక్షల కోసం చదువుకుంటున్నాను. ఊళ్లో అర ఎకరం పంట పొలం ఉంది. ఏటా రైతు భరోసా కూడా వస్తోంది.

– తాడ్డి మణికంఠ, ఆరిలోవ, విశాఖపట్నం
(మీసాల కామేశ్వరరావు, విలేకరి, ఆరిలోవ, విశాఖపట్నం)

'పెద్ద' భరోసా..!



విజయవాడ జీజీహెచ్‌లో అత్యాధునిక వసతులతో కూడిన ఒక వార్డు

▶ మొదటి పేజీ తరువాయి

వైద్యులను అందుబాటులోకి తెచ్చింది. ఖరీదైన చికిత్సలను సైతం ఉచితంగా అందించేలా మందులు, సదుపాయాలను సమకూర్చింది. ప్రస్తుతం ఇక్కడ రోజుకు 250 వరకూ ఓపీలు నమోదు అవుతున్నాయి. పడకలన్నీ ఫుల్‌గా ఉంటున్నాయి. ఒక్క న్యూరో మాత్రమే కాకుండా అన్ని విభాగాల్లో వైద్యులు, సిబ్బంది కొరతకు తావులేకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌ను అందుబాటులోకి తేవడంతో పాటు అధునాతన వైద్య పరికరాలను సమకూర్చింది. సేవలు కూడా గణనీయంగా పెరిగాయి. దీంతో ప్రజల్లో పెద్దాస్పత్రిపై విశ్వాసం పెరిగింది. 2018–19లో 9,202 మేజర్ సర్జరీలు నిర్వహించగా 2022–23లో ఏకంగా 51 శాతం అదనంగా అంటే 13,095 సర్జరీలు జరగడం గమనార్హం. 2018–19లో 3.85 లక్షల ల్యాబ్ టెస్టులు చేయగా 2022–23లో 5.83 లక్షల టెస్టులు చేశారు.


వైద్య రంగంలో సంస్కరణలు..

సీఎం జగన్ ప్రభుత్వం వైద్య, ఆరోగ్య శాఖలో తెచ్చిన విప్లవాత్మక సంస్కరణల ఫలితంగా ప్రభుత్వాస్పత్రులపై ప్రజలకు నమ్మకం పెరిగింది. రోగుల తాకిడికి సరిపడా వైద్యులు, సిబ్బంది, అధునాతన వైద్య పరికరాలను సమకూర్చారు. విజయవాడ జీజీహెచ్‌లోనే కాకుండా అన్ని ప్రభుత్వ బోధనాస్పత్రుల్లో గతంతో పోలిస్తే రోగుల సేవల్లో గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయి.

సర్జరీల్లో పెరుగుదల

ప్రభుత్వాస్పత్రుల్లో ఒక్క పోస్టు కూడా ఖాళీగా ఉండటానికి వీల్లేకుండా గత నాలుగేళ్లలో 53 వేలకు పైగా పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది. దీంతో బోధనాస్పత్రుల్లోని స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో వైద్యులు, సిబ్బంది కొరతకు తావులేకుండా పోయింది. ఆపరేషన్ థియేటర్లలో అధునాతన వైద్య పరికరాలు సమకూరడంతో సర్జరీలు పెరిగాయి. 2022–23లో ఏకంగా 3,45,482 మైనర్, 1,50,592 మేజర్ సర్జరీలను నిర్వహించారు. 2023–24లో జూలై నెలాఖరు నాటికి 2.04 లక్షల మేజర్ సర్జరీలు జరిగాయి. టీడీపీ హయాంలో 2018–19లో ప్రభుత్వ బోధనాస్పత్రుల్లో 1.99 లక్షల మైనర్, 98 వేల మేజర్ సర్జరీలు మాత్రమే జరిగాయి. గతంతో పోలిస్తే 73.05 శాతం మైనర్, 52.56 శాతం మేజర్ సర్జరీలు పెరిగాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ల్యాబ్‌లను బలోపేతం చేయడంతో ఏటా కోటికిపైనే ల్యాబ్ టెస్టులు జీజీహెచ్‌లలో చేపడుతున్నారు. 2021–22లో 1.06 కోట్లు, 2022–23లో 1.32 కోట్ల మేర ల్యాబ్ టెస్టులు ఉచితంగా నిర్వహించారు. ఈ ఏడాది ఇప్పటికే 70 లక్షల టెస్టులు పూర్తి అయ్యాయి.

- 2021–22లో బోధనాస్పత్రుల్లో 49.32 లక్షల ఓపీ సేవలు నమోదు కాగా గతేడాది 83.16 లక్షలకు పెరిగాయి. ఐపీ సేవల్లో 33.63 శాతం పెరుగుదల నమోదైంది.
- డబ్ల్యూహెచ్‌వో ప్రమాణాలతో కూడిన 608 రకాల మందులను ప్రభుత్వం బోధనాస్పత్రుల్లో అందుబాటులోకి తెచ్చింది. 530కిపైగా రకాల మందులను సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ రూపంలో సరఫరా చేస్తుండగా మిగిలినవి స్థానిక ఫార్మా కంపెనీల ద్వారా అందిస్తున్నారు. ల్యాబ్ టెస్టుల నిర్వహణకు అవసరమయ్యే రీ ఏజెంట్స్ (రసాయనాలను) సెంట్రల్ ప్రొక్యూర్మెంట్ విధానంలో సరఫరా ప్రారంభించింది.
- నాడు–నేడు కింద రూ.16 వేల కోట్లకు పైగా నిధులతో ప్రభుత్వ వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ సీఎం జగన్ చర్యలు తీసుకున్నారు. బోధనాస్పత్రుల్లో అదనపు వార్డులు, సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌ల నిర్మాణం చేపట్టారు. గతంలో రూ.40 మాత్రమే ఉన్న డైట్ చార్జీలను రూ.80కు పెంచడం ద్వారా రోగులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు.



చక్కగా ఆపరేషన్ చేశారు



20 ఏళ్ల క్రితం గుండె కవాటం చెడిపోయింది. నా కుమార్తె సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తున్నా మందులతోనే కాలం గడిపా. రానురాను సమస్య పెరగడంతో గత ఆగస్టులో కర్నూలు జీజీహెచ్‌లో అడ్మిట్ అయ్యా. సీటీ సర్జన్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి ఆపరేషన్ చేశారు. మైట్రల్ వాల్వ్ రీ ప్లేస్‌మెంట్, కార్డల్ ప్రిజర్వేషన్ శస్త్ర చికిత్స నిర్వహించారు. ఆపరేషన్ చక్కగా చేశారు. నర్సింగ్ సేవలు చాలా బాగున్నాయి. వారి చొరవతో చకచకా కోలుకోగలిగా. సాధారణంగా ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యం అంటే అందరూ తెలియని భయానికి లోనవుతుంటారు. ఇప్పుడు అలాంటి పరిస్థితులు లేవు. వసతులు బాగున్నాయి. అనుభవజ్ఞులైన వైద్యులు, సిబ్బంది మంచి వైద్యం అందిస్తున్నారు. – వెంకట రెడ్డి, ప్రజా పరిరక్షణ ఐక్యవేదిక అనంతపురం జిల్లా అధ్యక్షుడు

ప్రైవేట్‌కు మించి సేవలు..



నాన్న అనారోగ్యం బారిన పడటంతో విజయవాడ జీజీహెచ్‌కు తీసుకొచ్చాం. వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించి అడ్మిట్ చేసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించారు. నర్సులు, వైద్య సిబ్బంది రోగులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో సైతం ఈ తరహాలో సేవలుండవు.

– జి. రవి, ఎండపల్లి, ఏలూరు జిల్లా

సేవలు వినియోగించుకోవాలి



బోధనాస్పత్రుల్లో ఎంతో అనుభవజ్ఞులైన వైద్యులు అందుబాటులో ఉన్నారు. అరుదైన జబ్బులకు ఇక్కడ చికిత్సలు అందుతున్నాయి. ప్రభుత్వం సౌకర్యాలను మెరుగుపరిచింది. ప్రజలు ఈ సేవలను వినియోగించుకోవాలి. ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించి అనవసర వ్యయ ప్రయాసలకు గురికావద్దు. ప్రభుత్వాస్పత్రుల్లో సేవలను సద్వినియోగం చేసుకోవాలి. అరుదైన సర్జరీలు అలవోకగా చేసేందుకు వసతులున్నాయి. కోత, కుట్లు లేకుండా చిన్న గాటుతో సర్జరీలు చేస్తున్నారు.

– డాక్టర్ నరసింహం, డీఎంఈ

పింఛనే కాదు.. పెన్షనర్లు పెరిగారు



కాకినాడ ఆర్‌ఎంసీ మైదానంలో సీఎం జగన్ బహిరంగ సభకు ముస్తాబవుతున్న ప్రాంగణం

▶ మొదటి పేజీ తరువాయి

వివిధ మండల కేంద్రాలు, మున్సిపాలిటీల్లో జరుగుతున్న ఉత్సవాల్లో స్థానిక ఎమ్మెల్యేలతో పాటు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు చురుగ్గా పాల్గొంటున్నారు. నాలుగున్నర ఏళ్ల క్రితం టీడీపీ హయాంలో కొత్తగా పింఛన్లు మంజూరు కావాలంటే ఎలాంటి ఇబ్బందులు ఉండేవి.. ఇప్పుడు ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ బాధ్యతలు చేపట్టాక పింఛన్ల పంపిణీలో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులను వారు ఈ సందర్భంగా లబ్ధిదారులకు గుర్తుచేస్తున్నారు. దీంతో.. ఎన్నికల ముందు సీఎం జగన్ ఇచ్చిన మాట ప్రకారం రూ.3,000ల పెన్షన్ అమలుపై వారంతా హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. పింఛన్ మొత్తం పెంపుతోపాటు రాష్ట్ర ప్రభుత్వం ఈనెల నుంచి కొత్తగా మరో 1,17,161 మందికి పింఛన్లు మంజూరు చేసింది.

నేడు కాకినాడ ఉత్సవాలకు సీఎం జగన్..

ఈ నేపథ్యంలో.. బుధ వారం సీఎం జగన్‌మోహన్ రెడ్డి కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీ గ్రౌండ్‌లో జరిగే పింఛన్ల పెంపు ఉత్సవంలో స్వయంగా పాల్గొననున్నారు. ఈ జనవరి ఒకటో తేదీ నుంచి 66,34,742 మంది లబ్ధిదారులకు పంపిణీ చేసే పింఛన్ల మొత్తం రూ.1,967.34 కోట్లు విడుదల చేయగా, ఇందుకు సంబంధించిన మెగాచెక్‌ను సీఎం కాకినాడలో ఆవిష్కరిస్తారు. అలాగే, రాష్ట్రంలో పెన్షన్ల పంపిణీ జరుగుతున్న తీరుకు ఇటీవల జాతీయ స్థాయిలో స్కోచ్ సంస్థ రాష్ట్రానికి ప్రకటించిన ప్లాటినం అవార్డును సీఎం జగన్ ఈ సందర్భంగా ప్రదర్శిస్తారు. అంతేకాక.. లబ్ధిదారులతో ఆయన నేరుగా మాట్లాడుతారు. అనంతరం.. రూ.65 కోట్లతో నిర్మించిన కొండయ్యపాలెం ఫ్లై ఓవర్‌ను (ముత్తా గోపాలకృష్ణ వారధి), రూ.20 కోట్లతో నిర్మించిన రాగిరెడ్డి వెంకట జయరామ్‌కుమార్ కళాక్షేత్రాన్ని, రూ.9.5 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన స్కేటింగ్ రింక్‌ను సీఎం ప్రారంభిస్తారు. ముఖ్యమంత్రి పర్యటనకు అవసరమైన అన్ని ఏర్పాట్లనూ అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తిచేశారు. సీఎం పర్యటనకు చేపట్టాల్సిన ఏర్పాట్లను ఆయన ప్రోగ్రాం కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, ఎంపీ వంగా గీత, వైఎస్సార్‌సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు, రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కలెక్టర్ కృతికా శుక్లా, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ సమీక్షించారు.

సీఎం షెడ్యూల్ ఇలా..

- ఉ.9.30కు ముఖ్యమంత్రి జగన్ తాడేపల్లి నుంచి బయల్దేరి 10.20 గంటలకు కాకినాడకు చేరుకుంటారు.
- ఉ.10.40కు బహిరంగ సభ జరిగే రంగరాయ వైద్య కళాశాల (ఆర్‌ఎంసీ) గ్రౌండ్స్‌కు చేరుకుంటారు.
- 11.55 వరకూ వైఎస్సార్ పింఛన్ పెంపు ఉత్సవంలో పాల్గొంటారు.
- మ.12 గంటల ప్రాంతంలో కాకినాడ నుంచి బయల్దేరుతారు.
- మ.2 గంటల ప్రాంతంలో తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్‌ఫర్నేస్–3 నుంచి తొలి ట్యాపింగ్



బ్లాస్ట్‌ఫర్నేస్–3 నుంచి హాట్ మెటల్ ఉత్పత్తి

ఉక్కునగరం (గాజువాక): స్టీల్‌ప్లాంట్ అన్నపూర్ణ బ్లాస్ట్‌ఫర్నేస్ (బీఎఫ్–3)లో మంగళవారం ఉత్పత్తి పునః ప్రారంభమైంది. బీఎఫ్–3 ఉత్పత్తికి కావాల్సిన ముడి పదార్థాలు లేకపోవడంతో 23 నెలలుగా ఫర్నేస్‌లో ఉత్పత్తి నిలిచి పోయింది. దీంతో సంస్థ ఉత్పత్తి లక్ష్యాలు నెరవేరకపోగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంది. కార్మిక సంఘాల నిరసనల మధ్య ఉక్కు యాజమాన్యం జిందాల్‌తో ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రస్ట్ (ఈఓఐ) ద్వారా ముడి పదార్థాల కోసం ఎంఓయూ కుదుర్చుకుంది. ఈ క్రమంలో ఫర్నేస్‌ను డిసెంబర్ 8న కోక్‌తో చార్జింగ్ చేయగా, 31వ తేదీన సీఎండీ, డైరెక్టర్లు లైటప్ చేశారు. తద్వారా మొదటి ట్యాపింగ్ జరిగింది. దీంతో ఉద్యోగులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

పీఎం జన్ మన్‌తో గిరిజనుల అభివృద్ధికి కృషి

- పథకం అమలుపై సీఎస్‌లతో కేంద్ర కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబ సమీక్ష
- 15న అల్లూరి సీతారామరాజు జిల్లా గిరిజనులతో మాట్లాడనున్న ప్రధాని మోదీ



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన సీఎస్ జవహర్‌రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు

సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా ఉన్న మారుమూల ప్రాంతాల్లోని గిరిజనుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి జన జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్(పీఎం జన్‌మన్ యోజన) పథకం ప్రవేశపెట్టిందని కేంద్ర కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబ చెప్పారు. ఈ పథకం అమలుపై వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు(సీఎస్‌లు)తో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. గిరిజన తెగల్లో కూడా బాగా వెనుకబడిన తెగలున్నాయని.. వారిని ఇప్పటివరకు ఎవరూ అంతగా పట్టించుకోలేదన్నారు. అలాంటి వారందరి అభివృద్ధి కోసమే ప్రధాని మోదీ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారని పేర్కొన్నారు. 2023–24 నుంచి 2025–26 వరకు ఈ కార్యక్రమాన్ని అమలు చేసేందుకు కేంద్రం వాటాగా రూ.15,336 కోట్లు, రాష్ట్రాల వాటాగా రూ.8,768 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. కేంద్ర, రాష్ట్ర పథకాల ద్వారా పక్కా ఇళ్ల నిర్మాణం, రహదారుల అభివృద్ధి, మొబైల్ మెడికల్ యూనిట్ల ద్వారా ఆరోగ్య పరిరక్షణ, నిరంతర నీటి సౌకర్యం, ప్రతి ఇంటికీ విద్యుత్, అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటు, మల్టీపర్పస్ కేంద్రాలు, సోలార్ వీధి దీపాలు, మొబైల్ టవర్లు, ఒకేషనల్ విద్యా కేంద్రాలు ఏర్పాటు చేయాలని సీఎస్‌లకు రాజీవ్ గౌబ సూచించారు. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన అన్ని పథకాల ద్వారా లబ్ధి కలిగించాలన్నారు. ఈ నెల 15న ప్రధాని మోదీ వర్చువల్‌గా అల్లూరి సీతారామరాజు జిల్లాలోని కొత్త బల్లుగుడ, పాత బల్లుగుడకు చెందిన ఆదివాసీలతో మాట్లాడతారని చెప్పారు. అనంతరం సీఎస్ కేఎస్ జవహర్ రెడ్డి ఈ అంశంపై రాష్ట్ర అధికారులతో సమీక్షించారు. రాష్ట్రంలోని పీవీటీజీ ఆవాసాల్లోని వారందరికీ వివిధ పథకాలను మిషన్ మోడ్‌లో పూర్తి స్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని సీఎస్ ఆదేశించారు. ఉన్నతాధికారులు కె.విజయానంద్, బి.రాజశేఖర్, ఎంటీ కృష్ణబాబు, గోపాలకృష్ణ ద్వివేది, ప్రవీణ్ ప్రకాశ్, జి.జయలక్ష్మి, కాంతిలాల్ దండే, సురేష్ కుమార్, లక్ష్మీశా, జె.వెంకట మురళి, బాలూ నాయక్, కృష్ణా రెడ్డి పాల్గొన్నారు.

మినీ సరుకు రవాణా వాహనదారులకు తీపికబురు

నాలుగు చక్రాల రవాణా వాహనాలకు త్రైమాసిక పన్ను వర్తింపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మినీ సరుకు రవాణా వాహనదారులకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. వారి దీర్ఘకాల డిమాండ్‌ను నెరవేర్చింది. రాష్ట్రంలో 2018నాటికి ఉన్న మినీ సరుకు రవాణా వాహనాల వార్షిక జీవిత పన్నును ప్రభుత్వం తొలగించింది. దాని స్థానంలో త్రైమాసిక పన్ను విధానాన్ని అమలులోకి తీసుకువచ్చింది. దీంతో రాష్ట్రంలో లక్షకుపైగా ఉన్న మినీ సరుకు రవాణా వాహనదారులకు ఊరట లభించింది. రాష్ట్రంలోని సరుకు రవాణా వాహనాల వార్షిక జీవిత పన్నును 2018లో నాటి టీడీపీ ప్రభుత్వం తొలగించింది. దాని స్థానంలో త్రైమాసిక పన్నును ప్రవేశపెట్టింది. కానీ త్రైమాసిక పన్నును ప్రవేశపెట్టిన వాహనాల జాబితాలో మినీ సరుకు రవాణా వాహనాలను చేర్చలేదు. దీంతో ఇతర సరుకు రవాణా వాహనాలపై త్రైమాసిక పన్ను వసూలు చేస్తున్నా.. నాలుగు చక్రాల సరుకు రవాణా వాహనాలపై మాత్రం వార్షిక పన్నునే విధిస్తున్నారు. దీంతో రాష్ట్రంలో లక్షకుపైగా ఉన్న మినీ సరుకు రవాణా వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. తమకు కూడా త్రైమాసిక పన్నును వర్తింపజేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం మినీ సరుకు రవాణా వాహనాలకు కూడా త్రైమాసిక పన్ను విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు రవాణా శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంతో రాష్ట్రంలో లక్షకుపైగా ఉన్న నాలుగు చక్రాల సరుకు రవాణా వాహనాల యజమానులు ఒకేసారి మొత్తం పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. ఏడాదికి 4 వాయిదాల్లో పన్ను చెల్లించేందుకు అవకాశం ఏర్పడింది.

సదరం స్లాట్‌ల విడుదల

- జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు స్లాట్‌లు
- రేపటి నుంచి గ్రామ, వార్డు సచివాలయాల్లో బుకింగ్‌కు అవకాశం

సాక్షి, అమరావతి: దివ్యాంగులు సదరం సర్టిఫికెట్లు పొందేందుకు జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు స్లాట్‌లను ప్రభుత్వం విడుదల చేసింది. అభ్యర్థులు గురువారం నుంచి గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. స్లాట్‌లు బుక్ చేసుకున్నవారికి ఈ నెల 8వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా వైద్యశాఖ ఆధ్వర్యాన 173 ప్రభుత్వాస్పత్రుల్లో ఆర్థోపెడిక్, మానసిక, కంటి, ఈఎన్‌టీ వైద్యులు పరీక్షలు నిర్వహించి అర్హులకు సదరం ధ్రువీకరణ పత్రాలు ఇస్తారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక సదరం సర్టిఫికెట్‌ల జారీ ప్రక్రియను సులభతరం చేసింది. గత ఏడాది జూలై నుంచి స్థానికతతో సంబంధం లేకుండా రాష్ట్రంలోని ఏ జిల్లాలో అయినా స్లాట్ బుకింగ్ చేసుకుని స్క్రీనింగ్‌కు హాజరయ్యే అవకాశం కల్పించింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో మొక్కుబడిగా 56 ఆస్పత్రుల్లోనే సదరం క్యాంపులు నిర్వహించేవారు. దీంతో అప్పట్లో దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులపాలయ్యారు. ప్రస్తుత ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల్లోనే స్లాట్ బుకింగ్‌లకు అవకాశం కల్పించింది. ఆస్పత్రుల సంఖ్యను కూడా 173కు పెంచింది. 2022–23 సంవత్సరంలో 96,439 మందికి సదరం సర్టిఫికెట్‌లను ఇచ్చింది.

ఏపీ వర్సిటీల్లో అంతర్జాతీయ కోర్సులు

- ప్రపంచంలో టాప్–50 వర్సిటీలతో స్థానిక వర్సిటీల అనుసంధానం
- ఎంఐటీ, హార్వర్డ్ వంటి ప్రఖ్యాత వర్సిటీల్లోని 2వేల కోర్సులు అందుబాటులోకి
- విద్యాశాఖ మంత్రి బొత్స



'కెరీర్ టూల్ కిట్'ను ఆవిష్కరిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ తదితరులు

సాక్షి, అమరావతి: ఉన్నత విద్యలో అంతర్జాతీయ యూనివర్సిటీల కోర్సులను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై సమగ్ర అవగాహన కల్పించేలా ఉన్నత విద్యామండలి రూపొందించిన 'కెరీర్ టూల్ కిట్' ఆన్‌లైన్ టీచింగ్ ప్రోగ్రామ్‌ను ఆయన మంగళవారం విజయవాడలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి బొత్స మాట్లాడుతూ రాష్ట్రంలోని యూనివర్సిటీలు ప్రపంచ వ్యాప్తంగా టాప్ 50 (సబ్జెక్టుల వారీగా) విశ్వవిద్యాలయాలతో కలిసి పనిచేసేలా కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. తద్వారా విదేశాలకు వెళ్లి చదువుకోలేని ఎందరో విద్యార్థులు ఎంఐటీ, హార్వర్డ్ వంటి ప్రఖ్యాత వర్సిటీలు అందించే సుమారు 2 వేల కోర్సులను ఆన్‌లైన్‌లో చదువుకునే వెసులుబాటు కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. దేశంలోనే విద్యార్థులపై ఆర్థిక భారం పడకుండా చదువులు అందిస్తున్న ఏకైక రాష్ట్రంగా ఏపీ నిలుస్తోందన్నారు. నూతన జాతీయ విద్యావిధానం కంటే ముందుగానే ఏపీ విద్యావ్యవస్థలో అనేక సంస్కరణలు తీసుకొచ్చామన్నారు. ఇందులో భాగంగా ఉన్నత విద్యలో 10 నెలల ఇంటర్న్‌షిప్‌ను తప్పనిసరి చేశామన్నారు. తాజాగా తొలిసారిగా స్టైఫండ్‌తో కూడిన ఇంటర్న్‌షిప్‌ను ఇచ్చేలా అనేక కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నట్టు చెప్పారు. ఇప్పటికే మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజ సంస్థలతో కలిసి విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి శ్రీకారం చుట్టామన్నారు. ఉన్నత విద్యామండలి 10 లక్షల మందికిపైగా విద్యార్థులకు మేలు చేస్తూ ప్రతి సెమిస్టర్‌లో విభిన్న అంశాల్లో మార్గనిర్దేశం చేసేలా 'కెరీర్ టూల్ కిట్'ను తీసుకురావడం అభినందనీయమన్నారు. ఉన్నత విద్య ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో ఫ్యూచర్ స్కిల్స్, నాలెడ్జ్ ఇంప్రూవ్‌మెంట్, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం విప్లవాత్మక సంస్కరణలు ప్రవేశపెట్టిందన్నారు. వాటి ఫలితాలే ఇండియా స్కిల్ రిపోర్టులో ఏపీని అగ్రగామిగా నిలబెట్టాయన్నారు.

సెమిస్టర్ల వారీగా కెరీర్ గైడెన్స్

ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు సెమిస్టర్ల వారీగా కార్యాచరణ ప్రణాళిక అందించడం, ఎంచుకున్న రంగాల్లో నైపుణ్యం, సాఫ్ట్ స్కిల్స్ పెంపుపై 'కెరీర్ టూల్‌కిట్' మెంటార్‌గా నిలుస్తుందన్నారు. విద్యా ప్రయాణంలో ప్రతి దశలో విద్యార్థులకు వ్యక్తిగత మార్గదర్శకంగా పని చేసేలా 19 రకాల కెరీర్ టూల్ కిట్లను రూపొందించామని తెలిపారు. దేశంలో ఏ యూనివర్సిటీ, విద్యామండలి చేయని విధంగా విద్యార్థి కోర్సులో చేరినప్పటి నుంచి పూర్తి చేసి బయటకు వెళ్లేంత వరకు జాబ్, రీసెర్చ్ ఓరియంటేషన్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, ఆర్థిక క్రమశిక్షణ, సామాజిక దృక్పథాన్ని పెంపొందించేలా 'కెరీర్ టూల్ కిట్'ను తీసుకొచ్చామన్నారు. ఉన్నత విద్యామండలి వైస్ చైర్‌పర్సన్లు రామ్మోహనరావు, ఉమామహేశ్వరిదేవి, సెక్రటరీ నజీర్ అహ్మద్, సెట్స్ స్పెషల్ ఆఫీసర్ సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా...

ప్రభుత్వ అప్పీళ్ల విచారణ నుంచి తప్పుకున్న జస్టిస్ రఘునందనరావు

మరో ధర్మాసనానికి పంపనున్న సీజే

సాక్షి, అమరావతి: ఉత్తరాంధ్ర అభివృద్ధిపై సమీక్ష చేసేందుకు వీలుగా విశాఖపట్నంలో క్యాంపు కార్యాలయాలను ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయానికి బ్రేక్ వేస్తూ సింగిల్ జడ్జి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ఇటీవల ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీళ్ల విచారణ నుంచి న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందనరావు తప్పుకున్నారు. క్యాంపు కార్యాలయాల ఏర్పాటు విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోవద్దంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులపై రాష్ట్ర ప్రభుత్వం వేర్వేరుగా దాఖలు చేసిన ఈ మూడు అప్పీళ్లు మంగళవారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందనరావు ధర్మాసనం ముందు విచారణకు వచ్చాయి. ఈ వ్యాజ్యాల విచారణ నుంచి తప్పుకుంటున్నట్లు జస్టిస్ రఘునందన రావు తెలిపారు. దీంతో ఈ అప్పీళ్లు సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ నిర్ణయం మేరకు మరో ధర్మాసనం ముందు విచారణకు రానున్నాయి. ఏ ధర్మాసనం ముందుకు వస్తాయో 3, 4 రోజుల్లో తెలుస్తుంది. వీలైనంత త్వరగా విచారణకు వచ్చేలా చూడాలని సీజేను రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) చింతల సుమన్ కోరారు. ఇందుకు సీజే సానుకూలంగా స్పందించారు.

కొత్తగా డివిజినల్ డెవలప్‌మెంట్ పోస్టులు

సాక్షి, అమరావతి: డివిజినల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీడీవో) పోస్టులను సృష్టిస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. రెవెన్యూ డివిజన్లకు సమాంతరంగా గతంలో ఉన్న 51 డివిజన్లతో పాటు కొత్తగా ఏర్పడిన 26 రెవెన్యూ డివిజన్లకు ఈ పోస్టులను కేటాయిస్తున్నట్టు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో మొత్తం 77 రెవెన్యూ డివిజన్లలో డీడీవో పోస్టులు ఏర్పాటయ్యాయి.

కొత్తగా పోస్టులు ఏర్పడిన 26 రెవెన్యూ డివిజన్లు ఇలా..

పలాస (శ్రీకాకుళం), బొబ్బిలి, చీపురుపల్లి (విజయనగరం), చింతూరు (ఏఎస్ఆర్), భీమునిపట్నం (విశాఖపట్నం), తాడేపల్లిగూడెం (పశ్చిమ గోదావరి), ఉయ్యూరు (కృష్ణా), తిరువూరు, నందిగామ (ఎన్టీఆర్), బాపట్ల, చీరాల, రేపల్లె (బాపట్ల), సత్తెనపల్లి (పల్నాడు), కనిగిరి (ప్రకాశం), పత్తికొండ (కర్నూలు), ఆత్మకూరు, డోన్ (నంద్యాల), గుంతకల్లు (అనంతపురం), పుట్టపర్తి (శ్రీసత్యసాయి), బద్వేలు, పులివెందుల (వైఎస్సార్), రాయచోటి (అన్నమయ్య), నగరి, పలమనేరు, కుప్పం (చిత్తూరు), శ్రీకాళహస్తి (తిరుపతి)

వ్యవస్థలను భ్రష్టు పట్టించిన చంద్రబాబు

1,192వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: కులవాదమే అజెండాగా రాష్ట్ర రాజకీయాల్లో తన సామాజిక వర్గానికి పెద్దపీట వేసిన చంద్రబాబు అన్ని వ్యవస్థలను భ్రష్టు పట్టించి రాష్ట్రాభివృద్ధిని వెనక్కి నెట్టాడని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ధ్వజమెత్తారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,192వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో మంగళవారం పలువురు మాట్లాడారు. శివరామకృష్ణన్ కమిటీ, బోస్టన్ కమిటీ, జీఎన్ రావు కమిటీల నివేదికలను తుంగలోకి తొక్కిన చంద్రబాబు నారాయణ కమిటీ వేసి అమరావతి ఏకైక రాజధానిగా ప్రకటించి తప్పుల మీద తప్పులు చేశాడని మండిపడ్డారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి తన పార్టీకి ప్రచారం చేయడం మాని.. అమరావతి ముసుగులో బాబు అవినీతికి ఊతమిచ్చేలా మాట్లాడడం సిగ్గుచేటన్నారు. అమరావతి ప్రాంతంలో కులవాదులు చేస్తున్న ఉద్యమానికి ఈ ప్రాంత ప్రజల మద్దతు లేదని, ఇతర ప్రాంతాల నుంచి కులవాద వలస పక్షులు, ప్యాకేజీ నాయకులు చేరి ఎల్లో మీడియాలో లేనిది ఉన్నట్లు ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. నాయకులు మాదిగాని గురునాథం, ఈపూరి ఆదాం, నూతక్కి జోషి పలువురు దళిత నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు 'బొజ్జా' అరెస్ట్

ఆత్మకూరు: రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథ రామిరెడ్డిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. అనంతరం ఆయనను కోర్టు ఆదేశాల మేరకు నందికొట్కూరు సబ్‌జైలుకు తరలించారు. ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో కృష్ణానది వద్ద సిద్దేశ్వరం అలుగు నిర్మాణం చేపట్టాలని 2016లో రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు దశరథరామిరెడ్డి రాయలసీమ ప్రాంత వాసులతో కలిసి ఆ ప్రాంతానికి వెళ్లారు. దీంతో దశరథరామిరెడ్డి, మరో నలుగురిపై కేసు నమోదుచేశారు. ఆయన అప్పటి నుంచి కోర్టుకు హాజరు కాకపోవడంతో 2023 నవంబర్ 16న ఆత్మకూరు కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది.

అన్నంపై 'ఘోర' అబద్ధాలు

పేద పిల్లలకు రోజుకో మెనూ రుచించని రామోజీ

- నిత్యం సగటున 34.90 లక్షల మంది విద్యార్థులకు 'గోరుముద్ద'
- బడికి హాజరైన పిల్లల్లో 90 శాతానికిపైగా తృప్తిగా తింటున్న వైనం
- ఆరు రోజులకు 16 రకాల వంటకాలు.. మూడు దశల్లో నాణ్యత పరిశీలన
- పిల్లల భోజనానికి బాబు పాలనలో ఏటా రూ.450 కోట్లు.. నీళ్ల సాంబారే దిక్కు
- ఇప్పుడు సగటున ఏకంగా రూ.1,450 కోట్లు.. రోజుకో మెనూతో బలవర్ధకమైన భోజనం



నాడు 450 కోట్లు.. నేడు 1,450 కోట్లు!

గోరుముద్ద బడ్జెట్ కేటాయింపులు రూ.కోట్లలో	
ఏడాది	ఎంత?
2019-20	979.48
2020-21	1,187.49
2021-22	1,840.05
2022-23	1,548.58
2023-24	1,689.00
మొత్తం	7,244.60

సాక్షి, అమరావతి: ఐదేళ్లగా అంతుచిక్కని వ్యాధితో అల్లాడుతున్న ఎల్లో మీడియా ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలు తినే అన్నంపైనా 'ఘోర'మైన అబద్ధాలను వండి వార్చింది. నిత్యం మూడు దశల పరిశీలన అనంతరం పిల్లలకు నాణ్యమైన భోజనాన్ని అందిస్తుంటే ఈనాడు రామోజీకి ముద్ద సహించడం లేదు! రేపటి తరానికి విద్యా బుద్ధులతో పాటు ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గోరుముద్ద మెనూను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్రంలోని 44,156 ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు 'జగనన్న గోరుముద్ద' కింద బలవర్థకమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. ఉదయం 9.30 గంటలకు హాజరు తీసుకునే సమయంలో ఆ రోజు విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా మెనూ సరుకులు వంటవారికి అందిస్తున్నారు. ప్రతి దశలో కొలతలు, లెక్క పక్కాగా అమలు చేస్తున్నారు. పిల్లలకు ఎలా వండితే నచ్చుతుందో వారి అభిప్రాయాలు తీసుకుని పరిశుభ్రంగా వండి పెడుతున్నారు. భోజనం తిన్నాక విద్యార్థులే స్వయంగా రిజిస్టర్‌లో తమ అభిప్రాయాలను నమోదు చేస్తున్నారు. ఆ రోజు మెనూ, ఆహారం బాగుంటే 'గుడ్' అని బాగా లేదంటే 'నాట్ గుడ్' అని నిర్భయంగా చెప్పే స్వేచ్ఛను ప్రభుత్వం విద్యార్థులకు కల్పించింది. ప్రతి రోజు కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు పిల్లలతో కలిసి గోరుముద్ద తిని వారి అభిప్రాయాలు సైతం నమోదు చేస్తున్నారు.

రోజుకో మెనూ రుచించలేదా రామోజీ?

విద్యార్థుల్లో రక్త హీనతను నివారించేందుకు ఫోర్టిఫైడ్ సార్టెక్స్ బియ్యాన్నే గోరుముద్దలో వినియోగిస్తున్నారు. ప్రతి గురువారం స్థానిక ప్రభుత్వ వైద్యశాల, విలేజ్ క్లినిక్ నుంచి సిబ్బంది స్కూళ్లకు వెళ్లి బడి పిల్లల ఆరోగ్యాన్ని పరీక్షిస్తున్నారు. రక్తహీనత నివారించే మాత్రలు సక్రమంగా వాడుతున్నారో లేదో పరిశీలిస్తున్నారు. పిల్లలు తీసుకునే ఆహారం మెనూను స్వయంగా ముఖ్యమంత్రి జగన్ రూపొందించారు. రక్తహీనత నివారణకు వారంలో మూడు రోజులు బెల్లంతో చేసిన రాగిజావ, మూడు రోజులు చిక్కీ ఇస్తున్నారు. వారంలో ఐదు రోజులు ఉడికించిన కోడిగుడ్డు అందిస్తున్నారు. టీడీపీ హయాంలో బడి పిల్లలకు రోజూ నీళ్ల సాంబారు.. ముద్దగా మారిన అన్నం మాత్రమే ఇవ్వడంతో 20 శాతం పిల్లలు కూడా తినేవారు కాదు.

నగటున 34.90 లక్షల మందికి భోజనం

విద్యార్థులకు మధ్యాహ్న భోజనం విషయంలో ప్రభుత్వం అన్ని దశల్లో శ్రద్ధ తీసుకుంటోంది. రోజుకో మెనూ చొప్పున ఆరు రోజులకు 16 రకాల పదార్థాలను పిల్లలకు ఇస్తున్నారు. విద్యార్థుల హాజరుతో పాటు భోజనం చేసేవారి సంఖ్యను తెలుసుకునేలా 'ఇంటిగ్రేటెడ్ మానిటరింగ్ సిస్టం ఫర్ మిడ్ డే మీల్స్ అండ్ శానిటేషన్' (ఐఎంఎంఎస్) యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. ప్రతిరోజు బడిలో సరుకుల స్టాక్‌తో పాటు భోజనం అంశాలను ఫొటోలతో సహా అప్‌లోడ్ చేస్తున్నారు. రాష్ట్రంలో 1–10 తరగతుల వరకు 43 లక్షల మంది విద్యార్థులు ఉండగా నిత్యం సగటున 34,89,895 మంది (90 శాతం) గోరుముద్ద తీసుకుంటున్నారు. మిగిలిన 10 శాతం మందిలో బాలికలు ప్రత్యేక పరిస్థితుల్లో ఇంటి నుంచి అన్నం తెచ్చుకుని బడిలో కూరలు తీసుకుంటున్నారు.

టీడీపీ అధికారంలో ఉండగా మధ్యాహ్న భోజనం ఏజెన్సీలకు ఏనాడూ సకాలంలో డబ్బులు చెల్లించలేదు. నాడు స్కూళ్లలో వంటపాత్రల సరఫరా కూడా లేదు. ఈ ఏడాది 43 లక్షల మంది విద్యార్థులకు స్టీలు గ్లాసులు అందించారు. 44,156 పాఠశాలలకు రూ.41 కోట్లతో స్టీలు వంట పాత్రలను ప్రభుత్వం అందించింది. గత సర్కారు పిల్లల భోజనం కోసం ఏటా రూ.450 కోట్లు వెచ్చించగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సగటున రూ.1,448.92 కోట్లు వ్యయం చేస్తోంది. ఈ విద్యా సంవత్సరంలో గోరుముద్దకు రూ.1,689 కోట్లు కేటాయించింది. వంట ఖర్చు, అదనపు మెనూ, ఆహార ధాన్యాలు, రవాణాతో సహా మొత్తం ఖర్చు రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోంది.

- గత సర్కారు వంట ఖర్చు నిమిత్తం ఒక్కో విద్యార్థికి రూ.3.59 మాత్రమే కేటాయించగా ప్రస్తుతం రూ.8.57కి పెంచి నాణ్యమైన ఆహారం అందిస్తున్నారు. పాఠశాలలకు మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్న కేంద్రీకృత కిచెన్ ఏజెన్సీలకు వంట ఖర్చును ప్రభుత్వం ఇప్పుడు క్రమం తప్పకుండా చెల్లిస్తోంది. వంట చేసే కుక్/హెల్పర్ల గౌరవ వేతనాన్ని ప్రతి నెలా వారి ఖాతాల్లోనే జమ చేస్తోంది.
- ప్రభుత్వ స్కూళ్లల్లో 70 శాతం మంది విద్యార్థులు మాత్రమే భోజనం తింటున్నట్లు ఈనాడు కాకి లెక్కలు వేసింది. వాస్తవానికి గతేడాది జూన్ నుంచి డిసెంబర్ 31 వరకు హాజరైన విద్యార్థుల్లో సగటున 90 శాతం మంది భోజనం చేశారు.
- చిత్తూరు సంతపేట మున్సిపల్ హైస్కూల్‌లో 585 మంది విద్యార్థులుంటే 400 మందికి మాత్రమే వంట చేస్తున్నారని, కానీ అంతకంటే తక్కువ మంది తింటున్నారంటూ ఈనాడు పేర్కొంది. ఈ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 575 కాగా సగటున 420 మంది హాజరవుతున్నారు. వచ్చిన వారంతా గోరుముద్ద తీసుకున్నట్టు తేలింది.
- నరసరావుపేట శంకర భారతీపురం హైస్కూల్లో 60 శాతం కంటే తక్కువ మందే గోరుముద్ద తీసుకుంటున్నారన్నదీ అబద్ధమే. ఇక్కడ 1,240 మంది విద్యార్థుల్లో సగటున 862 మంది హాజరు అవుతుండగా (88 శాతం) సరాసరిన 757 మంది (85 శాతం) మంది గోరుముద్ద తీసుకుంటున్నారు.

నోరూరే మెనూ..

- సోమవారం హాట్ పొంగల్, ఉడికించిన గుడ్డు / వెజిటబుల్ పలావు, గుడ్డు కూర, చిక్కీ
- మంగళవారం ఉదయం 10.20కి రాగిజావ, మధ్యాహ్నం 12.20కి చింతపండు పులిహోర, దొండకాయ పచ్చడి, ఉడికించిన గుడ్డు
- బుధవారం వెజిటబుల్ అన్నం, ఆలూ కుర్మా, ఉడికించిన గుడ్డు, చిక్కీ
- గురువారం ఉదయం రాగిజావ, మధ్యాహ్నం సాంబార్ బాత్/ నిమ్మకాయ పులిహోర, టొమాటో పచ్చడి, ఉడికించిన గుడ్డు
- శుక్రవారం అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, చిక్కీ
- శనివారం ఉదయం రాగిజావ, మధ్యాహ్నం ఆకుకూరతో చేసిన అన్నం, పప్పుచారు, స్వీట్ పొంగల్

పేద పిల్లల తిండిపైనా విషమేనా?

- రామోజీపై మండిపడ్డ ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి
- టీడీపీ హయాం కంటే 11 లక్షల మందికి అదనంగా మధ్యాహ్న భోజనం
- రుచికరమైన, పౌష్టికాహారంతో కూడిన మెనూతో జగనన్న గోరుముద్ద



సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులు తినే తిండిపైనా ఈనాడు రామోజీ విషం చిమ్ముతున్నారని, మానవత్వం లేకుండా వ్యవహరిస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి మండిపడ్డారు. మీడియాను అడ్డం పెట్టుకుని పెత్తందారుడు పేద పిల్లల కడుపు కొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశానికే ఆదర్శంగా నిలిచిన 'జగనన్న గోరుముద్ద' పథకంపై దారుణమైన కథనాలు ప్రచురించటాన్ని తీవ్రంగా ఖండించారు. మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

టీడీపీ హయాంతో పోలిస్తే రెట్టింపు

పిల్లల మధ్యాహ్న భోజనం కోసం చంద్రబాబు హయాంలో ఖర్చు చేసిన దానికంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 50–60 శాతం అధికంగా నిధులు వెచ్చిస్తున్నారు. 16 రకాల రుచికరమైన మెనూతో 43 లక్షల మంది విద్యార్థులకు (టీడీపీ హయాంలో కంటే 11 లక్షల మందికి అదనంగా) పౌష్టికాహారం అందిస్తుంటే రామోజీ అమానవీయ కథనాలు ప్రచురించడం దారుణం. ఎల్లో మీడియా రాతలను రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఖండించాలి. గత ప్రభుత్వం వంట ఖర్చుల నిమిత్తం విద్యార్థికి రూ.3.50 చొప్పున ఇవ్వగా జగనన్న ప్రభుత్వం రూ.6.50కి పెంచింది. వంట సిబ్బందికి గత సర్కారు కేవలం రూ.1,000 మాత్రమే గౌరవ వేతనం చెల్లించగా సీఎం జగన్ ప్రభుత్వం రూ.3,000కి పెంచింది. ప్రాథమిక తరగతుల విద్యార్థుల భోజనం ఖర్చు రూ.11.26 నుంచి 50 శాతం పెంచి రూ.16.07 ఖర్చు చేస్తున్నారు. ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు గత సర్కారు వెచ్చించిన మొత్తం కంటే 50 నుంచి 60 శాతం పెంచి ఒక్కొక్కరికీ రూ.18.75 చొప్పున ఇస్తున్నారు. ఆహార నాణ్యతలో ఎక్కడా రాజీ పడకుండా ఉన్నత పాఠశాలల విద్యార్థులకు రూ.23.40 చొప్పున అందజేస్తున్నారు.

నాడు వంట ఏజెన్సీలకు ఎగనామం

టీడీపీ హయాంలో వంట ఏజెన్సీలకు బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం జరిగేది. దాదాపు 9 నెలల నుంచి ఏడాది దాటినా వంట ఏజెన్సీలకు బిల్లులు చెల్లించలేదు. సీఎం జగన్ ప్రభుత్వం వంట సిబ్బందికి మూడు రెట్లు అధికంగా గౌరవ వేతనాలు పెంచడంతో పాటు వంట ఏజెన్సీలకు క్రమం తప్పకుండా సకాలంలో బిల్లులను చెల్లిస్తోంది. టీడీపీ సర్కారు 32 లక్షల మంది విద్యార్థులకు మాత్రమే మధ్యాహ్న భోజన పథకాన్ని నాసిరకంగా అందజేస్తే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 43,46,299 జగనన్న గోరు ముద్దను రుచికరంగా అమలు చేస్తోంది. ఆహార నాణ్యత బాగుండటంతో గతం కంటే 30 నుంచి 40 శాతం విద్యార్థులు పెరిగారు. టీడీపీ సర్కారు మధ్యాహ్న భోజన పథకానికి సగటున రూ.450 కోట్లు మాత్రమే వ్యయం చేయగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇప్పటివరకు దాదాపు రూ.7,244 కోట్లకు పైగా బడ్జెట్ కేటాయింపులు చేసింది. 2023–24 బడ్జెట్‌లో గోరుముద్ద కోసం రూ.1,689 కోట్లు కేటాయించింది. పేద పిల్లల ఆహారంపై ఈ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని ఎవరూ శంకించలేరు.

కైలాసగిరికి మరో మకుటం



మ్యూజియం నిర్మాణానికి శంకుస్థాపన చేసి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి అమర్‌నాథ్

- సైన్స్ అండ్ టెక్నాలజీ మ్యూజియం ఏర్పాటుకు శ్రీకారం
- రూ.4.69 కోట్లతో రూపుదిద్దుకోనున్న మ్యూజియంతో మరింత పర్యాటక శోభ
- శంకుస్థాపన చేసిన మంత్రి గుడివాడ అమర్‌నాథ్

ఆరిలోవ (విశాఖ తూర్పు): విశాఖపట్నంలోని కైలాసగిరిని రాష్ట్రంలో అత్యంత ముఖ్యమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు మరో అడుగు పడింది. ఇప్పటికే పర్యాటక ప్రాంతంగా ఉన్న కైలాసగిరి.. ఇతర దేశాలు, రాష్ట్రాల నుంచి నగరానికి వచ్చే పర్యాటకులను ఆకర్షించే విధంగా మరిన్ని హంగులు సంతరించుకుంటోంది. తాజాగా సైన్స్ అండ్ టెక్నాలజీ మ్యూజియం పురుడుపోసుకుంటోంది. కేంద్ర సాంస్కృతికశాఖ, రాష్ట్ర ప్రభుత్వం కలిసి సుమారు ఎకరా విస్తీర్ణంలో రూ.4.69 కోట్లతో ఈ మ్యూజియం ఏర్పాటు చేస్తున్నాయి. 3డీ ఆర్ట్ గ్యాలరీ, సిలికా విగ్రహాలు, సైన్స్ వర్కింగ్ మోడల్ ప్రదర్శనలు, శాస్త్రీయ థీమ్‌లు తదితరాలతో.. ఏడాదిలో ఇది అందుబాటులోకి రానుంది. ఈ మ్యూజియం నిర్మాణానికి ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మంగళవారం ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కైలాసగిరిని ముఖ్య పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. ఇక్కడ పర్యాటకులకు అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేస్తామన్నారు. గతంలో పలు అభివృద్ధి పనులకు ఇక్కడ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. ఇప్పుడు కేంద్ర సాంస్కృతికశాఖ, రాష్ట్ర ప్రభుత్వం కలిసి మ్యూజియం గ్రాంట్ స్కీం కింద సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఎస్‌సీఏపీ) ఆధ్వర్యంలో అధునాతనమైన సైన్స్ అండ్ టెక్నాలజీ మ్యూజియం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రూ.4.69 కోట్లతో ఏర్పాటు చేస్తున్న దీనికి.. రూ.3.75 కోట్లను ఎస్‌సీఏపీకి కేంద్ర సాంస్కృతికశాఖ కేటాయించగా మిగిలిన సుమారు రూ.కోటిని రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ పనుల్ని ఏడాదిలో పూర్తిచేసి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావడానికి అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారని ఆయన చెప్పారు. జీవీఎంసీ కార్పొరేటర్ స్వాతి, ఎస్‌సీఏపీ సీఈవో డాక్టర్ కె.జయరామిరెడ్డి, వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ రవీంద్ర, కార్యదర్శి బి.కీర్తి తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి ఎలా కట్టాలో చెప్పడానికి ఇంజనీర్లం కాదు

కృష్ణానదిపై బ్రిడ్జితో పాటు బ్యారేజీ నిర్మించాలన్న పిటిషన్‌పై సుప్రీంకోర్టు వ్యాఖ్య



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లను కలుపుతూ కృష్ణా నదిపై కేంద్రం నిర్మించతలపెట్టిన కేబుల్ స్టే సస్పెన్షన్ బ్రిడ్జి (ఐకానిక్)తో పాటు, బ్యారేజీ నిర్మించాలన్న విజ్ఞప్తిపై రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆశ్రయించాలని పిటిషనర్‌కు సుప్రీంకోర్టు సూచించింది. కర్నూలు జిల్లాకు చెందిన కమాని వేణుగోపాల్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది శిశిర్ పినాకి, న్యాయవాది దొంతిరెడ్డి శివరామిరెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఆరేళ్ల క్రితమే కేంద్రం ఐకానిక్ బ్రిడ్జి నిర్మించాలని తలపెట్టిందన్నారు. తెలంగాణలోని కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం .. ఏపీలోని కర్నూలు జిల్లా నందికొట్కూరు అసెంబ్లీ నియోజకవర్గం మధ్య కృష్ణానది మీద ఈ బ్రిడ్జి నిర్మించడానికి కేంద్రం ముందుకొచ్చిందన్నారు. ఈ దశలో జస్టిస్ సూర్యకాంత్ జోక్యం చేసుకుని బ్రిడ్జి ఎలా కట్టాలి? ఎక్కడ నిర్మించాలి? అని చెప్పడానికి తామేమీ ఇంజనీర్లు కాదని వ్యాఖ్యానించారు. అయితే, సిద్ధేశ్వరం అలుగు నిర్మించాలని కర్నూలు జిల్లా రైతులు దశాబ్దాలుగా ఆందోళన చేస్తున్నారని, ప్రస్తుతం ఐకానిక్ బ్రిడ్జితోపాటు బ్యారేజీ నిర్మించినా వారి కష్టాలు తీరుతాయని పిటిషనర్ తరఫు న్యాయవాదులు తెలిపారు. ఇప్పటికే అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదం కేసు సుప్రీంకోర్టులో ఉందని, రెండు రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఉన్న అంశంపై మూడో వ్యక్తిగా మీ ఆసక్తి ఏమిటి? అని ధర్మాసనం ప్రశ్నించింది. రైతుల ఆందోళనను కేంద్రం దృష్టికి తీసుకొద్దామనే ఈ పిటిషన్ దాఖలు చేశామని శిశిర్ పినాకి తెలిపారు. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించి తమ విజ్ఞప్తిని కేంద్రానికి ప్రతిపాదనగా పంపాలని కోరాలని పిటిషనర్‌కు ధర్మాసనం సూచించింది. అనంతరం పిటిషన్ కొట్టివేసింది.

బాలికపై లైంగిక దాడి కేసులో 11 మంది అరెస్ట్

సీతమ్మధార (విశాఖ ఉత్తర): ఓ మైనర్ బాలికపై లైంగికదాడికి పాల్పడిన 11 మంది నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మరో ఇద్దరి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. వివరాలు ఇలా... బాధిత కుటుంబం ఒడిశా నుంచి విశాఖ వలస వచ్చింది. ఓ అపార్ట్‌మెంట్‌లో తల్లిదండ్రులిద్దరూ పనిచేస్తున్నారు. రైల్వే క్వార్టర్స్‌లో ఓ ఇంట్లో బాలిక పనిచేస్తోంది. డిసెంబర్ 17వ రాత్రి తన ప్రియుడు ఇమ్రాన్, అతని స్నేహితుడు షోయబ్‌తో కలిసి నగరంలోని హోటల్‌కు వెళ్లింది. అక్కడ ఇమ్రాన్‌తోపాటు షోయబ్ కూడా ఆమెపై లైంగిక దాడికి పాల్పడినట్లు పోలీసుల విచారణలో స్పష్టమైంది. మనస్తాపానికి గురైన బాలిక ఆత్మహత్య చేసుకునేందుకు ఆర్కే బీచ్‌కు వెళ్లింది. అక్కడ పర్యాటకుల ఫొటోలు తీసే యువకుడు మాట కలిపాడు..ధైర్యం చెబుతూనే సమీపంలోని లాడ్జికి తీసుకువెళ్లాడు. అక్కడ బాలికపై లైంగికదాడికి పాల్పడ్డాడు. తరువాత మైనర్‌ను మరో గదికి తీసుకువెళ్లాడు. 22 వతేదీ వరకు ఫొటోగ్రాఫర్‌తో పాటు అతని స్నేహితులు పది మంది కలిసి లైంగిక దాడికి పాల్పడ్డారు. బాలిక ఫొటోగ్రాఫర్ల బారి నుంచి తప్పించుకుని ఒడిశాకు వెళ్లిపోయింది. గత నెల 18వ తేదీనే బాలిక కనిపించడం లేదని తల్లిదండ్రులు ఫోర్త్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల దర్యాప్తులో బాలిక ఒడిశాలో ఉన్నట్లు గుర్తించి విశాఖ తీసుకొచ్చారు. విచారణలో తనపై 13 మంది లైంగిక దాడి చేసినట్లు బాలిక వెల్లడించింది. దీంతో ఫొటోగ్రాఫర్ల బృందం 11 మందిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బాలిక ప్రియుడు ఇమ్రాన్, అతని స్నేహితుడు షోయబ్ పరారీలో ఉన్నారు. ఇమ్రాన్ జార్కండ్‌కు చెందినవాడు. ఇమ్రాన్, షోయబ్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కాగా, మంగళవారం ఇమ్రాన్ స్నేహితులు ఇద్దరినీ ఫోర్త్ టౌన్ సీఐ విజయ్‌కుమార్ అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఇమ్రాన్ వీళ్లతో టచ్‌లో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరిన టీడీపీ, జనసేన కార్యకర్తలు

'పశ్చిమ'లో మంత్రి కారుమూరి సమక్షంలో చేరిక



అత్తిలిలో మంత్రి కారుమూరి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ, జనసేన కార్యకర్తలు

అత్తిలి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఇతర పార్టీల నేతలు, కార్యకర్తలు ఆకర్షితులవుతున్నారని, వారు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా అత్తిలిలో మంగళవారం చేపట్టిన ప్రజా దీవెన పాదయాత్ర కార్యక్రమంలో మంత్రి సమక్షంలో జనసేన, టీడీపీలకు చెందిన 150 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి మంత్రి కారుమూరి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘనవిజయానికి కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు అడ్డాల జానకి, సర్పంచ్ గంటా విజేత నాగరాజు, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, వైస్ ఎంపీపీలు సుంకర నాగేశ్వరరావు, దారం శిరీష, అత్తిలి టౌన్ అధ్యక్షుడు పోలినాటి చంద్రరావు, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


మున్సిపల్ సమ్మె వాయిదా

సీఐటీయూ మినహా మిగిలిన సంఘాల అంగీకారం

- పారిశుద్ధ్య కార్మిక సంఘాల నేతలతో మంత్రుల బృందం చర్చలు
- ఇప్పటికే కొన్ని డిమాండ్లు పరిష్కారం..
- మరికొన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన నిర్ణయం

సాక్షి, అమరావతి: పట్టణ పారిశుద్ధ్య కార్మికుల సమ్మెను కార్మిక సంఘాలు వాయిదా వేసుకొనేందుకు అంగీకారం తెలిపాయి. మంగళవారం మంత్రుల బృందంతో చర్చల అనంతరం సీఐటీయూ మినహా మిగతా కార్మిక సంఘాలు బుధవారం నుంచి చేపట్టనున్న సమ్మె నిర్ణయాన్ని వాయిదా వేసుకొన్నాయి. మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి సచివాలయంలో కార్మిక సంఘాల నేతలతో సుదీర్ఘంగా చర్చలు జరిపారు. పారిశుద్ధ్య కార్మికుల ప్రధాన డిమాండ్ అయిన కేటగిరీల వారీగా బేసిక్ పే నిర్ణయం, పారుగు సేవల సిబ్బంది, కాంట్రాక్టు ఉద్యోగులను శాశ్వత ఉద్యోగులుగా క్రమబద్ధీకరించడం తదితర అంశాలపై చర్చించారు. అవుట్ సోర్సింగ్‌పై పనిచేసే పారిశుద్ధ్య, ఇంజినీరింగ్, ఇతర సిబ్బందికి అన్ని ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని, నియామకాల్లో వారికి వెయిటేజీ మార్కులు కేటాయించాలని, ఖాళీగా ఉన్న రెగ్యులర్ పోస్టులను వెంటనే భర్తీ చేసి, అవసరానికి తగ్గట్టుగా కార్మికుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. ఘన వ్యర్థాల తరలింపునకు కాంట్రాక్టు విధానంలో తీసుకున్న వాహనాల పనితీరును మెరుగుపరచాలని, పారిశుద్ధ్య కార్మికులు, ఇంజినీరింగ్ సిబ్బంది, పార్కుల నిర్వహణ, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వర్కర్లకు పనుల ఆధారంగా వారికి బేసిక్ పే పైనా సమావేశంలో చర్చించారు. కార్మికుల డిమాండ్లను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రులు చెప్పారు. సంక్రాంతి ముందు లేదా తర్వాత ప్రభుత్వంతో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని, అంతవరకు సమ్మెను వాయిదా వేయాలని మంత్రులు కోరారు. ప్రస్తుతం సీఐటీయూ కార్మిక సంఘాలు సమ్మె చేస్తున్నాయి. మిగిలిన సంఘాలు బుధవారం నుంచి సమ్మెకు దిగాలని మొదట నిర్ణయించాయి. మంత్రుల విజ్ఞప్తి మేరకు సీఐటీయూ మినహా మిగిలిన సంఘాల నేతలు సమ్మె నిర్ణయాన్ని వాయిదా వేసుకున్నట్టు ప్రకటించారు. ఈ చర్చల్లో మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి, సీడీఎంఏ కోటేశ్వరరావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడు, ఆప్కాస్ ఎండీ వాసుదేవరావు తదితర అధికారులు, రాష్ట్ర మున్సిపల్ ఉద్యోగుల సంఘాల నేతలు ఆనందరావు, రమణ (వైఎస్సార్‌టీయూసీ), రంగనాయకులు, పి.సుబ్బారాయుడు (ఏఐటీయూసీ), అబ్రహం లింకన్ (ఐఎఫ్‌టీయూ), జి.ప్రసాద్, కె.ఉమామహేశ్వరరావు (ఏపీసీఐటీయూ), జి.రఘురామరాజు, శ్యామ్ (టీఎన్‌టీయూసీ), మధుబాబు, ఆంజనేయులు (ఏపీ ఎంఈడబ్ల్యుయూ), వరప్రసాద్, కె.శ్రీనివాసరావు (ఏఐసీటీయూ) పాల్గొన్నారు.

చాలా సమస్యలు పరిష్కరించాం: మంత్రి సురేష్



అనంతరం మంత్రి సురేష్ పాత్రికేయులతో మాట్లాడుతూ.. కార్మికుల డిమాండ్లలో చాలా పరిష్కరించామని, మిగతా వాటిపైనా సరైన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ప్రధానంగా మున్సిపల్ శాఖలో అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వర్కర్లు, పారిశుద్ధ్య వాహనాల డ్రైవర్లు, మలేరియా వర్కర్లకు నెలకు రూ.6 వేలు చొప్పున ఆక్యుపేషనల్ హెల్త్ అలవెన్స్ చెల్లించేందుకు ఉత్తర్వులు జారీ చేశామన్నారు. మరికొన్ని డిమాండ్లపైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని చెప్పారు. స్కిల్డ్, సెమీ స్కిల్డ్, అన్ స్కిల్డ్ వర్కర్ల కేటగిరీల్లో కొన్ని తప్పులు జరిగాయని, వాటినీ పరిష్కరిస్తామన్నారు. ప్రమాదవశాత్తు చనిపోయినవారి కుటుంబాలకు పరిహారం చెల్లింపుపైనా సానుకూలనిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

తమకు ఉన్నవాటిని ప్రశంసించడం
తెలియనివారికి సంతోషం అనేది ఎప్పటికీ రాదు.
- బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 3 జనవరి 2024

గగనాంతర గవేషణ

కొత్త ఏడాది మొదలవుతూనే భారత్ మరో మైలురాయికి చేరుకుంది. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)కు చెందిన అంతరిక్ష ప్రయోగవాహక నౌక పీఎస్ఎల్వీ–సీ58 సోమవారం విజయవంతంగా నింగిలోకి దూసుకుపోవడంతో రోదసీ శోధనలో మన దేశం మరో ముందడుగు వేసింది. 'ఎక్స్–రే పోలారిమీటర్ శాటిలైట్' (ఎక్స్పో శాట్)నూ, మరో 10 ఇతర ఉపగ్రహాలనూ మోసుకుంటూ నింగిలోకి సాగిన ఈ ప్రయోగం అనేక విధాల ప్రత్యేకమైనది. ఖగోళంలోని కృష్ణబిలాలను (బ్లాక్ హోల్స్) అధ్యయనం చేసి, కొత్త అంశాల్ని వెలికితీసేందుకు 'ఎక్స్పోశాట్' ఉపకరిస్తుంది. ఈ తరహా శాస్త్రీయ శోధనకే పూర్తిగా అంకితమైన ఉపగ్రహాన్ని ఇస్రో పంపడం ఇదే తొలిసారి. దీంతో, అమెరికా తర్వాత రోదసిలోని ఇలాంటి దృగ్విషయాలపై ప్రయోగాలు జరుపుతున్న రెండో దేశమనే ఖ్యాతి భారత్కు దక్కింది. ఇక, వివిధ ప్రైవేట్ సంస్థల, విద్యార్థుల, ఇస్రో కేంద్రాలకు చెందిన మిగతా ఉపగ్రహాలు మన శాస్త్రవేత్తల, ప్రైవేట్ రంగ ఆలోచనలనూ, ఆకాంక్షలనూ ప్రతిబింబిస్తున్నాయి.

గత ఏడాది చరిత్రాత్మక చంద్రయాన్3 మిషన్తో మనం చంద్రునిపై జెండా పాతాం. చంద్రయాన్3 విజయం తర్వాత గత అయిదు నెలల్లో ఇస్రో విజయవంతం చేసిన రెండు మిషన్లూ శాస్త్రీయ స్వభావమున్నవే కావడం గమనార్హం. సూర్యుడి అధ్యయనానికి ముందుగా ఆదిత్య ఎల్1ను నింగిలోకి పంపింది. తాజాగా ఖగోళ–భౌతిక శాస్త్ర ఘటనలో భాగంగా వెలువడే ధ్రువీకృత ఎక్స్రేల అధ్యయనానికి ఈ 'ఎక్స్పో శాట్'ను తెచ్చింది. 'ఆదిత్య ఎల్1' లాగా 'ఎక్స్పో శాట్' సైతం పూర్తిగా అంతరిక్ష పరిశోధన–ప్రయోగశాలే. ఇది రెండు పేలోడ్లను నింగిలోకి మోసుకుపోయింది. రామన్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ రూపొందించిన 'పోలిక్స్' పేలోడ్ రాగల అయిదేళ్ళలో దాదాపు 50 మూలాల నుంచి వచ్చే ఉద్గారాలను పరిశీలిస్తుంది. 8 నుంచి 30 కిలో ఎలక్ట్రాన్ ఓల్ట్ (కేఈవీ) శక్తి పరిధిలోని ఎక్స్రేల గమనాన్ని గమనిస్తుంది. ఇక, ఇస్రోకు చెందిన యూఆర్ రావు శాటిలైట్ సెంటర్ రూపొందించిన 'ఎక్స్పెక్ట్' అనే రెండో పేలోడ్ 0.8 నుంచి 15 కేఈవీల శక్తి గల ఎక్స్రేలను పరిశీలిస్తుంది. నిరంతర ఎక్స్రే ఉద్గారాల్లోని మార్పులను అధ్యయనం చేస్తుంది. వెరసి రెండు పేలోడ్లూ ప్రబలమైన ఎక్స్రేస్కు ఉత్పత్తిస్థానాలైన కృష్ణబిలాలు, పల్సర్ల విషయంలో కొత్త అంశాల్ని వెలికి తీస్తాయి.

గగనాంతర సీమలో మన తాజా గవేషణ... అమెరికా, చైనా, రష్యాలదే ఆధిపత్యమైన అంతరిక్ష యాన రంగంలో భారత్ స్థానాన్ని సుస్థిరం చేస్తుంది. 2021 డిసెంబర్లోనే అమెరికా 'నాసా' చేసిన ఈ తరహా ఐఎక్స్పీఈ మిషన్కు ఏకంగా 188 మిలియన్ డాలర్లయితే, మన తాజా ఎక్స్పో శాట్ కేవలం 30 మిలియన్ డాలర్ల (రూ. 250 కోట్ల)కే సిద్ధమవడం విశేషం. అమెరికా ఉపగ్రహ జీవిత కాలం రెండేళ్ళే. మనది అయిదేళ్ళు. ఇలా అగ్రరాజ్యంతో పోలిస్తే అతి తక్కువ బడ్జెట్లో మరింత సమర్థమైన రాకెట్లు, ఉపగ్రహాలు రూపొందించి మన 'ఇస్రో' మరోసారి సత్తా చాటింది. మిగతా దేశాల్ని ఆశ్చర్యపరిచింది. నిజానికి ఎక్స్కిరణాల ధ్రువీభవనాన్ని కొలిచేందుకు సాగుతున్న ప్రయత్నాలు తక్కువ. 'నాసా' చేస్తున్నవీ బెలూన్ ఆధారిత, స్వల్పకాలిక ప్రయోగాలే. 2015 సెప్టెంబర్లో మనం ప్రయోగించిన ఆస్ట్రోశాట్ ద్వారానే భారతీయ ఖగోళ శాస్త్రజ్ఞులు గతంలో ఎక్స్రే ఉత్పత్తి స్థానాల బ్రాడ్బ్యాండ్ వర్ణపటమాపనం చేస్తూ వచ్చారు. అతి సున్నితమైన, కచ్చితమైన ఉపకరణాలు అవసరం గనక ఎక్స్రేల ధ్రువీభవనాన్ని కొలిచే ప్రయత్నాలెప్పుడూ పెను సవాలే. ఇస్రో చేసిన ఎక్స్పో శాట్ ప్రయోగం ఆ సవాలుకు సరైన జవాబవుతుందని ఆశంస.

ఇలాంటి అనేక సవాళ్ళను ఇస్రో భుజానికెత్తుకుంది. పలు అంతరిక్ష ప్రయోగాలు, మిషన్లతో ఈ ఏడాది పొడుగూతా ఇస్రో క్యాలెండర్ నిండిపోయి ఉంది. సగటున నెలకు కనీసం ఒక అంతరిక్ష ప్రయోగమో, ప్రయత్నమో చేయనుంది. ఈ జోరు ఇలాగే సాగితే, ఈ జోరులో ఇస్రో ఈ ఏడాది జరిపే ప్రయోగాల సంఖ్య డజను దాటేసినా ఆశ్చర్యం లేదు. వాణిజ్య విభాగమైన 'న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్' (ఎన్ఎస్ఐఎల్) కోసం రెండు పీఎస్ఎల్వీ వాణిజ్య మిషన్లను సైతం ఇదే ఏడాది ఇస్రో చేపడుతోంది. అలాగే, నిరుడు చేసిన పునర్వినియోగ ప్రయోగవాహక నౌక ప్రయోగాన్ని మరింత కఠోర పరిస్థితుల మధ్య విజయవంతం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. కొన్నేళ్ళ క్రితం హైడ్రోజన్ను ఇంధనంగా చేసుకొని స్క్రామ్జెట్ ప్రయోగాత్మక పరీక్ష చేసిన ఇస్రో ఈసారి కిరోసిన్ వాడి, పరీక్షించనుంది. అలాగే, నిరుడు సెప్టెంబర్ 2న ఆరంభమైన భారత తొలి సౌరయాత్ర 'ఆదిత్య ఎల్1' సైతం తుది విన్యాసం అనంతరం ఈ జనవరి 6 నాటికి లక్షిత ఎల్1 గమ్యానికి చేరుకోనుంది. మొత్తం మీద ఈ కొత్త ఏడాది అంతా ఇస్రో తీరిక లేకుండా ప్రయోగాలు చేయనుంది.

ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ మాటల్లో చెప్పాలంటే ఈ 2024 'గగన్యాన్' సన్నాహక సంవత్సరం. అంతేకాదు... తాజా రోదసీ ప్రయోగంలో భాగంగా నింగిలోకి పంపిన ఇతర ఉపగ్రహాలలో 'ఉయ్ శాట్' పూర్తిగా కేరళలోని మహిళలే తీర్చిదిద్దినది కావడం విశేషం. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మహిళల ముందంజకు అది ఓ ప్రతీక. ఇతర ప్రైవేట్ ఉపగ్రహాల వ్యవహారం అంతరిక్ష రంగంలో వస్తున్న సంస్కరణల్ని ప్రతిఫలిస్తోంది. ఈ ఆవిష్కరణలు, అతి తక్కువ ఖర్చు ప్రయోగాలు ప్రైవేట్ రంగానికి రోదసి తలుపుల్ని బార్లా తీస్తున్న భారత్కు కలిసొచ్చే అంశం. ఇప్పటికే దేశంలోని అంకుర సంస్థలు విదేశీ సంస్థలతో జత కలిసి ఉపగ్రహ నిర్మాణ వ్యాపారంలో దూసుకొస్తున్నాయి. ఖగోళ శోధనలో పురోగతికీ, ఉపగ్రహ నిర్మాణ సాధనలో భారత్ కేంద్రంగా మారడానికీ ఇవన్నీ శుభ శకునాలే! నూతన సంవత్సరం తొలి రోజున సాగిన విజయవంతమైన ప్రయోగం అందులో ఒకటి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, తిథి: బ.సప్తమి సా.4.36 వరకు, తదుపరి అష్టమి, నక్షత్రం: ఉత్తర ప.12.29 వరకు, తదుపరి హస్త, వర్జ్యం: రా.9.43. నుండి 11.27 వరకు, దుర్ముహూర్తం: ఉ.11.42 నుండి 12.30 వరకు, అమృత ఘడియలు: లేవు.

సూర్యోదయం : 6.36
సూర్యాస్తమయం: 5.34
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

అక్రమ వలసల విపరిణామం

విశ్లేషణ



కేపీ నాయర్

సుమారు 300 మంది భారతీయులు ప్రయాణిస్తున్న ఒక విమానాన్ని ఫ్రాన్స్లోని వాట్రీ విమానాశ్రయంలో నిర్బంధించడం అంతర్జాతీయ వార్తగా మారింది. నికరాగ్వాకు వెళ్తున్న ఇలాంటి వాళ్లందరూ అక్కడి నుంచి తమ దేశంలోకి అక్రమంగా వస్తున్నారని అమెరికా ఆరోపణ. ఫ్రెంచ్ అధికారులతో ఈ సమాచారాన్ని పంచుకున్న అమెరికన్ నిఘా వర్గాలు న్యూఢిల్లీని మాత్రం చీకట్లో ఉంచాయి. ఈ వార్తను పతాక శీర్షికల్లో వచ్చేలా చేయడం ద్వారా అక్రమ వలస రాకెట్ను సమర్థంగా బహిర్గతం చేయాలని వారు కోరుకున్నారు. తమ అమెరికా కలల్ని నెరవేర్చే అక్రమ ముఠాలకు భారీగా డబ్బులు ముట్టచెబుతూ, జనాలు తమ జీవితాలను ప్రమాదంలోకి నెట్టుకుంటున్నారు. సమగ్ర వలస విధాన సంస్కరణల అవసరాన్ని ఈ ఉదంతం సూచిస్తుంది.

తమ వలస, జాతీయతా చట్టంలో అమెరికా విదేశీ వ్యవహారాల శాఖ నవంబర్ 21న ఒక నిబంధనను పొందుపర్చింది. నికరాగ్వాకు ప్యాసింజర్ విమానాల్లో రివాజుగా విదేశీయులను తీసుకెళ్తున్న వారిని గుర్తించి, వారి ప్రయత్నాలను విఫలం చేయడానికీ, అలాంటి వారిని శిక్షించడానికీ సంబంధించిన నిబంధన అది. విదేశీయులను ప్రమాదకరమైన భూభాగం, జలమార్గాల ద్వారా అమెరికాలోకి నెట్టడమే మానవ రవాణా చేస్తున్న వారి ఉద్దేశం అని అమెరికా విదేశీ మంత్రిత్వ శాఖ ఆరోపించింది. ఆ సమయంలో భారతదేశంలో ఎవరికీ పెద్దగా తెలియని ఈ ప్రకటన, నాలుగు కీలక అంశాలను పేర్కొంది. ఒకటి, చట్టవిరుద్ధమైన మార్గాల ద్వారా అమెరికాకు రాబోయే వలసదారుల కోసం కొత్త అక్రమ రవాణా కేంద్రంగా నికరాగ్వా ఉద్భవించింది. రెండు, నేరస్థ ముఠాలు వలస వచ్చేవారి నుండి 'భారీ–స్థాయిలో డబ్బు'ను వసూలు చేస్తున్నాయి, వారిని తీవ్ర ప్రమాదాలకు గురిచేస్తున్నాయి. మూడు, అటువంటి అక్రమ వలసదారులు దేశంలోకి ప్రవేశించినా, ఎలాగైనా వారిని తమ తమ దేశాలకు అమెరికా తిప్పి పంపుతుంది. నాలుగు, నికరాగ్వాలోకి చార్టర్ విమానాలను పంపించే కంపెనీల యజమానులు, అధికారులు, సీనియర్ అధికారులతో కఠినంగా వ్యవహరించడానికి అమెరికా పాలనాయంత్రాంగం సిద్ధమవుతోంది.

అమెరికా చట్టంలోని సెక్షన్ 212 (ఎ)(3)(సి) 'యునైటెడ్ స్టేట్స్లో ప్రవేశించడం లేదా తీవ్రమైన అమెరికన్ ప్రతికూల విదేశాంగ విధాన పరిణామాలను కలిగి ఉన్న ఏ దరఖాస్తుదారుని అయినా సరే మినహాయించడానికి విదేశాంగ శాఖ మంత్రిని అమెరికా అనుమతిస్తుంది'. నికరాగ్వా బడా ముఠాలు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న వారి సహాయకులకు వ్యతిరేకంగా అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ ఈ నిబంధనను ఉపయోగించడానికి పథక రచన చేశారని నవంబర్ ప్రకటన పేర్కొంది. నికరాగ్వాకు అలాంటి విమానాలను నడుపుతున్న వారినీ, అమెరికా–మెక్సికో సరిహద్దులోని చివరి గమ్యస్థానానికి వలసదారులను తీసుకువెళ్లేవారినీ వదిలిపెట్టబోమని అమెరికా విదేశాంగ శాఖ పునరుద్ఘాటించింది. దురదృష్టవశాత్తు, వాషింగ్టన్ చేసిన ఈ రెండవ హెచ్చరిక కూడా భారతదేశం దృష్టిలోకి రాకుండా పోయింది.

వందలాదిమంది అనుమానిత భారతీయులను తీసుకెళుతున్న లెజెండ్ ఎయిర్లైన్స్(రొమేనియన్ సంస్థ) విమానం ఇంధనం నింపుకోవడం కోసం ఫ్రాన్స్లోని వాట్రీ విమానాశ్రయంలో దిగుతోందన్న సమాచారాన్ని సేకరించిన అమెరికన్ ప్రభుత్వ నిఘావర్గాలు, వ్యవస్థీకృత నేరాలపై పోరాడే ఒక ఫ్రెంచ్ ప్రభుత్వ విభాగానికి ఉప్పందించాయి. అట్లాంటిక్ సముద్ర ప్రాంతం పొడవునా నిఘా సమాచారాన్ని పంచుకోవడం అనేది ప్రపంచాన్ని సురక్షితమైన ప్రదేశంగా మారుస్తుందన్నది దీని వెనుక ఉద్దేశం. కానీ ఇది కలవరపెట్టే ప్రశ్నను కూడా



లేవనెత్తుతుంది: అలాంటి నిఘా సమాచారాన్ని న్యూఢిల్లీతో ఎందుకు పంచుకోలేదు? అత్యవసర పరిస్థితుల కోసం తగినంతగా సన్నద్ధత లేని ఒక విమానాశ్రయంలో, నాలుగు రోజుల పాటు భారతీయ ప్రయాణికులు నిర్బంధించబడ్డారు.

వాషింగ్టన్లోని విశ్వసనీయ వర్గాల ప్రకారం, అమెరికన్ అధికారులు ఆ విమానాన్ని ఎగరడానికి ముందే ఆపాలని అనుకోలేదు. పతాక శీర్షికల్లోకి వచ్చేలా చేయడం ద్వారా ప్రపంచ స్థాయిలో చర్యలు తీసుకునేలా అక్రమ వలస రాకెట్ను సమర్థవంతంగా బహిర్గతం చేయాలని వారు కోరుకున్నారు. ఎవరి తోడూ లేని మైనర్ ప్రయాణీకులను కూడా కలిగి ఉన్న ఆ విమానం వాట్రీ విమానాశ్రయం వద్ద ముట్టడిలో ఉండగానే అది ప్రపంచవ్యాప్తంగా వార్తలను సృష్టించింది. యూరప్ టీవీల్లో అతిపెద్ద వార్తగా మారిన ఈ అసాధారణ సంఘటన కారణంగా, ఈశాన్య ఫ్రాన్స్లో క్రిస్మస్ వేడుకలకు, పారిస్లోని అధికారిక వ్యవస్థలకు అంతరాయం ఏర్పడింది.

పశ్చిమ దేశాలకు వలస వచ్చే వారికోసం వేటాడే నేరస్థ ముఠాలు ఈ ఉదంతం కారణంగా, కనీసం కొంతకాలం అయినా ఇలాంటి విమాన వలసలకు ప్రయత్నించవు. అమెరికన్ విదేశాంగ శాఖ శిక్షాత్మకమైన వలస చట్టాన్ని అమలు చేయడానికి కొన్ని వారాల ముందు, హైతీ తన రాజధాని నుండి నికరాగ్వాకు అన్ని విమానాలను నిలిపివేసింది. భారతదేశంలాగే, ప్రస్తుతం హైతీ కూడా అక్రమ వలసలకు ఒక వనరుగా ఉందని అమెరికా పేర్కొంది.

సంపన్న దేశాలకు తమను అక్రమంగా తరలించేందుకు లక్షల రూపాయలు అప్పులు చేసి నికరాగ్వాకు వెళ్లే విమానం ఎక్కుతున్నారు భారతీయులు. ప్రభుత్వం ఈ నష్టాన్ని నివారించడంలో ఆలస్యం చేసింది. ఎట్టకేలకు డిసెంబరు 21న ఆర్భాటంగా, ఆకర్షణీయమైన సంక్షిప్త నామంతో విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఒక కార్యక్రమాన్ని ప్రారంభించింది. యువత, నైపుణ్యం కలిగిన నిపుణుల కోసం క్రమబద్ధమైన సహాయకరమైన వలసను ప్రోత్సహించే 'ప్రయాస్' కార్యక్రమం అది. అంతర్జాతీయ వలస చక్రానికి సంబంధించిన విషయాలపై మెరుగైన అవగాహనను ప్రోత్సహించడానికి... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య మెరుగైన సమన్వయం కోసం ఒక రోడ్మ్యాప్ను అభివృద్ధి చేయడం దీని లక్ష్యం. నికరాగ్వాకు ఇటీవల కనీసం రెండు విమానాల్లో వెళ్లిన భారతీయులను ఎవరూ గుర్తించలేదని పోలీసులు ఇప్పుడు చెబుతున్నారు. అనేక వందల మంది భారతీయ అక్రమ వలసదారులు దొరకకుండా తప్పించుకు పోతుండటాన్ని నాటకీయంగా చూపించే తమ ప్రయత్నంలో అమెరికా, ఫ్రెంచ్ ప్రభుత్వాల నేరనిరోధక ఏజెన్సీలు... ప్రధానంగా పంజాబ్, గుజరాత్ల నుండి యూరప్ గుండా పశ్చిమ అర్ధ గోళానికి వలసదారులను చేర్చడం కోసం పనిచేస్తున్న విస్తృత నేరస్థ నెట్వర్క్ గురించి భారతదేశాన్నే కాకుండా ఐక్యరాజ్యసమితిని కూడా చీకటిలో ఉంచాయి. ప్రయాస్ అనేది ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ వలస సంస్థ, భారతీయ అంతర్జాతీయ వ్యవహారాల మండలి... ఉమ్మడి ప్రాజెక్ట్.

మరో విడ్డూరం ఏమిటంటే, లెజెండ్ ఎయిర్లైన్స్ చార్టర్ ఫ్లైట్ ఉదంతం వెలుగులోకి రావడానికి ఒక వారం ముందు, 'నమోదు కాని రిక్రూట్మెంట్ ఏజెంట్ల వల్ల మోసపోతున్న విదేశీ ఉద్యోగార్థుల సంఖ్య భారీగా పెరిగింది' అని భారత విదేశాంగ శాఖ హెచ్చరించింది. విదేశాలకు వెళ్లాలనుకునే భారతీయులపై వేటు వేయడం ప్రపంచ స్థాయిలో జరుగుతోంది. 'చాలా తూర్పు యూరోపియన్ దేశాలు, కొన్ని గల్ఫ్ దేశాలు, మధ్య ఆసియా, ఇజ్రాయెల్, కెనడా, మయన్మార్, లావో పీపుల్స్ డెమోక్రటిక్ రిపబ్లిక్లలో వీటికి సంబంధించి కేసులు నమోదవుతున్నాయి' అని హెచ్చరించింది.

పార్లమెంట్లోని ప్రతి సెషన్ లోనూ, అక్రమ వలసల శాపం గురించి జీరో అవర్లో పెద్ద మొత్తంలో ప్రశ్నలు వస్తుంటాయి. భారత విదేశాంగ మంత్రి లోక్సభలో ఒక ప్రకటన చేస్తూ ఈ సమస్య సంక్లిష్టత రీత్యా తాము నిస్సహాయంగా ఉంటున్నట్టు పేర్కొన్నారు. 'బహిష్కరణ ఉత్తర్వులు వచ్చే వరకు విదేశాలు చాలావరకు తమ తమ దేశాల్లో అక్రమంగా ఉంటున్న వారి గురించి సమాచారాన్ని అందించవు' అని చెప్పారు. 'విదేశాల్లో చట్టవిరుద్ధంగా ఉంటున్న లేదా పని చేస్తున్న భారతీయుల సంఖ్యపై మన దౌత్య కార్యాలయాల వద్ద ఎటువంటి విశ్వసనీయమైన డేటా లేదు' అని అంగీకరించారు. ఇది షాకింగ్గా ఉందని చెబితే సమస్యను తక్కువ అంచనా వేయడమే అవుతుంది. వాట్రీ విమానాశ్రయ ఘటన ఉదంతం, సమస్య తీవ్రతనూ, సమగ్ర వలస విధాన సంస్కరణల అవసరాన్నీ సూచిస్తుంది. ఈ విషయంలో విఫలమైతే ఎక్కువ మంది భారతీయులు... అంతర్జాతీయ నేరస్థ ముఠాల బాధితులుగా మారతారు.

వ్యాసకర్త వ్యూహాత్మక అంశాల విశ్లేషకులు
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్సైట్లు ఫేస్బుక్, ట్విట్టర్లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఏది వైఖరి?



నాలుగు వందల ఏళ్ల క్రితం జరిగిన అవమానాన్ని మనం ఎప్పటికీ మర్చిపోకూడదు కాబట్టి, రామాలయం అవసరం అని ఒక స్నేహితుడు గుర్తుచేశాడు. ఇదే జనాలు '2002' సంవత్సరం ఎప్పటిదో అంటూ, దాన్ని మర్చిపోవాలని చెబుతుంటారు. ఇంతకీ, ఇండియా గుర్తుంచుకోవాలా? మర్చిపోవాలా?

– సలీల్ త్రిపాఠి, జర్నలిస్ట్

అందుకా వ్యతిరేకత?



నరేంద్ర మోదీ లాంటి నేతలు తమ నియంత్రణలో లేకపోవడం పట్ల వాషింగ్టన్లోని వామపక్ష కులీన వర్గాలు నిరాశలో ఉన్నాయి. అంతర్జాతీయ వ్యవహారాల్లో వాళ్లు చెప్పేది కాకుండా, భారత ప్రయోజనాల రీత్యా ఆయన వ్యవహరిస్తున్నారు. ఇలాంటిదానికి వాళ్లు గతంలో ఎప్పుడూ అలవాటుపడి లేరు.

– ఆర్తి టిక్కూ, జర్నలిస్ట్

ఇలా మారేం!



రాజ్యాంగంలో 'సైంటిఫిక్ టెంపర్' అనే మాటను జోడించిన మొదటి దేశం... ఇండియా. కానీ దేశంలో ఎంతోమంది మూర్ఖులుగా, తర్కహీనులుగా తయారయ్యారు.

– డాక్టర్ హుస్సేన్, ఆంకాలజిస్ట్

మడత టాపులు



త్వరలో ల్యాప్టాపులకు కాలం చెల్లిపోయేట్టుంది. ల్యాప్టాపుల స్థానంలో రోల్–టాపులు వచ్చేస్తాయి. వీటిని దగ్గరగా చుట్టుకోవచ్చు. టెక్నాలజీ ఎంత నమ్మశక్యం కానట్టుగా మారుతున్నదో!

– అనిల్ చోప్రా, ఎయిర్ మార్షల్ (రిటైర్డ్)

ఇంత గందరగోళమా?



ఐడీఎఫ్ (ఇజ్రాయెల్) తన సైనికులను తానే 'ఫ్రెండ్లీ ఫైర్'లో (స్వపక్షం నుంచే జరిగే పొరపాటు కాల్పులు) చంపుకొంటూ జిజీగా ఉంది. కనీసం ఇప్పటికే 29 మంది చనిపోయారు. కొన్ని కేసుల్లోనైతే సొంత సైనికుల మీదికి ట్యాంకులు ఎక్కించేశారు. పూర్తి భయాందోళనలకు ఇదొక సంకేతం.

– నీనా వ్యాస్, జర్నలిస్ట్

తగనిది



ఆర్టికల్ 370, అయోధ్య కేసుల్లో తన తీర్పును సమర్థించుకుంటూ భారత ప్రధాన న్యాయమూర్తి మీడియా ఇంటర్వ్యూలు ఎందుకు ఇస్తున్నారు? న్యాయమూర్తి తన తీర్పుల ద్వారానే మాట్లాడాలి. అవసరం అనుకుంటే మీడియాను కేవలం సుప్రీంకోర్టు పనితీరు మీద అవగాహన కల్పించడానికే వాడుకోవాలి. అంతేగానీ తీర్పుల మీద వివరణ ఇవ్వడం, సమర్థించుకోవడం తగదు.

– ఆశిష్ గోయల్, న్యాయవాది

గాల్లో ప్రాణాలు



గాజా పౌరులను మానవ కవచాలుగా వాడుతున్నట్టు ఒక హమాస్ మాజీ కార్యకర్త విచారణలో అంగీకరించాడు. తమకు మిలిటరీ స్థావరాలు నిర్మించే వీలు లేనందున, జనావాస బిల్డింగుల నుంచి దాడి చేయడం తప్ప ఇంకో మార్గం లేదనేది అతడి వాదన. ఒక విధంగా ఇది నిరాకరణ కన్నా, సమర్థనలా ధ్వనిస్తోంది.

– ఇంతియాజ్ మహమూద్, థింకర్

ఇన్ బాక్స్

దేశానికే ఆదర్శంగా...

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం ఆంధ్ర' దేశానికే ఆదర్శంగా నిలుస్తుంది. ఎందుకంటే ప్రస్తుతం ఆధునిక సమాజంలో సెల్ ఫోన్... అరచేతుల్లో ప్రపంచాన్ని చూపిస్తూ మనిషిని కట్టిపడేస్తోంది. దీంతో ఏ కొద్ది తీరిక ఉన్నా జనం మొబైళ్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలతోనే కాలక్షేపం చేస్తున్నారు. కనీసమైన వ్యాయామాన్ని చేయడంలేదు. ఈ పరిస్థితిలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలు నిర్వహిస్తోంది. తద్వారా గ్రామీణ స్థాయిలోనే అనేకమందిలో నిగూఢంగా దాగి ఉన్న ప్రతిభను బయట పెట్టుకోవడానికి అవకాశం కల్పించినట్లయింది. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న 15 సంవత్సరాల పిల్లల నుంచి ఆ పైన ఉన్న అన్ని వయసుల వారికీ క్రీడాపోటీలు నిర్వహిస్తున్నది ప్రభుత్వం. అన్ని గ్రామాల్లో ప్రజలు ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేస్తూ తమ బిజీ జీవితానికి స్వస్తి చెప్పి ప్రస్తుతం ఆటల్లో ఆనందాన్ని ఆస్వాదిస్తున్నారు.

ఏ విధమైన శారీరక శ్రమ, సరైన వ్యాయామం లేకుండా బీపీ, షుగర్ లాంటి దీర్ఘ కాలిక ఆరోగ్య సమస్యలు తెచ్చుకుంటున్న కోట్లాదిమందికి మరోసారి చిన్నప్పటి క్రీడానందాన్నీ, ఉత్సాహాన్నీ ఈ క్రీడలు కలిగిస్తున్నాయని చెప్పాలి. ప్రస్తుతం గ్రామీణ క్రీడల్లో ప్రజలు మునిగి తేలుతూ ఉన్నారు. మునుముందు రోజుల్లో మరింతమంది క్రీడాకారులను ఆంధ్రప్రదేశ్ నుండి మరీ ముఖ్యంగా గ్రామీణ యువతీ యువకులను ప్రోత్సహించడానికి ఈ క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయి. సుమారు 35 లక్షల మంది యువతీ యువ కులు ఈ క్రీడల్లో పాల్గొని విజయం సాధించాలని కోరుకుంటున్నారు. వారందరి ఆటలనూ సుమారు 90 లక్షల మంది ప్రేక్షకులు వీక్షించి సంతోషిస్తున్నారు. ఈ విధంగా క్రీడలు నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు. భవిష్యత్తులో ఈ క్రీడా ఉత్సవాలు కొనసాగడానికి ప్రజలు తమ వంతు అండదండలు అందించడం అవసరం.

– నాగెండ్ల సుమతీ రత్నం, దాచేపల్లి
(డిసెంబర్ 26 నుంచి ఫిబ్రవరి 10 వరకు కొనసాగనున్న 'ఆడుదాం ఆంధ్ర')

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

సత్వరిపాలనకు జై కొడదాం!

నాటి టీడీపీ పాలన పెత్తందారీ పాలన అన్న నోరే నేడు అదే పాలన కావాలి, అంటే ఆ నోటిని ఏమనాలి? ప్రతి మనిషికీ స్వార్థం ఉంటుంది. అలాగే ప్రతిపక్ష పార్టీలకు తిరిగి అధికారంలోకి రావాలనే తపన ఉంటుంది. అది తప్పు కాదు. అయితే అధికారంలోకి రావడానికి ఏ అడ్డదారైనా తొక్కవచ్చునా అనేదే ఇక్కడ ప్రశ్న.

అధికారంలో ఉన్న వారికి ప్రతిపక్ష పార్టీలు నిర్మాణాత్మకమైన సహకారాన్ని అందించడమే రాజనీతి. అంటే మంచిని మంచిగా, చెడును చెడుగా చూడాలి. నేడు అది జరుగుతోందా? ప్రజలు ఆలోచించాలి. స్వాతంత్ర్యానంతరం 75 ఏళ్లలో అధికారాన్ని వెలగబెట్టిన పార్టీలు, ముఖ్యమంత్రులు ప్రజలకు మంచిపాలన అందించారా? నిజంగా వారి పాలన అంత బాగా ఉంటే నేటికీ ప్రాంతాల మధ్య అంతరాలు ఎందుకు ఉన్నాయి? ప్రజల పేదరికం స్థాయి ఇంకా ఎందుకు పెరిగింది?

నవ్యాంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత టీడీపీ అధినేత ఎంతో అనుభవజ్ఞులని ప్రజలు నమ్మి అధికారం కట్టబెడితే ఏం జరిగింది? ఉద్యోగ, కార్మిక, కర్షక, విద్యార్థి, మహిళా వర్గాలను పాతాళానికి తొక్కిన మాట నిజం కాదా? చెప్పుకోవడానికి ఒక మంచి అయినా జరిగిందా? ఒకవేళ జరిగి ఉంటే నేడు ఆ పార్టీలు తాము చేసిన మేలును గురించి చెప్పుకుంటూ జనంలోకి ఎందుకు వెళ్లడం లేదు? ఈ ఐదేళ్లలో ప్రతిపక్షంగానైనా ఎప్పుడైనా, ఎక్కడైనా వారు చేసిన మంచిని గురించి మాట్లాడారా? అది చెప్పలేక అధికార పక్షంపై విరుచుకుపడుతూ, జగన్ ప్రభుత్వం ఏర్పడిన మొదటి రోజు నుంచే విపరీతమైన దాడికి పాల్పడటం ఏ పాటి నీతి? పాలనను సైతం సాగించడానికి వీలు లేనంత అక్కసు వారి మాటలలో కనబడలేదా?

గత టీడీపీ పాలనలో విసిగి, వేసారిన ప్రజలు 2019లో చిత్తుగా ఓడించి వైఎస్సార్సీపీని గద్దెనెక్కించినారు. అప్పటి నుంచి జగన్... ప్రజలే కేంద్రంగా పాలనకు శ్రీకారం చుట్టారు. ప్రజలు పాలకుల దగ్గరకు తిరగడం కాదు, పాలకులే ప్రజల దగ్గరకు పోయే వ్యవస్థలైన సచివాలయ, వాలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేశారు.



నవ్యాంధ్రప్రదేశ్లో మూడు ప్రాంతాలు ఏక కాలంలో సమానంగా అభివృద్ధి చేయాలనుకోవడం తప్పా? గతంలో 'పెద్ద మనుషుల' ఒప్పందాలు, నిపుణుల కమిటీల నివేదికల ఆధారంగా రాయలసీమలో పెట్టాల్సిన రాజధానిని, ఇప్పటికే అభివృద్ధి చెందిన కోస్తా ప్రాంతంలో పెట్టడం నేరం కాదా? మూడు ప్రాంతాలలో మూడు రాజధానులను ఏర్పాటు చేయడం తప్పా? ఇదెక్కడి రాజనీతి! ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైనా, జగన్ సామాన్య ప్రజలను నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వాన్ని నడుపుతున్న మాట వాస్తవం కాదా? పేదలు అందరితో సమానంగా సమాజంలో తలెత్తుకొని బతకాలన్న సద్బుద్ధితో... విద్య, వైద్య రంగాలను ప్రక్షాళన చేసిన మాట వాస్తవం కాదా?

ప్రజలారా ఆలోచించండి. ఎవరికైనా బూజు పట్టిన సమాజాన్ని మార్చడానికి సమయం కావాలి. కరోనా కాలం మినహాయించి చూస్తే నిజంగా వైఎస్సార్సీపీకి ఈ టెర్మ్లో ఉన్నది కేవలం రెండున్నర సంవత్సరములు మాత్రమే. ఇంత తక్కువ కాలంలో ఏ ప్రభుత్వాలూ అద్భుతాలు చేసి చూపించలేవు. అయినా జగన్ ప్రభుత్వం కష్టాలను, అడ్డంకులను అధిగమించి ప్రపంచం మన వైపు చూసే లాగా వ్యవస్థలను సంస్కరించింది. వీటన్నిటికీ మించి నిర్లక్ష్యానికి గురైన బహుజన సమాజాన్ని అభివృద్ధి చేసేందుకు నిర్విరామ కృషి చేస్తోంది. బహుజనులు అంటే బలహీనులు కాదు, దేశ సంపదను సృష్టించే శ్రామికులు అనే సత్యాన్ని సమాజంలోకి తీసుకెళుతోంది. అందుకే నిరంతరం మంచికై తపన పడుతున్న వైఎస్సార్సీపీనీ, ప్రభుత్వాన్నీ బతికించుకుందాం. పెత్తందారుల వంచనను ఎండగడదాం. వైఎస్ఆర్సీపీ ప్రజా పాలనకు జై కొడదాం. తద్వారా మనం చనిపోయినా బతికిన వాళ్లమవుదాం. లేకుంటే బతికి కూడా చనిపోయిన వారితో సమానంగా ఉండిపోతాం!

– కె.వి. రమణ
బెస్త కార్పొరేషన్ డైరెక్టర్, అనంతపురం


ఈశ్వరమ్మ ఆరాధన

శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి కాలజ్ఞాని, తత్వవేత్త, సంఘ సంస్కర్తగా ప్రసిద్ధి చెందారు. ఆయన తత్వ వారసురాలిగా శ్రీ ఈశ్వరీదేవి పేరు పొందారు. బ్రహ్మంగారి కాలజ్ఞాన తత్వాలను ప్రజలకు బోధించారు. ఆమె బ్రహ్మంగారి రెండో కుమారుడైన గోవిందస్వామి, గిరియమ్మ దంపతులకు క్రీ.శ.1703లో జన్మించారు. చిన్నప్పటి నుంచే సంస్కృతం, తెలుగు భాషలపై పాండిత్యం సంపాదించారు. భారత, భాగవతాది గ్రంథాలను స్వయంగా వర్ణించే వారు. బ్రహ్మంగారి మఠానికి సమీపాన ఉన్న నల్లమల కొండ గుహలో 14 ఏళ్లు కఠోర తపస్సు చేసి.. అష్టాంగ యోగాది, జ్ఞాన వాక్సిద్ధి పొందారు. స్వీయ కల్యాణాన్ని త్యజించి... లోక కల్యాణార్థం బ్రహ్మచర్య దీక్ష బూని ఆత్మతత్వ బోధనలు రచించారు. శిష్యసమేతంగా దేశ పర్యటన చేసి భక్తితత్వాన్ని ప్రచారం చేశారు. భక్తులకు ఎన్నో లీలలు ప్రత్యక్షంగా చూపించారని భక్తులు చెప్పుకుంటూ ఉంటారు.

మార్కాపురంలో కలరా, మశూచి వంటి అంటు వ్యాధులను నివారించారు. ఆ గ్రామంలో బొడ్డు రాయిని ప్రతిష్ఠించారు. ఎందరినో సంస్కరించి జ్ఞాన దీప్తిలా భాసిల్లి... జనుల గుండెల్లో అమ్మవారిగా కొలువైనారు. 1803లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైఎస్ఆర్ జిల్లాలోని బ్రహ్మంగారి మఠం (కంది మల్లాయపల్లె)లో సజీవ సమాధి నిష్ఠ పొందారు. నాటి నుంచి లోక కల్యాణార్థం యోగ నిద్ర ముద్రితురాలై భక్త జనుల నిత్య నీరాజనాలు స్వీకరిస్తున్నారు. ఆ ప్రాంతం శ్రీ ఈశ్వరీదేవి మఠంగా పేరొందింది. ఏటా మార్గశిర బహుళ నవమి నాడు అమ్మవారి ఆరాధన గురుపూజ మహోత్సవం నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ ఏడాది జనవరి 3 నుంచి 8 వరకు ఉత్సవాలు నిర్వహిస్తారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, మహారాష్ట్ర నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు.

– వి. మల్లికార్జున ఆచార్య, కడప
(జనవరి 5న ఈశ్వరీదేవి సజీవ సమాధి నిష్ఠ పొందిన రోజు)

క్లుప్తంగా...



ఆకాశం వైపు పెద్ద టార్చిలైట్ వేసినట్లు కనిపిస్తోంది కదూ.. చిలీలోని విలారికా అగ్నిపర్వతం రగులుతున్నప్పుడు ఈ దృశ్యం ఆవిష్కృతమైంది. ఈ చిత్రాన్ని క్రిస్టోబార్ అనే ఫొటోగ్రాఫర్ తీశారు..

వైఎస్సార్‌సీపీకి దాడి వీరభద్రరావు రాజీనామా

- నేడు చంద్రబాబుతో భేటీ



అనకాపల్లి: మాజీ మంత్రి దాడి వీరభద్రరావు వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేశారు. ఈమేరకు ఆయన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌కు మంగళవారం లిఖితపూర్వకంగా రాజీనామా పత్రాన్ని పంపించారని వీరభద్రరావు తనయుడు, వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు రత్నాకర్ చెప్పారు. స్థానిక రింగ్‌రోడ్డులోని దాడి క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దాడి కుటుంబమంతా రాజీనామా చేస్తున్నట్టు చెప్పారు. బుధవారం అమరావతిలో టీడీపీ అధినేత చంద్రబాబు, లోకేశ్‌లను కలిసి, వారితో మాట్లాడిన అనంతరం తదుపరి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

వీరభద్రరావుకు సముచిత స్థానం

టీడీపీ స్థాపించినప్పటి నుంచి 2014 వరకూ మాజీ మంత్రి దాడి వీరభద్రరావు ఆ పార్టీలో ఉన్నారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ నుంచి ఎమ్మెల్యే టికెట్ రాదని తెలిసి వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దాడి వీరభద్రరావుకు పార్టీలో సముచిత స్థానం కల్పించడమే కాకుండా విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా వీరభద్రరావు కుమారుడు దాడి రత్నాకర్‌కు సీటు ఇచ్చారు. పార్టీలో ఆయనకు సముచితస్థానం కల్పిస్తూ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వైఎస్ జగన్ నియమించారు. రాష్ట్ర గ్రంథాలయాల చైర్మన్ పదవి ఆఫర్ చేస్తే దాడి తిరస్కరించారు.

వెన్నుపోటు పొడిచే కంటే బయటకెళ్లడమే మంచిది

- 'దాడి' రాజీనామాపై మంత్రి అమర్‌నాథ్ వ్యాఖ్య

ఆరిలోవ (విశాఖ తూర్పు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉండి వెన్నుపోటు పొడిచే కంటే పార్టీని వీడి బయటకు వెళ్లిపోవడమే మంచిదని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. నగరంలో కైలాసగిరిపై సైన్స్ మ్యూజియం శంకుస్థాపన కోసం వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. స్వార్థం కోసం కాకుండా కష్టపడేవారే వైఎస్సార్‌సీపీలో ఉంటారన్నారు. పార్టీ వీడిన దాడి వీరభద్రరావుకు ప్రస్తుత పరిస్థితిలో ఎమ్మెల్యే సీటు ఇవ్వలేకపోయినా భవిష్యత్‌లో మంచి అవకాశాలు కల్పిస్తామని సీఎం జగన్ చెప్పారని, అయినా ఆయన స్వార్థం కోసం పార్టీని వీడినట్లు తెలిపారు. రాష్ట్రంలో 175 సీట్లకు 175 మందికి మాత్రమే ఎమ్మెల్యే సీట్లు ఇవ్వగలరన్నారు. పార్టీలో ఉన్న లక్షల మంది నాయకులకు ఎమ్మెల్యే సీట్లు కావాలంటే సాధ్యం కాదన్నారు. గెలిచేవారికే సీట్లు కేటాయిస్తామని గత నెలలో సీఎం సమావేశం పెట్టి మరీ నాయకులందరికీ తెలియజేశారన్నారు. కష్టపడేవారందరికీ పార్టీలో మంచి భవిష్యత్ ఉంటుందన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన మాజీ ఎంపీ శాంత

- సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చూసి వైఎస్సార్‌సీపీలో చేరా
- పార్టీలో సామాన్య కార్యకర్తలా పని చేస్తా
- సీఎం జగనన్న నిర్ణయం ప్రకారం నడుచుకొంటానని శాంత వెల్లడి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో జే శాంత. చిత్రంలో ఎంపీ మిథున్ రెడ్డి తదితరులు

సాక్షి, అమరావతి: మాజీ ఎంపీ జె. శాంత మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. సీఎం క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ఆమె పార్టీ కండువా కప్పుకొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన ఆమె వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన వారు. ఆమె 2009లో లోక్‌సభ సభ్యురాలిగా ఎన్నికయ్యారు. పార్టీలో చేరిన అనంతరం సీఎం క్యాంపు కార్యాలయం వద్ద జె.శాంత మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చూసి ప్రజలకు ఆయనపై అపారమైన నమ్మకం ఏర్పడిందని, అందుకే వైఎస్సార్‌సీపీలో చేరానని చెప్పారు. ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో పార్టీలో చేరానని, పార్టీలో సామాన్య కార్యకర్తలా పని చేస్తానని తెలిపారు. పార్టీ కార్యకర్తలు, ప్రజలు తనను ఆశీర్వదించాలని కోరుతున్నానని చెప్పారు. వాల్మీకి సామాజిక వర్గం నుంచి వచ్చిన తనకు సీఎం జగన్ ప్రాధాన్యత ఇస్తారని భావిస్తున్నానని, ఆయన నిర్ణయమే శిరోధార్యమని అన్నారు. అవకాశం ఇస్తే వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని, హిందూపురం ఎంపీగా పోటీ చేసే విషయంపై పార్టీ అధిష్టానం ఆదేశాల ప్రకారం నడుచుకుంటానని చెప్పారు. సీఎం జగన్ రాష్ట్రంలో పేదల సంక్షేమం, అభివృద్ధి రెండుకళ్లుగా డీబీటీ ద్వారా నేరుగా పేదల ఖాతాల్లో జమ చేసిన రూ.2.42 లక్షల కోట్లలో 70 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అందించారన్నారు. రాష్ట్రంలో ఇళ్ల నిర్మాణం పారదర్శకంగా జరుగుతుండటం తాను గమనించానని చెప్పారు. 17 వేలకు పైగా జగనన్న కాలనీలు ప్రత్యేక ఊళ్లుగా శరవేగంగా రూపుదిద్దుకుంటున్నాయని తెలిపారు. దేశంలో మరెక్కడా ఈ విధంగా జరగటంలేదన్నారు. రాష్ట్రంలో ఏ గ్రామానికి వెళ్లినా సీఎం జగన్ మార్క్ కనిపిస్తోందని, గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం రాష్ట్రంలో సాకారమవుతోందని చెప్పారు. రాష్ట్రంలో ఏ మూలకు వెళ్లి ప్రజలను కదిలించినా జయహో జగనన్న అంటున్నారని చెప్పారు. మీడియా సమావేశంలో నియోజకవర్గ నేతలు గుంతకల్లు రమేష్ రెడ్డి, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో డిమాండ్ల జాతర.. అనంతరం పాతర

కాపు నేతలకు కాపు ఐక్య వేదిక బహిరంగ లేఖ

సాక్షి, అమరావతి: ఎన్నికల ముందు డిమాండ్ల జాతర... ఎన్నికల అనంతరం ఆ డిమాండ్లన్నింటికీ పాతర వేయడం గత 35 ఏళ్లుగా కాపు జేఏసీ పేరుతో చేస్తున్న హంగామా.. అని కాపు ఐక్యవేదిక తప్పుపట్టింది. ఈ మేరకు పలు అంశాలను ప్రస్తావిస్తూ రాష్ట్ర కాపు జేఏసీ నేతలకు కాపు ఐక్య వేదిక బహిరంగ లేఖ రాసింది. ఆ లేఖను కాపు ఐక్య వేదిక రాష్ట్ర చైర్మన్ రావి శ్రీనివాస్ మంగళవారం మీడియాకు విడుదల చేశారు. '1988–89 నుంచి ఇప్పటి వరకు ప్రతి ఎన్నికల ముందు హడావుడి చేయడం, ఎన్నికల అనంతరం మౌనంగా ఉండటం కాపు నేతలకు వెన్నతో పెట్టిన విద్య. కాపు కులానికి కాపు నాయకులే శత్రువులు. స్పందించాల్సిన సమయంలో మౌనంగా ఉండి ఆ తర్వాత డిమాండ్లు చేయడం వల్ల ప్రయోజనం లేదు. మళ్లీ ఎన్నికలు వస్తున్నాయని మీ వ్యక్తిగత అజెండాలతో ఇప్పుడు సిద్ధమైపోయారా? గత టీడీపీ ప్రభుత్వంలో రిజర్వేషన్ల విషయంలో ఎందుకు యూటర్న్ తీసుకున్నారు. దేశంలో వివాదాలు పరిష్కారమయ్యాయి.. కానీ కాపు రిజర్వేషన్ల సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. చిత్తశుద్ధి ఉంటే సమగ్ర కులగణన ద్వారా కాపులకు జనాభా ప్రాతిపదికగా ప్రత్యేక బీసీ రిజర్వేషన్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేయాలి. కాపుల అమాయకత్వాన్ని, ఆవేశాన్ని, భావోద్వేగాలను ప్రతి ఎన్నికల్లోనూ ఎవరో ఒకరు వాడుకోవడం, అవసరం తీరిపోయాక వదిలేయటం పరిపాటిగా మారింది..' అని ఆ లేఖలో పేర్కొన్నారు.

సొంత సామాజికవర్గంలోనే పవన్ కళ్యాణ్ పై వ్యతిరేకత

- జనసేన శ్రేణుల ఆత్మాభిమానాన్ని ఆయన దెబ్బతీశారు
- టీడీపీకి జనసేన వాళ్లెవరూ ఓటేయరు
- ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్ వెల్లడి
- భీమవరంలో వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన నేతలు, కార్యకర్తలు



జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరుతున్న వారిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న గ్రంధి శ్రీనివాస్

భీమవరం: పవన్‌కళ్యాణ్‌కు సీఎం పదవి కాదు కదా, డిప్యూటీ సీఎం పదవి కూడా వచ్చే అవకాశంలేదని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పవన్‌కు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వడంపై పొలిట్‌బ్యూరో, చంద్రబాబు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని ఇటీవల లోకేశ్ వ్యాఖ్యానించడంపై సొంత సామాజికవర్గంలోనే పవన్‌పై వ్యతిరేకత వ్యక్తమవుతోందని.. ఆయనకు పౌరుషం, ఆత్మాభిమానం లేదా అని వారు ప్రశ్నిస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన జనసేన నేతలు, కార్యకర్తలు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే గ్రంధి తన క్యాంపు కార్యాలయంలో వారికి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు రాజకీయంగా మోసగాడని, 14 ఏళ్ల పాటు సీఎంగా చేసిన ఆయన ఎన్నో వెన్నుపోటు రాజకీయాలు చేశాడని, ప్రజలకు హామీలిచ్చి వాటిని తుంగలోకి తొక్కాడని, అటువంటి చంద్రబాబుతో పవన్ పొత్తు పెట్టుకుని మరోసారి బాబును సీఎంగా చేయాలని భావిస్తుండటంపై జనసేన శ్రేణులు మండిపడుతున్నాయని ఎమ్మెల్యే గ్రంధి చెప్పారు.

పవన్‌కు కార్యకర్తల కంటే బాబే ముఖ్యమా?

చంద్రబాబును అధికారంలోకి తీసుకురావడానికే పవన్ పార్టీ పెట్టారా అని జనసేన కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారని ఎమ్మెల్యే చెప్పారు. అలా ప్రశ్నిస్తున్న వారిని వైఎస్సార్‌సీపీ కోవర్టుల్లా పరిగణిస్తూ వైఎస్సార్‌సీపీలోకి పోండి అని పవన్‌కళ్యాణ్ మాట్లాడడం చూస్తుంటే తన పార్టీ శ్రేణులకంటే చంద్రబాబే ఆయనకు ముఖ్యంగా కనిపిస్తున్నట్లుగా ఉందన్నారు. నిజానికి.. చంద్రబాబును జైలుకు వెళ్లి పరామర్శించి వచ్చిన తర్వాత టీడీపీతో పొత్తు పెట్టుకుంటున్నామని పవన్ చెప్పడాన్ని ఒక సిగ్గుచేటు పనిగా జనసేన కార్యకర్తలు భావించారన్నారు. ఇచ్చిన మాటను నెరవేర్చే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన పట్ల జనసేన నేతలు ఆకర్షితులై ప్రజాసేవ చేయడానికి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని, వారికి అన్ని విధాలుగా పూర్తిగా అండగా ఉంటామని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఇక టీడీపీ అభ్యర్థులు పోటీచేసే నియోజకవర్గాల్లో ఆత్మాభిమానం గల జనసేన కార్యకర్తలు, నేతలెవరూ ఆ పార్టీకి కచ్చితంగా ఓటు వెయ్యరని ఎమ్మెల్యే గ్రంధి స్పష్టంచేశారు. జనసేన నేతలు ప్రజాసేవ చేయాలనుకుంటే వైఎస్సార్‌సీపీలో చేరాలని ఆయన పిలుపునిచ్చారు.

సీఎం జగన్‌ను ఎదుర్కోలేక దుష్ప్రచారం చేస్తారా?

- చంద్రబాబు, ఎల్లో మీడియాపై వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి ఫైర్
- వైఎస్ షర్మిల కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు సమాచారం లేదు
- కుటుంబ సభ్యులను కలిస్తే రాయబారానికి వెళ్లినట్లా?
- ఎవరెన్ని కుతంత్రాలు చేసినా 2024 ఎన్నికల్లో వైఎస్ జగన్‌దే విజయం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి పథకాలు, సుపరిపాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు ప్రజల్లో ఆదరణ మరింతగా పెరుగుతోందని వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. అత్యంత ప్రజాదరణ ఉన్న సీఎం వైఎస్ జగన్‌ను ఒంటరిగా ఎదుర్కోలేకే టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్, ఎల్లో మీడియాతో కలిసి కట్టుకథలు అల్లుతూ దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సుబ్బారెడ్డి మంగళవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడుతూ.. వైఎస్ షర్మిలమ్మ మూడేళ్ల క్రితమే తెలంగాణలో పార్టీ పెట్టారని, ఆ రాష్ట్రంలో ఎన్నికల సమయంలో ఆమె కాంగ్రెస్‌లో చేరతారని ప్రచారం జరిగిందన్నారు. ఇప్పుడు షర్మిల కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు తనకు ఎలాంటి సమాచారం లేదని చెప్పారు. తాను ఈ మధ్య హైదరాబాద్‌కు ఎక్కువగా వెళ్లడంలేదన్నారు. ఎప్పుడు హైదరాబాద్ వెళ్లినా వైఎస్ విజయమ్మను, కుటుంబ సభ్యులను కలుస్తానని తెలిపారు. ఇటీవల అమెరికాకు వెళ్లి వచ్చిన విజయమ్మను ఆదివారం కలిసి కుటుంబ విషయాలు మాట్లాడుకున్నట్లు చెప్పారు. ఆ తర్వాత షిరిడి వెళ్లి, సోమవారం రాత్రి విజయవాడ వచ్చాక ఎల్లో మీడియాలో వార్తలు చూశానని తెలిపారు. షర్మిలతో తాను మధ్యవర్తిత్వం చేసినట్లు కట్టుకథలు అల్లారని మండిపడ్డారు. కుటుంబ సభ్యులను కలవడానికి వెళ్తే రాయబారానికి వెళ్లినట్లా అని ప్రశ్నించారు. చంద్రబాబును సీఎం పీఠంపై కూర్చోబెట్టడం కోసమే ఎల్లో మీడియా తమపై బురద జల్లుతోందని, వారి దుష్ప్రచారం పరాకాష్టకు చేరిందని అన్నారు. ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా.. 2024 ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌దే విజయమని స్పష్టం చేశారు. తమ జీవితాల్లో మరింతగా వెలుగులు నిండాలంటే జగన్ మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో 175కు 175 స్థానాల్లో విజయమే లక్ష్యంగా అవసరమైన చోట్ల అభ్యర్థులను మారుస్తున్నారని తెలిపారు. పోటీ చేసేందుకు అవకాశం లేని నేతలకు అధికారంలోకి వచ్చాక సముచిత స్థానం కల్పిస్తామని సీఎం వైఎస్ జగన్ హామీ ఇస్తున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్ నిర్ణయాన్ని అందరూ స్వాగతిస్తున్నారని, కొందరు వ్యక్తిగత కారణాలతో పార్టీని వీడుతున్నారని చెప్పారు.

పొగాకు క్యూరింగ్‌లు ప్రారంభం

- 55 వేల ఎకరాల్లో వర్జీనియా సాగు
- 49 మిలియన్ల కిలోల ఉత్పత్తికి అనుమతి
- 65 మిలియన్ల కిలోలు వస్తుందని అంచనా



దేవరపల్లి మండలం సంగాయగూడెంలో క్యూరింగ్ చేసిన పొగాకు

దేవరపల్లి: తూర్పు గోదావరి జిల్లాలోని మెట్ట ప్రాంతంలో ప్రధాన వాణిజ్య పంటగా సాగు చేస్తున్న వర్జీనియా పొగాకు క్యూరింగ్‌లు ప్రారంభమయ్యాయి. అక్టోబర్‌లో వేసిన తోటలు పక్వానికి రావడంతో రైతులు ఆకులు రెలిచి, క్యూరింగ్ చేస్తున్నారు. క్యూరింగ్ చేసిన పొగాకు రంగులు ఆశాజనకంగా ఉండటంతో ఊపిరి పీల్చుకున్నారు. మిచాంగ్ తుపాను వల్ల పొగాకు రంగు, నాణ్యత దెబ్బతింటాయని రైతులు భయపడ్డారు. అయితే, తరువాత వాతావరణం అనుకూలించడంతో తోటలు క్రమంగా కోలుకుంటున్నాయి. సంక్రాంతి నాటికి పొగాకు రెలుపులు, క్యూరింగ్‌లు ముమ్మరంగా జరుగుతాయని రైతులు చెబుతున్నారు. మన జిల్లాలోని మెట్ట ప్రాంతంతో పాటు ఏలూరు జిల్లాలోని ఉత్తర తేలిక నేలల్లో (ఎన్ఎల్ఎస్) పొగాకు సాగు జరుగుతోంది. ఇక్కడ పండించిన పొగాకుకు అంతర్జాతీయ మార్కెట్లో మంచి డిమాండ్ ఉంటోంది. బ్రెజిల్, జింబాబ్వే, రష్యా, అమెరికా వంటి దేశాల్లో పండిస్తున్న పొగాకుకు దీటుగా దాదాపు 60 ఏళ్లుగా ఇక్కడి రైతులు పొగాకు పండిస్తున్నారు. బోర్ల కింద ఈ పంట సాగు జరుగుతోంది. అక్టోబర్ నుంచి మార్చి వరకూ పొగాకు సీజన్ ఉంటుంది. పండించిన పొగాకును క్యూరింగ్ చేసి, నాలుగు గ్రేడ్‌లుగా విభజించి, బేళ్లుగా కట్టి వేలం కేంద్రాల్లో విక్రయిస్తారు. మార్చి నుంచి సెప్టెంబర్ వరకూ పొగాకు కొనుగోళ్లు జరుగుతాయి. రాష్ట్రవ్యాప్తంగా 170 మిలియన్ల కిలోల పొగాకు ఉత్పత్తికి కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ అనుమతి ఇచ్చింది. ఇందులో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఉత్తర తేలిక నేలల్లో 49 మిలియన్ల కిలోల ఉత్పత్తికి అనుమతి ఇచ్చింది. అయితే మిచాంగ్ తుపాను ముందు వరకూ పంట ఆశాజనకంగా ఉండటంతో 65 నుంచి 68 మిలియన్ల కిలోల పొగాకు ఉత్పత్తి అవుతుందని అధికారులు, ట్రేడర్లు అంచనా వేశారు. తుపానుకు దాదాపు 10 వేల ఎకరాల్లో పొగాకు తోటలు దెబ్బ తినడంతో ఉత్పత్తి తగ్గుతుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

కోలుకుంటున్న తోటలు

మరోవైపు మిచాంగ్ తుపాన్ వల్ల దెబ్బ తిన్న పొగాకు తోటలు కోలుకుంటున్నాయి. సస్యరక్షణ చర్యలు చేపట్టడం, వాతావరణం పొడిగా ఉండటంతో పాక్షికంగా దెబ్బ తిన్న తోటలు ఇప్పుడిప్పుడే నిలబడుతున్నాయని రైతులు తెలిపారు. పూర్తిగా దెబ్బ తిన్న తోటలను దున్ని, కొత్తగా నాట్లు వేస్తున్నారు.

20,971 హెక్టార్లలో పొగాకు సాగు

తూర్పుగోదావరి జిల్లాతో పాటు ఏలూరు జిల్లాలో ప్రస్తుత సంవత్సరానికి సంబంధించి 20,971 హెక్టార్లలో పొగాకు సాగు జరుగుతోంది. మొత్తం 14,097 మంది రైతులు దీని సాగు చేస్తున్నారు. 12,235 బ్యారన్ల రిజిస్ట్రేషన్లు చేశారు.

పొగాకు రంగులు ఆశాజనకం



పొగాకు రంగులు ఆశాజనకంగా ఉన్నాయి. పలు గ్రామాల్లో ముందుగా వేసిన తోటల రెలుపులు, క్యూరింగ్‌లు జరుగుతున్నాయి. ఈ ఏడాది 55 వేల ఎకరాల్లో పొగాకు సాగు జరుగుతోంది. తుపానుకు దెబ్బ తిన్న తోటలు కొంత వరకూ నిలదొక్కుకున్నాయి. తోటల ఎదుగుదల బాగుంది. పరిమితికి లోబడి పంట వేసి, అధిక దిగుబడులు సాధిస్తే సాగు లాభసాటిగా ఉంటుంది. పంటకు అవసరమైన అన్ని రకాల ఎరువులనూ రైతులకు సరఫరా చేశారు.

– ఎం.ఆదిశేషయ్య, ఆర్ఎం, పొగాకు బోర్డు, రాజమహేంద్రవరం

• తెలంగాణ

హైదరాబాద్ చుట్టూ 'మెట్రో'

- 5 కారిడార్‌లలో మెట్రోరైల్ రెండో దశ విస్తరణకు సమగ్ర ప్రణాళికలు
- ఉన్నతస్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం



సాక్షి, హైదరాబాద్: భాగ్యనగరం నలువైపులా మెట్రో విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. ఐదు కారిడార్‌లలో మెట్రో విస్తరణకు సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్ మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డిని ఆదేశించారు. హెచ్ఎంఆర్ఎల్, హెచ్ఎండీఏలు సమన్వయంతో హైదరాబాద్‌లో మెట్రో రైల్ రెండో దశ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ మేరకు మంగళవారం మెట్రో రైల్‌పై సమీక్షా సమావేశంలో సీఎం దిశానిర్దేశం చేశారు. నగరంలోని అన్ని ప్రధాన ప్రాంతాలకు, అత్యధిక జనాభాకు మెట్రో సేవలు అందుబాటులో ఉండేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. పాతబస్తీలో మెట్రో నిర్మాణం కోసం దారుల్‌షిఫా నుంచి షాలిబండ వరకు రోడ్డు విస్తరణ చేపట్టాల్సి ఉందని అధికారులు తెలపగా షాలిబండ వరకే కాకుండా ఫలక్‌నుమా వరకు 100 అడుగుల మేర రోడ్డు విస్తరణకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సీఎం సూచించారు. ఇందుకోసం స్థానిక ప్రజాప్రతినిధులను, వివిధ వర్గాలను సంప్రదించాలన్నారు. నగరంలోని అన్ని ప్రాంతాలకు దీటుగా పాతబస్తీని అభివృద్ధి చేయాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. ఇందుకోసం రోడ్డు విస్తరణ, మెట్రోరైల్ నిర్మాణం అవసరమన్నారు. ఈ క్రమంలో ఇప్పటికే మెట్రోరైల్ పొడిగింపు కోసం 103 చోట్ల మతపరమైన కట్టడాలు, సాంస్కృతిక కేంద్రాలు ఉన్నట్లు గుర్తించిన నేపథ్యంలో అవసరమైతే ప్రజాప్రతినిధులు, స్థానికులతో సంప్రదింపులు జరిపేందుకు తాను సైతం వస్తానని సీఎం పేర్కొన్నారు.

సీఎం ప్రతిపాదించిన 5 కారిడార్‌లు ఇలా...

- మియాపూర్–చందానగర్–బీహెచ్ఈఎల్–పటాన్‌చెరు (14 కి.మీ.)
  ఎంజీబీఎస్–ఫలక్‌నుమా–చాంద్రాయణగుట్ట–మైలార్‌దేవ్‌పల్లి–పీ7 రోడ్డు–ఎయిర్‌పోర్టు (23 కి.మీ.)
- నాగోల్–ఎల్బీనగర్–ఒవైసీ హాస్పిటల్–చాంద్రాయణగుట్ట– మైలార్‌దేవ్‌పల్లి–ఆరాంఘర్–న్యూ హైకోర్టు ప్రతిపాదిత ప్రాంతం రాజేంద్రనగర్ (19 కి.మీ.)
- కారిడార్ 3లో భాగంగా రాయదుర్గం నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వరకు (విప్రో జంక్షన్ నుంచి/అమెరికన్ కాన్సులేట్) వయా బయోడైవర్సిటీ జంక్షన్, ట్రిపుల్ ఐటీ జంక్షన్, ఐఎస్‌బీ రోడ్డు (12 కి.మీ.)
- ఎల్బీనగర్–వనస్థలిపురం–హయత్‌నగర్ (8 కి.మీ.)

ఎంపీ నందిగం సురేశ్ కారును ఢీకొట్టే ప్రయత్నం

- అనంతరం వేళ్లు చూపించి ఎంపీని బెదిరించిన వైనం
- కారు నంబరు ఆధారంగా తుళ్ళూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



ఎంపీ నందిగం సురేష్ పీఎస్‌వోపై దుర్భాషలాడిన వ్యక్తి

తాడేపల్లిరూరల్: దళిత ఎంపీ నందిగం సురేష్ కారును మరో కారుతో ఢీకొట్టేందుకు మంగళవారం గుర్తుతెలియని వ్యక్తులు ప్రయత్నించారు. బాపట్ల ఎంపీ సురేష్‌కు తృటిలో ప్రమాదం తప్పింది. అమరావతి కరకట్ట వెంబడి ఇస్కాన్ టెంపుల్ సమీపంలో బిబి1 మధ్య జరిగిన ఈ సంఘటనలో ఎంపీ కారును ఢీకొట్టబోయిన కారులో ఉన్నవారు బొటనవేలు, చిటికెనవేలు చూపిస్తూ, చూపుడు వేలుతో వార్నింగ్ ఇచ్చి ప్రకాశం బ్యారేజ్ వైపు పరారయ్యేందుకు ప్రయత్నించారు. ఎంపీ సురేష్ పీఎస్‌వో బషీర్ తెలిపిన వివరాల మేరకు.. సురేష్ కాన్వాయ్ కరకట్ట మీదుగా వెళుతున్న సమయంలో ఇస్కాన్ టెంపుల్ సమీపంలో ఉద్దేశపూర్వకంగా ఏపీ16 జెఎఫ్ 0828 గల కారుతో ఢీకొట్టేందుకు ప్రయత్నం చేశారు. ఇస్కాన్ టెంపుల్ సమీపంలో ఆపి ఉన్న కారు ఒక్కసారిగా రోడ్డు మీదుగా వచ్చి ఎస్కార్ట్ వాహనాన్ని, సురేష్ కారును ఢీకొట్టేందుకు ప్రయత్నించింది. డ్రైవర్ అప్రమత్తమై కారును కంట్రోల్ చేశారు. లేకపోతే కారు కరకట్ట మీద నుంచి 30 అడుగుల లోతులో ఉన్న పంట పొలాల్లోకి దూసుకుపోయేది. ఏపీ16 జెఎఫ్ 0828 కారులో డ్రైవర్ వెనుక కూర్చున్న వ్యక్తి కారు అద్దాలు దించి చూపుడువేలుతో వార్నింగ్ ఇస్తూ, టీడీపీ సింబల్ అయిన విక్టరీ సింబల్ చూపిస్తూ నాలుక మడత పెట్టి వార్నింగ్ ఇస్తున్నట్లు సైగలు చేశాడు. వెళ్లిపోతోతున్న కారును ఆపడంతో అందులో ఉన్న వ్యక్తి కిందకు దిగి వేళ్లు చూపిస్తూ ఎంపీ అయితే ఏమిటి.. త్వరలోనే మీ సంగతి చూస్తానంటూ వార్నింగ్ ఇచ్చాడు. కారుకు అడ్డుగా నిలిచిన బషీర్‌ను ఢీ కొట్టేందుకు ప్రయత్నించారు. ఎంపీ సురేష్ వచ్చి కారులో డ్రైవర్ వెనుక సీటులో కూర్చున్న వ్యక్తిని నువ్వెవరని ప్రశ్నించగా.. నీకు చెప్పేది ఏమిట్రా అంటూ కారు ఎక్కుతూ మరోసారి చేతివేళ్లు ఊపుతూ నీ సంగతి తేలుస్తామంటూ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఆ కారులో డ్రైవర్‌తో పాటు మరో ముగ్గురు ఉన్నారు. ఈ ఘటనపై తుళ్ళూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఫిర్యాదు నమోదు చేసి కారు నంబరు ఆధారంగా వారిని పట్టుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారని బషీర్ తెలిపారు.

3 నెలల తర్వాత నీ అంతు చూస్తా..

ప్రభుత్వ వైద్యుడిని బెదిరించిన టీడీపీ నేత

తణుకు అర్బన్: 'మూడు నెలలు ఆగు.. నీ సంగతి తేలుస్తా.. నీ అంతు చూస్తా..' అంటూ ప్రభుత్వ వైద్యాధికారిపై టీడీపీ నేత దుర్భాషలాడి, బెదిరింపులకు దిగిన ఘటన పశ్చిమగోదావరి జిల్లా తణుకులో ఆలస్యంగా వెలుగు చూసింది. తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని సేఫ్ కేర్ సెంటర్‌లో వైద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ సుంకవల్లి రామకృష్ణ ఒక ప్రైవేట్ ఫంక్షన్‌లో భోజనం చేస్తుండగా పాత విభేదాల నేపథ్యంలో టీడీపీ నేత మల్లిన రాధాకృష్ణ ఆయనతో వాగ్వాదానికి దిగారు. అంతు చూస్తా అంటూ బిగ్గరగా అరిచి దాడికి ప్రయత్నించాడు. దీంతో అక్కడ ఉన్న వ్యక్తులు అతనిని వారించారు. గతనెల 26న ఈ ఘటన జరగ్గా, ఆ వైద్యుడు 30న తణుకు రూరల్ పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. కోర్టు అనుమతి మేరకు చర్యలు తీసుకుంటామని సీఐ సీహెచ్ ఆంజనేయులు తెలిపారు.

'ఎర్రబుక్కు'తో భయపెడుతున్న మాజీ ఎమ్మెల్యే..

నారా లోకేశ్ ఎర్రబుక్కు పేరుతో ఇటీవల అధికారులను భయపెడుతున్న విషయం తెలిసిందే. ఇదే తీరులో టీడీపీ తణుకు నేతలు కూడా స్థానిక అధికారులపై బెదిరింపులకు దిగుతున్నారు. ఇటీవల 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ'లో టీడీపీ నేతలు ఓటీపీలు అడుగుతున్న వ్యవహారంలో కొంతమందిని పోలీసులు అదుపులోకి తీసుకుని బైండోవర్ చేశారు. ఈ వ్యవహారంలో ఉన్న మల్లిన రాధాకృష్ణను పోలీస్‌స్టేషన్‌కు తీసుకురాగా టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ స్టేషన్‌కు వచ్చి పోలీసులతో వాగ్వాదానికి దిగారు.

నమ్ముకున్న వారిని ఎమ్మెల్యే ఆర్కే నట్టేట ముంచారు

వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి పచ్చల శ్యామ్ ధ్వజం

తాడేపల్లి రూరల్: నమ్ముకున్న వారిని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) నట్టేట ముంచారని, మంగళగిరిలో హత్యా రాజకీయాలకు తెరలేపింది ఆయనే అని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి పచ్చల శ్యామ్ ధ్వజమెత్తారు. మంగళవారం గుంటూరు జిల్లా మంగళగిరి ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆయన ఏం చెప్పారంటే.. "వైఎస్సార్‌సీపీలో సుదీర్ఘంగా పనిచేసిన స్థానిక నేతలు పార్టీ వీడేందుకు ఆర్కే ముఖ్య కారణం. ఆయన రెండో సారి ఎమ్మెల్యేగా గెలిచినప్పటి అధికార పక్షంలోని వారి మధ్య విభేదాలు సృష్టించారు. టీడీపీకి ఎక్కువగా అండగా ఉండే సామాజిక వర్గం వారు వైఎస్ జగన్ వెంట ఉంటే.. వారిని సైతం ఆయన పక్కన పెట్టి ఇబ్బందులకు గురిచేశారు. ఆయనంటే ప్రాణమిచ్చే మాలాంటి వారిని సైతం ఇబ్బందులకు గురిచేశారు. ఓటుకు కోట్లు కేసు వేసిన ఎమ్మెల్యే ఆర్కే.. మంగళగిరి నియోజకవర్గంలో 2014, 2019 ఎలక్షన్లలో ఎందుకు డబ్బులు పంచారో సమాధానం చెప్పాలి. మంగళగిరి నియోజకవర్గాన్ని ఆయనొక్కరే అభివృద్ధి చేసినట్లు ప్రగల్భాలు పలుకుతున్నారు. ప్రభుత్వ సహాయ సహకారాలు లేకుండా అభివృద్ధి చేయగలరా? రూ. 8 కోట్లు ఖర్చు పెట్టాను అని మీడియా ముందు అంటున్నారు. ప్రభుత్వ నిధులు ఖర్చు పెడుతున్నప్పుడు కాంట్రాక్టర్లు బిల్లుల కోసం వేచి ఉండాలి కదా? మంగళగిరిలో ఆయన ఎమ్మెల్యే అయిన తరువాతే కులాల మధ్య చిచ్చు పెట్టారు. ఆయనకు వైఎస్సార్‌సీపీలో సీటు ఇవ్వనన్నారనే రాజీనామా చేశారు" అని శ్యామ్ చెప్పారు.

174 మంది విద్యార్థులు.. రూ. 61.27 లక్షలు

- గ్రామీణ పేద విద్యార్థుల కోసం 'చిరాక్ ఇంటర్నేషనల్ స్కూల్' విద్యార్థుల విరాళం
- క్లౌడ్ ఫండింగ్ ప్లాట్‌ఫాం 'ఫ్యూయల్ ఎ డ్రీమ్' ద్వారా సేకరణ

రాయదుర్గం: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే గ్రామీణ విద్యార్థులకు చేయూత ఇచ్చేందుకు కొండాపూర్‌లోని చిరాక్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు నడుం బిగించారు. అందుకోసం 'క్లౌడ్ ఫండింగ్ ప్లాట్‌ఫాం ఫ్యూయల్ ఎ డ్రీమ్ డాట్‌కామ్'ద్వారా నిధులను సేకరించారు. పాఠశాలకు చెందిన 174 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి మూడు వారాల్లోనే రూ.61.27 లక్షల రూపాయలను సేకరించడం విశేషం. తెలంగాణ, మహారాష్ట్రలోని అన్ని ప్రాంతాలలో చదివే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బ్యాక్–టు–స్కూల్ కిట్‌ను అందించడమే లక్ష్యంగా వారు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కిట్ కోసం సంవత్సరానికి రూ.900 ఖర్చవుతుంది. గ్రీన్‌సోల్ అనే ఎన్‌జీఓ సహకారంతో ఈ కిట్‌ను తయారు చేయించారు. చిరాక్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ప్రతి విద్యార్థి రూ.27వేలు సేకరించడం లక్ష్యం. దీంతో 30 మంది గ్రామీణ విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుంది. అయితే 174 మంది విద్యార్థులు రూ.61.27 లక్షలను సేకరించడంతో 6,800 మంది విద్యార్థులకు మేలు జరగనుంది.

వన్ ఉమన్ షో!



బంగ్లాదేశ్‌లో 7న సార్వత్రిక ఎన్నికలు • విపక్షాల బాయ్‌కాట్

మళ్లీ హసీనా గెలుపు లాంఛనమే • ఏకపక్ష పోకడలతో విమర్శలపాలు

ఎన్నికల 'చిత్రా'నికి పొరుగు దేశం బంగ్లాదేశ్‌లో సర్వం సిద్ధమైంది. అక్కడ జనవరి 7న సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. కాకపోతే వాటి ఫలితం మాత్రం ముందే తేలిపోయింది. విపక్ష పార్టీల బాయ్‌కాట్ నేపథ్యంలో పాలక అవామీ లీగ్ విజయం, పార్టీ అధినేత్రి షేక్ హసీనా ప్రధానిగా కొనసాగడమూ లాంఛనప్రాయమే కానుంది. హసీనా వంటి నియంత చేతిలో అధికారం ఉన్నంత వరకూ ఎన్నికలు పారదర్శకంగా జరిగే అవకాశం లేదని విపక్షాలన్నీ ఆరోపిస్తున్నాయి. ఆమె పదవి నుంచి తప్పుకుని తటస్థ మధ్యంతర ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం కల్పించాలని, దాని పర్యవేక్షణలో స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు సజావుగా జరపాలని అవి పలుమార్లు డిమాండ్ చేశాయి. వాటిని హసీనా నిర్ద్వంద్వంగా తోసిపుచ్చారు. దాంతో ఎన్నికల బహిష్కరణ తప్ప తమకు మరో మార్గం లేదని విపక్షాలన్నీ ఇప్పటికే ప్రకటించాయి. బేగం ఖలీదా జియా సారథ్యంలోని బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ (బీఎన్‌పీ), దాని భాగస్వాములతో పాటు ప్రధాన ప్రతిపక్ష పార్టీలన్నీ ఎన్నికలను బాయ్‌కాట్ చేశాయి. ఈ నేపథ్యంలో బ్యాలెట్ పత్రాలపై కేవలం అధికార అవామీ లీగ్, దాని భాగస్వామ్య పక్షాల అభ్యర్థులు, స్వతంత్రులు మాత్రమే ఉండనున్నారు!

ఇంటా బయటా విమర్శలే...

హసీనా పూర్తిగా ఏకపక్ష పోకడలు పోతున్నారన్న ఆరోపణలు ఇప్పటివి కావు. బంగ్లాదేశ్‌లో 2009 నుంచీ ఆమే ప్రధానిగా అధికారం చలాయిస్తున్నారు. ఆ క్రమంలో గత పదేళ్లుగా హసీనా కరడుగట్టిన నియంతగా మారారని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. అధికారాన్ని విచ్చలవిడిగా దుర్వినియోగం చేస్తున్నారని, విపక్ష నేతలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని, కంట్లో నలుసుగా మారిన వారిని ఏకంగా చంపిస్తున్నారని మండిపడుతున్నాయి. అంతర్జాతీయ సమాజం జోక్యం చేసుకుని కోరుతున్నాయి. వాటి వాదనలోనూ వాస్తవం లేకపోలేదు. విపక్ష నేతలు, ముఖ్యంగా బీఎన్‌పీకి చెందిన వారు భారీగా జైలుపాలయ్యారు. కనీసం 20 మందికి పైగా తమ నేతలు, కార్యకర్తలు జైలుపాలైనట్టు బీఎన్‌పీ నాయకుడు అబ్దుల్ మొయీన్ ఖాన్ ఆరోపించారు. బీఎన్‌పీ చీఫ్ బేగం ఖలీదా జియా కూడా అవినీతి ఆరోపణలపై గృహ నిర్బంధంలో మగ్గుతున్నారు. 78 ఏళ్ల జియా ఆరోగ్యమూ బాగా క్షీణించింది. తన నియంతృత్వం, అణచివేత బయటి ప్రపంచానికి తెలియకుండా అడ్డుకునేందుకు మీడియాపైనా హసీనా ఉక్కుపాదం మోపారని విపక్షాలు దుయ్యబడుతున్నాయి. నోబెల్ గ్రహీత మహమ్మద్ యూనిస్‌ను కేసులతో వేధించడం ఆపాలంటూ అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామాతో పాటు ఏకంగా 170 మంది అంతర్జాతీయ ప్రముఖులు హసీనాకు గత ఆగస్టులో బహిరంగ లేఖ రాయాల్సి వచ్చింది! అయినా ఆర్థిక అవకతవకల కేసులో ఆయనకు తాజాగా ఆర్నెల్ల జైలు శిక్ష పడటం గమనార్హం! ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ అణచివేత తీవ్రతరం కావడంతో నిర్బంధం నుంచి తప్పించుకునేందుకు బీఎన్‌పీతో పాటు పలు విపక్షాల నేతలు భారీగా అజ్ఞాతంలోకి వెళ్లారు!! జర్నలిస్టులతో పాటు ఎవరికీ బంగ్లాదేశ్‌లో సురక్షిత పరిస్థితులు లేవని ఐరాస స్వయంగా పేర్కొంది.

భిన్న పార్శ్వాలు

హసీనా ఆధ్వర్యంలో బంగ్లాదేశ్ ప్రస్థానంలో భిన్న పార్శ్వాలున్నాయి. ఒకటి పుష్కర కాలంగా దేశం సాధించిన స్థిరమైన ఆర్థిక ప్రగతి. మరొకటి ప్రధానిగా ఆమె ఒంటెత్తు పోకడలు, విచ్చలవిడి అణచివేత విధానాలు. ప్రపంచంలోని అతి పేద దేశాల్లో ఒకటిగా చెప్పే బంగ్లాదేశ్ హసీనా హయాంలో చెప్పుకోదగ్గ ఆర్థిక ప్రగతి సాధించింది. ఆర్థిక వృద్ధిలో భారత్‌ను కూడా మించిపోయింది. దేశంలో గత పదేళ్లలో తలసరి ఆదాయం మూడింతలు పెరిగింది. గత 20 ఏళ్ల కాలంలో కనీసం 2.5 కోట్ల మంది పేదరికం నుంచి బయట పడ్డట్టు ప్రపంచ బ్యాంకు గణాంకాలే చెబుతున్నాయి. భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు హసీనా తెర తీశారు. దుస్తుల ఎగుమతిలో చైనా తర్వాత రెండో స్థానం బంగ్లాదేశ్‌దే. అయితే ఈ అభివృద్ధంతా ప్రజాస్వామిక విలువలకు పాతరేసిన ఫలితమేనన్న వాదన ఉంది. మరోవైపు కరోనా కల్లోలం బంగ్లాను అతలాకుతలం చేసింది. జీవన వ్యయం విపరీతంగా పెరిగిపోయింది. ద్రవ్యోల్బణం 9.5 శాతం దాటింది! విదేశీ మారక నిల్వలు క్షీణిస్తున్నాయి.

బంగ్లా పార్లమెంటులో బలాబలాలు (మొత్తం సీట్లు 350)	
అవామీ లీగ్	306
జాతీయ పార్టీ	27
బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ	6
ఇతరులు	11

నియంతగా మారిన హక్కుల నేత!

76 ఏళ్ల షేక్ హసీనా బంగ్లాదేశ్ జాతి పిత షేక్ ముజిబుర్ రెహ్మాన్ పెద్ద కూతురు. ఆయన రాజకీయ వారసత్వాన్ని అందిపుచ్చుకున్నారు. కరడుగట్టిన నియంతగా విమర్శల పాలవుతున్న ఆమె ఒకప్పుడు బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్య మనుగడ కోసం ప్రముఖంగా గళమెత్తడం విశేషం! 1980ల్లో సైనిక పాలకుడు జనరల్ హుస్సేన్ మహమ్మద్ ఎర్షాద్ నియంతృత్వంపై ఖలీదా జియాతో పాటు అన్ని పార్టీల నేతలతోనూ కలిసి పోరాడారామె. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం వారితో పాటు వీధి పోరాటాలూ చేశారు. 1996 ఎన్నికల్లో నెగ్గి తొలిసారిగా ప్రధాని పదవి చేపట్టారు. 2001లో ఖలీదా చేతిలో ఓటమి చవిచూశారు. 2006లో అవినీతి ఆరోపణలపై నిర్బంధం పాలయ్యారు. 2008లో జైలు నుంచి విడుదలయ్యాక ఎన్నికల్లో ఘనవిజయం సాధించారు. నాటినుంచీ ప్రధానిగా కొనసాగుతున్నారు. ఆమె ఇప్పటికే మొత్తమ్మీద 19 ఏళ్లు ప్రధానిగా ఉన్నారు. ప్రపంచంలో అత్యధిక కాలం అధికారంలో ఉన్న మహిళా దేశాధినేతగా ఇప్పటికే రికార్డు లకెక్కారు.

\- సాక్షి, నేషనల్ డెస్క్



కత్తిపోటు అనంతరం కుప్పకూలిన లీ జే మ్యుంగ్

దక్షిణ కొరియా ప్రతిపక్ష నేతకు కత్తిపోట్లు

సియోల్: దక్షిణ కొరియా ప్రతిపక్ష డెమోక్రాటిక్ పార్టీ నేత లీ జే మ్యుంగ్(59) కత్తిపోట్లకు గురయ్యారు. మంగళవారం ఆయన బుస్తాన్‌లోని ప్రతిపాదిత విమానాశ్రయం ప్రాంతాన్ని సందర్శించారు. అనంతరం మీడియా ప్రతినిధులు తదితరులతో మాట్లాడుతున్న సమయంలో ఓ ఆగంతకుడు కత్తితో లీ మెడపై బలంగా పొడిచాడు. తీవ్రంగా రక్తస్రావం అయ్యింది. చుట్టుపక్కల వారు, పోలీసులు నిందితుడి(67)ని పట్టుకున్నారు. బుసాన్‌లో చికిత్స అనంతరం విమానంలో సియోల్‌కు తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా లేదని అధికారులు చెబుతున్నప్పటికీ పూర్తి వివరాలు వెల్లడి కావాల్సి ఉంది. ఘటనకు కారణాలపై దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు చెప్పారు. ఘటనపై దర్యాప్తుకు అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ ఆదేశించారు.

వలసలను అడ్డుకున్నాం: సునాక్



లండన్: దేశంలోకి ఆశ్రయం పొందేందుకు వచ్చే వారి దరఖాస్తులను 2023 చివరి కల్లా పూర్తిగా పరిష్కరించాలన్న లక్ష్యాన్ని విజయవంతంగా చేరుకున్నట్లు బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ చెప్పారు. చిన్న చిన్న పడవల ద్వారా దేశంలోకి అక్రమంగా ప్రవేశించే వారిని 36 శాతం మేర అడ్డుకున్నట్లు ఆయన తెలిపారు. ఇదే సమయంలో యూరప్‌లోకి వలసదారుల తాకిడి గణనీయంగా ఉందని వివరించారు. శరణార్థుల దరఖాస్తులను పరిష్కరించడం ద్వారా మిలియన్ల కొద్దీ ప్రజాధనం ఆదా అవుతోందని చెప్పారు. అక్రమ వలసల భారం నుంచి బ్రిటిష్ ప్రజలకు విముక్తి కల్పించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. 2022 చివరి నాటికి 92 వేల శరణార్థుల దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా అంతకు మించి 2023లో 1,12,000 దరఖాస్తులను పరిష్కరించినట్లు దేశ హోం శాఖ తెలిపింది. 2002 తర్వాత ఇదే అత్యధికమని వివరించింది.

మిలిటెంట్లు, బలగాల మధ్య కాల్పులు

ఇంఫాల్: మణిపూర్‌లోని మొరెహ్‌లో భద్రతా బలగాలు, మిలిటెంట్లకు మధ్య మరోసారి కాల్పులు చోటుచేసుకున్నాయి. సోమవారం పోలీసులపై దాడికి పాల్పడినట్లు అనుమానిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకునేందుకు మంగళవారం ఉదయం సరిహద్దులకు సమీపంలోని చవంగ్‌ఫై ఏరియాకు బలగాలు చేరుకున్నాయి. గాలింపు జరుపుతున్న బలగాలపైకి మిలిటెంట్లు కాల్పులకు తెగబడ్డారు. బలగాలు వెంటనే ఎదురుకాల్పులు జరిపాయి. కాల్పులు కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.

పింఛను నామినీలుగా ఉద్యోగినుల పిల్లలు

న్యూఢిల్లీ: భర్త నుంచి వేరుగా ఉండే మహిళా ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం కొత్త వెసులుబాటు కల్పించింది. కుటుంబ పింఛను కోసం నామినీలుగా ఇకపై తన పిల్లల పేర్లను పేర్కొనవచ్చని తెలిపింది. సెంట్రల్ సివిల్ సర్వీసెస్(పింఛను)నిబంధనలు–2021లోని 50వ క్లాజ్ ప్రకారం ప్రభుత్వ ఉద్యోగి లేదా రిటైర్డు ప్రభుత్వ ఉద్యోగి మరణించిన సందర్భాల్లో కుటుంబ పింఛను మంజూరవుతుందని పేర్కొంది. ప్రభుత్వ ఉద్యోగి లేదా పింఛనుదారు మరణించినప్పుడు ఆ వ్యక్తి జీవిత భాగస్వామికి కుటుంబపింఛను అందుతుందని తెలిపింది. మరణించిన ప్రభుత్వ ఉద్యోగి లేదా పింఛనుదారు జీవిత భాగస్వామి కుటుంబ పింఛనుకు అనర్హులైనప్పుడు లేదా చనిపోయినప్పుడు కుటుంబ పింఛను ఇతర కుటుంబసభ్యులకు అందుతుందని వివరించింది. మహిళా ప్రభుత్వ ఉద్యోగులు కుటుంబ పింఛనుకు నామినీలుగా భర్త కంటే ముందుగా సంతానాన్ని పేర్కొనేందుకు వీలు కల్పిస్తూ తాజాగా నిబంధనలను మార్చినట్లు కేంద్ర పింఛను, పింఛనుదారుల సంక్షేమ విభాగం పేర్కొంది. తాజా సవరణ.. మహిళా ప్రభుత్వోద్యోగి విడాకుల పిటిషన్, గృహ హింస కేసు, మహిళల రక్షణ చట్టం కింద కేసులను దాఖలు చేసిన అన్ని సందర్భాల్లో, ఆమె భర్త కంటే ముందు అర్హత ఉన్న బిడ్డకు కుటుంబ పెన్షన్‌ను పంపిణీ చేయడానికి అనుమతిస్తుందని విభాగం కార్యదర్శి వి శ్రీనివాస్ పిటిఐకి తెలిపారు.

312కు చేరిన జేఎన్.1 వేరియంట్ కేసులు

న్యూఢిల్లీ: దేశంలో కోవిడ్ సబ్ వేరియంట్ జేఎన్.1 కేసులు ఇప్పటి వరకు 312 బయటపడ్డాయి. ఇందులో 47% కేసులు కేరళలోనే నమోదయ్యాయని ప్రభుత్వ ఆరోగ్య విభాగం ఇన్సాకాగ్ మంగళవారం తెలిపింది. మొత్తం పది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఈ వేరియంట్ జాడలను గుర్తించామంది. కేరళలో 147, గోవాలో 51, గుజరాత్‌లో 34, మహారాష్ట్రలో 26, తమిళనాడులో 22, ఢిల్లీలో 16, కర్ణాటకలో 8, రాజస్తాన్‌లో 5, తెలంగాణలో రెండు, ఒడిశాలో ఒక కేసు ఈ వేరియంట్‌కు సంబంధించినవిగా నిర్ధారణైనట్లు వివరించింది.

కార్మికులకు డీఎంకే ఎంపీ క్షమాపణ

చెన్నై: ఉత్తరప్రదేశ్, బిహార్‌లకు చెందిన కార్మికులనుద్దేశించి చేసిన అభ్యంతరకర వ్యాఖ్యల వివాదం ముదరడంతో డీఎంకే లోక్‌సభ ఎంపీ దయానిధి మారన్ క్షమాపణలు చెప్పారు. దయానిధి మారన్ చేసిన వ్యాఖ్యలతో కూడిన వీడియో ఒకటి తాజాగా సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. కొందరు ఆయన వ్యవహార శైలిని తీవ్రంగా తప్పుబట్టారు. దీంతో, ఎంపీ మారన్ మంగళవారం సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో కార్మికులకు క్షమాపణలు చెప్పారు.

ఉక్రెయిన్‌పైకి 100 క్షిపణులు

కీవ్: రష్యా మంగళవారం ఉక్రెయిన్‌పైకి సుమారు 100 క్షిపణులను ప్రయోగించింది. ఈ దాడుల్లో అయిదుగురు చనిపోగా 100 మందికి పైగా గాయపడ్డారు. రాజధాని కీవ్‌పై జరిగిన దాడుల్లో నలుగురు చనిపోగా మరో 92 మంది వరకు గాయపడ్డారు. ఖార్కివ్‌పై జరిగిన దాడిలో ఒకరు మృతి చెందారు. రష్యా ప్రయోగించిన క్షిపణుల్లో హైపర్‌సోనిక్ కింజల్ రకానికి చెందినవి కూడా ఉన్నాయని ఉక్రెయిన్ అధికారులు తెలిపారు. అయితే, కీవ్‌పైకి వచ్చిన అన్నిటినీ క్షిపణి రక్షణ వ్యవస్థలు సమర్థంగా అడ్డుకున్నట్లు చెప్పారు.

మెగసెసె వాపస్ చేస్తా: సందీప్ పాండే

న్యూఢిల్లీ: గాజాపై ఇజ్రాయెల్ దాడులకు అమెరికా మద్దతు ఇస్తున్నందుకు నిరసనగా రామన్ మెగసెసె అవార్డును వెనక్కి ఇచ్చేయాలని నిర్ణయించుకున్నట్లు సామాజిక కార్యకర్త సందీప్ పాండే తెలిపారు. అమెరికా యూనివర్సిటీల నుంచి పొందిన రెండు డిగ్రీలను కూడా వదులుకోనున్నట్లు వివరించారు. రామన్ మెగసెసె అవార్డుతో అమెరికాకు చెందిన రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్, ఫోర్డ్ ఫౌండేషన్‌లతో సంబంధముండటం గమనార్హం. 'గాజాలోని 21 వేల మందికి పైగా పాలస్తీనా పౌరుల ఉసురుతీసిన ఇజ్రాయెల్‌కు అమెరికా వంతపాడటం మనస్తాపం కలిగించింది. అందుకే మెగసెసె అవార్డును వెనక్కి ఇచ్చేయాలని నిర్ణయించుకున్నా'అని ఆయన పీటీఐకి చెప్పారు.

డ్రోన్ దాడిలో హమాస్ అగ్ర నేత అరౌరీ మృతి

బీరుట్: లెబనాన్ రాజధాని బీరుట్ శివారులో జరిగిన డ్రోన్ దాడిలో హమాస్ మిలిటరీ విభాగం వ్యవస్థాపకుల్లో ఒకరైన సలేహ్ అరౌరీ మృతి చెందారు. మంగళవారం జరిగిన ఈ ఘటనలో మరో నలుగురు కూడా చనిపోయినట్లు హెజ్బొల్లా సారథ్యంలోని టీవీ తెలిపింది. వెస్ట్‌బ్యాంకులోని మిలిటెంట్లకు ఆయనే నాయకత్వం వహిస్తున్నారు. ఘటనపై ఇజ్రాయెల్ అధికారులు స్పందించలేదు. అరౌరీని చంపుతామని ఇజ్రాయెల్ ప్రకటించడం గమనార్హం.

రోజంతా అల్లాడించి... రోడ్డెక్కిన ట్రక్కులు

పెట్రోల్ బంకులకు పోటెత్తిన జనం

- దేశవ్యాప్తంగా ఎక్కడ చూసినా క్యూలే
- నిత్యావసరాల సరఫరాకు తీవ్ర అంతరాయం
- చివరికి కేంద్రం హామీతో సమ్మె విరమణ

న్యూఢిల్లీ: హిట్ అండ్ రన్ కేసుల్లో ప్రతిపాదిత కఠిన చట్టాలను నిరసిస్తూ లారీలు, ట్రక్కుల డ్రైవర్లు చేపట్టిన సమ్మె మంగళవారం దేశ వ్యాప్త గందరగోళానికి, అత్యవసర సేవల్లో తీవ్ర అంతరాయానికి దారి తీసింది. ఆయిల్ ట్యాంకర్ల డ్రైవర్లు కూడా సమ్మెలో పాల్గొనడంతో పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ కొరత ఏర్పడింది. సమ్మె రోజుల పాటు కొనసాగుతుందన్న వార్తల నేపథ్యంలో దేశమంతటా వాహనదారులంతా పెట్రోల్ బంకులకు పోటెత్తారు. దాంతో ఎక్కడ చూసినా బంకుల ముందు భారీ క్యూ లైన్లే దర్శనమిచ్చాయి. ఇది నగరాలు, పట్టణాల్లో భారీ ట్రాఫిక్ జామ్‌లకు దారితీసింది. అత్యధిక బంకుల్లో చూస్తుండగానే నిల్వలు అడుగంటి నో స్టాక్ బోర్డులు దర్శనమిచ్చాయి. వంట గ్యాస్ సిలిండర్లతో పాటు కాయగూరలు, ఇతర నిత్యావసరాల సరఫరా కూడా నిలిచిపోయి జనం తీవ్ర ఇక్కట్ల పాలయ్యారు. కేంద్రంతో ఆలిండియా మోటార్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (ఏఐఎంటీసీ) జరిపిన చర్చలు ఎట్టకేలకు మంగళవారం రాత్రికి ఫలించాయి. కొత్త చట్టాన్ని ఇప్పటికిప్పుడే అమలు చేయడం లేదని కేంద్రం తరఫున హోం శాఖ కార్యదర్శి అజయ్ భల్లా వారికి హామీ ఇచ్చారు. దానిపై ఏఐఎంటీసీతో లోతుగా చర్చించాకే నిర్ణయం తీసుకునేలా అంగీకారం కుదిరినట్టు సంఘం చైర్మన్ మల్కిత్‌సింగ్ బల్ తెలిపారు. దాంతో సమ్మె విరమిస్తున్నట్టు సంఘం ప్రకటించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

సర్వత్రా నో స్టాక్...!

రోడ్డు ప్రమాద మృతికి బాధ్యుడైన వాహనదారు పోలీసులకు ఫిర్యాదు చేయకుండా పారిపోయేతే పదేళ్ల దాకా కఠిన కారాగార శిక్ష, రూ.7 లక్షల దాకా జరిమానా విధించేలా భారత న్యాయ సంహితలో చేర్చిన సెక్షన్లపై లారీలు, ట్రక్కుల డ్రైవర్లు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తుండటం తెలిసిందే. వాటి రద్దు డిమాండ్‌తో మహారాష్ట్ర తదితర చోట్ల సోమవారం నుంచే మూడు రోజుల సమ్మెకు దిగారు. అది మంగళవారాకల్లా దేశమంతటా విస్తరించింది. దాంతో పెట్రోల్, డీజిల్ కోసం వాహనదారులంతా ఒక్కసారిగా రోడ్డెక్కడంతో అన్ని రాష్ట్రాల్లోనూ పరిస్థితి చేయి దాటింది. పెట్రోల్ బంకులన్నీ జనంతో పోటెత్తి కన్పించాయి. కిలోమీటర్ల పొడవున వాహనదారులు బారులు తీరారు. నో స్టాక్ బోర్డు పెట్టి బంకులను మూసేయడం ఉద్రిక్తతకు, గొడవలకు దారి తీసింది. పరిస్థితిని అదుపు చేసేందుకు పోలీసులు రంగంలోకి దిగాల్సి వచ్చింది. మరోవైపు డ్రైవర్లు కూడా తమ లారీలు, ట్రక్కులను హైవేలపై రోడ్డుకు అడ్డంగా పెట్టి వాహనాల రాకపోకలను కూడా అడ్డుకుంటూ కన్పించారు.



కేంద్ర హోం శాఖ కార్యదర్శి అజయ్ భల్లాతో చర్చల అనంతరం మీడియాతో మాట్లాడుతున్న ఏఐఎంటీసీ బృందం



టోక్యో విమానాశ్రయంలో ప్రమాదం అనంతరం అగ్నికీలల్లో చిక్కి బుగ్గవుతున్న విమానం

మంటల్లో విమానం!

టోక్యో ఎయిర్‌పోర్టులో కోస్ట్‌గార్డు విమానాన్ని ఢీకొట్టిన ప్రయాణికుల విమానం

- రన్‌వేపై ల్యాండ్ అవుతుండగా ప్రమాదం.. వెంటనే వ్యాపించిన మంటలు
- ప్రాణాలతో బయటపడిన 379 మంది ప్రయాణికులు
- కోస్ట్‌గార్డు విమానంలోని ఆరుగురు సిబ్బందిలో ఐదుగురు మృతి
- భూకంప బాధితుల కోసం సహాయక సామగ్రి తీసుకెళ్లకముందే దుర్ఘటన

టోక్యో: తీవ్ర భూకంపం ధాటికి పెద్ద సంఖ్యలో ప్రాణనష్టం చోటుచేసుకోవడంతో పెనువిషాదంలో మునిగిపోయిన జపాన్‌లో మరో దుర్ఘటన జరిగింది. భూకంప బాధితుల కోసం సహాయక సామగ్రిని చేరవేయాల్సిన విమానం ప్రమాదంలో చిక్కుకొని ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. విమానాశ్రయం రన్‌వేపై ల్యాండ్ అవుతున్న విమానం మరో విమానాన్ని ఢీకొట్టింది. మొదటి విమానంలో ఉన్న 379 మంది క్షేమంగా ప్రాణాలతో బయటపడడంతో ఊరటనిచ్చింది. ఏమాత్రం ఆలస్యం జరిగినా ఊహించని ఉత్పాతమే జరిగేదని ప్రత్యక్షసాక్షులు చెప్పారు. రాజధాని టోక్యోలోని హనెడా ఎయిర్‌పోర్టు జపాన్‌లో అత్యంత రద్దీ విమానాశ్రయాల్లో ఒకటి. నూతన సంవత్సరం సెలవుల సందర్భంగా ప్రయాణికుల రాకపోకలతో మంగళవారం మరింత రద్దీగా మారింది. హొక్కైడోలోని షిన్ చిటోస్ ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరిన జపాన్ ఎయిర్‌లైన్స్ విమానం జేఏఎల్–516(ఎయిర్‌బస్ ఏ–350) హనెడా ఎయిర్‌పోర్టుకు చేరుకుంది. ఇందులో 12 మంది సిబ్బంది సహా మొత్తం 379 మంది ఉన్నారు. రన్‌వేపై దిగుతూ కుదుపులకు లోనైంది. రన్‌వేపై ల్యాండ్ అవుతూ, ఒక పక్కగా నిలిపి ఉన్న జపాన్ తీర రక్షక దళానికి చెందిన విమానం ఎంఏ–722ను అనూహ్యంగా ఢీకొట్టి కొద్దిదూరం దూసుకెళ్లి ఆగిపోయింది. క్షణాల వ్యవధిలోనే జేఏఎల్ విమానం రెక్క భాగంలో మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన విమాన సిబ్బంది వెంటనే తలుపులు తెరిచి ప్రయాణికులకు బయటకు పంపించారు. మంటలు వేగంగా దూసుకొస్తున్నా లెక్క చేయకుండా ప్రయాణికులంతా బయటకు వచ్చారు. తర్వాత విమానం మొత్తం మంటల్లో చిక్కుకుంది. ఎయిర్‌పోర్టు ప్రాంగణమంతా పొగతో నిండిపోయింది. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. విమానం నుంచి ప్రయాణికులను భద్రంగా బయటకు పంపించిన అందులోని సిబ్బందిపై ప్రశంసల వర్షం కురుస్తోంది. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ఎలా వ్యవహరించాలన్న దానిపై వారికి శిక్షణ ఇచ్చినట్లు అధికారులు చెప్పారు.

'సాయం' అందించకుండానే...

ప్రమాదం జరిగిన వెంటనే తీర రక్షక దళం విమానం పైలట్ అక్కడి నుంచి పరారయ్యాడని జపాన్ కోస్ట్‌గార్డు అధికారులు చెప్పారు. ఈ విమానంలో ఉన్న ఆరుగురు కోస్ట్‌గార్డు సిబ్బందిలో ఐదుగురు మరణించారని స్థానిక మీడియా వెల్లడించింది. కోస్ట్‌గార్డు విమానం సహాయక సామగ్రితో జపాన్ పశ్చిమ తీరంలోని నిగాటాకు బయలుదేరాల్సి ఉంది. కానీ అక్కడి భూకంప బాధితులకు సామగ్రిని అందించకుండానే ప్రమాదం జరగడం, ఐదుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోవడం ఆవేదన కలిగిస్తోంది.

ఊపిరాడక నరకంలా అనిపించింది

జేఏఎల్–516 విమానంలో తనకు ఎదురైన భయానక అనుభవాన్ని 17 ఏళ్ల స్వీడి ఆంటోన్ డీబె మీడియాతో పంచుకున్నాడు. తొలుత ఏం జరిగిందో అర్థం కాలేదని, విమానం లోపలంతా దట్టమైన పొగ కమ్ముకుందని, ఊపిరాడక నరకంలా అనిపించిందని చెప్పాడు. సీట్లలో నుంచి కిందపడిపోయామని, ఎవరో ఎమర్జెన్సీ డోర్లు తెరవడంతో ప్రాణాలతో బయటపడ్డామని తెలిపాడు.

రెండు రోజుల్లో 155 ప్రకంపనలు

జపాన్‌లో 50 మందికి పైగా మృతి

వజిమ: జపాన్‌లో సోమ, మంగళవారం సంభవించిన వరుస ప్రకంపనలతో ప్రాణ, ఆస్తి నష్టం భారీగా సంభవించింది. రెండు రోజుల్లో మొత్తం 155 ప్రకంపనలు నమోదైనట్లు భూకంప విభాగం తెలిపింది. సోమవారం మధ్యాహ్నం సంభవించిన భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 7.6గా నమోదు కావడంతో అధికారులు సునామీ హెచ్చరికలను జారీ చేశారు. మంగళవారం పశ్చిమ తీరంలోని ఇషికావ ప్రిఫెక్చర్‌లో భూకంప సంబంధిత ప్రమాద ఘటనల్లో 50 మందికి పైగా చనిపోగా మరో 16 మంది గాయపడ్డారు. పలు భవనాలు, వాహనాలు ధ్వంసం అయ్యాయి. విద్యుత్ వ్యవస్థలు దెబ్బతినడంతో సుమారు 33 వేల నివాసాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ప్రధాన హైవేలు దెబ్బతిన్నాయి. దీంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. మళ్లీ భూ ప్రకంపనలు సంభవించే ప్రమాదమున్నందున ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని అధికారులు కోరారు. పశ్చిమ తీరంలోని హొన్షు దీవి నుంచి 97 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు షెల్టర్లలోకి తరలిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. జపాన్‌లో భూకంపం నేపథ్యంలో పొరుగునే ఉన్న రష్యా, దక్షిణ కొరియా, ఉత్తర కొరియాలు కూడా సునామీ హెచ్చరికలను జారీ చేశాయి.



జపాన్‌లోని వజిమలో కుప్పకూలిన భవనం

రాష్ట్రాలతోనే దేశాభివృద్ధి

తమిళనాడులో ప్రధాని మోదీ పునరుద్ఘాటన



తిరుచిరాపల్లిలో చిన్నారులతో మాట్లాడుతున్న మోదీ

తిరుచిరాపల్లి/లక్షద్వీప్: రాష్ట్రాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యం అనేది కేంద్ర ప్రభుత్వం విశ్వసించే విధానమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. రాష్ట్రాల అభివృద్ధి దేశాభివృద్ధిని ప్రతిబింబిస్తుందని అన్నారు. ఆయన మంగళవారం తమిళనాడులో పర్యటించారు. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పౌర విమానయానం, ఓడ రేవులు, రైల్వే, హైవేలు, పెట్రోలియం, సహాయ వాయువు, అణు శక్తి, ఉన్నత విద్యకు సంబంధించిన రూ.20,140 కోట్ల విలువైన వివిధ ప్రాజెక్టులను ప్రారంభించారు. వాటిని జాతికి అంకితం ఇచ్చారు. మరికొన్ని కొత్త ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. తొలుత భారతీదాసన్ విశ్వవిద్యాలయం 38వ స్నాతకోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం తిరుచిరాపల్లి అంతర్జాతీయ విమానాశ్రయంలో నూతన టెర్మినల్ భవనాన్ని ప్రారంభించారు. ఏడాది కాలంలో 40 మందికిపైగా కేంద్ర మంత్రులు తమిళనాడులో 400సార్లు పర్యటించారని చెప్పారు. తమిళనాడు అభివృద్ధితో ఇండియా అభివృద్ధి సాధిస్తుందన్నారు. దేశ విదేశాలతో బహుళ అనుసంధానం అభివృద్ధికి కీలక మార్గమని అన్నారు. దీనివల్ల కీలక రంగాల్లో పెట్టుబడులు, తద్వారా వ్యాపారం, వాణిజ్యం పెరుగుతాయని, ప్రజల జీవనం సులభతరం అవుతుందన్నారు. దేశాభివృద్ధిని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లడానికి యువతకు ఇది మంచి సమయమని చెప్పారు. ఈ అవకాశాన్ని చక్కగా ఉపయోగించుకోవాలన్నారు.

లక్షద్వీప్‌లో మోదీ..

రూ1.1,50 కోట్లకుపైగా విలువైన పలు జాతీయ అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించడానికి ప్రధాని మోదీ మంగళవారం లక్షద్వీప్‌కు చేరుకున్నారు. అగత్తీ ఎయిర్‌పోర్టు వద్ద బహిరంగ సభలో ప్రసంగించారు. లక్షద్వీప్‌లో గత పదేళ్లలో ఎన్నో ప్రాజెక్టులను అమల్లోకి తీసుకొచ్చామని చెప్పారు. ఇక్కడి ద్వీపాల అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందన్నారు.

సమాజంలో విభజనను పెంచుతోంది

బీజేపీపై సోనియా ధ్వజం



తిరువనంతపురం: భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు లౌకికవాదమే మూలస్తంభమని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియా గాంధీ స్పష్టం చేశారు. అధికారంలో ఉన్న వ్యక్తులు లౌకికవాదం అనే పదాన్ని వ్యతిరేకిస్తున్నారని, తూలనాడుతున్నారని ఆరోపించారు. అసలు ఈ మాటే వారికి నచ్చడం లేదని ఆక్షేపించారు. ఈ పరిణామం వల్ల అంతిమంగా సమాజంలో 'విభజన' పెరిగిపోతోందని 'మనోరమ ఇయర్‌బుక్–2024'కు రాసిన వ్యాసంలో సోనియా ఆందోళన వ్యక్తం చేశారు. అధికార పదవుల్లో కొనసాగుతున్న వ్యక్తులు ప్రజాస్వామ్యానికి కట్టుబడి ఉన్నట్లు చెబుతూనే, ప్రజాస్వామ్య వ్యవస్థ రక్షణ కవచాలను బలహీనపరుస్తున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యం, లౌకికవాదం పరస్పరం లోతుగా అనుసంధానమైన ఉంటాయని తెలిపారు. ఈ రెండు పదాల గురించి సమగ్రంగా తెలుసుకుంటే భారతదేశ చరిత్రను, భూత, వర్తమాన, భవిష్యత్తు సవాళ్లను మరింత బాగా అర్థం చేసుకోవచ్చని వెల్లడించారు. సెక్యులరిజం గురించి రకరకాలుగా నిర్వచించవచ్చని పేర్కొన్నారు. భారత్‌కు సంబంధించినంత వరకు మహాత్మా గాంధీ బోధించిన 'సర్వధర్మ సమభావం' అనేది లౌకికవాదానికి సరైన అర్థం అవుతుందని సోనియా గాంధీ అభిప్రాయపడ్డారు. అన్ని మతాల ఐక్యత గురించి గాంధీజీ బోధించారని గుర్తుచేశారు.



ధాన్య లక్ష్మి

మైసూరు వద్ద రాగి నూర్పిళ్లు జరుగుతున్నాయి. మంగళవారం రాగి రాశికి పూజ చేస్తున్న ఓ రైతు కుటుంబం

న్యూస్‌రీల్

16న ఘాటి బ్రహ్మరథోత్సవం



దొడ్డబళ్లాపురం: దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రాల్లో ఒకటైన దొడ్డ తాలూకాలోని ఘాటి సుబ్రమణ్య క్షేత్రంలో ఈనెల 16న బ్రహ్మ రథోత్సవం జరగనుంది. 16న మంగళవారం మధ్యాహ్నం 12-15 నుండి 12-30 మధ్య కాలంలో వచ్చే శుభమేష లగ్నం లో రథోత్సవం జరుగుతుంది. షష్ఠి రోజున తెల్లవారుజామున 3గంటల నుండి స్వామికి అభిషేకాలు ప్రారంభమవుతాయి. గర్భగుడిలో ఏకశిలలో వెలసిన సుబ్రమణ్యస్వామి, నరసింహస్వామిలకు ప్రాతఃకాలంలో క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, శ్రీగంధాభిషేకం,పూల అలంకరణ జరుగుతాయి. ఆ రోజు రాత్రి 9-30 వరకూ స్వామి దర్శనం అవకాశం ఉంటుంది.

పులుల దాడుల్లో గోవులు బలి

మైసూరు: పులుల దాడిలో ఆవులు మృతి చెందిన సంఘటన మైసూరు జిల్లాలోని హెచ్‌డి కోటె తాలూకాలోని నాగరహొళె అడవుల్లోని మేటికొప్ప వద్ద కల్లహట్టి గ్రామంలో జరిగింది. నాగేగౌడ అనే రైతుకు చెందిన ఆవును పులి దాడి చేసి హతమార్చింది, పక్కనే సిద్దాపుర గ్రామంలో కూడా మరో ఆవును పులి పొట్టన పెట్టుకుంది. సుమారు 80 మందికి పైగా అటవీ సిబ్బంది పులి కోసం గాలింపు చేపట్టారు. అక్కడక్కడా బోనులు ఏర్పాటు చేశారు. ఏ క్షణంలో పులి దాడి చేస్తుందోనని పల్లెల జనంలో ఆందోళన నెలకొంది.

కట్నం కోసం అలక ప్రభుత్వ ఉద్యోగికి బేడీలు

దొడ్డబళ్లాపురం: వరకట్నం ఆశతో ఒక ప్రభుత్వ ఉద్యోగి జైలు పాలైన సంఘటన బెళగావి జిల్లా ఖానాపురలో చోటుచేసుకుంది. పాత హుబ్బళ్లి నివాసి సచిన్ విఠల పాటీల్ జైలుపాలైన ప్రభుత్వ ఉద్యోగి. ఖానాపురలోని ఒక కల్యాణ మండపంలో ఖానాపురకు చెందిన యువతితో పాటీల్‌కు వివాహం జరగాల్సి ఉండగా అనుకున్న మొత్తం కంటే ఎక్కువ మొత్తంలో కట్నం డిమాండు చేసాడు. దీంతో వధువు తల్లిదండ్రులు ససేమిరా అన్నారు. వరకట్నం ఇవ్వనిదే తాను వివాహం చేసుకోనని పాటీల్ పట్టుబట్టాడు. దీంతో వధువు కుటుంబ సభ్యులు ఖానాపుర పోలీసులకు ఫిర్యాదు చేసారు. రంగంలోకి దిగిన పోలీసులు పాటీల్‌ను అరెస్టు చేసి జైలుకు పంపించారు. వరుడు సచిన్ విఠల్ పాటీల్ బెళగావి కలెక్టరేట్‌లో ఎస్‌డీసీగా విధులు నిర్వహిస్తున్నాడు.

దొడ్డ తాలూకాలో మరో చిరుత



రోడ్డుపైన తిరుగుతున్న చిరుత

దొడ్డబళ్లాపురం: దొడ్డ తాలూకాలో చిరుత పులులు ఇటీవల తీవ్ర కలకలం రేపుతున్నాయి. తాజాగా సోమవారం రాత్రి ఆరకమల్లిగె- కుంటనహళ్లి మార్గంలో ఓ చిరుతపులి రోడ్డుపై తిరుగుతూ వాహనదారుల కంట పడింది. కారులోని వారు చిరుత దృశ్యాలను మొబైల్‌లో వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. గత వారం క్రితమే పారిశ్రామికవాడలోని వీరాపురంలో, అపెరల్ పార్కులోని ఒక ఫ్యాక్టరీ గేటు ముందు చిరుతలు తిరుగుతూ కనిపించాయి. మూడు చోట్లా కనిపించిన చిరుత ఒక్కటే అని అటవీశాఖ అధికారులు చెబుతున్నా, ఈ ప్రదేశాల మధ్య చాలా దూరం ఉండడం, మధ్యలో జనావాస ప్రదేశాలు ఎక్కువగా ఉండడంతో చిరుత ఎలా వెళుతోంది అనేది ప్రశ్నగా మారింది.

జైళ్ల ప్రక్షాళన జరిగేనా?

- అక్రమాల అడ్డుకట్టకు కేంద్రం నూతన చట్టం
- రాష్ట్రాలకు మార్గదర్శకాల జారీ



జైళ్లకు వెళ్లే ఖైదీల్లో పరివర్తన తేవడం ఆ శాఖ ముఖ్య ఆశయం. కానీ వాస్తవంగా జరిగేది వేరు. జైళ్లలో వేర్వేరు ఖైదీలతో జతకట్టి ముఠాలుగా ఏర్పడి మరింతగా నేరాలకు పాల్పడడం, జైల్లోకే డ్రగ్స్, మొబైల్‌ఫోన్లు, ఆయుధాలు, మద్యం వంటివి తెప్పించుకుని విలాసాలు అనుభవించడం అందరికీ తెలిసిందే. బెళగావి సెంట్రల్ జైలు నుంచి ఓ బడా ఖైదీ ఏకంగా కేంద్రమంత్రి ఆఫీసుకి ఫోన్ చేసి కోట్లాది రూపాయలు డబ్బులు ఇవ్వాలంటే, లేదంటే అంతుచూస్తానని బెదిరించాడు. ప్రస్తుతం కారాగాల్లో ఇలా ఉంది పరిస్థితి.



బెంగళూరు పరప్పన అగ్రహార సెంట్రల్ జైలు వద్ద ఖైదీలు, అధికారులు (ఫైల్)

బనశంకరి: జైళ్లలో ప్రక్షాళనకు కేంద్ర సర్కారు నడుం బిగించింది. కారాగారాల్లో సత్పరిపాలన కోసం కేంద్రం ఆదర్శ కారాగృహాల చట్ట సవరణ సేవలు-2023 చట్టం అమల్లోకి తీసుకువచ్చింది. దేశంలోని అన్ని రాష్ట్రాలు అమలు చేయాలని ఆదేశించింది. ఖైదీలు, వారితో భేటీకి వచ్చే ఆధార్ కార్డు అనుసంధానం ధృవీకరణను తప్పనిసరి చేసింది. అంతేగాక ఈ- ప్రిజిన్స్ వెబ్‌సైట్‌లో ఖైదీల సమగ్ర వివరాలను అప్‌డేట్ చేయాలని తెలిపింది. దేశంలో అన్ని జైళ్లలో ఉన్న ఖైదీల సమాచారం ఒకే వేదికపై పొందుపర్చనున్నారు.

అక్రమాలు అనేకం

జైళ్లలో మొబైల్‌ఫోన్లు, డ్రగ్స్ సరఫరా- వినియోగం, ఖైదీలకు చట్ట విరుద్ధంగా విలాసవంతమైన సౌలభ్యాలు కల్పించడం, జైలు నుంచే ఉగ్ర కార్యకలాపాలు, బెదిరింపు కాల్స్‌కు పాల్పడి డబ్బు వసూలు చేయడం వంటి సంఘటనలు తరచూ వెలుగులోకి వస్తున్నాయి. వీటికి అడ్డుకట్ట వేసే దృష్టితో కేంద్ర ప్రభుత్వం కారాగృహాలు చట్టాన్ని సవరించింది. చెరసాలల్లోకి ఖైదీల ప్రవేశం, భద్రత, నియంత్రణ, శిక్ష, విడుదలతో పాటు ప్రతి విషయం జైలు అధికారి ఆధీనంలో ఉంటుంది. ఉల్లంఘనలు జరిగితే దీనికి జైలు అధికారి జవాబుదారీ వహించాలి. జైలు అధికారులు జైలు ఖైదీలతో ఏవిధంగా పరోక్ష లేదా నేరుగా సంబంధాలు కలిగి ఉండరాదు. డబ్బు తీసుకుని ఖైదీలకు ప్రయోజనాలను కల్పించడం నేరం. ఇలాంటి ఘటనలు జరిగితే జైలు అధికారులపై చర్యలు తప్పవని కొత్త చట్టంలో స్పష్టంచేశారు.

మొబైల్ జామర్లు ఉండాలి

జైళ్లలో ఖైదీలు మొబైల్‌ఫోన్ల వినియోగానికి అడ్డుకట్ట వేయడానికి అత్యాధునిక జామర్, మొబైల్‌ఫోన్ల ఆచూకీని కనిపెట్టే పరికరాలు అమర్చాలి. వీటితో పాటు సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ వ్యవస్థ, బాడీ స్కానర్, రేడియో ఫ్రీక్వెన్సీ గుర్తింపు పరికరాలు, వీడియో కాన్ఫరెన్స్ సౌలభ్యాలను అన్ని జైళ్లలో ఏర్పాటు చేయాలి. జైళ్ల నిర్వహణలో మార్పులు తీసుకురావడం, అంతేగాక ఇంటర్ ఆపరేబల్ క్రిమినల్ జస్టిస్ సిస్టం (ఐసీజేఎస్)తో పాటు జైళ్ల డేటాను పూర్తిగా అందుబాటులో ఉంచాలని సూచించింది.

మహిళా ఖైదీల భద్రతకు

జైళ్లలో ఉన్న మహిళా ఖైదీలపై తోటి ఖైదీలు, సిబ్బంది లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటనలు ఉన్నాయి. ఇలాంటి అంశాలపై ఫిర్యాదులు వస్తే ఆలస్యం చేయకుండా తక్షణం విచారణ జరపాలి. కారకులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని జైలు అధికారులు సూచించారు.



చెరసాలల్లో కొత్త వెలుగులు వచ్చేనా?

హైరిస్క్ ఖైదీలపై నిఘా

పాత నేరస్తులు, నేర చరితులు, తీవ్రమైన నేరాల్లో అరెస్ట్ అయిన ఖైదీలపై ప్రత్యేక నిఘా వహించాలి. ప్రమాదకారులు అని భావించే ఖైదీలను గుర్తించి సాధారణ ఖైదీలతో కలవడానికి అవకాశం ఇవ్వకుండా ప్రత్యేక సెల్‌లో ఉంచాలి. నేరాలకు కుట్రపన్నే ఖైదీలపై నిఘాపెట్టాలి. దీనికి నమ్మకమైన ఖైదీలను ఇన్‌ఫార్మర్లుగా నియమించి సమాచారం సేకరించాలని ఆదేశించారు.

జైలు అభివృద్ధి మండలి

జైళ్ల ఆధునీకరణ కోసం కారాగారాభివృద్ధి మండలిని ఏర్పాటుచేయాలి. దీని ద్వారా జైళ్లలో మౌలిక సౌకర్యాలు, ఖైదీలు పర్యవేక్షణకు కార్యకలాపాలు చేపట్టడం, సిబ్బంది సంక్షేమ కార్యకలాపాలు రూపొందించాలని సూచించింది. వీటన్నింటిని జైళ్ల శాఖ అధికారులు అమలు చేస్తారా? అనేది ముఖ్యమైన ప్రశ్నగా మారింది.

స్కూలు బస్ డ్రైవర్ ఘాతుకం





కిరాతకుడు సంతోష్, బాలిక (ఫైల్)

- 8వ తరగతి బాలికకు మాయమాటలు
- ఇద్దరూ రైలు కింద పడి ఆత్మహత్య
- చిక్కమగళూరు జిల్లాలో దారుణం

యశవంతపుర: అభం శుభం తెలియని 8వ తరగతి బాలికను లోబర్చుకున్న సదరు పాఠశాల బస్సు డ్రైవర్.. చివరకు జనం ఏమంటారోనని భయపడి బాలికతో సహా ఆత్మహత్య చేసుకున్నాడు. చిక్కమగళూరులో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. జిల్లా అజ్జంపుర తాలూకా గిరియాపుర గ్రామంలోని జ్ఞానదీప ప్రైవేట్ స్కూల్ ఉంది. అందులో బాలిక (14) 8వ తరగతి చదువుతోంది. ఆమె రోజూ స్కూలు బస్సులో ఇంటికి వచ్చి వెళ్లేది. ఆమెపై తండ్రి వయసున్న బస్సు డ్రైవర్ సంతోష్ (38) కన్నేశాడు. మాయమాటలు చెప్పి లోబర్చుకున్నాడు. ప్రేమ దోమ అంటూ షికార్లకు తీసుకెళ్లాడు. ఈ విషయం బాలిక తల్లిదండ్రులకు తెలిసింది. దీంతో వారు దండిస్తారని భయపడిన సంతోష్ ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడు. తనతో పాటు బాలికను కూడా బలిగొనాలని కుట్ర పన్నాడు. సోమవారం విద్యార్థిని సమీపంలోని రైలు పట్టాల వద్దకు తీసుకెళ్లి అక్కడ ఇద్దరూ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు.

స్కూలు యాజమాన్యంపై కేసు

ఈ నేపథ్యంలో స్థానిక పోలీసులు స్కూలు యాజమాన్యం నిర్లక్ష్యం ఉన్నందున వారిపై పోక్సో కేసు నమోదు చేశారు. తమ కూతురు కనిపించడం లేదని స్థానిక అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, వారు స్పందించి ఉంటే ప్రాణాలతో దక్కి ఉండేదని తల్లిదండ్రులు విలపించారు.

లోకాయుక్త అధికారి ముసుగులో డబ్బులు వసూలు

- నిందితుడి అరెస్ట్



పోలీసులకు పట్టుబడిన శ్రీనాథ్‌రెడ్డి

బనశంకరి: లోకాయుక్త అధికారి ముసుగులో ప్రభుత్వ ఉద్యోగులకు ఫోన్ చేసి బెదిరించి డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తిని మంగళవారం తూర్పువిభాగ సీసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శ్రీనాథ్‌రెడ్డి పట్టుబడిన వ్యక్తి. ఇటీవల ఒక ప్రభుత్వ అధికారికి ఫోన్ చేసి తాను లోకాయుక్త సీఐ చంద్రశేఖర్ అని చెప్పుకొని, మీపై లోకాయుక్తలో కేసు ఉంది. కేసు విచారణ చేపట్టకుండా క్లోజ్ చేయాలంటే డబ్బు ఇవ్వాలని, డబ్బులు ఇస్తే పిటిషన్‌ను మా టెక్నికల్ టీమ్ నుంచి విచారణ చేపట్టి బీ రిపోర్ట్ ఇస్తామని తెలిపాడు. ఈ ఘటనపై విధానసౌధ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కేసు దర్యాప్తు చేపట్టిన సీసీబీ పోలీసులు శ్రీనాథ్‌రెడ్డిని అరెస్ట్ చేశారు. ఏపీలో సైతం ఇదే విధంగా ఉద్యోగులకు ఫోన్ చేసి బెదిరించి డబ్బులు వసూళ్లకు పాల్పడ్డాడు. ఇతడిపై బెంగళూరు సిద్దాపుర, హైగ్రౌండ్స్ పోలీస్‌స్టేషన్, అనంతపురం, బెంగళూరు బేగూరు, ఎలక్ట్రానిక్‌సిటీ, అత్తిబెలె, హెబ్బగోడి, జిగిణి, సూర్యసిటీ, కోలారు టౌన్‌లో చోరీ, చీటింగ్ కేసులు నమోదయ్యాయి.

నాట్యాంజలి



భరతనాట్య ప్రదర్శన



చిన్నారి కీర్తన యోగా ప్రదర్శన

చింతామణి: తాలూకాలోని పుణ్యక్షేత్రమైన కైవార శ్రీయోగి నారేయణమఠంలో నృత్య కళా విద్యార్థుల భరతనాట్య ప్రదర్శన అలరించింది. భక్తి కీర్తనలకు తగినట్లు లయబద్ధంగా నాట్య విన్యాసంతో ప్రతిభ చాటుకున్నారు. అలాగే చింతామణి యోగా సాధకురాలు కీర్తన అప్పటికప్పుడు వేదికపైకి వచ్చి క్లిష్టమైన యోగాసనాలను ప్రదర్శించి ప్రశంసల్ని అందుకుంది.

డ్రగ్స్‌రహిత కర్ణాటకనే లక్ష్యం



పోలీస్ అధికారులతో సమావేశమైన హోంమంత్రి పరమేశ్వర్

బనశంకరి: న్యూ ఇయర్ సమయంలో పోలీస్ శాఖ జనస్నేహిగా విధులు నిర్వహించడంతో ప్రజల నుంచి అభినందనలు వస్తున్నాయని, ఇది నిరంతరంగా కొనసాగాలని హోంమంత్రి పరమేశ్వర్ తెలిపారు. మంగళవారం సదాశివనగరలోని హోం మంత్రి కార్యాలయంలో నగర పోలీస్ కమిషనర్ దయానంద్, అదనపు పోలీస్ కమిషనర్లు రమణగుప్తా. సతీశ్, ఎంఎన్ అనుచేత్‌తో పాటు నగరంలోని అన్ని విభాగాల డీసీపీలతో మంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సమయంలో కొన్ని కఠిన నిర్ణయాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. తాను కాలేజీ రోజుల నుంచి న్యూ ఇయర్ చూస్తున్నానని, ఈ ఏడాది ప్రత్యేకంగా ఆచరించారని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. కర్ణాటకను మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని తెలిపారు. కొన్ని దేశాల పర్యాటకులు ఎక్కువగా మాదకద్రవ్యాలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని, వారిపై నిఘా పెట్టాలన్నారు.

5 నుంచి సిరిధాన్య మహోత్సవం



బనశంకరి: సిలికాన్ సిటీలో ప్యాలెస్ మైదానంలోని త్రిపురవాహినిలో 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు సిరిధాన్య, సేంద్రియ అంతర్జాతీయ వాణిజ్య మేళా -2024 జరుగుతుందని వ్యవసాయ మంత్రి చెలువరాయస్వామి తెలిపారు. మంగళవారం నగరంలోని విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ మూడురోజుల పాటు సాగే మేళాలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి పరిశోధన సంస్థలు పాల్గొంటాయని తెలిపారు. వివిధ రాష్ట్రాలకు చెందిన రైతులు పండించిన పంటలను ప్రదర్శిస్తారు. ఇందులో 281 స్టాల్స్‌కు అవకాశం ఉంటే, 248 స్టాల్స్‌కు నమోదు చేసుకున్నారు. ఉత్పత్తిదారులు, మార్కెట్‌దారులు, నిపుణులతో సదస్సులు ఉంటాయి. మేళా ప్రచారంలో భాగంగా సిరిధాన్య నడక, వంటలు, ఆటల పోటీలు తదితరాలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఏఎస్ రోహిణి సింధూరి పాల్గొన్నారు.

ఊడిన ఆర్టీసీ బస్సు చక్రాలు

- 10 మందికి గాయాలు



యశవంతపుర: కేఎస్ఆర్‌టీసీ బస్సు చక్రాలు ఊడి ఒరిగిపోయి ప్రయాణికులు గాయపడిన ఘటన ఉత్తరకన్నడ జిల్లా కారవార నగరం దగ్గర హబ్బువాడ రోడ్డులో మంగళవారం జరిగింది. కరవడి కి వెళుతుండగా బస్సు వెనుక చక్రాలు ఊడిపోవడంతో బస్సు హఠాత్తుగా ఒరిగిపోయింది. ఈ ఘటనలో 10 మంది ప్రయాణికులు గాయపడి కారవార ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. డొక్కు బస్సులను నడుపుతున్నారని గ్రామస్థులు మండిపడ్డారు. ప్రమాదంతో కారవార పారిశ్రామికవాడ రోడ్డుపై కొంతసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది.

కడతేరిన కూలీ బతుకులు



ధ్వంసమైన జీపు



ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్

- జీపును ఢీకొన్న ఆర్టీసీ బస్సు
- నలుగురు మృత్యువాత
- మైసూరు జిల్లాలో ఘోరం

మైసూరు: కూలీలతో వెళుతున్న జీపును కేఎస్ ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో నలుగురు మృత్యువాత పడ్డారు. ఈ దుర్ఘటన మైసూరు జిల్లాలోని హుణసూరులో ఉన్న ఆర్‌టిఓ ఆఫీసు దగ్గర మంగళవారం జరిగింది. హెచ్‌డి కోటె తాలూకా చిల్లర మరతిట్టు గ్రామానికి చెందిన సోమేశ (30), రాజు (35), లోకేష్ (35), దమ్మనకట్టెకి చెందిన జీపు డ్రైవర్ మరణించారు. విరాజపేటె నుంచి బెంగళూరుకు వెళుతున్న ఆర్టీసీ లగ్జరీ బస్సు.. హుణసూరు నుంచి పిరియా పట్టణానికి వెళుతున్న జీపును ఢీకొట్టింది. జీపు ధ్వంసం కాగా, అందులోని నలుగురు ఘటనాస్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. కూలిపనుల కోసం వీరు వెళుతున్నట్లు తెలిసింది. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. బస్సులోని అందరూ క్షేమంగా ఉన్నారు. స్థానిక పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

కోవిడ్ చికిత్సలకు సంసిద్ధం

- కొత్త వేరియంట్‌పై భయం వద్దు
- వైద్య విద్యామంత్రి వెల్లడి



బెంగళూరు సోమేశ్వరనగరలోని కోవిడ్ ఫీల్డ్ ఆస్పత్రి

బనశంకరి: కోవిడ్ కేసులు రాష్ట్రంలో పెరుగుతున్నందున నివారణ చర్యలపై మంగళవారం వైద్య విద్యా మంత్రి శరణ ప్రకాష్ పాటిల్, ఉన్నత విద్యా మంత్రి ఎంసీ సుధాకర్, కోవిడ్ సాంకేతిక సలహా సమితి అధ్యక్షుడు డా. రవి, ఉన్నతాధికారుల సమావేశం నిర్వహించారు. మంత్రి శరణ ప్రకాష్ పాటిల్ మాట్లాడుతూ... కోవిడ్ కేసులు రోజురోజుకు హెచ్చుమీరుతున్నాయి, వీటి నియంత్రణ, చికిత్సకు ఏర్పాట్ల గురించి సమావేశంలో చర్చించామని తెలిపారు. రోగులకు చికిత్స కోసం అన్ని మెడికల్ కాలేజీలు, ఆసుపత్రులకు ఆక్సిజన్, బెడ్‌లు, ఐసీయూలు, వెంటిలేటర్ తదితరాలను సిద్ధం చేసుకోవాలని సూచించామన్నారు. గతంలో మాదిరిగా ఆక్సిజన్, ఔషధాలకు ఇబ్బంది తలెత్తరాదని అన్నారు.

ఇప్పటికి 10 మంది మృతి

కోవిడ్ కేసులు పెరగగానే భయపడాల్సిన పని లేదన్నారు. కొత్త వేరియంట్‌కు వ్యాపించే సామర్థ్యం ఎక్కువగా ఉందని, కానీ ప్రాణాంతకం కాదని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెప్పిందని, కాబట్టి ప్రజలు భయపడవద్దని మంత్రి సూచించారు. 60 ఏళ్లకు పైబడిన వారు మాస్కులను ధరించాలని, జనరద్దీ ప్రాంతాల్లో అయితే అందరూ కోవిడ్ నిబంధనలను పాటించాలని తెలిపారు. కొత్తగా రాష్ట్రంలో కోవిడ్ వల్ల 10 మంది మృతి చెందారని, వీరికి వైరస్‌తో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నాయని చెప్పారు. మరోవైపు సోమేశ్వరనగర ఫీల్డ్ ఆస్పత్రితోపాటు పలు వైద్యశాలల్లో కోవిడ్ సన్నద్ధత చర్యలు సాగుతున్నాయి.

ఓ తల్లి కఠిన హృదయం

- ఇద్దరు పిల్లలతో కలిసి ఆత్మహత్య!
- ఇంట్లో గ్యాస్ లీక్ చేసి అఘాయిత్యం



శివమ్మ, పిల్లలు, భర్త ఫొటోలు



సంఘటన జరిగిన ఇంటివద్ద జనం

యశవంతపుర: ఇంటిలో వంట గ్యాస్ సిలిండర్‌ను లీక్ చేసి ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి ఆత్మహత్య చేసుకున్న విషాద సంఘటన హాసన్ నగరంలోని దాసరకొప్పలలో మంగళవారం వెలుగుచూసింది. హాసన తాలూకా సీగె గ్రామానికి చెందిన తీర్థ తుమకూరులో బేకరిలో పని చేస్తున్నాడు. కుటుంబాన్ని దాసరకొప్పలలో అద్దె ఇంట్లో ఉంచాడు. ఆ ఇంట్లోనే భార్య శివమ్మ (36), సించన (7), పవన్ (10) అనూహ్య రీతిలో ప్రాణాలు తీసుకున్నారు.

అర్ధరాత్రి భర్త రాక

సోమవారం సాయంత్రం భార్యకు ఫోన్ చేసిన తీర్థ తను ఇంటికి వస్తున్నాను, భోజనం సిద్ధంగా ఉంచాలని చెప్పాడు. అర్ధరాత్రి ఇంటికి వచ్చిన తీర్థ తలుపులు కొట్టగా ఎవరూ తెరవలేదు. భార్యకు ఫోన్ చేసినా స్పందించలేదు. నిద్రమత్తులో ఉండవచ్చని భావించి తీర్థ ఇంటిపైకెళ్లి నిద్రపోయాడు. మంగళవారం ఉదయం మళ్లీ తలుపులు తీయాలని ప్రయత్నించగా తెరవలేదు. అనుమానం వచ్చి బలవంతంగా తెరిచి చూడగా ఇల్లు పూర్తిగా గ్యాస్ వాసనతో నిండిపోయింది. తల్లి పడి ఉండగా, ఆమె కాళ్లపై ఇద్దరు చిన్నారులు నిద్రిస్తున్న మాదిరిలో చనిపోయి ఉన్నారు. గ్యాస్‌ను పీల్చడం వల్లే చనిపోయి ఉంటారని భావిస్తున్నారు. ఈ దారుణం చూసి గ్రామస్థులు చలించిపోయారు.

ఘటనపై అనుమానాలు

చావుకు గల కారణాలు కచ్చితంగా తెలియడం లేదు. కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు కారణం కావచ్చని భావిస్తున్నారు. పెన్షన్ మొహల్లా పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. కాగా, శివమ్మ గ్యాస్ లీక్ చేసి ఆత్మహత్య చేసుకున్నారా, లేక పొరపాటున గ్యాస్ లీకై ప్రాణాలు పోయాయో తెలియటం లేదనే అనుమానాలూ ఉన్నాయి.

క్లుప్తంగా

వేడుకగా బసవేశ్వర రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కంప్లి: కూడ్లిగి తాలూకా చిక్కజోగిహళ్లి సిద్దాపుర గ్రామ ఆరాధ్య దైవమైన బసవేశ్వర స్వామి రథోత్సవం ఆడంబరంగా జరిగింది. కొత్త సంవత్సరంలో దేవుడి దర్శనార్థం భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని రథోత్సవాన్ని తిలకించారు. ఉదయాన్నే ఆలయంలో, స్వామి వారికి పూజా కార్యక్రమాలు జరిగాయి. రథోత్సవానికి ముందుగా బసవేశ్వరుడిని రథం వద్దకు తెచ్చి రథం చుట్టు మూడు ప్రదక్షణలు జరిపించి రథంలో బసవేశ్వరుని ప్రతిష్ఠించారు. మహిళలు పూర్ణకుంభాలతో వివిధ వాయిద్యాలతో రథోత్సవంలో పాల్గొన్నారు.

ముస్లింలపై అనుచిత వ్యాఖ్యలు తగదు



గంగావతిలోని బస్టాండ్ సర్కిల్‌లో ధర్నా చేస్తున్న దృశ్యం

గంగావతి: ముస్లిం మహిళలపై అనుచితంగా మాట్లాడిన కల్లడ్క ప్రభాకర్ భట్‌పై చర్యలు తీసుకొని బంధించాలని డిమాండ్ చేస్తూ కర్ణాటక ప్రదేశ్ జనతాదళ్(జేడీఎస్) పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం బస్టాండ్ సర్కిల్‌లో ధర్నా చేశారు. ఇటీవల ముస్లిం మహిళల గురించి అసభ్యకరంగా,అగౌరవపరిచే రీతిలో మాట్లాడిన ఆయనను తక్షణం రాష్ట్ర ప్రభుత్వం బంధించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు తమ కార్యాలయం నుంచి అంబేడ్కర్ సర్కిల్ మీదుగా బస్టాండ్ వరకు ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో జేడీఎస్ నేత షేక్ నబి, దుర్గా ప్రసాద్, సలీం, హుస్సేన్‌బీ, శాహిదా బేగం, అమీనాబేగం తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడితో పాట్లు



ట్యాంకర్ ముందు గుమికూడిన లేబెట్ నివాసులు

కంప్లి: హూవినహడగలి తాలూకాలోని నందిహళ్లి లేబెట్‌లో తాగునీటి ఎద్దడితో ఆ ప్రాంతవాసులు అల్లాడి పోతున్నారు. వేసవికి ముందే ఈ పరిస్థితి ఉంటే మరి వేసవిలో ఇంకా ఎంత దారుణంగా ఉంటుందో అని కూలీ కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో అధిక శాతం కూలీ కార్మికులే ఉన్నందున నీరు దొరకడం లేదు. గత్యంతరం లేక సమీపంలోని పొలాల్లోకి వెళ్లి నీరు తెచ్చుకుంటున్నారు. కనీసం కూలీ కార్మికుల కష్టాలను పరిశీలించి వెంటనే సంబంధించిన అధికారులు సక్రమంగా తాగునీరు అందించే చర్యలు తీసుకోవాలని లేబెట్ నివాసులు వీరేష్, శరణప్ప, కొట్రేష్ విన్నవించారు.


6 నుంచి రాష్ట్ర స్థాయి మహిళా సమ్మేళనం



పోస్టర్‌ను విడుదల చేస్తున్న మంజుల తదితరులు

హొసపేటె: మహిళలపై నిరంతరం జరుగుతున్న దౌర్జన్యాలు, హింసను అరికట్టడంతో పాటు మహిళలకు విద్య, ఉపాధి, ఆరోగ్యం, శ్రామిక మహిళలకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత భరోసా తదితర సమస్యలపై దావణగెరెలో ఈ నెల 6, 7 తేదీల్లో 7వ రాష్ట్ర స్థాయి మహిళా సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు ఏఐఎంఎస్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్.మంజుల తెలిపారు. మంగళవారం నగరంలోని ప్రెస్ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. బాధిత మహిళల గొంతుకగా నిలిచిన అఖిల భారత మహిళా సాంస్కృతిక సంఘం(ఏఐఎంఎస్ఎస్) దేశ వ్యాప్తంగా పాదయాత్రలు నిర్వహిస్తోందన్నారు. ఈ సందర్భంగా మహిళా సంఘం నాయకురాళ్లు పాల్గొన్నారు.

వైభవంగా మారుతేశ్వర జాతర



రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే, భక్తులు

రాయచూరు రూరల్: తాలూకాలోని సాదాపురలో సోమవారం సాయంత్రం మారుతేశ్వర జాతర, రథోత్సవం వైభవంగా జరిగాయి. రాయచూరు రూరల్ ఎమ్మెల్యే బసనగౌడ, ఏపీఎంసీ అధ్యక్షుడు మల్లికార్జున గౌడ, వందలాది మంది భక్తుల సమక్షంలో రథోత్సవాన్ని నిర్వహించారు.

రామభక్తులకు మాత్రమే ఆహ్వానమా?

- అయోధ్యలో రామాలయ ప్రారంభోత్సవానికి ఆహ్వానం అందని అంశంపై సీఎం అసంతృప్తి



విజయపురలో స్వామీజీ గురునమన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీఎం సిద్దరామయ్య, స్వామీజీలు

గంగావతి: అయోధ్యలో రామ మందిర ప్రారంభోత్సానికి రామభక్తులను మాత్రమే ఆహ్వానించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు ప్రకటించడం విచారకరం అని సీఎం సిద్దరామయ్య పేర్కొన్నారు. ఆయన కొప్పళ తాలూకా బసాపుర విమానాశ్రయం వద్ద విలేకరులతో మాట్లాడారు. ఆహ్వానం అందిన వారు మాత్రమే రామాలయ ప్రారంభోత్సవానికి వెళతారని ఎద్దేవా చేశారు. హుబ్లీలో కర సేవకులు తప్పు చేసినందుకే చర్యలు తీసుకున్నారన్నారు. తప్పు చేసిన వారిని ఊరికే వదిలిపెట్టాలా? అని సీఎం ప్రశ్నించారు.

సిద్దేశ్వర స్వామీజీ సేవలు అనన్యం

రాయచూరు రూరల్: రాష్ట్రంలో జ్ఞానయోగి, ఆధ్యాత్మిక ప్రవక్త, జ్ఞాన యోగాశ్రమ సంచాలకుడు సిద్దేశ్వర స్వామీజీ సేవలు అనన్యమని రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రశంసించారు. మంగళవారం విజయపుర జ్ఞానయోగాశ్రమంలో స్వామీజీ గురు నమన కార్యక్రమంలో ప్రసంగించారు. సిద్దేశ్వర స్వామీజీ అడుగుజాడల్లో నడవాలన్నారు. బసవాది శరణుల అనుయాయులుగా మనందరం మారాలన్నారు.

అతిథి అధ్యాపకుల పర్మినెంట్ అసాధ్యం

రాష్ట్రంలో ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న అతిథి అధ్యాపకులను పర్మినెంట్ చేయడం కష్టసాధ్యమని సీఎం అన్నారు. మంగళవారం కొప్పళ జిల్లా గిణిగెరాలోని హెలిప్యాడ్ వద్ద విలేకరులతో ఆయన మాట్లాడారు. పాదయాత్రలు చేస్తున్న విషయంపై వారితో చర్చలు జరిపామన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి నయాపైసా కరువు సహాయం అందలేదన్నారు. దీనిపై 25 మంది లోక్‌సభ సభ్యులు మౌనం వహించడంపై సీఎం అభ్యంతరం వ్యక్తం చేశారు.

స్థలం లేనందున పిలవలేదు: కేంద్ర మంత్రి జోషి

సాక్షి బళ్లారి: రామ మందిర ప్రారంభోత్సవానికి ముఖ్యులకు వేదిక మీద స్థలం లేకపోవడంతో సీఎం సిద్దరామయ్యకు ఆహ్వానం పంపలేదని కేంద్ర మంత్రి ప్రహ్లాదజోషి పేర్కొన్నారు. ఆయన శనివారం విజయపురలో విలేకరులతో మాట్లాడారు. రామమందిర ప్రారంభోత్సవానికి సీఎంకు ఆహ్వానం అందలేదని మాజీ మంత్రి ఆంజనేయ పేర్కొన్న విషయంపై ఆయన ప్రస్తావిస్తూ దేశంలోని ఏ బీజేపీ ముఖ్యమంత్రికి రామ మందిర ప్రారంభోత్సవానికి ఆహ్వానం పంపలేదన్నారు. కేంద్రమంత్రి అయిన తనకు కూడా ఆహ్వానం అందలేదన్నారు. అంతేగాకుండా సమావేశానికి రాకూడదని కూడా పంపారన్నారు.

జక్కణాచారి సేవలు ఎనలేనివి



కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

హొసపేటె: దేశ సంస్కృతికి గర్వకారణమైన శిల్పకళకు అమరశిల్పి జక్కణాచారి చేసిన సేవలు ఎనలేనివని విశ్రాంత అధ్యాపకులు నాగరాజ పత్తార్ తెలిపారు. సోమవారం బళ్లారి రోడ్డులోని కాళికమ్మ ఆలయంలో ఏర్పాటు చేసిన అమరశిల్పి జక్కణాచారి సంస్మరణ దినోత్సవంలో ఆయన ప్రత్యేక ఉపన్యాసం చేశారు. శిల్పులు వాస్తుశిల్ప కళలో దేశ సాంస్కృతిక, రాజకీయ, విద్యా వారసత్వాన్ని కైవసం చేసుకున్నారన్నారు. అలాంటి శిల్పుల్లో అమరశిల్పి జక్కణాచారి ప్రముఖుడన్నారు. జక్కణాచారి ఒక చారిత్రక వ్యక్తి. అనేక రాజ కుటుంబాల పాలన ఫలితంగా కర్ణాటక శిల్పకళా వారసత్వం ప్రపంచ ప్రసిద్ధి చెందిందన్నారు. రాష్ట్రంలో హొయ్సళేశ్వర్, బేలూరు చెన్నకేశవాలయాలు, విజయనగర సామ్రాజ్య హంపీ తదితర చారిత్రక ప్రదేశాలు ప్రపంచ ప్రఖ్యాతి పొందాయన్నారు. కరునాడ శిల్ప వైభవాన్ని తిలకించేందుకు ప్రపంచ వ్యాప్తంగా పర్యాటకులు వస్తున్నారని తెలిపారు. తహసీల్దార్ విశ్వజిత్ మెహతా, కన్నడ సంస్కృతి శాఖ సహాయ సంచాలకులు సిద్దలింగేష్ రంగన్నవర, జిల్లా కమిషనర్ కార్యాలయం తహసీల్దార్ షణ్ముఖ్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

నిరాడంబరంగా కొత్త వేడుక



పేద పిల్లల మధ్య కొత్త సంవత్సర వేడుకల్లో మహిళా పోలీస్ కానిస్టేబుల్ కల్పనా నాయక్

రాయచూరు రూరల్: చెత్తకుప్పల వద్ద ప్లాస్టిక్ బాటిళ్లను ఏరుకొనే వారి పిల్లల మధ్య జిల్లా జైలులో విధులు నిర్వహిస్తున్న పోలీస్ మహిళా కానిస్టేబుల్ కల్పనా నాయక్ నూతన సంవత్సర వేడుకలను జరిపారు. సోమవారం రాత్రి అల్లమ ప్రభు కాలనీలో పిల్లల మధ్య కేక్ కట్ చేసి వారికి తినిపించారు. ఆనందంగా కేరింతలు, తుళ్లింతలతో ఆడుతూ పాడుతూ చేసుకొనే నూతన సంవత్సర వేడుకల సంబరాలకు స్వస్తి పలికి పేద పిల్లల మధ్య జరుపుకోవడం విశేషం.

జక్కణ్ణ సర్కిల్‌గా పేరు పెట్టండి



జక్కణాచారి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన దృశ్యం

కంప్లి: పట్టణంలోని సర్కిల్‌కు అమరశిల్పి జక్కణ్ణ కూడలిగా నామకరణం చేయాలని డీ.హిరేహాళ్ విశ్వకర్మ జగద్గురువు కాళహస్తేంద్ర స్వామి ఒత్తిడి చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అమరశిల్పి జక్కణాచారి సంస్మరణ దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ జక్కణాచారి చెక్కిన కళను గుర్తించిన ప్రభుత్వం ఆయన పేరిట ప్రభుత్వ పరంగా దినోత్సవం నిర్వహించడం గర్వకారణం అన్నారు. అనంతరం తహసీల్దార్ శివరాజ్ మాట్లాడుతూ ఇతిహాస వాస్తుశిల్పి పరంపరకు శిల్పాల కానుక అపారం, అలాంటి అద్భుత కళను తన చేతిలో మలచి అమర శిల్పి జక్కణాచారిగా ప్రజల హృదయాల్లో నిలిచి పోయారని, వారి కళ నేటికీ అజరామరం అని కొనియాడారు.

సిక్కిం భక్తుల పర్తియాత్ర



సంగీత కచేరి నిర్వహిస్తున్న సిక్కిం సత్యసాయి భక్తులు

ప్రశాంతి నిలయం: దేశంలో మారుమూలన ఉండే ఈశాన్య రాష్ట్రం సిక్కిం నుంచి పర్తిసాయి సన్నిధికి భక్తులు తరలివచ్చారు. పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన సిక్కిం సత్యసాయి భక్తులు తమ సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ నిర్వహించిన భక్తిరస కార్యక్రమాలు భక్తులను మైమరపించాయి. మంగళవారం సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత కోసెలీ నృత్య నాటికను నిర్వహించారు.



వినాయకున్ని స్మరిస్తూ ,సత్యసాయి బోధనలను చాటుతూ భక్తిగీతాలు ఆలపిస్తూ నిర్వహించిన నృత్య ప్రదర్శనతో భక్తులు మంత్ర ముగ్ధులయ్యారు.



కనువిందుగా నృత్య ప్రదర్శనలు

కెబ్బహుండి గ్రామంలో సంబరాలు

మైసూరు: అయోధ్య రామ మందిరంలో భవ్య శ్రీరాముడి విగ్రహానికి తుది రూపు ఇచ్చిన శిల్పి అరుణ్ యోగిరాజు స్వగ్రామం మైసూరు జిల్లా టీ నరసిపుర తాలూకా కెబ్బహుండి గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. గ్రామంలో స్వీట్లు పంపిణీ చేశారు. ఆరు నెలల పాటు అరుణ్ అయోధ్యలో బాల రాముడి విగ్రహాన్ని చెక్కారు. ఈ సందర్భంగా స్థానికులు ఆయన కుటుంబ సభ్యులను సన్మానించారు.

డ్రగ్స్ పెడ్లర్ అరెస్ట్



పోలీసులకు పట్టుబడిన డ్రగ్స్ పెడ్లర్

బనశంకరి: డ్రగ్స్ విక్రయాలకు పాల్పడుతున్న పెడ్లర్‌ను సీసీబీ పోలీసులు అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి రూ.8.40 లక్షల విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నామని నగర పోలీస్ కమిషనర్ దయానంద్ తెలిపారు. మంగళవారం నగరంలో విలేకరులతో కమిషనర్ వివరాలు వెల్లడించారు. హలసూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో అందిన సమాచారం ఆధారంగా సీసీబీ పోలీసులు భరత్ అనే డ్రగ్స్ పెడ్లర్‌ను అరెస్ట్ చేసి, అతడి వద్ద నుంచి 1.54 కిలోల గంజాయి, 25 ఎండీఎంఏ క్రిస్టల్‌తో పాటు నిషేధిత మాదకద్రవ్యాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

రాష్ట్రస్థాయికి ఎంపిక

విజయపుర (బెంగళూరు గ్రామీణ): విజయపుర పట్టణంలోని ప్రభుత్వ పీయూ కళాశాలలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ప్రతిభా కారంజీ పోటీలలో అనేక విభాగాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను జిల్లా జాయింట్ డైరెక్టర్ కృష్ణమూర్తి అభినందించారు.

బైక్ అదుపుతప్పి యువకుడి మృతి

మండ్య: బైక్ అదుపుతప్పి కట్టపై నుంచి పడిపోవడంతో ఓ యువకుడు మృతి చెందిన ఘటన మండ్య తాలూకా హొస బూదనూరు గ్రామం సమీపంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. మృతుడిని యరహళ్లి గ్రామానికి చెందిన దిలీప్ కుమార్ (27)గా గుర్తించారు. డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్న దిలీప్ విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వెళ్లే క్రమంలో కట్టపై నుంచి వస్తుండగా వాహనం అదుపుతప్పడంతో కట్ట కింద పడి తీవ్ర గాయాలతో మృతి చెందాడు. మంగళవారం అటుగా వెళ్తున్న వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చేనేతలను ప్రోత్సహించాలి

బళ్లారిటౌన్: చేనేతకారులు తయారు చేసిన వస్త్రాలను కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించాలని జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జెడ్పీ సీఈఓ రాహుల్ సంకనూరు పేర్కొన్నారు. మంగళవారం గాంధీభవన్ ఆవరణలో జవళి శాఖ అభివృద్ధి నిగమ, జిల్లా పంచాయతీ, కావేరి హ్యాండ్‌లూమ్స్ తదితర శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి చేనేత మేళా వస్త్రసిరిని ప్రారంభించి మాట్లాడారు. నేటి ఆధునిక పరిజ్ఞాన యుగంలో చేనేత వస్తువులకు ఆదరణ పెంచి చేనేతకారులను ఆదుకొనే దిశలో ప్రభుత్వం పలు పథకాలను ప్రవేశ పెడుతోందని గుర్తు చేశారు. దాదాపు 60 చేనేత సంఘాలు ఈ ప్రదర్శనలో పాల్గొని తాము తయారు చేసిన వస్త్రాలను 20 శాతం ప్రభుత్వ ప్రోత్సాహ రాయితీతో అమ్మకాలు చేపట్టారు. ఈ నెల 15 వరకు ప్రదర్శన ఉంటుందని జవళి శాఖ జేడీ వీరేష్ దవలే తెలిపారు. కార్యక్రమంలో కావేరి హ్యాండ్‌లూమ్స్ అధ్యక్షులు బీజీ గణేష్, మాజీ అధ్యక్షులు విరుపాక్షప్ప, ఉపమేయర్ జానకి, చేనేత వర్గ నేతలు బ్రహ్మయ్య, దేవానంద, కార్పొరేటర్ విక్కీ, అధికారులు మారిముత్తు, లింగరాజు, విఠల్ పాల్గొన్నారు.

వేతన బకాయిల కోసం ధర్నా



ఆందోళనలో పాల్గొన్న జెస్కాం ఉద్యోగులు, సిబ్బంది

రాయచూరు రూరల్: జిల్లాలోని మాన్వి జెస్కాం విభాగంలో విధులు నిర్వహిస్తున్న జెస్కాం సిబ్బంది, ఉద్యోగులు బకాయి వేతనాలు చెల్లించాలని కేపీటీసీఎల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గురురాజ్ డిమాండ్ చేశారు. మంగళవారం మాన్వి జెస్కాం కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టి మాట్లాడారు. మాన్వి తాలూకాలో 8 విభాగాల్లో విద్యుత్ బిల్లులు వసూలు చేయలేదనే కారణంతో 90 మంది సిబ్బంది, ఉద్యోగుల వేతనాలను పెండింగ్‌లో పెట్టడం తగదన్నారు. ఈ విషయంలో రాయచూరు జెస్కాం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆందోళనకారుల వద్దకు వచ్చి సమస్యను పరిష్కరించాలని కోరారు.

లారీ, బైక్ ఢీ- ఒకరు మృతి

- మినీ బస్సు బోల్తా.. 10 మందికి గాయాలు
- విద్యార్థులకు తృటిలో తప్పిన పెనుప్రమాదం



మృతి చెందిన లైన్‌మెన్



బోల్తా పడిన లారీ



బోల్తా పడిన మినీ బస్సు

సాక్షి బళ్లారి: చిత్రదుర్గ జిల్లాలో మంగళవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి చెందగా, 10 మంది విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. తృటిలో విద్యార్థులకు పెనుప్రమాదం తప్పింది. చిత్రదుర్గ జిల్లా హొసదుర్గ తాలూకా మల్లప్పనహళ్లి సమీపంలో విద్యార్థులు వెళ్తున్న మినీ బస్సు డ్రైవర్ అదుపు తప్పి బోల్తా పడటంతో విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. అదృష్టవశాత్తు విద్యార్థులకు ఎలాంటి ప్రాణహాని జరగకపోవడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకొన్నారు. ఈఘటనపై హొసదుర్గ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా జిల్లాలో మరో రోడ్డు ప్రమాదంలో బైక్, లారీ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్రంగా గాయాలయ్యాయి. లైన్‌మెన్‌గా పని చేస్తున్న సిద్దాపుర గ్రామానికి చెందిన రంగస్వామి(40) అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. ఈఘటనపై చెళ్లకెరె పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



షాపులకు బోర్డులు కన్నడలోనే ఉండాలని మంగళవారం బెంగళూరు ఫ్రీడంపార్కులో కన్నడ సంఘాల ధర్నా



బెంగళూరు గాంధీబజార్‌లో వీధి వ్యాపారుల కోసం షెల్టర్ల నిర్మాణ పనులు త్వరగా కావడం లేదని స్థానికులు వాపోయారు

కోలారు వార్తలు...

6 నుంచి మాధవ తీర్థుల మహా సమారాధన

కోలారు: హంసవాహన పరమాత్మ పరంపర జగద్గురు శ్రీమన్మధ్వాచార్య మూల మహా సంస్థాన తాలూకాలోని తంబిహళ్లి శ్రీ మన్మథతీర్థ శ్రీమఠంలో శ్రీశ్రీ 108 శ్రీ ప్రసన్న శూర మాధవతీర్థ మహా సమారాధన మహోత్సవాలను ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. 6న పూర్వారాధన, 7న ఏకాదశి, 8న ద్వాదశి, 9న త్రయోదశి ఉత్తరారాధన కార్యక్రమాన్ని గురువుల బృందావనంలో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రీ మఠం భక్తులు ఈ పవిత్ర ఉత్సవంలో పాల్గొని భగవంతుడి కృపకు పాత్రులు కావాలని కోరారు.

కరవే నేత విడుదలకు వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

శ్రీనివాసపురం: ధర్నా చేస్తుండగా అరెస్ట్ చేసిన కరవే రాష్ట్ర అధ్యక్షుడు నారాయణగౌడ, కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కరవే కార్యకర్తలు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు మేడిహాళ రాఘవేంద్ర మాట్లాడుతూ కన్నడ భాష రక్షణ కోసం పోరాటాలు సాగిస్తున్న కరవే రాష్ట్ర అధ్యక్షుడు నారాయణగౌడను అరెస్టు చేయడం సరికాదన్నారు. అనంతరం తహసీల్దార్ సుధీంద్రకు వినతిపత్రం సమర్పించారు. ధర్నాలో కస్తూరి కర్ణాటక జనపర వేదిక యువ రాష్ట్ర అధ్యక్షుడు టి.సుబ్రమణి, ప్రధాన కార్యదర్శి సునీల్‌కుమార్, కాశీ విశ్వనాథ్, చిరంజీవి పాల్గొన్నారు.

రిటైర్డు జవాన్‌కు సన్మానం

కేజీఎఫ్: భారత సైన్యంలో 28 ఏళ్ల పాటు సుదీర్ఘ సేవలు అందించిన అనంతరం రిటైరై వచ్చిన సుబ్రమణి అనే మాజీ జవాన్‌కు ఘన స్వాగతం లభించింది. కేజీఎఫ్ రైల్వేస్టేషన్‌లోకి రాగానే కుటుంబసభ్యులు, నగరసభ సభ్యులు కరుణాకరన్ తదితరులు ఆయనకు మైసూరు పేటా తొడిగి స్వాగతం పలికారు. సైన్యంలో ప్రముఖంగా నేర్పించేది క్రమశిక్షణ అని, సైన్యంలో విధులు నిర్వహించినందుకు ఎంతో సంతోషంగా ఉందని రిటైర్డ్ జవాన్ సుబ్రమణి అన్నారు.

యువనిధి లబ్ధి పొందండి

కోలారు: జిల్లాలోని యువకులు రాష్ట్ర ప్రభుత్వ ప్రకటించిన ప్రతిష్ఠాత్మక యువనిధి పథకాన్ని సక్రమంగా వినియోగించుకోవాలని జిల్లాధికారి అక్రంపాషా తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయ సభాంగణంలో నిర్వహించిన యువనిధి పథకం లబ్ధిదారుల రిజిస్టర్ కార్యక్రమంపై జిల్లాలోని అన్ని కళాశాలల ప్రిన్సిపాళ్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను సక్రమంగా అమలు చేయడం జిల్లాలో మొదటి నుంచి వస్తున్న సాంప్రదాయం కావడం వల్ల యువనిధి పథకాన్ని కూడా సక్రమంగా అమలులోకి తేవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. జిల్లాలో ప్రభుత్వ గ్యారంటీల అమలు చక్కగా ఉందని ఇప్పటికే ముఖ్యమంత్రి హర్షం వెలిబుచ్చారన్నారు. యువనిధి పథకాన్ని కూడా అదేవిధంగా సక్రమంగా లబ్ధిదారులకు అందించాల్సి ఉందన్నారు. ఇందుకు కళాశాలల ప్రిన్సిపాళ్ల సహకారం అవసరం ఉందన్నారు. కళాశాల స్థాయిలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించడానికి సదస్సులను ఏర్పాటు చేయాలన్నారు. 2022–23వ విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణులైన డిగ్రీ, డిప్లొమా విద్యార్థులు అనంతరం కనీసం 6 నెలల వరకు ప్రైవేటు ఉద్యోగం పొందని వారి వివరాలను అందించాలన్నారు. అర్హులైన లబ్ధిదారులు సేవా సింధు పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమావేశంలో కౌశల్యాభివృద్ధి అధికారి శ్రీనివాస్, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

కల్లడ్క ప్రభాకర్ వ్యాఖ్యలపై ధర్నా



గాంధీవనం వద్ద ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

కోలారు: ముస్లిం మహిళలపై అవ్యాచ్య శబ్దాలతో నిందించిన కల్లడ్క ప్రభాకర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఎస్‌డీపీఐ భాగస్వామ్య సంస్థ విమెన్ ఇండియా మూవ్‌మెంట్ సంఘం ఆధ్వర్యంలో ముస్లిం మహిళలు నగరంలోని గాంధీవనం వద్ద ధర్నా నిర్వహించారు. సంఘం అధ్యక్షురాలు జుబేరా ఫాతిమా మాట్లాడుతూ ముస్లిం మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆర్ఎస్ఎస్ నాయకుడు కల్లడ్క ప్రభాకర్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. భీమా సేన రాష్ట్ర అధ్యక్షుడు పండిత్ మునివెంకటప్ప, ఎస్‌డీపీఐ జిల్లా అధ్యక్షుడు శావూస్ జమన్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు యాసిన్ పాషా, నగరసభ సభ్యుడు ఖాజా మైనుద్దీన్, సల్మా తదితరులు పాల్గొన్నారు.

దొడ్డ శివారలో వరుస చోరీలు



చోరీకి గురైన దుకాణాలు ఇవే

మాలూరు: మాలూరు– కోలారు మెయిన్ రోడ్డులోని దొడ్డశివార గేట్ వద్ద ఉన్న దుకాణాల్లో వరుస దొంగతనాలు జరిగాయి. గుర్తు తెలియని దుండగులు దుకాణాల తలుపులను పగులగొట్టి లోపలకు చొరబడి సుమారు రూ.15 వేల నగదు, పలు వస్తువులను దొంగిలించుకెళ్లిన ఘటన సోమవారం రాత్రి జరిగింది. దొడ్డశివార గేట్ వద్ద ఉన్న ఎంఎస్ఆర్ హోం ప్రొడక్ట్స్, భజరంగ మెడికల్స్, వెంకటేశ్వర బేకరీల్లో దొంగతనాలు జరిగాయి. మరో 3 దుకాణాల తలుపులు తెరవాలని చూసినా వారికి సాధ్యం కాలేదు. ముగ్గురు దొంగలు దుకాణాల్లోకి చొరబడిన దృశ్యాలు సీసీ టీవీల్లో నమోదయ్యాయి. విషయం తెలిసిన మాలూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు.

నియామకాల్లో అక్రమాలను అరికట్టరూ..

రాయచూరు రూరల్: ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీలో జరుగుతున్న అక్రమాలను అరికట్టాలని ఏఐడీఎస్ఓ కార్యకర్తలు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద చేపట్టిన ఆందోళనలో సంచాలకుడు చెన్నబసవ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలోని 12 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. ఎన్ఆర్ఈజీ పనులను 200 రోజులకు పెంచాలని, రూ.600 కూలీ ధరలను ఇవ్వాలన్నారు. ఒపెక్, రిమ్స్, పీహెచ్‌సీల్లో కాంట్రాక్ట్ పద్ధతిపై నియామకాల్లో అక్రమాలపై విచారణ జరపాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

క్లుప్తంగా

కుట్టు మిషన్ల పంపిణీ



కృష్ణరాజపురం: నగరంలోని మహాదేవపుర పరిధి బీబీఎంపీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో టైలరింగ్‌లో శిక్షణ పొందిన మహిళలకు స్థానిక ఎమ్మెల్యే మంజుల లింబావలి మంగళవారం కుట్టుమిషన్లను అందజేశారు. కార్యక్రమంలో బీబీఎంపీ కమిషనర్ దాక్షాయణి, అధికారులు పాల్గొన్నారు.

అడవి ఏనుగు మృతి

మైసూరు: అడవి ఏనుగు ఒకటి చెరువులో నీరు తాగడానికి వచ్చి మృతి చెందిన సంఘటన జిల్లాలోని బీఆర్‌టి పులి అభయారణ్యంలో చోటుచేసుకుంది. వయోభారంతో ఉన్న మగ ఏనుగు నీటి మడుగు వద్ద పడిపోయింది. అటవీ అధికారి దీప కాంట్రాక్టర్, పశు వైద్యాధికారి పరిశీలించి ఏనుగు కళేబరాన్ని అక్కడి నుంచి తరలించారు.

అదుపుతప్పిన లారీ



రోడ్డుపక్కకు దూసుకుపోయిన లారీ

మడకశిర రూరల్: మండల పరిధిలోని జీవీ పాళ్యం బస్టాండ్ సమీపంలో మంగళవారం తెల్లవారుజాము సమయంలో మడకశిర వైపు నుంచి మంగళూరుకు వెళుతున్న తారు లారీ అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. ఓ ఇంటి మీదకు వెళ్లిపోయేదే, అయితే అక్కడే గుంత ఉండడంతో నిలిచిపోయి పెద్ద ప్రమాదం తప్పింది. ఈ సంఘటనలో ఎవరికీ ఎలాంటి అపాయం కలగలేదు.

నేడు ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు

కృష్ణరాజపురం: బీబీఎంపీ పరిధిలో వినూత్న కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు కార్యక్రమాన్ని బుధవారం నగరంలోని కృష్ణరాజపురంలో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రారంభించనున్నారు. కార్యక్రమానికి బీబీఎంపీ అధికారులతో పాటు రెవెన్యూ, బీఎంటీసీ, బీడీఏ, ఇతర శాఖ అధికారులు హాజరుకానున్నారు. బెంగళూరు కార్పొరేషన్ పరిధిలోని ఫిర్యాదుల స్వీకరణ, సమస్యల పరిష్కరణకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

అదుపుతప్పిన బైక్, పలువురికి గాయాలు



ప్రమాద దృశ్యం

శివమొగ్గ: బైక్ అదుపుతప్పి పాఠశాల విద్యార్థిని సహా ముగ్గురు గాయపడిన ఘటన శివమొగ్గ సమీపంలోని గాడికొప్ప లేఔట్‌లో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. క్షతగాత్రులను మెగ్గాన్ ఆస్పత్రికి తరలించారు. వివరాలు... గాడికొప్ప ప్రభుత్వ పాఠశాల సమీపంలో ఓ యువకుడు బైక్‌పై వాయువేగంగా వస్తూ అదుపు తప్పడంతో కళాశాలకు వెళ్తున్న సుస్మిత (12), అదే లౌఔట్‌కు చెందిన శివరాజ్ (53)ను ఢీకొన్నాడు. బైక్ కిందపడటంతో అతను కూడా గాయపడ్డాడు. స్థానిక పోలీసులు అక్కడికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

హత్య చేసి బావిలో పడేశారు

దొడ్డబళ్లాపురం: వ్యక్తిని దారుణంగా హత్య చేసిన దుండగులు శవాన్ని బావిలో విసిరేసిన సంఘటన బెళగావిలోని తానాజి గల్లీలో చోటుచేసుకుంది. చిక్కోడి తాలూకా కరోశి గ్రామానికి చెందిన హనుమంత మద్యాలి (37) హత్యకు గురైన వ్యక్తి. హతుడు హనుమంత తానాజి గల్లీలో అద్దెకు ఉంటున్నాడు. హనుమంతును దారుణంగా హత్య చేసిన దుండగులు శవాన్ని సమీపంలోని బావిలో పడేశారు. హత్యకు గల కారణాలు తెలిసిరాలేదు. మార్కెట్ పోలీస్‌స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కన్నడ భాషలోనే బోర్డులు పెట్టాలి



మాట్లాడుతున్న కమిషనర్

చింతామణి: ప్రభుత్వ ఆదేశాల మేరకు చింతామణి తాలూకాలో దుకాణాల ఎదుట కన్నడ భాషలోనే బోర్డులు పెట్టాలని నగరసభ కమిషనర్ చలపతి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ...ప్రభుత్వం ఇతర భాషలకు వ్యతిరేకం కాదని, ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

చిరుధాన్య మేళా.. రుచులు భళా





మేళాలో వంటకాలను రుచి చూస్తున్న సందర్శకులు, చిరుధాన్యాలతో తయారు చేసిన తీపి పదార్థాలను కొనుగోలు చేస్తున్న దృశ్యం



రాగి ముద్దలను ఆరగించే పోటీలు

- మండ్యలో సిరి ధాన్య మేళా

మండ్య: ఇప్పుడు చిరు ధాన్యాల వంటకాల గురించి ఆసక్తి పెరుగుతోంది, దీంతో విస్తృతంగా సిరి ధాన్య మేళాలు జరుగుతున్నాయి. మంగళవారం మండ్య నగరంలోని అంబేడ్కర్ భవనంలో సిరిధాన్య మేళా, విక్రయాలు ఆరంభమయ్యాయి. ఈ మేళాలో సుమారు 50 స్టాల్స్ ఏర్పాటు కాగా, వాటిలో 14 స్టాళ్లలో చిరుధాన్యాలతో చేసిన వైవిధ్య ఆహార పదార్థాలను విక్రయించారు. చిరుధాన్యాల దోసెలు, వడలు, బెల్లం రవ్వ ఉండలు, కజ్జాయలు, ఇడ్లీ, బిసిబెళెబాత్, దోసె, పకోడా, పొంగల్, సేమియా, గులాబ్ జామూన్ వంటి నోరూరించే వంటకాలను వడ్డించారు. మేళాకు వచ్చిన వారు చిరుధాన్యాలను కొనడంతో పాటు ఈ వంటకాలను కొని ఆరగించారు. చిరుధాన్యాల వాడకం వలన బీపీ, సుగర్, ఊబకాయం వంటి సమస్యలు దరిచేరవని నిపుణులు వివరించారు.

రాగి ముద్ద– కోడి పులుసు స్వాహా

మండ్య జిల్లా యంత్రాంగం, వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన సిరిధాన్యాల మేళాలో రాగి ముద్దలను ఆరగించే పోటీలు ఆకట్టుకున్నాయి. శ్రీరంగ పట్టణం తాలూకాలోని అరికెరె గ్రామానికి చెందిన ఈరేగౌడ అనే వృద్ధుడు 2.7 కేజీల బరువైన 10 రాగి ముద్దలను స్వాహా చేసి మొదటి బహుమానం రూ. 3 వేలు అందుకున్నాడు.

పోటీదారులకు రాగి ముద్ద – నాటుకోడి పులుసు వడ్డించారు. 20 నిమిషాల్లో ఎవరు ఎక్కువగా భుజిస్తే వారే విజేత. మొదట కోడి పులుసు, 2 ముద్దలను వడ్డించారు. ముద్దలు ఖాళీ అయ్యేకొద్దీ మళ్లీ మళ్లీ వడ్డించారు. ఇలా సుమారు 10 మందికిపైగా స్త్రీ, పురుషులు పోటీలో పాల్గొని ఫ్రీ గా ముద్దలను లాగించారు.

ఇదే గ్రామానికి చెందిన దిలీప్ ఆరు ముద్దలు (1.6 కేజీలు) తిని రెండవ బహుమానం రూ.2 వేలు అందుకున్నాడు. టిఎం హోసూరుకు చెందిన రవీంద్ర ఆరు ముద్దలు (1.5 కేజీలు)తో మూడవ స్థానంతో రూ. వెయ్యి స్వీకరించాడు. వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ అశోక్ బహుమతులను అందజేశారు.

మద్యం మత్తులో కారు నడిపి.. ప్రమాదం

- ఇద్దరికి తీవ్ర గాయాలు



నుజ్జయిన కారు

గౌరిబిదనూరు: తాలూకా సరిహద్దులోని హిందూపురం చౌళూరు గ్రామంలో లభించే ఈతకల్లు బెంగుళూరు నగరంలో ప్రసిద్ధి. ఇది తాగడానికి చాలా మంది బెంగుళూరు వాసులు చౌళూరుకు వస్తూ వుంటారు. సోమవారం కొత్త సంవత్సరం పురస్కరించుకుని కారులో వచ్చిన ఇద్దరు స్నేహితులు తిరుగు ప్రయాణంలో ఉండగా మద్యం మత్తులో ఎదురుగా వచ్చి క్యాంటర్‌ను ఢీకొన్నారు. దీంతో కారులో ఉన్న యలహంకకు చెందిన విశ్వ (35), దొడ్డబళ్లాపురానికి చెందిన పునీత్ (38) తీవ్రంగా గాయపడ్డారు. వీరికి ప్రథమ చికిత్స చేసి బెంగుళూరు తరలించారు. తరచూ హిందూపురం వైపు రోడ్డు ప్రమాదాలు జరగడానికి చౌళూరు ఈత కల్లే కారణమని స్థానికులు చెబుతున్నారు. కారులో పదికి పైగా సారా సీసాలు లభించాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

స్కూటీని ఢీకొన్న కారు

- 50 మీటర్ల మేర ఎగిరిపడ్డ యువతి

దొడ్డబళ్లాపురం: స్కూటీని కారు ఢీకొన్న ప్రమాదంలో స్కూటర్ నడుపుతున్న యువతి కారు ఢీకొన్న తీవ్రతకు 50 మీటర్ల మేర ఎగిరిపడ్డ సంఘటన బెళగావిలోని మజగావి వద్ద చోటుచేసుకుంది. ప్రమాదంలో బెళగావి బ్రహ్మనగర్ నివాసి దివ్య పాటిల్ తీవ్రంగా గాయపడింది. దివ్య పాటిల్ తన స్కూటీపై వెళ్తుండగా వెనుక నుండి వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో ఆమె సుమారు 50 మీటర్ల దూరం ఎగిరిపడింది. ప్రమాదంలో దివ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్కూటర్‌ను ఢీకొన్న కారు అదేవేగంతో వెళ్లి ముందు వస్తున్న మరో కారును కూడా ఢీకొంది. తీవ్రంగా గాయపడ్డ దివ్య పాటిల్‌ను ఆస్పత్రికి తరలించారు. బెళగావి దక్షిణ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

కన్నడ యోధులను విడుదల చేయాలి

బనశంకరి: కరవే రాష్ట్రాధ్యక్షుడు టీఏ.నారాయణగౌడతో పాటు 29 మంది కన్నడపర కార్యకర్తలను అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తూ కరవే కార్యకర్తలు, డాక్టర్ రాజ్‌కుమార్ విగ్రహ ప్రతిష్ఠాన ట్రస్ట్ సభ్యులు ధర్నా చేపట్టారు. మంగళవారం ఫ్రీడం పార్కులో ధర్నాకు దిగిన కన్నడ కార్యకర్తలు కన్నడ పోరాటదారులను ఆరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. తక్షణం వీరిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

పాతకక్షలతో ఇంటిపై రాళ్ల దాడి

- వాహనాలు ధ్వంసం

దొడ్డబళ్లాపురం: పాతకక్షల నేపథ్యంలో ఒక ఇంటిపై దాడి చేసిన సుమారు 20 మంది యువకుల గుంపు ఇంట్లో వారిని కత్తులతో బెదిరించి దోపిడీకి పాల్పడి విధ్వంసం సృష్టించిన సంఘటన బెళగావి తాలూకా నావగె గ్రామంలో చోటుచేసుకుంది.

గ్రామం నివాసి మారుతి హూరకడ్లి అనే వ్యక్తి ఇంటిపై దాడి జరిగింది. సోమవారం రాత్రి మొదట ఇంటి ముందు నిలిపి ఉన్న కారు, బైక్‌లపై రాళ్ల దాడి చేసారు. తరువాత ఇంట్లో జొరబడి కుటుంబ సభ్యులను కత్తులతో బెదిరించి రూ.2 లక్షల నగదు దోచుకున్నారు. మారుతి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన పోలీసులు అక్కడకి చేరుకోవడంతో దుండగులు పరారయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

నావగె గ్రామాన్ని సందర్శించిన మంత్రి

బెళగావి తాలూకా నావగె గ్రామంలో మారుతి అనే వ్యక్తి ఇంటిపై 20 మంది యువకులు గుంపు రాళ్లతో దాడిచేసి, వాహనాలను ధ్వంసం చేసి దోపిడీకి పాల్పడ్డ సఘటనకు సంబంధించి వివరాలు తెలుసుకునేందుకు మంత్రి లక్ష్మి హెబ్బాళ్కర్ మంగళవారం ఉదయం గ్రామాన్ని సందర్శించారు. బాధిత కుటుంబాన్ని కలిసి వివరాలు తెలుసుకున్నారు. పోలీసులతో మాట్లాడి ఘటనకు గల కారణాలను ఆరా తీశారు. పాఠశాల, కళాశాలలకు వెళ్లే పిల్లల చేతిలోకి రాళ్లు, ఆయుధాలు ఉండటం మంచి పరిణామం కాదన్నారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని చట్టానికి లోబడి ఏం చేయాలో పోలీసులకు సూచించానన్నారు. రెండు గ్రామాల పెద్దలను పిలిపించి ఈ కక్షలు కొనసాగకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులకు సూచించారు. కొత్త సంవత్సరం నేపథ్యంలో బాదరవాడి, నావగె గ్రామాల మధ్య ఉన్న పాతకక్షల నేపథ్యంలో ఈ దాడులు జరిగినట్టు గుర్తించామన్నారు.



దాడిలో ధ్వంసమైన కారు

నీటికుంటలో పడి బాలుడు మృతి



బాలుడు జస్విత్

గుడిబండ: మడకశిర నియోజకవర్గం గుడిబండ మండల పరిధిలోని ముతుకూరు గ్రామంలో మంగళవారం మూడేళ్ళ బాలుడు జస్విత్ ఆటలాడుతూ స్థానిక చెరువులో ఉన్న నీటి కుంటలో పడి మృతి చెందాడు. బాలుని తల్లిదండ్రులు మల్లికార్జునచారి, చంద్రకళ, ఈ దంపతులకు జస్విత్ అనే కొడుకు, కుమార్తె సంతానం. తల్లిదండ్రులు జీవనోపాధికోసం కర్ణాటకలో వున్న దొడ్డబళ్లాపురంలో కూలి పని చేస్తున్నారు. జస్విత్ అవ్వతాతల జతలోనే ఉండేవాడు. ఆటలాడుతూ ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడ్డాడు. అటు వైపుగా వెళ్తున్న కొందరు గమనించి బాలున్ని బయటకు తీసి మడకశిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలిసి తల్లిదండ్రులు హుటాహుటిన చేరుకున్నారు, ఒక్కగానొక్క కొడుకు లేకపోవడం చూసి కన్నీరుమున్నీరయ్యారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



జాగృతి కార్యక్రమంలో కళాబృందం

చింతామణి: ప్రస్తుత ఆధునిక యుగంలో తీవ్ర ఒత్తిళ్ల మధ్య ప్రజలు జీవిస్తున్నారని, ఇది ప్రమాదకరమని తాలూకా ఆరోగ్య అధికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం ఆరోగ్యంపై జన జాగృతి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని, ఒత్తిళ్లను తగ్గించుకోవాలన్నారు. చిన్నపాటి వ్యాయామాలతో పాటు మంచి ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా తాలూకాకు చెందిన సిద్దార్థ కళాబృందం నిర్వహించిన జాగృతి కార్యక్రమం ఆకట్టుకుంది.

క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తుండగా ఆటో పల్టీ

- నలుగురికి తీవ్ర గాయాలు

మైసూరు: మైసూరు నగరం సమీపంలోని బైపాస్ రోడ్డులో జరిగిన ప్రమాదంలో గాయపడిన వారిని ఆటోలో ఆస్పత్రికి తరలిస్తుండగా ఆటో పల్టీ కొట్టడంతో ఆటోలోని డ్రైవర్‌తో పాటు నలుగురు తీవ్రంగా గాయపడిన ఘటన జిల్లాలోని హుణసూరు తాలూకా కేఆర్ నగర బైపాస్ రోడ్డులో చోటుచేసుకుంది. ఆటో డ్రైవర్ నస్రుల్లా, గంగాధర్, అభిషేక్, మనోజ్ గాయపడ్డారు. వివరాలు... హుణసూరు సమీపంలోని జాతీయ రహదారి 275లో అయప్ప స్వామి కొండ వద్ద తమిళనాడుకు చెందిన కారు పంక్చర్ అయ్యింది. దీంతో కారులోని వ్యక్తి కిందకు దిగి పరిశీలిస్తుండగా బైక్‌పై వచ్చిన ఓ వ్యక్తి అదుపుతప్పి కారును, అక్కడే ఉన్న వ్యక్తిని బలంగా ఢీకొన్నాడు. దీంతో గాయపడిన ఇద్దరిని ఆటోలో తరలిస్తుండగా ఆటో బోల్తా పడింది. ఆటో డ్రైవర్‌తో పాటు గాయపడిన వారికి సహాయంగా వచ్చిన వ్యక్తి సహా నలుగురు గాయపడ్డారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

తీరని బస్సుల సమస్య.. విద్యార్థుల ధర్నా

దొడ్డబళ్లాపురం: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణం పాఠశాల, కళాశాలల విద్యార్థులకు తలపోటుగా మారింది. బస్సులన్నీ నిండుకుండలా వస్తుండడంతో విద్యార్థులకు కనీసం నిల్చోవడానికి కూడా చోటు లభించడం లేదు. ఈ సమస్య రాష్ట్ర వ్యాప్తంగా ఉంది. బస్సు సమస్య పరిష్కరించాలని డిమాండు చేస్తూ బెళగావి జిల్లా రాయభాగ తాలూకా బస్తవాడలో విద్యార్థులు ధర్నా చేపట్టారు. అయితే ధర్నాలో పాల్గొన్న ఇద్దరు విద్యార్థినులు అస్వస్థతకు గురై కుప్పకూలిపోయారు. ప్రియ కాంబళె, ప్రియా హోళ్కర్ ఇద్దరూ ధర్నాలో నినాదాలు చేస్తూ హఠాత్తుగా స్పృహతప్పి పడిపోయారు. ఇద్దరినీ సహచర విద్యార్థులు ఆస్పత్రికి తరలించారు. సమయానికి బస్సులు రావడం లేదని, వచ్చినా బస్సులు నిలపడం లేదని, బస్సుల్లో కనీసం నిల్చోవడానికి సాధ్యం కావడం లేదని, వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు డిమాండు చేశారు.

నిందితుడి అరెస్ట్

యశవంతపుర: పెళ్లి చేసుకుంటానని నమ్మించి 17 ఏళ్ల యువతిపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడు మొహ్మద్ రజాక్‌ను దక్షిణ కన్నడ జిల్లా ఉళ్లాల పోలీసులు అరెస్ట్ చేశారు. చిక్కమగళూరు జిల్లా మూడిగెరెకి చెందిన యువతిని ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి మంగళూరు కుంపల గ్రామానికి తీసుకెళ్లి ఓ అద్దె ఇంటిలో ఉంచాడు. బాధిత యువతి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

ఆరుగురికి కటకటాలు:

బెంగళూరు గోవిందపుర పోలీసుస్టేషన్ పరిధిలోని వీరణ్ణపాళ్య వెనుక ఉన్న స్మశాన దారిలో దోపిడీలకు పథకం వేసిన ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి మూడు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు.

కర సేవకుల అరెస్ట్‌పై మాటల యుద్ధం

- అరెస్ట్‌ను సమర్థించిన సీఎం సిద్దరామయ్య
- విజయేంద్ర ఆగ్రహం
- నేడు బీజేపీ రాష్ట్ర వ్యాప్త ధర్నాలు



బనశంకరి: 31 ఏళ్ల క్రితం అయోధ్య రామ మందిరం కోసం నిర్వహించిన పోరాట సమయంలో కరసేవలో పాల్గొన్న ఇద్దరు హిందూ కార్యకర్తలు విషయంలో రాజకీయ చిచ్చు చెలరేగింది. రాష్ట్ర ప్రభుత్వం అరెస్ట్‌ను సమర్థిస్తుండగా బీజేపీ ఖండిస్తోంది. హిందూ కార్యకర్తలు అరెస్ట్ ప్రస్తుతం బీజేపీ–కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధానికి కారణమైంది. పాతకేసు అని అరెస్ట్ చేయకుండా మిన్నకుండిపోవాలా అని ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రశ్నించడం ద్వారా వివాదానికి అగ్గి రాజేశారు. ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన బీజేపీ బుధవారం హిందూ కార్యకర్తలు అరెస్ట్‌కు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా పోరాటం చేస్తామని తెలిపింది. రామ మందిరం ప్రారంభానికి కౌంట్‌డౌన్ సమయంలో ఇద్దరు కర సేవకుల అరెస్ట్ గొడవకు కారణమైంది.

రాజకీయం చేయడం సరికాదు: హోం మంత్రి పరమేశ్వర్

హోం మంత్రి పరమేశ్వర్ ప్రభుత్వ చర్యను సమర్థిస్తూ ఈ విషయంలో రాజకీయం చేయడం సరికాదని మతవిద్వేషం రంగు పులమద్దని తెలిపారు. అయితే బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు బీవై విజయేంద్ర, హిందూ కార్యకర్తలు సంబరాల సమయంలో అరెస్ట్ అవసరం ఏముంది, ప్రభుత్వ తీరు ఖండనీయమని ధ్వజమెత్తారు. రామ మందిరం కోసం నిర్వహించిన పోరాటంలో పాల్గొన్న రాజు, ధర్మదాస్ అనే ఇద్దరిని డిసెంబరు 10న అరెస్ట్ చేయగా శ్రీకాంత్ పూజారిని రెండు రోజుల క్రితం అరెస్ట్ చేశారు. పాతకేసులో మళ్లీ కర సేవకులను అరెస్ట్ చేయడం రాజకీయరంగు పులుముకుని బీజేపీ–కాంగ్రెస్ మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి.

ద్వేష రాజకీయాలు చేయలేదు : సీఎం సిద్దు

కర సేవకులు అరెస్ట్ విషయంలో ద్వేష రాజకీయాలు చేయలేదని ముఖ్యమంత్రి సిద్దరామయ్య స్పష్టం చేశారు. హుబ్లీ 30 ఏళ్ల పాతకేసుకు సంబంధించి కరసేవకులు అరెస్ట్ చేయడంపై కొప్పల విమానాశ్రయంలో సిద్దరామయ్య విలేకరులతో మాట్లాడారు. తప్పు చేసిన వారిని ఏమి చేయాలి వదిలిపెట్టాలా అని ప్రశ్నిస్తూ పాతకేసులు పరిశీలించాలని సూచించామని కానీ పోలీసుల చర్యను సమర్థించుకున్నారు. రామ మందిర ప్రారంభానికి కేవలం రామభక్తులకు ఆహ్వానించారని అని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆహ్వానం ఉన్న వారు వెళతారు లేనివారు వెళ్లరని తెలిపారు. కరువు పరిహారానికి సంబంధించి రైతులకు తాత్కాలికంగా రూ.2 వేలు అందించే ప్రక్రియ ప్రారంభమైందని అన్నారు.

నేడు బీజేపీ ధర్నాలు

హుబ్లీలో పాతకేసుకు సంబంధించి హిందూ కార్యకర్తలను అరెస్ట్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ బీజేపీ రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం ధర్నా చేస్తుందని బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు బీవై.విజయేంద్ర తెలిపారు. మంగళవారం విలేకరులతో విజయేంద్ర మాట్లాడుతూ... పాత కేసులో హుబ్లీ హిందూ కార్యకర్తలను అరెస్ట్ చేయడాన్ని బీజేపీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హిందూ వ్యతిరేక ప్రభుత్వమని పదేపదే గుర్తుచేస్తూ పనిచేస్తుందని ధ్వజమెత్తారు. దేశమంతా సంబరాల్లో ఉండగా రామభక్తులను అరెస్ట్ చేయడమంటే ఈ ప్రభుత్వానికి ఎంత ధైర్యమని ధ్వజమెత్తారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలకు ముఖ్యమంత్రి దిగారని మండిపడ్డారు.

ఈ ఘటన కేవలం కర్ణాటక కాదు దేశమే చూస్తుందని ప్రపంచంలో హిందూ కార్యకర్తలు సంతోషంలో ఉన్న సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఈపనిచేసిందని ఈ ఘటనను బీజేపీ కాకుండా పార్టీలకు అతీతంగా అందరూ ఖండిస్తున్నారని ఘటనకు హోం మంత్రి కారణమని విజయేంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం బెంగళూరులో ఫ్రీడంపార్కులో ధర్నా చేస్తామని తెలిపారు. సిద్దరామయ్య పేరులో రామపేరు ఉండటం నిజం కానీ, వారి ప్రవర్తనలో రాముడి గుణాలు కనిపించలేదన్నారు. సిద్దరామయ్య హిందూ వ్యతిరేక ధోరణి అనుసరిస్తున్నారని ధ్వజమెత్తారు.

హోసూరు వార్తలు..

కర్రసాము విజేతలకు సన్మానం



విద్యార్థులను సన్మానించిన దృశ్యం

హోసూరు: దక్షిణ భారతస్థాయిలో జరిగిన కర్రసాము పోటీల్లో హోసూరు విద్యార్థులు బంగారు పతకాలను అందుకొన్నారు. కర్ణాటకలో జరిగిన పోటీల్లో మొత్తం 200 మందికిపైగా పాల్గొన్నారు. అందులో హోసూరు నుంచి వెళ్లిన 20 మంది విద్యార్థులు మంచి ప్రతిభ చూపి స్వర్ణ పతకాలను సంపాదించారు. సోమవారం వీరిని డీఎస్పీ బాబు ప్రశాంత్ సన్మానించారు, కర్రసాము సంఘం నేతలు దురై రామలింగం, శరవణన్, ప్రేమ పాల్గొన్నారు.

వారిని మళ్లీ బడిబాట పట్టించండి



విద్యాశాఖ అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్

హోసూరు: బడి మానేసిన వారిని మళ్లీ బడిలో చేర్పించే కార్యక్రమం చేపట్టాలని కలెక్టర్ శరయు అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ...క్రిష్ణగిరి జిల్లా వ్యాప్తంగా సేకరించిన వివరాల మేరకు 14,842 మంది బడి మానేసినట్లు తేలిందని, వీరిలో ఇప్పటి వరకు 2313 మంది పిల్లలను బడిలో చేర్పించినట్లు, మిగతా వారిని కూడా వెంటనే పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో హోసూరు సబ్‌కలెక్టర్ ప్రియాంక, అధికారులు బాబు, మహేశ్వరి, మాదేవన్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కొళాయిల్ని తీసేయాలి

హోసూరు: వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో పట్టణంలోని 45 వార్డులలో తాగునీటి సమస్య పరిష్కారానికి ముందు జాగ్రత్త చర్యలపై సంబంధిత శాఖాధికార్లతో మేయర్ ఎస్.ఏ.సత్య మావేశమయ్యారు. కార్పొరేషన్ కార్యక్రమంలో జరిగిన సమావేశానికి కమిషనర్ స్నేహ నేతృత్వం వహించారు. మేయర్ మాట్లాడుతూ నిరుపయోగంగా ఉన్న బోరుబావుల్లో విద్యుత్ మోటార్లను అమర్చి నీటి సరఫరాని పరిశీలించాలని తెలిపారు. అన్ని వార్డుల్లో సాగుతున్న అక్రమ కొళాయి కనెక్షన్లను, మోటార్లను తొలగించాలని తెలిపారు.

ఆలయాల్లో విశేష పూజలు



విశేష అలంకరణతో చంద్రమౌళేశ్వరస్వామి



ప్రత్యంగిరాదేవి మూలవిరాట్

హోసూరు: నూతన సంవత్సరం సందర్భంగా రెండు రోజులుగా ప్రముఖ ఆలయాల్లో విశేష పూజలను నిర్వహించారు. సోమవారం వేకువ జాము నుంచి స్వామివారి దర్శనం కోసం భక్తులు క్యూకట్టారు. రాత్రికి భజనలు, భక్తిగీతాల కార్యక్రమాలను నిర్వహించారు. హోసూరు రామ్‌నగర్‌లో చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో మూలవిరాట్‌ను విశేషంగా అలంకరించి పూజలు జరిపించారు. మోర్నపల్లిలో అధర్వణ ప్రత్యంగిరా దేవి ఆలయంలో విశేష పూజలు జరిగింది.

పోలీసుల దురుసు వైఖరి





ప్రభుత్వ పాఠశాల ప్రధాన ద్వారాన్ని మూసివేసిన దృశ్యం

- పాఠశాల గేటు మూసి, గోడ నిర్మాణం
- దారి లేక విద్యార్థినుల అవస్థలు

కెలమంగలం: నియోజకవర్గ కేంద్రమైన తళిలో రక్షణ కల్పించవలసిన పోలీసులు పాఠశాల ప్రధాన ద్వారాన్ని మూసివేయడంతో ఇదేం అన్యాయమంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. వివరాలు.. తళిలో పోలీస్‌స్టేషన్, ప్రభుత్వ బాలికల పాఠశాల, గిరిజన విద్యార్థుల హాస్టల్, ప్రభుత్వ కళాశాల ఒకే చోట ఉన్నాయి. పాఠశాలలో 260 మంది విద్యార్థినులు, కళాశాలలో 350 మంది విద్యార్థులు, హాస్టల్లో 60 మంది విద్యార్థులున్నారు. పోలీస్‌స్టేషన్ ముందు భాగంలోనే పాఠశాల ప్రధాన ద్వారం ఉండడంతో పోలీసులు వ్యతిరేకిస్తున్నారు. ఇటీవల పాఠశాలకు సెలవులు రావడంతో అనుకూలంగా చేసుకొని పోలీసులు ప్రధాన ద్వారాన్ని మూసివేసి గోడ కట్టించారు.

తల్లిదండ్రుల నిరసన

మంగళవారం పాఠశాలకెళ్లిన విద్యార్థినులు లోనికెళ్లేందుకు దారిలేక అయోమయంలో పడ్డారు. పిల్లల తల్లిదండ్రులు ఘటనా స్థలానికి చేరుకొని తక్షణం గోడను తొలగించి దారి ఉంచాలని ధర్నా చేశారు. డెంకణీకోట డీఎస్పీ ఘటనా స్థలానికి చేరుకొని చర్చించారు. ఈ విషయాన్ని పై అధికార్ల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రక్షణ కల్పించవలసిన పోలీసులే విద్యార్థులకు ఇబ్బంది కల్పించడం సహించదగ్గ విషయం కాదని స్థానిక ప్రజలు నిరసన తెలిపారు.

ఇంటింటికి అక్షతలు పంపిణీ



అయోధ్య నుంచి వచ్చిన అక్షతలు

మైసూరు: అయోధ్యలో రాముడి విగ్రహానికి ఏర్పాట్లు సాగుతుండగా మరోవైపు అక్కడి నుంచి వచ్చిన అక్షతల పంపిణీని మైసూరు నగరంలో ఇంటింటికి ప్రారంభించారు. మైసూరు నగరంలోని నిర్విన్ రోడ్డులో పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ఆర్ఎస్ఎస్, భజరంగదళ్, హిందూ పరిషత్ కార్యకర్తలు పత్రికలు, అక్షతలకు పూజలు చేసి ఇంటింటికి పంపిణీ కార్యక్రమం చేపట్టారు.

బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం. ఉద్యోగి దుర్మరణం

బాగేపల్లి: బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఓ ఉద్యోగి మృతి చెందిన ఘటన బాగేపల్లి పట్టణ సమీపంలోని కేఎస్ ఆర్టీసీ డిపోలో మంగళవారం చోటుచేసుకుంది. ఇక్కడి ఆర్టీసీ డిపోలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న మంజునాథ్ (24) సాయంత్రం డిపోలో బస్సులు శుభ్రం చేస్తుండగా ఓ డ్రైవర్ బస్సును రివర్స్‌లో తీసుకుని వస్తూ మంజునాథ్‌ను ఢీకొన్నాడు. మంజునాథ్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా...

నేటి నుంచి భవానీ దీక్షల విరమణ

ఇంద్రకీలాద్రి (విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై గల శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో బుధవారం నుంచి భవానీ దీక్షల విరమణ ప్రారంభం కానుంది. 7వ తేదీ పూర్ణాహుతితో ముగుస్తుంది. దీక్ష విరమణలకు సుమారు ఐదు లక్షల మంది భవానీలు వస్తారని అంచనా. దేవస్థానం ఇందు కోసం అన్ని ఏర్పాట్లు చేసింది.

దూసుకొచ్చిన మృత్యువు

- రెండు కార్లు ఢీ... ముగ్గురి మృతి



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

దేవరపల్లి: తూర్పుగోదావరి జిల్లా, దేవరపల్లి మండలం, బందపురం వద్ద మంగళవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. మరో ఎనిమిదిమంది తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు... కృష్ణాజిల్లా నందిగామకు చెందిన వేల్పూరు విజయ మోహన్, భార్య సజన గ్రేస్, కుమార్తె అమితశ్రీ, కుమారుడు రోవిన్ జేదిద్య కలిసి కారులో విశాఖపట్నం బయలుదేరారు. అతి వేగంగా వెళ్తున్న వారి కారు బందపురం వద్ద టైర్ పంక్చరై, అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి, అవతల వైపు విశాఖపట్నం నుంచి హైదరాబాద్ వెళుతున్న మరో కారును ఢీకొంది. ఆ కార్లలో ప్రయాణిస్తున్న 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. వారిని సమీపంలోని ప్రభుత్వాస్పత్రులకు తరలించారు. ప్రమాదంలో హైదరాబాద్ వెళుతున్న ఇండిగ రమాదేవి (50), ఇండిగ దివ్య ప్రియ (25), 18 నెలల చిన్నారి ఇండిగ గనిష్క చికిత్స పొందుతూ మృతి చెందారు. రమాదేవి భర్త సుభాష్‌గౌడ్, మేనల్లుడు వికాస్‌సాయి, మల్లికార్జున తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు. వీరి స్వస్థలం హైదరాబాద్.

తెలుగు భాషా వైభవ శోభాయాత్ర ప్రారంభం



శోభాయాత్రను ప్రారంభిస్తున్న స్వాత్మానందేంద్ర సరస్వతి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): తల్లిని గౌరవించినట్లే అమ్మ భాషను కూడా గౌరవించాలని విశాఖపట్నం శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి ఉద్బోధించారు. ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 5, 6, 7 తేదీల్లో రాజమహేంద్రవరం గైట్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో అంతర్జాతీయ తెలుగు మహాసభలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో తెలుగు భాషా వైభవ శోభాయాత్ర నిర్వహించారు. యాత్రను స్వాత్మానందేంద్ర ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మహాసభలను శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి ప్రారంభిస్తారని తెలిపారు. ఎంపీ మార్గాని భరత్‌రామ్ మాట్లాడుతూ తెలుగు మహాసభలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. చైతన్య విద్యాసంస్థల చైర్మన్ చైతన్య రాజు, గజల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మొబైల్ ఫోన్ కోసం మహిళ సాహసం

బనశంకరి: బెంగళూరు ఇందిరానగర మెట్రోస్టేషన్‌లో పట్టాలపై పడిపోయిన మొబైల్‌ఫోన్‌ను తీసుకునేందుకు ఓ మహిళా ప్రయాణికురాలు పట్టాలపైకి దూకింది. హైటెన్షన్ విద్యుత్ ప్రసారం కలిగిన పట్టాలను తాకి ఉంటే క్షణాల్లో ప్రాణాపాయం సంభవించేది. అదృష్టవశాత్తు స్టేషన్ సిబ్బంది తక్షణమే కరెంటు సరఫరాను నిలిపివేయడంతో ముప్పు తప్పింది.సోమవారం సాయంత్రం 6.40 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. దీంతో 15 నిమిషాల పాటు రైళ్లు స్తంభించాయి. మెట్రో ఎండీ అంజుమ్ పర్వేజ్ మాట్లాడుతూ రైలుపట్టాలకు 750 ఓల్టుల విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. .

బాలుడి ముక్కులో గుచ్చుకున్న బాణం



బాలుడి ముక్కులో బాణం

మల్కన్‌గిరి: ఒడిశా రాష్ట్రం, మల్కన్‌గిరి జిల్లా అంధగూడ గ్రామంలో తొమ్మిదేళ్ల బాలుడి ముక్కులో బాణం గుచ్చుకుంది. మంగళవారం ఉదయం ఈ ఘటన జరిగింది. జగన్నాథ్ పూజారి కుమారుడు నాంధో పూజారి గ్రామంలో తోటిపిల్లలతో కలిసి ఆడేందుకు వెళ్లాడు. అడవి పక్షులు వేటాడేందుకు తయారుచేసిన బాణంతో ఆడుతుండగా ప్రమాదవశాత్తు అది ముక్కులో గుచ్చుకుంది. వెంటనే మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు రెండు గంటల పాటు శ్రమించి బాణాన్ని బయటకు తీశారు.



చిత్తూరు జిల్లా వనదుర్గాపురంలో ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య సేవలు పొందుతున్న స్థానికులు



జగనన్న ఆరోగ్య సురక్ష గురించి వృద్ధులను అడిగి తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్



విశాఖ జిల్లా భీమునిపట్నం మండలం చిప్పాడలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు



కాకినాడ జిల్లా తుని మండలం కేవో మల్లవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య సేవలు అందిస్తున్న వైద్యుడు

మూడేళ్లుగా ఒకేచోట పనిచేస్తున్న అధికారులను బదిలీ చేయాలి

ఏ అధికారి సొంత జిల్లాల్లో ఉండకూడదు

- లోక్‌సభ, శాసనసభ ఎన్నికల నిర్వహణలోని అధికారులకు వర్తింపు
- సొంత జిల్లాలు, ప్రాంతాల్లో పోస్టింగ్‌లు ఇవ్వరాదు
- డీఈవో, డిప్యూటీ డీఈవో, ఆర్వో, ఈఆర్వో, డిప్యూటీ కలెక్టర్, జాయింట్ కలెక్టర్, తహసీల్దారులకు వర్తింపు
- అదనపు డీజీ, డీఐజీ, ఎస్పీ, అదనపు ఎస్పీ, సబ్ డివిజనల్ ఆఫీసర్, ఇన్‌స్పెక్టర్, సబ్ ఇన్‌స్పెక్టర్లకు వర్తింపు
- సంబంధిత శాఖాధిపతులు, కార్యదర్శులు వెంటనే బదిలీల కసరత్తు చేపట్టి పూర్తిచేయాలి
- ఈ నెలాఖరుకల్లా నివేదికలను కేంద్ర ఎన్నికల సంఘానికి పంపాలి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో పాల్గొనే అధికారుల బదిలీలు, పోస్టింగ్‌లపై కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా తక్షణం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. సంబంధిత శాఖాధిపతులు, కార్యదర్శులు వెంటనే చర్యలు తీసుకుని ఈ నెల చివరి వారంలోగా బదిలీలు, పోస్టింగ్‌ల ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఈ నెలాఖరుకల్లా బదిలీల, పోస్టింగ్‌ల నివేదికను కేంద్ర ఎన్నికల సంఘానికి పంపించాల్సి ఉంటుందని తెలిపారు. మూడేళ్లు ఒకచోట, ఒకే జిల్లాలో పనిచేస్తున్న అధికారులను బదిలీలు చేయాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో పాల్గొనే అధికారులందరికీ ఈ నిబంధన వర్తిస్తుందని తెలిపారు. ఆ ఉత్తర్వుల మేరకు..



- నాలుగు సంవత్సరాల్లో.. జిల్లాలో మూడు సంవత్సరాలు పూర్తిచేసిన అధికారులు, లేదా ఈ ఏడాది జూన్ 30 లేదా అంతకుముందు 3 సంవత్సరాలు పూర్తిచేసుకున్న ఉద్యోగులను మరో జిల్లాకు బదిలీ చేయాలి.
- ఎన్నికలకు సంబంధం ఉన్న ఏ అధికారిని సొంత జిల్లాలో కొనసాగించడానికి వీల్లేదు.
- జిల్లా అధికారులతో పాటు నిర్దిష్టంగా ఎన్నికల విధులకు నియమించిన జిల్లా ఎన్నికల అధికారులు, ఉప ఎన్నికల అధికారులు, ఏఆర్‌వోలు, ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు, నోడల్ అధికారులతో పాటు డిప్యూటీ కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, తహసీల్దార్లు, బ్లాక్ డెవలప్‌మెంట్ అధికారులతో సహా ఇంకా ఎన్నికలకు సంబంధించిన అధికారులందరికీ బదిలీల నిబంధనలు వర్తిస్తాయి. మున్సిపల్ కార్పొరేషన్, డెవలప్‌మెంట్ అథారిటీ అధికారులకు కూడా బదిలీల నిబంధనలు వర్తిస్తాయి.
- పోలీసుశాఖకు కూడా బదిలీల నిబంధనలు వర్తిస్తాయి. అదనపు డీజీలు, ఐజీలు, డీఐజీలు, రాష్ట్ర ఆర్మ్‌డ్ పోలీసులు, ఎస్ఎస్‌పీలు, ఎస్పీలు, అదనపు ఎస్పీలు, సబ్ డివిజనల్ హెడ్ ఆఫ్ పోలీసు, ఎస్‌హెచ్‌వోలు, ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, జిల్లాస్థాయిలో ఎన్నికల బందోబస్తుకు ఉపయోగించే పోలీసు బలగాలకు వర్తిస్తాయి.
- పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్లను వారి స్వంత జిల్లాలో నియమించకూడదు.
- ఒక పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ నాలుగేళ్లలో 3 సంవత్సరాల పదవీకాలాన్ని పూర్తిచేస్తే మరో పోలీసు సబ్ డివిజన్‌కు బదిలీ చేయాలి. ఆ సబ్ డివిజన్ అంతకుముందు పనిచేసిన అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఉండకూడదు. లేదంటే మరో జిల్లాకు బదిలీ చేయాలి.
- ఎక్సైజ్ అధికారులకు బదిలీ నిబంధనలు వర్తిసాయి. సబ్ ఇన్‌స్పెక్టర్, అంతకంటే ఎక్కువ ర్యాంక్ ఉన్న రాష్ట్రంలోని ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ అధికారులకు కూడా బదిలీల నిబంధనలు వర్తిస్తాయి.
- ఎన్నికలతో నేరుగా సంబంధం లేని వైద్యులు, ఇంజనీర్లు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు బదిలీలుండవు. అయితే వారిలో ఎవరైనా రాజకీయ పక్షపాతంతో వ్యవహరిస్తున్నారనే ఫిర్యాదులు వస్తే.. విచారణలో రుజువైతే.. అటువంటి అధికారిని బదిలీ చేయమని ఆదేశించడంతోపాటు శాఖాపరమైన చర్యలకు కేంద్ర ఎన్నికల సంఘం సిఫార్సు చేస్తుంది.
- గతంలో కేంద్ర ఎన్నికల సంఘం క్రమశిక్షణ చర్యలకు సిఫార్సు చేసి పెండింగ్‌లో ఉన్న అధికారులు లేదా గతంలో ఎన్నికలకు సంబంధించి ఏదైనా తప్పుపట్టిన, అభియోగాలు మోపిన అధికారులకు ఎన్నికలకు సంబంధించి ఎలాంటి విధులను అప్పగించకూడదు. గతంలో ఎన్నికల సమయంలో బదిలీ చేసిన అధికారులు ఎన్నికల విధుల్లో పాల్గొనకూడదు.
- అధికారిక పనితీరుకు సంబంధించిన క్రిమినల్ కేసు ఏదైనా న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉంటే అలాంటి అధికారులు ఎన్నికల సంబంధిత విధుల్లో ఉండకూడదు.
- ఆరునెలల్లో పదవీ విరమణ చేయనున్న అధికారులు ఎవరైనా ఎన్నికల సంబంధిత పోస్టులో ఉంటే ఆ వ్యక్తిని ఆ విధుల నుంచి తప్పించాలి. అలాంటి వారిని బదిలీ చేయాల్సిన అవసరం లేదు.
- పదవీ విరమణ తరువాత వివిధ హోదాల్లో తిరిగి నియమించిన, పొడిగింపులపై ఉన్న అధికారులు ఎన్నికల సంబంధిత విధుల్లో ఉండకూడదు.
- ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఉన్న అధికారులకు సంబంధించిన బదిలీ ఉత్తర్వులు ఏమైనా ఉంటే సంబంధిత ప్రధాన ఎన్నికల అధికారిని సంప్రదించి ఓటర్ల జాబితా తుది ప్రచురణ తర్వాత మాత్రమే బదిలీలు అమలు చేయాలి. ఏదైనా అసాధారణ కారణాల వల్ల బదిలీ చేయాల్సి వస్తే కేంద్ర ఎన్నికల సంఘం ముందస్తు అనుమతి తీసుకోవాలి. బదిలీలపై ఎప్పటికప్పుడు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని సంప్రదించడంతో పాటు బదిలీ ఉత్తర్వులను ఆయనకు ఇవ్వాలి.
- ఎన్నికల సంబంధిత అధికారులందరూ ప్రస్తుత ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థుల్లో ఎవరికీ దగ్గర బంధువు కానని డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. క్రిమినల్ కేసుల వివరాలను నిర్ధారించిన నమూనాపత్రంలో సమర్పించాలి. ఏ అధికారి అయినా తప్పుడు సమాచారం ఇస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారు.

ఈనెల 9న రాష్ట్రానికి కేంద్ర ఎన్నికల సంఘం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ సన్నద్ధతపై సమీక్షించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్, కమిషనర్లు అనూప్‌చంద్ర పాండే, అరుణ్ గోయల్ ఈ నెల 9వ తేదీన ఏపీకి రానున్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియతో పాటు ఈవీఎంల సన్నద్ధత, ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఇతర ఏర్పాట్లపై 9, 10 తేదీల్లో కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్, కమిషనర్లు సమీక్షిస్తారని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, ఇతర ఉన్నతాధికారులు, కలెక్టర్లు, ఎస్పీలతో కేంద్ర ఎన్నికల సంఘం సమీక్షలు నిర్వహించనుంది. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుకు తీసుకోవాల్సిన చర్యలు, చెక్‌పోస్టుల ఏర్పాటు, మద్యం, నగదు పంపిణీలను నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రాష్ట్ర ఉన్నతాధికారులకు మార్గనిర్దేశం చేయనుంది.

'జగనన్న ఆరోగ్య సురక్ష' రెండో దశలో 13,818 క్యాంపులు

- ప్రజలందరికీ నాణ్యమైన వైద్యం ఉచితంగా అందాలనేది సీఎం జగన్ లక్ష్యం
- రాష్ట్ర ప్రజలందరికీ అపర సంజీవనిలా ఆరోగ్యశ్రీ
- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని

గుంటూరు రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో దశ కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 13,818 వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష రెండో దశ మెడికల్ క్యాంపులు ప్రారంభమయ్యాయి. గుంటూరు రూరల్ మండలం చినపలకలూరులో నిర్వహించిన క్యాంపునకు మంత్రి విడదల రజిని హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మండలాల వారీగా గ్రామాల్లో ప్రతి మంగళవారం, శుక్రవారం వారానికి రెండురోజుల చొప్పున వైద్య శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. పట్టణాల్లో వార్డు సచివాలయాల పరిధిలో ప్రతి బుధవారం, గురువారం ఈ శిబిరాలు ఉంటాయని పేర్కొన్నారు. మొత్తం 10,032 గ్రామ సచివాలయాలు, 3,786 వార్డు సచివాలయాల పరిధిలో 13,818 వైద్య శిబిరాలు నిర్వహిస్తామని వివరించారు. అనారోగ్య సమస్యలు ఉన్నవారిని వైద్య శిబిరాలకు తీసుకురావడం, ప్రభుత్వ వైద్యుల ఆధ్వర్యంలో పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. మెరుగైన వైద్యం అవసరం ఉన్నవారిని పెద్ద ఆస్పత్రులకు పంపి ఉచితంగా అందేలా చేయడం ఈ కార్యక్రమంలో ఒక భాగమని ఆమె వెల్లడించారు. రోగి పూర్తిగా కోలుకునే వరకు ఆరోగ్యమిత్ర, ఏఎన్ఎంల పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు. ఇలాంటి గొప్ప కార్యక్రమాలను దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడం లేదని, ఒక్క ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాత్రమే చేస్తోందని తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్యాన్ని ఉచితంగా, వేగంగా అందించాలనే గొప్ప లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తుండటం వల్లే వైద్య, ఆరోగ్య రంగంలో కనీవిని ఎరుగని సంస్కరణలను ప్రవేశపెట్టారని రజిని చెప్పారు. రాష్ట్ర ప్రజలకు ఆరోగ్యశ్రీ ద్వారా అందుతున్న చికిత్సల సంఖ్యను ఏకంగా 3,257కు జగనన్న పెంచారని పేర్కొన్నారు. వైద్య ఖర్చును రూ.25లక్షలకు పెంచారని తెలిపారు. ఆరోగ్యశ్రీ కార్డులను కూడా కొత్తవి మంజూరు చేసి జగనన్న ఆరోగ్య సురక్ష-2లో భాగంగా ఇంటింటికీ వెళ్లి అందజేస్తున్నామని చెప్పారు. ఆరోగ్య ఆసరా అనే గొప్ప పథకాన్ని ప్రవేశపెట్టి రోగులకు చికిత్సకాలంలో ఆర్థిక సాయం అందజేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్ మాత్రమే అని ప్రశంసించారు. జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవో డీకే బాలాజీ, డీఎంఈ నర్సింహం, డీఎంఅండ్‌హెచ్‌వో శ్రావణ్‌బాబు పాల్గొన్నారు.



జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు అందజేస్తున్న మంత్రి విడదల రజిని

6.47 లక్షల మందికి వైకుంఠ ద్వార దర్శనం

- సంతృప్తికరంగా భక్తులకు శ్రీవారి దర్శనం
- పది రోజుల్లో హుండీ కానుకల ద్వారా రూ.40.20 కోట్లు
- టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి వెల్లడి

తిరుమల: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని గతేడాది డిసెంబర్ 23 నుంచి ఈ ఏడాది జనవరి 1 వరకు మొత్తం 6.47 లక్షల మంది భక్తులకు తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనం కల్పించినట్లు టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి వెల్లడించారు. తిరుమల అన్నమయ్య భవనంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా.. సంతృప్తికరంగా వైకుంఠ ద్వార దర్శనం కల్పించామని చెప్పారు. భక్తులు క్యూ లైన్లలో ఎక్కువ సమయం వేచి ఉండడాన్ని నివారించేందుకు టైంస్లాట్ టోకెన్లు జారీ చేశామన్నారు. ఈ పది రోజుల్లో మొత్తం రూ.40.20 కోట్ల హుండీ కానుకలు అందాయని, 17.81 లక్షల మంది అన్నప్రసాదాలు, 35.60 లక్షల మంది లడ్డూ ప్రసాదాలు స్వీకరించారని, 2.14 లక్షల మంది భక్తులు తలనీలాలు సమర్పించారని ఈవో వెల్లడించారు. రాతిమండపాలు, ఆలయాల పునర్నిర్మాణానికి సంబంధించి టీటీడీలో ఆలయ నిర్మాణ విభాగం ఉందని, ఇక్కడ నిపుణులైన స్థపతులు ఉన్నారని వివరించారు. ఎస్వీ శిల్ప కళాశాల ఆధ్వర్యంలో ఎంతో మంది నిపుణులు తయారవుతున్నారని, వీరు విగ్రహాల తయారీతో పాటు, చక్కగా ఆలయాలు నిర్మించగలరని చెప్పారు. ఇటీవల జమ్ముకశ్మీర్, విశాఖ, హైదరాబాద్, ఒడిశా, కన్యాకుమారి, సీతంపేట, రంపచోడవరం ప్రాంతాల్లో అత్యంత సుందరంగా ఆలయాలు నిర్మించామని వివరించారు. అలిపిరి నడక మార్గంలో చిరుత, ఎలుగుబంటి సంచారాన్ని ట్రాప్ కెమెరాల ద్వారా గుర్తించిన వెంటనే.. భక్తులను అప్రమత్తం చేసి తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అటవీ శాఖకు రూ.3.5 కోట్లు అందించామన్నారు. వీటిని ఉపయోగించి అత్యాధునిక ట్రాప్ కెమెరాల కొనుగోలుతో పాటు భక్తులకు ఇబ్బంది కలగకుండా ఇతర చర్యలు చేపడతారని చెప్పారు.

జన బలమే గీటురాయి

మొదటి పేజీ తరువాయి

గమనార్హం. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం మీడియా పాయింట్ వద్ద విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి మంగళవారం రాత్రి ఈ వివరాలను ప్రకటించారు. గత నెల 11వతేదీన 11 శాసనసభ స్థానాలకు నూతన సమన్వయకర్తలను ప్రకటిస్తూ వైఎస్సార్ సీపీ మొదటి జాబితాను విడుదల చేసిన విషయం తెలిసిందే. రెండు జాబితాల్లో కలిపి మొత్తం 35 శాసనసభ, 3 లోక్‌సభ స్థానాలకు పార్టీ సమన్వయకర్తలను ప్రకటించారు.

- కురుబ (బీసీ) సామాజిక వర్గానికి చెందిన మాజీ మంత్రి, పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణను అనంతపురం లోక్‌సభ సమన్వయకర్తగా నియమించారు. బోయ సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎంపీ జోలదరాశి శాంత హిందూపురం లోక్‌సభ సమన్వయకర్తగా నియమితులయ్యారు. ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మిని అరకు లోక్‌సభ స్థానం సమన్వయకర్తగా నియమించారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన అనంతపురం ఎంపీ తలారి రంగయ్యను కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించగా, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌ను రాజమండ్రి సిటీ నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు అప్పగించారు. ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన అరకు ఎంపీ గొడ్డేటి మాధవిని అరకు నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి,, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే కేవీ ఉషాశ్రీచరణ్‌ను పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించారు. బీసీ సంక్షేమం, సమాచార శాఖ మంత్రి, రామచంద్రాపురం ఎమ్మెల్యే చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించారు.

బీసీలు, మైనార్టీలకు పెద్దపీట..

రెండు దఫాల్లో ప్రకటించిన 35 శాసనసభ స్థానాల సమన్వయకర్తల జాబితాను పరిశీలిస్తే సామాజిక న్యాయానికి సీఎం జగన్ పెద్దపీట వేసినట్లు స్పష్టమవుతోంది. గతంలో అగ్రవర్ణాలకు చెందిన అభ్యర్థులను పోటీకి పెట్టిన ఏడు శాసనసభ స్థానాల్లో ఇప్పుడు ఐదు స్థానాల్లో బీసీలకు, రెండు స్థానాల్లో మైనార్టీ వర్గానికి చెందిన వారిని సమన్వయకర్తలుగా నియమించడం గమనార్హం. ఇక ఐదు శాసనసభ స్థానాలకు మహిళలను సమన్వయకర్తలుగా నియమించారు. పది స్థానాల్లో యువతీ యువకులకు సమన్వయకర్తలుగా అవకాశం కల్పించారు. మొత్తమ్మీద 35 శాసనసభ స్థానాలకు ప్రకటించిన సమన్వయకర్తల్లో ఎస్సీలు 9 మంది, ఎస్టీలు ముగ్గురు, బీసీలు 11 మంది, మైనార్టీలు ముగ్గురు, అగ్రవర్ణాలు 9 మంది (రెడ్డి, కాపు, వైశ్య) చొప్పున ఉన్నారు.

175 స్థానాల్లోనూ విజయమే లక్ష్యంగా..

గత 55 నెలలుగా సంక్షేమాభివృద్ధి పథకాలు, చరిత్ర ఎరుగని విప్లవాత్మక సంస్కరణలతో సీఎం వైఎస్ జగన్ జనరంజక పరిపాలన అందిస్తున్నారు. సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ(ప్రత్యక్ష నగదు బదిలీ)తో రూ.2.45 లక్షల కోట్లు, నాన్ డీబీటీ రూపంలో మరో రూ.1.67 లక్షల కోట్లు వెరసి మొత్తం రూ.4.12 లక్షల కోట్ల మేర ప్రజలకు ప్రయోజనం చేకూర్చారు. రాష్ట్రంలో సగటున 87 శాతం కుటుంబాలకు సంక్షేమాభివృద్ధి పథకాల ద్వారా ప్రయోజనం అందగా అందులో 75 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలే ఉండటం గమనార్హం. ప్రతి కుటుంబం, ప్రతి గ్రామం, ప్రతి నియోజకవర్గంలో తీసుకొచ్చిన మార్పులు కళ్లెదుట కనిపిస్తున్నప్పుడు 175కు 175 స్థానాల్లోనూ విజయం సాధించడం సాధ్యమేనని పార్టీ శ్రేణులకు సీఎం వైఎస్ జగన్ దిశానిర్దేశం చేస్తూ వస్తున్నారు. చేసిన మంచిని ప్రజలకు చెప్పి వారితో మమేకమై మరింత మేలు చేయడానికి ఆశీస్సులు కోరాలని ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలకు మార్గనిర్దేశం చేశారు. ప్రజలతో మమేకం కాకుండా వారి మనసులు చూరగొనలేని వారికి టికెట్లు ఇవ్వలేనని ఆది నుంచి సీఎం జగన్ తేల్చి చెబుతూ వస్తున్నారు. ఈ క్రమంలో 175 స్థానాల్లోనూ గెలుపే లక్ష్యంగా అవసరమైన చోట్ల నూతన సమన్వయకర్తలను నియమిస్తున్నారు.



గెలుపే ప్రామాణికంగా జాబితా

సామాజిక సమీకరణాలే లక్ష్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీల జాబితాను రూపొందించామని విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం నూతన ఇన్‌ఛార్జీల జాబితాను విడుదల చేసిన అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. మండల, నియోజకవర్గ నేతలతో పాటు ఎమ్మెల్యేల అభిప్రాయ సేకరణ తర్వాతే జాబితాను విడుదల చేశామన్నారు. గెలుపే ప్రామాణికంగా 27 మంది ఇన్‌ఛార్జీలతో రెండో జాబితాను విడుదల చేస్తున్నామని తెలిపారు. ఈ జాబితాను సీఎం జగన్ ఖరారు చేసినట్లు చెప్పారు. సామాజిక సమీకరణాలు, ప్రజల ఆదరాభిమానాలు, అంతిమంగా పార్టీ గెలుపే లక్ష్యంగా జాబితాను రూపొందించామన్నారు. భారీ విజయం సాధిస్తామన్న ఆత్మవిశ్వాసం తన శ్రేణుల్లో తొణికిసలాడుతుండగా ప్రతిపక్షంలో పూర్తి అయోమయ వాతావరణం నెలకొందన్నారు. పొత్తులు తేల్చుకోలేక, సీట్ల పంపిణీ చిక్కుముడులు వీడక, నియోజకవర్గాల్లో అభ్యర్థులే లేక విపక్షాలు నిరాశలో కొట్టు మిట్టాడుతున్నాయన్నారు. ఇవాళ విడుదల చేసిన జాబితాలో అవకాశాలు దక్కని వారి సేవలను పార్టీపరంగానూ, ఇతరత్రా వినియోగించుకుంటామని చెప్పారు. పార్టీ అన్ని రకాలుగా ఆలోచించే ఈ నిర్ణయం తీసుకుందన్నారు.175 స్థానాల్లో గెలుపే ధ్యేయంగా అడుగులు వేస్తున్నామని, ఆ దిశగానే ఈ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు.

–మీడియాతో బొత్స, సజ్జల

వైఎస్సార్‌సీపీ నూతన సమన్వయకర్తలు వీరే..

లోక్‌సభ స్థానం పేరు	సమన్వయకర్త
అనంతపురం	మాలగుండ్ల శంకరనారాయణ(బీసీ-కురుబ)
హిందూపురం	జోలదరాశి శాంత(బీసీ-బోయ)
అరకు(ఎస్టీ)	కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి(ఎస్టీ)
శాసనసభ స్థానం పేరు	**సమన్వయకర్త**
రాజాం(ఎస్సీ)	డాక్టర్ తాలె రాజేష్
అనకాపల్లి	మలసాల భరత్ కుమార్(ఓసీ-కాపు)
పాయకరావు పేట(ఎస్సీ)	కంబాల జోగులు
రామచంద్రాపురం	పిల్లి సూర్యప్రకాశ్(బీసీ-శెట్టిబలిజ)
పి. గన్నవరం(ఎస్సీ)	విప్పర్తి వేణుగోపాల్
పిఠాపురం	వంగా గీత(ఓసీ-కాపు)
జగ్గంపేట	తోట నరసింహం(ఓసీ-కాపు)
ప్రత్తిపాడు	వరుపుల సుబ్బారావు(ఓసీ-కాపు)
రాజమండ్రి సిటీ	మార్గాని భరత్(బీసీ-గౌడ)
రాజమండ్రి రూరల్	చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ(బీసీ-శెట్టిబలిజ)
పోలవరం(ఎస్టీ)	తెల్లం రాజ్యలక్ష్మి
కదిరి	బీఎస్ మక్బూల్ అహ్మద్
ఎర్రగొండపాలెం(ఎస్సీ)	తాటిపర్తి చంద్రశేఖర్
ఎమ్మిగనూర్	మాచాని వెంకటేశ్(బీసీ-పద్మశాలి)
తిరుపతి	భూమన అభినయ్ రెడ్డి
గుంటూరు ఈస్ట్	షేక్ నూరి ఫాతిమా
మచిలీపట్నం పేర్ని	కృష్ణమూర్తి(కిట్టు)
చంద్రగిరి	చెవిరెడ్డి మోహిత్ రెడ్డి
పెనుకొండ	కేవీ ఉషా శ్రీచరణ్(బీసీ-కురుబ)
కళ్యాణదుర్గం	తలారి రంగయ్య(బీసీ-బోయ)
అరకు(ఎస్టీ)	గొడ్డేటి మాధవి
పాడేరు(ఎస్టీ)	మత్స్యరాస విశ్వేశ్వర రాజు
విజయవాడ సెంట్రల్	వెలంపల్లి శ్రీనివాస రావు(ఓసీ- వైశ్య)
విజయవాడ వెస్ట్	షేక్ ఆసిఫ్




● చిన్ని కృష్ణుడిని తీర్చిదిద్దుతూ...

రాముణ్ణి చెక్కిన చేతులు

ఎంబిఏ చేసిన అరుణ్ యోగిరాజ్ కొన్నాళ్లు కార్పొరేట్ సంస్థలో ఉద్యోగం చేశాడు. కాని అనువంశికంగా వస్తున్న కళ అతనిలో ఉంది. నా చేతులున్నది శిల్పాలు చెక్కడానికిగాని కీబోర్డు నొక్కడానికి కాదని ఉద్యోగం మానేశాడు. 2008 నుంచి అతను చేస్తున్న సాధన ఇవాళ దేశంలోనే గొప్ప శిల్పిగా మార్చింది. అంతే కాదు 'బాల రాముడి' విగ్రహాన్ని చెక్కి అయోధ్య ప్రతిష్ఠాపన వరకూ తీసుకెళ్లింది. తమలో ఏ ప్రతిభ ఉందో యువతా, తమ పిల్లల్లో ఏ నైపుణ్యం ఉందో తల్లిదండ్రులు తెలుసుకోవాలనడానికి ఉదాహరణ అరుణ్.



● అమ్మవారిని కొలువుదీరుస్తూ...



● జగద్గురు ఆదిశంకరాచార్యులు

జనవరి 22న అయోధ్యలో అంగరంగ వైభవంగా జరగనున్న రామమందిర ప్రారంభోత్సవంలో ఒక్కో విశేషం తెలుస్తూ వస్తోంది. ప్రాణప్రతిష్ఠ జరగనున్న విగ్రహాల్లో 'బాల రాముడి' విగ్రహం సమర్పించే గొప్ప అవకాశం మైసూరుకు చెందిన 40 ఏళ్ల శిల్పి అరుణ్ యోగిరాజ్‌కు దక్కింది. కర్ణాటకకు చెందిన బీజేపీ పెద్దలు ఈ విషయాన్ని తెలియచేసి హర్షం వ్యక్తం చేశారు. అయితే ఇంకా అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది.

అయోధ్య రామమందిరంలో 'బాల రాముడి' విగ్రహం ప్రతిష్ఠ కోసం శిల్పం తయారు చేయమని దేశంలో ముగ్గురు శిల్పులకు శ్రీ రామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ బాధ్యత అప్పజెప్పింది. వారిలో ఒకరు అరుణ్ యోగిరాజ్. ఇతని కుటుంబం ఐదు తరాలుగా శిల్ప కళలో పేరు గడించింది. అరుణ్ తండ్రి యోగిరాజ్, తాత బసవణ్ణ శిల్పులుగా కర్ణాటకలో పేరు గడించారు. అయితే అరుణ్ ఈ కళను నేర్చుకున్నా అందరిలాగే కార్పొరేట్ ఉద్యోగం వైపు దృష్టి నిలిపాడు. కాని రక్తంలో ఉన్న శిల్పకళే మళ్లీ అతణ్ణి తనవైపు లాక్కుంది. 2008 నుంచి శిల్పాలు తయారు చేస్తున్న అరుణ్ ఇప్పటికే అనేక కోట్ల శిల్పాలు స్థాపించి తన ప్రతిభ నిరూపించుకున్నాడు. అరుణ్ తయారు చేసిన శిల్పాల్లో కేదార్‌నాథ్‌లోని ఆది శంకరాచార్య విగ్రహంతో మొదలు మైసూరులోని ఆర్.కె.లక్ష్మణ్ విగ్రహం వరకూ ఉన్నాయి. మైసూర్ రైల్వే స్టేషన్‌లో 'లైఫ్ ఈజ్ ఏ జర్నీ' పేరుతో ఒక కుటుంబం లగేజ్‌తో ఉన్న శిల్పాలు ప్రతిష్ఠించి అందరి దృష్టినీ ఆకర్షించాడు అరుణ్. అలా రాముడి విగ్రహం చెక్కే అవకాశం పొందే వరకూ ఎదిగాడు.

51 అంగుళాల విగ్రహం

అరుణ్ చెక్కిన బాల రాముడి విగ్రహం శిరస్సు నుంచి పాదాల వరకు 51 అంగుళాల ఎత్తు ఉంటుంది. అరుణ్ భార్య విజేత వివరాలు తెలియచేస్తూ 'అరుణ్‌కి ఈ బాధ్యత అప్పజెప్పాక శిల్ప ఆకృతి గురించి అతడు ఎంతో పరిశోధించాల్సి వచ్చింది. దానికి కారణం బాల రాముడి విగ్రహం ఇలా ఉంటుందనడానికి ఎలాంటి రిఫరెన్స్ లేకపోవడమే. అందుకని అరుణ్ పురాణాల అధ్యయనంతో పాటు రాముడి వేషం కట్టిన దాదాపు 2000 మంది బాలల ఫొటోలు పరిశీలించాడు' అని తెలిపింది. ఈ విగ్రహం కోసం ట్రస్ట్ శిలను అందించింది అరుణ్‌కు. 'మామూలు గ్రానైట్ కంటే ఈ శిల దృఢంగా ఉంది. చెక్కడం సవాలుగా మారింది. అయినప్పటికీ తనకు వచ్చిన అవకాశం ఎంత విలువైనదో గ్రహించిన అరుణ్ రేయింబవళ్లు శిల్పాన్ని చెక్కి తన బాధ్యత నిర్వర్తించాడు' అని తెలిపింది విజేత.

తల్లి ఆనందం

కుమారుడు చెక్కిన శిల్పం రామ మందిరంలో ప్రాణప్రతిష్ఠ చేసుకోనుందన్న వార్త విన్న అరుణ్ తల్లి ఆనందంతో తబ్బిబ్బవుతోంది. మరణించిన భర్తను తలచుకొని ఉద్వేగ పడుతోంది. 'అరుణ్ వాళ్ల నాన్న దగ్గరే శిల్పం చెక్కడం నేర్చుకున్నాడు. వాళ్ల నాన్న పేరు నిలబెడుతున్నాడు' అంది.

తల్లిదండ్రులు తెలుసుకోవాలి

తల్లిదండ్రులు పిల్లల బాగు కోరుతారు. అయితే అన్నీ తాము ఆదేశించినట్టుగా పిల్లలు నడుచుకోవాలన్న ధోరణి కూడా సరి కాదు. పిల్లలు తమకు ఇష్టమైన చదువులు చదవాలనుకుంటే ఎందుకు ఆ కోరిక కోరుతున్నారో పరిశీలించాలి. కళాత్మక నైపుణ్యాలుండి ఆ వైపు శిక్షణ తీసుకుంటామంటే వాటి బాగోగుల గురించి కనీసం ఆలోచించాలి. కఠినమైన చదువులకు అందరు పిల్లలూ పనికి రారు. రాని చదువును తప్పక చదవాల్సిందేనని హాస్టళ్లలో వేసి బాధించి ఇవాళ చూస్తున్న కొన్ని దుర్ఘటనలకు కారణం కారాదు. ఐశ్వర్యంతో జీవించడానికి కొన్నే మార్గాలు ఉండొచ్చు. కాని ఆనందంగా జీవించడానికి లక్షమార్గాలు. పిల్లల ఆనందమయ జీవితం కోసం చిన్నారుల ఆలోచనలను కూడా వినక తప్పదు.

సాక్షి ఫ్యామిలీ
బెంగళూరు
బుధవారం ॥ 3-1-2024



సైగల చికిత్స

ట్రీట్‌మెంట్ కోసం పది రోజుల్లో సైన్ లాంగ్వేజ్ నేర్చుకున్న డాక్టర్లు, నర్సులు

మూగ, వినికిడి సమస్య ఉన్న ఆ దంపతులకు లేకలేక సంతానం కలిగింది. అదీ పూర్తి ప్రసవ సమయానికి రెండు నెలల ముందుగానే. కవలల్లో పేగు సమస్యతో అబ్బాయి చనిపోయాడు. ఇక ఇప్పుడు పాప ఒక్కత్తే ఆశాజ్యోతి. కేవలం 450 గ్రాముల బరువుతో మనుగడ అవకాశాలు తక్కువ. పాపను ఎలాగైనా దక్కించుకునేందుకు ఏ విధంగానైనా ఆమెను బతికించుకునేందుకు పేరెంట్స్‌తో కమ్యూనికేట్ చేయడం తప్పనిసరి అయ్యింది. కనీస సంభాషణల కోసం కష్టపడి పదిరోజుల్లోనే సైగల భాషనూ, సంజ్ఞాశాస్త్ర పరిజ్ఞానాన్ని నేర్చుకోవడంలో విజయ సాధించారు అక్కడి కొందరు డాక్టర్లూ, నర్సులు. ఆ పాప ఇప్పుడు బతుకు బ్యారియర్స్‌ను బద్దలు కొట్టింది. నాలుగు నెలల వయసుకే అనేక అడ్డంకుల్ని అధిగమించింది. జీవన సమరంలో తొలి విజయం సాధించింది. విజయవంతంగా మనుగడ పోరాటం సాగిస్తోంది.

హైదరాబాద్‌కు చెందిన దంపతులు రాజ్‌కుమార్ వయసు 55 ఏళ్లు. భాగ్యమ్మకు 47. ఇద్దరూ మూగవారు. వినికిడి, మాట సమస్యలున్నాయి. అప్పటికే ఓ చిన్నారిని కోల్పోయారు. ఎలాగైనా తమకు సంతానం కావాలని కోరిక. ఎట్టకేలకు భాగ్యమ్మ గర్భవతి అయ్యింది. తన 47వ ఏట ప్రసవించింది. కానీ 28 వారాలకే ప్రీమెచ్యూర్‌గా పుట్టిన పిల్లలు. అంటే ఏడునెలలకే జరిగిన ప్రసవం. రెండు నెలలు ముందుగానే ప్రసవం కావడంతో కవలలు బాగా తక్కువ బరువుతో పుట్టారు. బాబు కేవలం 900 గ్రాములు. పాప బరువు మరీ తక్కువ. కేవలం 450 గ్రాములు!!

మరో ఆసుపత్రిలో ప్రసవం తర్వాత... పుట్టీ పుట్టగానే ఆ బిడ్డలకు కొన్ని సమస్యాత్మకమైన రుగ్మతలు ఉండటంతో తల్లినీ, బిడ్డను కొండాపూర్‌లోని కిమ్స్–కడల్స్ నియోనేటాలజీ విభాగంలో చేర్చారు. ఆ విభాగం డైరెక్టర్ డాక్టర్ అపర్ణ నేతృత్వంలో చికిత్స మొదలుపెట్టారు. బాబుకు నెక్రొటైజింగ్ ఎంటరోకొలైటిస్ అనే పేగుల సమస్య ఉండటంతో శస్త్రచికిత్స తప్పలేదు. కానీ బాబు దక్కలేదు.

ఎన్నో వైద్య ప్రక్రియల తర్వాత, మరెన్నో నోముల తర్వాత పండిన పంట అది. ఒడి నిండినట్టే నిండిందిగానీ... ఒడిబియ్యంలో సగం జారిపోయింది. పాప తల్లిదండ్రుల వయసుపరంగా, లేదా మరేరకంగా చూసినా ఆ బంగారు తల్లిని కాపాడుకోక తప్పని పరిస్థితి. కొంగున మిగిలింది సగం బంగారమే కావడంతో ఇప్పుడా కొంగుబంగారం మరీ మరీ అపురూపం. కానీ పాప బరువు అరకిలో కంటే మరో 50 గ్రాములు తక్కువే. వైద్యసిబ్బందికి ఇదో సవాల్‌గా మారింది.

తొలినాళ్లలో కుటుంబ స్నేహితుడి సాయంతో సంభాషణలు...

పాప తల్లిదండ్రులిద్దరూ మూగ, వినికిడి సమస్య ఉన్నవారైనప్పటికీ వైద్యులకు వారితో



● తల్లి, చిన్నారితో వైద్య సిబ్బంది

సంభాషించడం తప్పదు. తొలి నాళ్లలో రాజ్‌కుమార్‌కు తెలిసిన ఓ అబ్బాయే ఆ దంపతులకూ, వైద్య సిబ్బందికి మధ్య సంజ్ఞావారధిగా నిలబడ్డాడు. అతడో కాలేజీ విద్యార్థి. సంజ్ఞల భాష (సైన్ లాంగ్వేజ్)తో సంభాషణలు జరిపేవాడు. కొన్నాళ్ల సెలవు తర్వాత రాజ్‌కుమార్ తన విధులకు హాజరవ్వక తప్పనిస్థితి. తండ్రి ఆఫీసులో, తల్లి ఆసుపత్రిలో. సంజ్ఞల వారధి తన చదువుల్లో, తన పనుల్లో మరో చోట. అయినప్పటికీ ఎలాగోలా పేపర్ల మీద రాసిచూపుతూనో, వీడియో కాల్స్ ద్వారానో సంభాషణలు కొనసాగుతున్నాయి.

ఇంతలో ఇంటర్‌ప్రెటర్‌గా ఉన్న వ్యక్తికి పరీక్షలు వచ్చాయి. ఎప్పుడు పడితే అప్పుడు మాట్లాడేందుకు అవకాశం లేకపోయింది. ఆసుపత్రిలో చేర్చిన తొలినాళ్లలో రాజ్‌కుమార్ కొందరు వైద్యసిబ్బందికి సంకేతభాష (సైన్ లాంగ్వేజీ) నేర్పించేందుకు కొంత ప్రయత్నించారు. అప్పుడెవ్వరికీ దాని అవసరం అంతగా ఉన్నట్లు తోచలేదు. కానీ ఇప్పుడు తప్పని స్థితి!

మేము, మా సిబ్బంది అవసరమైన మేరకు సైన్‌లాంగ్వేజీలో పరిజ్ఞానం సంపాదించాం...



పాపను రక్షించుకునేందుకు సైన్ లాంగ్వేజ్ నేర్చుకోక తప్పలేదు. కొందరిలో కొత్తభాషను నేర్చుకునే పరిజ్ఞానం ఎక్కువగా ఉంటుంది కదా. అలాంటి వారు ఇతరులకు నేర్పారు. ఇలా ఆ టీమ్‌లోని పదిమంది డాక్టర్లలో ఐదారుగురు, నర్సుల్లో నలుగురైదుగురు, ఇతర సిబ్బందిలో మరికొందరు... తల్లిదండ్రులకు అవసరమైన మేరకు వివరాలను సూచించేంతగా సైన్‌లాంగ్వేజీలో ప్రాక్టీస్ సాగించారూ, నైపుణ్యం సాధించారు. చిన్నారిని బతికించుకున్నారు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ సమయంలో కంటి పరీక్షలూ, న్యూరో... ఇలా అన్ని రకాల పరీక్షలూ నిర్వహించాం. మరీ ముఖ్యంగా వినికిడి పరీక్షలు. ఆ చిన్నారిలో ఎలాంటిలోపాలూ లేవు. అన్నీ నార్మల్.

– డాక్టర్ అపర్ణ, క్లినికల్ డైరెక్టర్–నియోనేటాలజీ

ఇక డాక్టర్లూ, వైద్యసిబ్బందీ సంభాషించక తప్పలేదు...

పాపకు జరిగే వైద్య పరీక్షల గురించి తల్లిదండ్రులకు చెప్పాలి. చిన్నారి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలనూ, చేపట్టాల్సిన విధానాల్ని తల్లికి వివరించాలి. పాలు పట్టాల్సినప్పటి ప్రక్రియలను, ఆహారమివ్వాల్సిన తీరుతెన్నులను, బిడ్డను తల్లిగుండెలకు దగ్గరగా ఉంచేందుకు అనుసరించాల్సిన 'కంగారూ కేర్' ప్రక్రియల్ని విపులీకరించాలి. ఇందుకు ఇరువురికీ అర్థమ్యే భాష కావాలి. కానీ ఎలా?

పది రోజుల్లో అవసరమైనమేరకు శిక్షణ...

తొలినాళ్లలో రాజ్‌కుమార్ తమకు కొన్ని బేసిక్స్ నేర్పడానికి ప్రయత్నించడం గుర్తొచ్చింది. అంతే... చిన్నారిని కాపాడుకునేందుకు అవసరమైన మేరకు సైన్ లాంగ్వేజ్‌ను ఆయననుంచే నేర్చుకోవాలని నిర్ణయించుకున్నారు మెడికల్ టీమ్‌లోని కొందరు.

మొత్తం పది మంది వైద్యబృందంలో కొందరు డాక్టర్లు, మరి కొందరు నర్సులూ, ఇంకొందరు సహాయక వైద్య సిబ్బంది సంజ్ఞా భాష నేర్చుకోవడం మొదలుపెట్టారు. దాదాపు పదిరోజుల్లో సైగల భాషలోని అల్ఫాబెట్స్, సంఖ్యలూ, రోజులూ, వారాల పేర్లు, ఇతర వివరాలను కష్టపడి నేర్చుకున్నారు. కమ్యూనికేట్ చేస్తున్నారు.

తొలి విజయం ఆ మృత్యుంజయురాలిదే...

గత ఏడాది ఆగస్టులో ఆసుపత్రిలో చేరిన ఆ తల్లి దాదాపు మూడు నెలల పాటు (సరిగ్గా చెప్పాలంటే 79 రోజులు) ఆసుపత్రిలో ఉండాల్సి వచ్చింది. కేవలం 450 గ్రాములున్న ఆ చిన్నారి క్రమంగా 1200 గ్రాములకు చేరింది. నవంబరులో డిశ్చార్జ్ నాటికి ఆ పాప బరువు 1800 గ్రాములు. మనుగడ పోరాటంలో తొలి అవరోధాలన్నింటినీ అధిగమించింది... బతుకుకు అడ్డంకి లేని బరువు సాధించింది. ప్రస్తుతం తనకు 4 నెలల వయసు. డాక్టర్ల అంచనాల ప్రకారం... అందరిలాగే మరో మూడు–నాలుగు నెలల్లో ముద్దు మాటలు (బ్యాబ్లింగ్స్) మొదలుపెట్టాలి. అందుకు వైద్యపరంగా ఎలాంటి అవరోధాలూ, అడ్డంకులూ లేవు. ప్రస్తుతానికి... ముందు ముద్దులు మూటగడుతోంది. ముమ్ముందు మాటలు దండగట్టాల్సి ఉంది.

– యాసీన్

● ముగ్గు–ముచ్చట

ముగ్గులకు ఆహ్వానం

ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు–ముచ్చట, సాక్షి ఫ్యామిలీ,
సాక్షి టవర్స్, రోడ్ నెం.1,
బంజారాహిల్స్, హైదరాబాద్–34.
ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com





బి. రామలక్ష్మి
కల్లూరు,
ఖమ్మం జిల్లా

22 చుక్కలు
సరి చుక్క
2 వచ్చేవరకు





కాసర లక్ష్మీ సరోజారెడ్డి
జంగారెడ్డి గూడెం

21 చుక్కలు
మధ్యచుక్క
11 వచ్చేవరకు



50 అనివార్య ఖర్చులు 30 సరదా ఖర్చులు 20 పొదుపు

ట్రెండ్స్ స్థిరంగా ఉండనట్లే ఆలోచనలు, అభిప్రాయాలు కూడా స్థిరంగా ఉండవు. జెన్ జెడ్, మిలీనియల్స్ కొత్త ప్రయాణం కొత్త సంవత్సరంలో ఎలా ఉండబోతుంది? యోలో(వైవోఎల్‌వో–యూ వోన్లీ లివ్ వన్స్) సెగ్మెంట్‌లో ఉన్న యువతరం అవసరానికి మించి ఖర్చు చేయడానికి తప్ప 'ఆర్థిక భద్రత'కు పెద్దగా ప్రాధాన్యత ఇచ్చేది కాదు. అయితే ఈ ధోరణిలో ఇప్పుడిప్పుడే మార్పు వస్తోంది. 'యోలో' నుంచి 50–30–20 కాన్సెప్ట్ వైపు ప్రయాణించడానికి యువతరం ఆసక్తి చూపుతున్నారు...

సినిమాల గురించి తప్ప మరో లోకంతో సంబంధం లేనట్లుగా ఉండే మిలీనియల్స్, జెన్ జెడ్ ఇప్పుడు సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ నుంచి పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ వరకు ఎన్నో విషయాలపై ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్(ఎస్‌ఐపీ) అనేది మ్యూచువల్ ఫండ్స్‌లో నిర్ణీత మొత్తాన్ని నెలవారీ లేదా త్రైమాసికం చొప్పున పెట్టుబడిగా పెట్టే ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజీ. పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్(పిపిఎఫ్) అనేది ఆకర్షణీయమైన వడ్డీ రేట్లు, ట్యాక్స్ బెనిఫిట్స్‌ను అందించే దీర్ఘకాలిక పొదుపు పథకం. పదిహేను సంవత్సరాల లాక్–ఇన్ వ్యవధిని కలిగి ఉన్న ప్రభుత్వ పథకం ఇది.

'హెల్త్ ఇన్సూరెన్స్' అనే మాట వినబడగానే 'ఇది నాకు సంబంధించిన విషయం కాదు' అన్నట్లుగా పట్టించుకునే వారు కాదు చాలా మంది. 'హెల్త్ ఇన్సూరెన్స్' అనేది వయసు మళ్లిన వారికి సంబంధించిన విషయం అన్నట్లుగా ఉండేవారు. అయితే ఇప్పుడు సీన్ మారింది. ఎర్లీ ఏజ్‌లోనే హెల్త్ ఇన్సూరెన్స్ చేయడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి తగిన అవగాహనతో ఉన్నారు. అన్ ఎక్స్‌పెక్టెడ్ మెడికల్ సిచ్యువేషన్స్‌ను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక బడ్జెట్ కేటాయించుకుంటున్నారు. యాన్యువల్ హెల్త్‌బడ్జెట్‌ను ప్లాన్ చేసుకుంటున్నారు. మార్కెట్‌లో అందుబాటులో ఉన్న 'పర్సనల్ యాక్సిడెంట్ హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్స్'పై ఆసక్తి చూపుతున్నారు. 'సరైన ఆరోగ్య బీమా పథకాన్ని ఎంపిక చేసుకోవడం అనేది జీవన ప్రయాణానికి దిక్సూచి లాంటిది' అనే మాటను దృష్టిలో పెట్టుకొని హడావిడిగా కాకుండా ఆచితూచి సరియైన హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్‌ను ఎంచుకుంటున్నారు.



'ఫైనాన్షియల్ ప్లాన్' అనే మాట వినబడగానే ఒకప్పుడు యువతరం నోటి నుంచే వచ్చే మాటలు...

'అబ్బే! అంత టైమ్ లేదు'

'ఫైనాన్షియల్ విషయాలు నాకు బొత్తిగా తెలియవు'

ఇప్పుడు మాత్రం 'బొత్తిగా తెలియదు' అనుకునే విషయాలపై టైమ్ చేసుకొని మరీ ఎన్నో విషయాలు తెలుసుకుంటున్నారు. ఈ క్రమంలో మిలీనియల్స్, జెన్ జెడ్‌ను బాగా ఆకట్టుకున్న కాన్సెప్ట్ 50–30–20

'50–30–20' కాన్సెప్ట్ ప్రకారం సంపాదించే జీతంలో అనివార్య ఖర్చులకు 50 శాతం ఖర్చుచేయాలి. ఇంటి అద్దె నుంచి భోజన ఖర్చు వరకు ఇందులో ఉంటాయి. వ్యక్తిగత అవసరాలు, సరదాల కోసం 30 శాతం ఖర్చు చేయాలి. ట్రెండీ దుస్తులు కొనుక్కోవడం నుంచి సినిమాలు చూడడం వరకు ఇందులో వస్తాయి. 20 శాతం మాత్రం తప్పనిసరిగా పొదుపు చేయాలి.

'మిలీనియల్స్‌లో చాలా మంది ఇన్సూరెన్స్‌ల గురించి పట్టించుకోవడం లేదు. అనారోగ్యం లేదా ప్రమాదం జరిగిన సందర్భాల్లో మన ఖజానా అంతా ఖాళీ అవుతుంది. దిక్కు తోచని పరిస్థితి ఏర్పడుతుంది. అందుకే లైఫ్, హెల్త్, ఆటో ఇన్సూరెన్స్‌పై మిలీనియల్స్ తప్పనిసరిగా దృష్టి పెట్టాలి' అంటున్నాడు ఫైనాన్షియల్ ఎక్స్‌పర్ట్ శరద్ కోహ్లీ. శరద్ సలహా చదివి మారిన వారిలో తేజస్విని ఒకరు. దిల్లీకి చెందిన తేజస్వినికి ఇన్సూరెన్స్ పాలసీల గురించి ఆసక్తి, అవగాహన లేదు. ఇప్పుడు మాత్రం రకరకాల పాలసీల గురించి తెలుసుకునే ప్రయత్నం చేస్తోంది.

ఉద్యోగాలు చేస్తున్న మిలీనియల్స్, జెన్ జెడ్ దగ్గర 'ఇన్వెస్ట్‌మెంట్ ఫర్ రిటైర్‌మెంట్' ప్రస్తావన తెస్తే పెద్దగా నవ్వుతారు లేదా 'రిటైర్‌మెంట్ గురించి ఇప్పటి నుంచే ఆలోచించడం ఎందుకు!' అన్నట్లుగా మాట్లాడుతారు. అయితే ఈ ధోరణిలో కూడా మెల్లగా మార్పు వస్తుంది.

'రిటైర్‌మెంట్ లేదా భవిష్యత్ కోసం దాచుకున్న డబ్బు అత్యవసర సమయాల్లోనే కాదు విదేశీ ప్రయాణం చేయాలి లాంటి చిరకాల కలలను నిజం చేసుకోవడానికి ఉపయోగపడవచ్చు. ప్రతి ఉద్యోగి ఏదో ఒకరోజు రిటైర్ కావాల్సిందే. కొన్ని సమయాల్లో ముందస్తు పదవీ విరమణ తప్పనిసరి కావచ్చు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఇన్వెస్ట్ ఫర్ రిటైర్‌మెంట్‌ను తప్పనిసరిగా దృష్టిలో పెట్టుకోవాలి' అంటున్నాడు శరద్ కోహ్లీ.

స్టాక్ మార్కెట్ నుంచి మనీ మేనేజ్‌మెంట్ వరకు

సోషల్ మీడియాలో ఎంటర్‌టైన్‌మెంట్‌కు మాత్రమే యువత ప్రాధాన్యత ఇస్తుంది. స్టాక్‌మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్‌లాంటి మాటలు వినబడితే దూరంగా పారిపోయే వారిని కూడా తన మాటలతో, రాతలతో ఆకట్టుకొని నాలుగు మంచి విషయాలు చెబుతుంది నేహా నగార్. ఎంబీయే చేసిన నేహా స్టార్ ఫైనాన్షియల్ ఇన్‌ఫ్లుయెన్సర్‌గా యువతలో ఎంతోమంది ఆలోచనల్లో మార్పు తీసుకువచ్చింది. స్టాక్‌మార్కెట్, క్రిప్టో కరెన్సీ, ట్యాక్సేషన్, ట్రేడింగ్ నుంచి మనీ మేనేజ్‌మెంట్ వరకు ఎన్నో విషయాలను సులభంగా అర్థం అయ్యేలా చెబుతుంది. 'మనం ఎలా చెబుతున్నాం అనేదానిపై అవతలి వారి ఆసక్తి ఆధారపడి ఉంటుంది. ఆకట్టుకునేలా, సులభంగా అర్థమయ్యేలా చెప్పగలితే వారు మరిన్ని విషయాలు తెలుసుకోవడానికి ఆసక్తి చూపుతారు' అంటుంది నేహా నగార్.





నేహా నాగర్
ఫైనాన్షియల్ ఇన్‌ఫ్లుయెన్సర్



నాదల్ ఖాతాలో తొలి విజయం

తుంటి గాయం నుంచి కోలుకున్న స్పెయిన్ టెన్నిస్ దిగ్గజం రాఫెల్ నాదల్ కొత్త ఏడాదిలో తొలి విజయం అందుకున్నాడు. బ్రిస్బేన్ ఓపెన్ టోర్నీ పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో నాదల్ 7-5, 6-1తో ప్రపంచ మాజీ మూడో ర్యాంకర్ డొమినిక్ థీమ్ (ఆస్ట్రేలియా)పై గెలిచాడు. గత ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో రెండో రౌండ్‌లో ఓడిపోయాక నాదల్ తుంటి గాయంతో మరే టోర్నీలోనూ ఆడలేదు. బ్రిస్బేన్ ఓపెన్‌తో పునరాగమనం చేసిన నాదల్ ఇదే టోర్నీ డబుల్స్‌లోనూ బరిలోకి దిగి తొలి రౌండ్‌లోనే ఓడిపోయాడు. సింగిల్స్‌లో మాత్రం శుభారంభంతో ప్రీక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు.

రిత్విక్ జోడీ శుభారంభం



థాయ్‌లాండ్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ డబుల్స్‌లో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. బ్యాంకాక్‌లో మంగళవారం జరిగిన డబుల్స్ తొలి రౌండ్‌లో రిత్విక్ చౌదరీ-నిక్కీ పునాచా (భారత్) ద్వయం 6-3, 6-1తో సెచినాటో-ఫోనియో (ఇటలీ) జోడీని ఓడించింది. ఇదే టోర్నీలో ఆడుతున్న సాకేత్ మైనేని-రామ్‌కుమార్ జంట తొలి రౌండ్‌లో 5-7, 6-3, 8-10తో రే హో (చైనీస్ తైపీ)-యున్ సేంగ్ చుంగ్ (కొరియా) ద్వయం చేతిలో ఓడిపోయింది.

సమం చేస్తారా... అప్పగిస్తారా!



రోహిత్ శర్మ

దక్షిణాఫ్రికాలో గతంలో ఎనిమిదిసార్లు పర్యటించినా... భారత జట్టు ఒక్కసారి కూడా సిరీస్ గెలవలేకపోయింది... ఈసారీ ఆ అవకాశం ఇప్పటికే చేజారింది. అయితే గత రెండు పర్యటనల్లో కనీసం ఒక్క టెస్టు మ్యాచ్ అయినా విజయం సాధించగలిగింది. 2013లో మాత్రమే విజయం లేకుండా రిక్తహస్తాలతో తిరిగొచ్చింది. తొలి టెస్టు ఓడినా... ఇప్పుడు తమ స్థాయికి తగ్గ ఆటతో చెలరేగి టీమిండియా సిరీస్‌ను సమం చేస్తుందా లేక విజయం లేకుండా వెనుదిరుగుతుందా అనేది చూడాలి. మ్యాచ్ జరిగే న్యూలాండ్స్ మైదానంలో ఆరు ప్రయత్నాల్లో ఒక్కసారి గెలవలేకపోవడం రికార్డుపరంగా భారత్‌కు ప్రతికూలాంశం కూడా.

నేటి నుంచి దక్షిణాఫ్రికాతో భారత్ రెండో టెస్టు	సిరీస్ కాపాడుకునే ప్రయత్నంలో టీమిండియా	జోరు మీదున్న సఫారీ టీమ్	మధ్యాహ్నం గం.1:30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

కేప్‌టౌన్: తొలిసారి సఫారీ గడ్డపై సిరీస్ గెలిచే సంకల్పంతో బరిలోకి దిగిన భారత జట్టు పేలవ ప్రదర్శనతో తొలి టెస్టులో ఇన్నింగ్స్ తేడాతో ఓడింది. ఇప్పుడు దానిని మరచి ప్రత్యర్థిపై పైచేయి సాధించేందుకు మరో అవకాశం వచ్చింది. మరోవైపు సొంతగడ్డపై జోరు మీదున్న సఫారీ టీమ్ క్లీన్‌స్వీప్ లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. ఈ నేపథ్యంలో నేటినుంచి జరిగే రెండో టెస్టులో భారత్, దక్షిణాఫ్రికా తలపడనున్నాయి. భారత్ మ్యాచ్ ఓడినా, 'డ్రా' అయినా సిరీస్ కోల్పోతుంది. కాబట్టి సమం చేయాలంటే టెస్టులో గెలవడం తప్పనిసరి.

జట్టులోకి జడేజా...

తొలి టెస్టులో ఒక్కో ఇన్నింగ్స్‌లో రాహుల్, కోహ్లి ప్రదర్శన మినహా చెప్పుకోవడానికేమీ లేదు. మన జట్టు రెండు ఇన్నింగ్స్‌లు కలిపి కూడా దక్షిణాఫ్రికా ఒక ఇన్నింగ్స్‌లో ఆడినన్ని ఓవర్లు ఆడలేకపోయింది. యశస్వి, గిల్, శ్రేయస్‌ల బ్యాటింగ్ వైఫల్యం భారత్ పరాజయంలో ఒక కారణంగా నిలిచింది. కెప్టెన్ రోహిత్ కూడా విఫలం కావడం జట్టుపై ప్రభావం చూపించింది. దక్షిణాఫ్రికా గడ్డపై రోహిత్ రికార్డు చాలా పేలవం. 10 ఇన్నింగ్స్‌లలో కలిపి అతను 128 పరుగులే చేశాడు. ఇక్కడ చివరి సిరీస్ ఆడబోతున్న రోహిత్ శర్మ ఈ మ్యాచ్‌లోనైనా ఘనంగా ముగింపు ఇవ్వాలని పట్టుదలగా ఆడితే భారత్‌కు శుభారంభం లభిస్తుంది. తొలి టెస్టులో చక్కటి షాట్లతో ఆకట్టుకున్న కేఎల్ రాహుల్, విరాట్ కోహ్లి తమ ఫామ్‌ను కొనసాగించడం కీలకం. గాయంతో గత మ్యాచ్‌కు దూరమైన జడేజా ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగనుండటం జట్టుకు సానుకూలాంశం. జడేజా కోసం అశ్విన్‌ను పక్కన పెట్టవచ్చు. అయితే ఆల్‌రౌండర్‌గా శార్దుల్ ఠాకూర్ స్థానంపై గత మ్యాచ్ ప్రదర్శన సందేహాలు రేకెత్తించింది. బౌలింగ్‌లో పూర్తిగా విఫలమైన అతని స్థానంలో రెగ్యులర్ పేస్ బౌలర్‌ను తీసుకోవాలా లేక అశ్విన్‌ను రెండో స్పిన్నర్‌గా కొనసాగించాలా అనే దానిపై టీమ్ మేనేజ్‌మెంట్ తేల్చుకోలేకపోతోంది. టాపార్డర్ విఫలమైతే చివర్లో కొన్ని పరుగులు కావాలంటే శార్దుల్ సరైన ప్రత్యామ్నాయంగా కనిపిస్తున్నాడు. పేసర్ ప్రసిధ్ కృష్ణ ఘోరంగా విఫలమైనా... ఒక్క మ్యాచ్‌కే అతనిపై వేటు వేయడం సరైన ఆలోచన కాదు. కెప్టెన్ రోహిత్ శర్మ మాటలను బట్టి చూసినా ప్రసిధ్‌కు మరో అవకాశం దక్కవచ్చు. ఓవరాల్‌గా బ్యాటింగ్‌పరంగా భారత్ సరైన స్థితిలోనే కనిపిస్తున్నా...బౌలింగ్‌లో మెరుగైతేనే విజయావకాశాలు ఉంటాయి.

కొయెట్జీ స్థానంలో ఎన్‌గిడి

'నాకు సంబంధించి ఇదే వరల్డ్ కప్. అందుకే విజయంతో ఘనంగా ముగిద్దామనుకుంటున్నా'... తన చివరి టెస్టులో కెప్టెన్‌గా వ్యవహరించున్న డీన్ ఎల్గర్ వ్యాఖ్య ఇది. గత మ్యాచ్‌లోనూ సెంచరీతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన ఎల్గర్ సిరీస్‌ను 2-0తో గెలుచుకోవాలని పట్టుదలగా ఉన్నాడు. కేప్‌టౌన్‌లో తమ రికార్డు కూడా ఆ జట్టులో ఉత్సాహం పెంచుతోంది. ఎల్గర్‌తో పాటు జోర్జి ఫామ్‌లో ఉండగా బెడింగామ్ తనను తాను నిరూపించుకున్నాడు. సీనియర్ మార్క్‌రమ్‌తో పాటు పీటర్సన్ కూడా రాణిస్తే భారీ స్కోరు ఖాయం. గాయపడి మ్యాచ్‌కు దూరమైన బవుమా స్థానంలో హమ్జాకు చోటు దక్కింది. బౌలింగ్‌లో సఫారీ మరింత పదునుగా కనిపిస్తోంది. ఈ మైదానంలో 20.95 సగటుతో 42 వికెట్లు తీసిన ఘనమైన రికార్డు రబడ సొంతం. బర్గర్ తొలి టెస్టులోనే సత్తా చాటాడు. గాయపడిన కొయెట్జీ స్థానంలో ఎన్‌గిడి వస్తాడు. భారత్‌ను ఈ పేస్ బలగం తీవ్రంగా ఇబ్బంది పెట్టవచ్చు. స్పిన్నర్ లేకుండా టీమ్ బరిలోకి దిగే చాన్స్ ఉంది.



దక్షిణాఫ్రికా కెప్టెన్ ఎల్గర్

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ శర్మ (కెప్టెన్), యశస్వి, గిల్, కోహ్లి, శ్రేయస్, రాహుల్, జడేజా, శార్దుల్, బుమ్రా, సిరాజ్, ప్రసిధ్.

దక్షిణాఫ్రికా: ఎల్గర్ (కెప్టెన్), మార్క్‌రమ్, జోర్జి, పీటర్సన్, హమ్జా, బెడింగామ్, వెరీన్, జాన్సెన్, ఎన్‌గిడి, రబడ, బర్గర్.

పిచ్, వాతావరణం

మ్యాచ్‌కు ముందు రోజు పిచ్‌పై పచ్చిక కనిపిస్తోంది. తొలి రోజు వాతావరణాన్ని బట్టి చూస్తే సీమర్లు ప్రభావం చూపించగలరు. ఆ తర్వాత బ్యాటింగ్‌కు అనుకూల పరిస్థితులు ఉన్నాయి. టెస్టుకు వర్ష సూచన లేదు.

భారత్ 0... ఆసీస్ 3

- చివరి వన్డేలోనూ ఓడిన భారత మహిళల జట్టు
- సిరీస్‌ను 3–0తో క్లీన్‌స్వీప్ చేసిన ఆస్ట్రేలియా



లిచ్‌ఫీల్డ్



హర్మన్

ముంబై: భారత మహిళల జట్టు కొత్త ఏడాదిని భారీ పరాజయంతో ప్రారంభించింది. ఆస్ట్రేలియాతో మంగళవారం జరిగిన చివరిదైన మూడో వన్డేలో టీమిండియా ఏకంగా 190 పరుగుల తేడాతో ఓడిపోయింది. వరుసగా మూడో విజయంతో ఆస్ట్రేలియా సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 338 పరుగుల భారీస్కోరు చేసింది. భారత జట్టుపై ఆస్ట్రేలియాకిదే అత్యధిక స్కోరు కావడం విశేషం. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'... 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' ఫోబీ లిచ్‌ఫీల్డ్ (125 బంతుల్లో 119; 16 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ అలీసా హీలీ (85 బంతుల్లో 82; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) చెలరేగి తొలి వికెట్‌కు 189 పరుగులు జోడించారు. వన్డేల్లో భారత జట్టుపై ఏ వికెట్‌కైనా ఇదే అత్యధిక భాగస్వామ్యం కావడం గమనార్హం. భారత బౌలర్లలో శ్రేయాంక 3, అమన్‌జోత్ 2 వికెట్లు తీశారు. 339 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ 32.4 ఓవర్లలోనే 148 పరుగులకే కుప్పకూలింది. బ్యాటర్లు మూకుమ్మడిగా చేతులెత్తేశారు. స్మృతి మంధాన (29; 5 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా, జెమీమా రోడ్రిగ్స్ (25; 3 ఫోర్లు), దీప్తి శర్మ (25 నాటౌట్; 2 ఫోర్లు)లు 20 పైచిలుకు స్కోర్లు చేశారంతే! కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (3) వరుసగా మూడో మ్యాచ్‌లోనూ విఫలమైంది. వేర్‌హమ్ 3, మేగన్ షుట్, అలానా కింగ్, అనాబెల్ సదర్లాండ్ తలా 2 వికెట్లు తీశారు.

దబంగ్ ఢిల్లీ పైచేయి

నోయిడా: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో దబంగ్ ఢిల్లీ జట్టు ఐదో విజయం నమోదు చేసింది. గుజరాత్ జెయింట్స్‌తో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో దబంగ్ ఢిల్లీ 35-28తో గెలిచింది. ఢిల్లీ తరఫున అశు మలిక్ 11 పాయింట్లు, మంజీత్ 9 పాయింట్లు స్కోరు చేశారు. నేడు జరిగే మ్యాచ్‌ల్లో హరియాణా స్టీలర్స్‌తో జైపూర్ పింక్ పాంథర్స్; పుణేరి పల్టన్‌తో యూపీ యోధాస్ తలపడతాయి.

పాయింట్ల పట్టిక PKL

జట్టు	ఆ	గె	ఓ	టై	పా
పుణేరి పల్టన్	8	7	1	0	36
గుజరాత్ జెయింట్స్	10	6	4	0	34
దబంగ్ ఢిల్లీ	9	5	3	1	30
జైపూర్ పింక్ పాంథర్స్	8	4	2	2	28
పట్నా పైరేట్స్	9	5	4	0	27
యు ముంబా	7	5	2	0	26
హరియాణా స్టీలర్స్	8	5	3	0	26
బెంగళూరు బుల్స్	10	4	6	0	25
బెంగాల్ వారియర్స్	9	3	4	2	22
యూపీ యోధాస్	10	3	6	1	21
తమిళ్ తలైవాస్	9	2	7	0	13
తెలుగు టైటాన్స్	9	1	8	0	8

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు

ప్లీజ్... నా క్యాప్ ఇవ్వండి

చోరీకి గురైన బ్యాగీ గ్రీన్ టోపీ కోసం ఆసీస్ స్టార్ డేవిడ్ వార్నర్ వినతి



సిడ్నీ: ఆస్ట్రేలియా డాషింగ్ బ్యాటర్ డేవిడ్ వార్నర్ కెరీర్‌లో ఆఖరి టెస్టు కోసం బరిలోకి దిగాల్సిన సమయంలో చేదు అనుభవాన్ని ఎదుర్కొంటున్నాడు. క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) టెస్టు క్రికెట్ కోసం క్రికెటర్లకు 'బ్యాగీ గ్రీన్' టోపీలు ఇస్తుంది. ఇవి ఎందుకంత ప్రత్యేకమంటే వీటిని అరంగేట్రం చేసే మ్యాచ్‌లో మాత్రమే ఇస్తారు. ఆసీస్ క్రికెటర్లకు అదెంతో అమూల్యమైంది. ఇది వరకే రిటైర్మెంట్ ప్రకటించిన 37 ఏళ్ల వార్నర్ బుధవారం నుంచి పాకిస్తాన్‌తో ఆఖరి టెస్టు మ్యాచ్ ఆడనున్నాడు. అయితే అతని బ్యాక్‌ప్యాక్ నుంచి రెండు బ్యాగీ గ్రీన్ క్యాపుల్ని ఎవరో దొంగిలించారు. 2017లోనూ చోరీకి గురవడంతో బోర్డు మరో క్యాప్ ఇచ్చింది. పాత టోపీ మళ్లీ దొరకడంతో అతని వద్ద రెండు క్యాప్‌లున్నాయి. తాజాగా ఆ టోపీలు చోరీకి గురవడంతో వార్నర్ వీడ్కోలు టెస్టుకు ముందు సోషల్ మీడియాలో వేడుకోలు చేసుకున్నాడు. 'క్రికెట్ కిట్‌లో కాకుండా నా బ్యాక్‌ప్యాక్ బ్యాగులో పెట్టుకున్న రెండు క్యాపులు చోరీకి గురయ్యాయి. ఎవరైనా వాటిని తీసుకొని ఉంటే దయచేసి నాకు ఇవ్వండి' అని వార్నర్ వీడియో పోస్ట్ చేశాడు.

సినిమా

టీజర్ రెడీ



● జీవా, మమ్ముట్టి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి పాదయాత్ర నేపథ్యంలో వచ్చిన చిత్రం 'యాత్ర'. ఈ సినిమాకు సీక్వెల్‌గా 'యాత్ర 2' ఫిబ్రవరి 8న రిలీజ్ కానుంది. వైఎస్సార్ తనయుడు, ఏపీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రజా నాయకుడిగా ఎదిగిన తీరు, 2009 నుంచి 2019 వరకు ఆంధ్రప్రదేశ్‌లో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో 'యాత్ర 2' ఉంటుంది. ఈ చిత్రంలో వైఎస్ రాజశేఖర రెడ్డి పాత్రలో మమ్ముట్టి, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాత్రలో జీవా నటిస్తున్నారు. మహి వి. రాఘవ తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా టీజర్‌ను ఈ నెల 5న రిలీజ్ చేయనున్నట్లు వెల్లడించి, ఓ కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేసింది చిత్రబృందం. ''ఒక మనిషి, లక్షల సమస్యలు.. అయినా ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలి'' అంటూ 'యాత్ర 2' టీజర్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను షేర్ చేసింది యూనిట్. త్రీ ఆటమ్ లీవ్స్, వీ సెల్యులాయిడ్‌తో కలిసి శివ మేక ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

థ్రిల్లర్ షురూ



● వరుణ్ సందేశ్

వరుణ్ సందేశ్ హీరోగా నటిస్తున్న కొత్త చిత్రం మంగళవారం ప్రారంభమైంది. అద్వాన్ హర్ష దర్శకత్వంలో మహర్షి కూండ్ల సమర్పణలో మహేంద్రనాథ్ కూండ్ల ఈ సినిమాను నిర్మిస్తున్నారు. తొలి సన్నివేశానికి వరుణ్ సందేశ్ క్లాప్ ఇవ్వగా, సినిమాటోగ్రాఫర్ అజయ్‌కుమార్ చిత్రీకరించారు. వరుణ్ సందేశ్ మాట్లాడుతూ– ''సరికొత్త కథాంశంతో తీస్తున్న సినిమా ఇది. నా గత చిత్రాలకు ఈ సినిమా పూర్తి భిన్నంగా ఉంటుంది'' అన్నారు. ''విభిన్నమైన థ్రిల్లర్ ఫిల్మ్ ఇది'' అన్నారు అద్వాన్ హర్ష. ''ప్రేక్షకులకు కొత్త అనుభూతినిచ్చే చిత్రమిది'' అన్నారు మహేంద్రనాథ్.

అలాంటి జీవితం అంటే ఇష్టం

''నాకు నచ్చింది చేయడం ఇష్టం. మనకు నచ్చింది చేయాలనుకున్నప్పుడు జీవితంలో ఎన్ని సమస్యలు ఉన్నా వాటిని బ్యాలెన్స్ చేసుకోగలుగుతామని నా నమ్మకం. నాపై నాకు ఆ భరోసా ఉంది'' అని అంటున్నారు హాలీవుడ్ నటి, సింగర్ ఎల్నాజ్ నోరౌజీ. హిందీ, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో వెబ్ సిరీస్‌లు, సినిమాలు చేసిన ఈ హాలీవుడ్ బ్యూటీ ఇటీవల 'డెవిల్' సినిమాతో తెలుగు తెరపై మెరిశారు. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో నోరౌజీ మాట్లాడుతూ– ''ఇరాన్‌లో పుట్టిన నేను, జర్మనీలో పెరిగాను. నా చిన్నప్పట్నుంచి హాలీవుడ్, బాలీవుడ్ సినిమాలు చూస్తూ పెరిగాను. బాలీవుడ్ సినిమాల్లో నటించాలన్న నా కలను నెరవేర్చుకున్నాను. టెలివిజన్‌లో కొన్ని షోలు చేశాను. ఎనిమిదేళ్లుగా ఇండియాలోనే ఉంటున్న నేను ఇప్పుడు సౌత్ సినిమాలు చేయాలనుకుంటున్నాను. 'డెవిల్' సినిమాలోని ఓ స్పెషల్ సాంగ్‌తో తెలుగు ప్రేక్షకులకు దగ్గర కావడం హ్యాపీగా ఉంది. తెలుగు ప్రేక్షకుల ఆదరణ నాకు దక్కిందనే భావిస్తున్నాను. హిందీలో నవాజుద్దీన్ సిద్ధిఖీతో నేను చేసిన 'సంగీన్' అనే ఓ థ్రిల్లర్ ఫిల్మ్ రిలీజ్‌కు సిద్ధం అవుతోంది. 'రాణీతి' అనే వెబ్ సిరీస్ ఉంది. 'వోహ్' అనే సాంగ్ చేస్తున్నాను. మరికొన్ని ప్రాజెక్ట్స్ ఉన్నాయి'' అన్నారు.



● ఎల్నాజ్ నోరౌజీ

బాలరాజు వస్తున్నాడు



● సోహైల్

'బిగ్ బాస్' ఫేమ్ సోహైల్ టైటిల్ రోల్ చేస్తున్న చిత్రం 'బూట్‌కట్ బాలరాజు'. శ్రీ కోనేటి దర్శకత్వంలో ఎండీ పాషా నిర్మించారు. ఫిబ్రవరి 2న ఈ సినిమాను ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ చేస్తున్నట్లుగా మంగళవారం ప్రకటించారు. మేఘా లేఖ, సునీల్, సిరి హన్మంత్, ఇంద్రజ కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాకు భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు. ''ఇప్పటికే విడుదలైన మా సినిమా టీజర్, పాటలకు మంచి స్పందన లభిస్తోంది. సినిమా కూడా ప్రేక్షకులను అలరిస్తుంది'' అని యూనిట్ పేర్కొంది.

సందేశంతో...



● ప్రణయనాథ, మధుబాల

ప్రణయనాథ హీరోగా నటించి, నిర్మించిన చిత్రం 'ల్యాండ్ మాఫియా'. మధుబాల హీరోయిన్, బాబు వీఎస్ దర్శకత్వం వహించారు. శ్రీ లక్ష్మీ పిక్చర్స్‌పై విడుదల కానున్న ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. దర్శక–నిర్మాత సునీల్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ– ''నా మిత్రుడు ఎక్కలి రవీంద్ర బాబు వల్ల ఈ టీమ్‌ను కలిశాను. ఈ సినిమా విజయం సాధించి, యూనిట్‌కు పెద్ద పేరు తీసుకురావాలి'' అన్నారు. ''ఓ మంచి చిత్రం చేశాం'' అన్నారు ప్రణయనాథ. ''కమర్షియల్ అంశాలున్న సందేశాత్మక చిత్రం ఇది'' అన్నారు మధుబాల. ''ఫిబ్రవరి 14న సినిమాను విడుదల చేస్తాం'' అన్నారు డిస్ట్రిబ్యూటర్ బాపిరాజు.

మా ఊరు సిత్రాన్ని సూద్దాం




● సుహాస్

సుహాస్ హీరోగా దుశ్యంత్ కటికినేని దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు'. జీఏ2 పిక్చర్స్, దర్శకుడు వెంకటేశ్ మహా బ్యానర్ మహాయన మోషన్ పిక్చర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్స్ నిర్మిస్తున్నాయి. ఈ సినిమా ఫిబ్రవరి 2న విడుదల కానుంది. శేఖర్ చంద్ర సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'మా ఊరు..' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను హీరో తేజ సజ్జా విడుదల చేశారు. 'రారో మా ఊరు సిత్రాన్ని సూద్దాం...' అంటూ ఈ పాట సాగుతుంది. ఈ పాటకు రెహ్మాన్ లిరిక్స్ అందించగా, కాలభైరవ పాడారు.



● మహేశ్‌బాబు



● రవితేజ




● వెంకటేశ్, బేబీ సారా



● 'అల్లరి' నరేశ్, నాగార్జున, రాజ్ తరుణ్

పండగకు పుంజుకొస్తున్నాయి

సంక్రాంతికి కోడి పందేల హవా ఉంటుంది. వెండితెరపై సినిమా పందేల హవా ఉంటుంది. పండగకి రావడానికి చాలా సినిమాలు రెడీ అయ్యాయి. అన్నింటికీ థియేటర్లంటే కష్టం. అందుకే కొన్ని పండగ పుంజులు (సినిమాలు) వెనక్కి తగ్గాయి. పాంచ్ పటాకా అంటూ జోరుగా వెండితెర మీదకు పుంజుకొస్తున్న ఐదు చిత్రాల గురించి తెలుసుకుందాం.



● తేజ సజ్జా

● ఈ ఏడాది సంక్రాంతి బరిలో జనవరి 12న రెండు సినిమాలు విడుదలవుతున్నాయి. వాటిలో ఒకటి స్టార్ హీరో మహేశ్‌బాబు 'గుంటూరు కారం' కాగా మరొకటి యువహీరో తేజా సజ్జా 'హను–మాన్'. 'అతడు, ఖలేజా' వంటి సినిమాల తర్వాత హీరో మహేశ్ బాబు–దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో తెరకెక్కిన మూడో చిత్రం 'గుంటూరు కారం'. ఇందులో శ్రీలీల, మీనాక్షీ చౌదరి హీరోయిన్లు. ఎస్. రాధాకృష్ణ నిర్మించిన ఈ సినిమా ఫుల్ మాస్ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతోంది. ఈ మూవీలో మహేశ్‌బాబు పక్కా మాస్ లుక్‌లో కనిపించనున్నారని ఇప్పటికే విడుదలైన పోస్టర్స్, గ్లింప్స్, పాటలు స్పష్టం చేశాయి. అమ్మ సెంటిమెంట్ నేపథ్యంలో పొలిటికల్ టచ్‌తో ఈ సినిమా ఉంటుందని సమాచారం. ఇక అదే రోజు యువ హీరో తేజ సజ్జా 'హను–మాన్' సినిమాతో తొలిసారి సంక్రాంతికి వస్తున్నారు. 'జాంబీ రెడ్డి' తర్వాత తేజ సజ్జా, డైరెక్టర్ ప్రశాంత్ వర్మ కాంబినేషన్‌లో రూపొందిన పాన్ ఇండియా చిత్రమిది. కె. నిరంజన్ రెడ్డి నిర్మించారు. అమృతా అయ్యర్ హీరోయిన్. మామూలు కుర్రాడికి హనుమంతుని ఆశీస్సులతో సూపర్ పవర్స్ వస్తే అతను చేసే అసాధారణ పనులు ఏంటి? అనే నేపథ్యంలో 'హను–మాన్' తెరకెక్కింది. ఒకే రోజు అమ్మ సెంటిమెంట్, భక్తి సెంటిమెంట్... ఇలా రెండు విభిన్న చిత్రాలతో 12వ తేదీ ప్రేక్షకులకు ఎమోషనల్‌గా దగ్గర కావడానికి రెడీ అవుతోంది.

● సీనియర్ హీరోలు వెంకటేశ్, రవితేజ సంక్రాంతికి ఒకే రోజు బరిలో దిగుతున్నారు. వెంకటేశ్ నటించిన 'సైంధవ్', రవితేజ నటించిన 'ఈగల్' జనవరి 13నే రిలీజ్ కానున్నాయి. వెంకటేశ్ హీరోగా శైలేష్ కొలను దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'సైంధవ్'. శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్‌గా, బేబీ సారా కీలక పాత్రలో నటించారు. వెంకట్ బోయనపల్లి నిర్మించారు. ఫ్యామిలీ, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన 'సైంధవ్' వెంకటేశ్ కెరీర్‌లో 75వ చిత్రం కావడంతో అటు ఇండస్ట్రీ వర్గాల్లో ఇటు ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. పైగా ఆయన నటించిన తొలి పాన్ ఇండియన్ సినిమా ఇదే కావడం విశేషం. తండ్రీ–కూతురి అనుబంధం నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుంది. ఈ చిత్రానికి భిన్నంగా మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రవితేజ 'ఈగల్' వస్తోంది. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించిన ఈ మూవీలో కావ్యా థాపర్, అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్లు. టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. ఈ సినిమాలో మల్టిపుల్ షేడ్స్ ఉన్న పాత్ర చేశారు రవితేజ. ఒకటి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్, మరొకటి యాక్షన్ ఎంటర్‌టైనర్ కావడంతో ఈ రెండు వర్గాల ప్రేక్షకులకు మంచి చాయిస్ దక్కినట్లే.

● హీరో నాగార్జున కూడా 'నా సామిరంగ' సినిమాతో సంక్రాంతి బరిలో నిలిచారు. 'సోగ్గాడే చిన్ని నాయనా' (2016), 'బంగార్రాజు' (2022) వంటి చిత్రాలతో సంక్రాంతి రేసులో నిలిచి, విజయం అందుకున్న ఆయన ఈ సంక్రాంతికి 'నా సామిరంగ' చిత్రంతో జనవరి 14న సోలోగా వస్తున్నారు. కొరియోగ్రాఫర్ విజయ్ బిన్నీ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ఆషికా రంగనాథ్ హీరోయిన్. 'అల్లరి' నరేశ్, రాజ్ తరుణ్ కీలక పాత్రల్లో నటించారు. శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ సినిమాలో నాగార్జున ఫుల్ మాస్ లుక్‌లో కనిపించనున్నారు. ప్రేమ, స్నేహం, భావోద్వేగాలు, మాస్, యాక్షన్.. ఇలా అన్ని అంశాలతో ఈ సినిమా రూపొందింది. ఈ మధ్య రెండు సంక్రాంతి పండగలకు హిట్ సాధించిన హీరో కాబట్టి.. ఈసారి నాగార్జున 'నా సామిరంగ'పై అంచనాలు ఉన్నాయి.

అనువాదం ఉందా?

తమిళంలోనూ సంక్రాంతికి పోటీ నెలకొంది. ధనుష్ 'కెప్టెన్ మిల్లర్', శివ కార్తికేయన్ 'అయలాన్', తమిళ్, హిందీలో రూపొందిన విజయ్ సేతుపతి 'మెర్రీ క్రిస్మస్' సినిమాలు జనవరి 12న, అరుణ్ విజయ్ 'మాఫియా' పండగకి విడుదలకు సిద్ధమయ్యాయి. ధనుష్, ప్రియాంకా అరుళ్ మోహన్ జంటగా అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వం వహించిన చిత్రం 'కెప్టెన్ మిల్లర్'. శివ కార్తికేయన్, రకుల్ ప్రీత్‌సింగ్ జంటగా ఆర్. రవికుమార్ దర్శకత్వం వహించిన చిత్రం 'అయలాన్'. విజయ్ సేతుపతి, కత్రినా కైఫ్ జంటగా శ్రీరామ్ రాఘవన్ దర్శకత్వం వహించిన మూవీ 'మెర్రీ క్రిస్మస్'. ఈ మూడు సినిమాలూ తమిళంలో ఒకేరోజు విడుదలవుతున్నాయి. తెలుగులోనూ అనువాదం అవుతున్నాయి. అయితే తెలుగు విడుదలపై సందిగ్ధం నెలకొంది. ఈ సంక్రాంతికి స్ట్రయిట్ తెలుగు సినిమాలకే పోటీ ఉండటంతో థియేటర్ల సమస్య ఎదురైంది. ఆల్రెడీ విజయ్ దేవరకొండ 'ఫ్యామిలీ స్టార్' వంటి స్ట్రయిట్ చిత్రాల రిలీజ్ వాయిదా పడింది. అలాంటిది డబ్బింగ్ సినిమాలకు థియేటర్లు దొరుకుతాయా? అన్నది ఆసక్తిగా మారింది. ఇక అనువాద చిత్రాల్లో రజనీకాంత్ 'లాల్ సలాం' వంటివి పోటీ నుంచి తప్పుకున్నాయి.

సాక్షి బిజినెస్

బుధవారం
3-1-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
379	76
71,892	21,666

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	14,822	▽	190
డోజోన్స్	37,785	△	95
ఎఫ్‌టీఎస్ఈ 100	7,722	▽	12
డాక్స్	16,769	△	18
షాంఘై	2,962	△	12
నికాయ్	33,644	△	75

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	63,602	△	250
బంగారం (99.5 స్వచ్ఛత)	63,347	△	249
వెండి (కిలో)	74,133	△	248

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.68	83.88
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.73	107.29
€	యూరో	ఎస్‌బీఐ	90.71	93.09
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	57.65	59.05
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.80	57.75
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	61.69	63.49
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.19	22.91
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.75	23.53
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.58	12.61

బీఓఐ ప్రత్యేక డిపాజిట్ స్కీం



ముంబై: ప్రభుత్వరంగ బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీవోఐ) ప్రత్యేక డిపాజిట్ పథకాన్ని పరిమిత కాలానికి ప్రకటించింది. రూ.2 కోట్లు, అంతకుపైన రూ.50 కోట్ల వరకు డిపాజిట్లపై 7.50 శాతం వడ్డీని ఆఫర్ చేస్తోంది. ఈ డిపాజిట్ కాల వ్యవధి 175 రోజులు. జనవరి 1 నుంచి ఇది అందుబాటులోకి వచ్చింది.

బీఓబీ కామన్ మొబిలిటీ కార్డ్



హైదరాబాద్: బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) నేషనల్ కామన్ మొబిలిటీ కార్డ్ (ఎన్‌సీఎంసీ)ను విడుదల చేసింది. తిరిగి బ్యాలెన్స్ లోడ్ చేసుకోవడానికి వీలైన ఎన్‌సీఎంసీ రూపే ప్లాటినం ఈఎంవీ చిప్ ఎనేబుల్డ్ కాంటాక్ట్‌లెస్ ప్రీపెయిడ్ కార్డ్ ఇది. బహుళ ప్రయోజనాలతో కూడిన రవాణా కార్డ్. ఆన్‌లైన్ కోసం అయితే వ్యాలెట్‌లో గరిష్ఠంగా రూ.1,00,000ను లోడ్ చేసుకోవచ్చు. ఆఫ్‌లైన్ వ్యాలెట్‌లో రూ.2,000 వరకు కలిగి ఉండొచ్చు.

ధోతీలపై రామ్‌రాజ్ కాటన్ ఆఫర్



హైదరాబాద్: ధోతీ వారోత్సవాల్లో భాగంగా రామ్‌రాజ్ కాటన్ ధోతీలపై ఆఫర్‌ను ప్రకటించింది. మూడు ధోతీలుండే కాంబో ప్యాక్‌ను రూ.500లకే అందిస్తుంది. ప్రతి ఏటా జనవరి 1 నుంచి 7 వరకు రామ్‌రాజ్ కాటన్ దోతీ వారోత్సవాలు నిర్వహిస్తుంది. తమిళనాడులోని అన్ని రామ్‌రాజ్ షోరూంలు, టెక్స్‌టైల్స్ అవుట్‌లెట్‌లలో ఆఫర్ అందుబాటులో ఉంటుంది.

కొత్త కార్ల పరుగు

ఈ ఏడాది 100 నూతన మోడళ్లు, వేరియంట్లు! ● గతేడాది దూకుడుకు కొనసాగింపు



అయిదు డోర్ల ఎస్‌యూవీ..

భారత మార్కెట్లో ఎస్‌యూవీ ప్రియులు ఎంతగానో ఎదురు చూస్తున్న అయిదు డోర్ల థార్ ఈ ఏడాది ఆగస్ట్‌లో ఇక్కడి రోడ్లపై దూసుకుపోనుంది. మహీంద్రా అండ్ మహీంద్రా ఈ మేరకు సిద్ధం అయింది. మహీంద్రా తయారీ ఆధునీకరించిన ఎక్స్‌యూవీ 300, ఎక్స్‌యూవీ 500 సైతం ఈ ఏడాదే కస్టమర్ల చేతుల్లోకి రానున్నాయి.

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశవ్యాప్తంగా 2023లో ప్యాసింజర్ వాహన విక్రయాలు 41.08 లక్షల యూనిట్లు నమోదయ్యాయి. 2022తో పోలిస్తే ఇది 8.3 శాతం అధికం. గతేడాది నమోదైన రికార్డుతో 2024లోనూ అదే ఊపును కొనసాగించాలని ప్యాసింజర్ వాహన తయారీ సంస్థలు ఉవ్విళ్లూరుతున్నాయి. ఈ ఏడాది 100కుపైగా కొత్త మోడళ్లు, వేరియంట్లు రోడ్డెక్కనున్నట్టు మార్కెట్ వర్గాల సమాచారం. వీటిలో అత్యధికంగా ఎస్‌యూవీలు ఉండనున్నాయి. దీనికి కారణం ఏమంటే 2023లో అమ్ముడైన మొత్తం ప్యాసింజర్ వాహనాల్లో ఎస్‌యూవీల వాటా ఏకంగా 49 శాతం ఉండడమే. అంతకుముందు ఏడాది వీటి వాటా 42 శాతం నమోదు కావడం గమనార్హం. 2024 కోసం తయారీ కంపెనీలు పోటాపోటీగా కొత్త మోడళ్ల రూపకల్పనలో ఇప్పటికే నిమగ్నమయ్యాయి. మరోవైపు దేశీయ మార్కెట్లో విజయవంతం అయిన మోడళ్లకు మరిన్ని హంగులు జోడించి ఫేస్‌లిఫ్ట్ వేరియంట్ల విడుదలకు సన్నాహాలు చేస్తున్నాయి.

మెర్సిడెస్‌తో బోణీ..

ఈ ఏడాది మెర్సిడెస్ బెంజ్ తొలుత బోణీ చేయబోతోంది. జనవరి 8న ఈ కంపెనీ జీఎల్ఎస్ లగ్జరీ ఎస్‌యూవీని ప్రవేశపెడుతోంది. కియా ఇండియా నుంచి నూతన సోనెట్ కాంపాక్ట్ ఎస్‌యూవీ జనవరి 15న రాబోతోంది. ఆధునీకరించిన క్రెటా వేరియంట్‌ను జనవరి 16న విడుదలకు హ్యుందాయ్ రెడీ అయింది. మారుతీ సుజుకీ నుంచి కొత్త తరం స్విఫ్ట్ ఫిబ్రవరిలో అడుగుపెడుతోంది. మార్చిలో స్విఫ్ట్ డిజైర్ రోడ్డెక్కనుంది. మారుతీ సుజుకీ ఫ్రాంక్స్ కాంపాక్ట్ ఎస్‌యూవీ ఆధారంగా రూపుదిద్దుకుంటున్న ఏడు సీట్ల ఎస్‌యూవీ టైసర్ మోడల్‌ను ప్రవేశపెట్టేందుకు టయోటా కసరత్తు ప్రారంభించింది. కొత్త ఫార్చూనర్ సైతం దూసుకుపోనుంది. హ్యుందాయ్ నుంచి క్రెటా ఎన్ లైన్, ఫేస్‌లిఫ్ట్ టక్సన్, ఆల్కజార్ సైతం రానున్నాయి. కొత్తతరం అమేజ్ విడుదలకు హోండా కార్స్ సన్నద్ధం అయింది. ఫోక్స్‌వేగన్, స్కోడా, నిస్సాన్, రెనో, సిట్రోయెన్ ఫేస్‌లిఫ్ట్ మోడళ్లను తేనున్నాయి.

ఈవీలు సైతం మార్కెట్లోకి..

ఎలక్ట్రిక్ కార్లకు క్రమంగా ఆదరణ పెరుగుతుండడంతో కొన్ని కంపెనీలు ఈ విభాగంలో నూతన మోడళ్లను తెచ్చే పనిలో ఉన్నాయి. హ్యారియర్ ఈవీని ఏప్రిల్‌లో తీసుకొచ్చేందుకు టాటా మోటార్స్ ప్రణాళిక చేస్తోంది. 2024 చివరికల్లా టాటా కర్వ్ ఈవీ రానుంది. అలాగే టాటా పంచ్ ఈవీ సైతం పరుగుతీయనుంది. మారుతీ సుజుకీ నుంచి తొలి ఈవీ ఈ ఏడాది భారత రోడ్లపై అడుగు పెట్టేందుకు సిద్ధం అవుతోంది. కియా ఈవీ9 పండుగల సీజన్‌లో రానుందని సమాచారం.

కియా ఇండియా ఎండీగా గ్వాంగూ లీ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ సంస్థ కియా ఇండియా నూతన ఎండీ, సీఈవోగా గ్వాంగూ లీ నియమితులయ్యారు. టీ జిన్ పార్క్ స్థానంలో లీ చేరారు. కియా కార్పొరేషన్‌లో 36 ఏళ్లపాటు సుదీర్ఘ ప్రయాణం చేసి పదవీ విరమణ పొందిన టీ జిన్ పార్క్ కియా ఇండియా ఎండీగా నాలుగేళ్ల బాధ్యతలు నిర్వర్తించారు. యూఎస్, కెనడా, ఇటలీ, మెక్సికోతోపాటు సెంట్రల్, సౌత్ అమెరికాలో కియా హెడ్‌క్వార్టర్స్, జర్మనీలో ఉన్న కియా యూరప్ కేంద్ర కార్యాలయంలోనూ వివిధ కీలక హోదాల్లో గ్వాంగూ లీ పనిచేశారు. ఇటీవలి వరకు ఆయన కియా మెక్సికో ప్రెసిడెంట్‌గా ఉన్నారు. కంపెనీ గణనీయ వృద్ధి, ఉత్పత్తి, ఎగుమతి కేంద్రంగా కియా మెక్సికోను మలచడంలో ఆయన కీలక పాత్ర పోషించారని కియా తెలిపింది. రెండు సెగ్మెంట్-బ్రేకింగ్ ఫీచర్లతో కొత్త సెల్టోస్, కొత్త సోనెట్‌తోపాటు మరిన్ని వినూత్న ఉత్పత్తులతో కియా ఇండియా ఖచ్చితంగా స్థిర వ్యాపార వృద్ధికి సరైన మార్గంలో ఉందని ఈ సందర్భంగా గ్వాంగూ లీ తెలిపారు.

హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ 24 కొత్త శాఖలు



ముంబై: దేశవ్యాప్తంగా హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్ మంగళవారం 24 కొత్త శాఖలు ప్రారంభించింది. భారత్‌లోని మ్యూచువల్ ఫండ్ల ప్రాధాన్యతను పెంచే చర్యలో భాగంగా ఇది ఒక వ్యూహాత్మక చొరవగా సంస్థ తెలిపింది. ''ప్రతి భారతీయుడు సంపద సృష్టికర్తగా ఎదగాలనేదే మా లక్ష్యం. అందులో భాగంగా అందరికి మ్యూచువల్ ఫండ్లను అందుబాటులోకి తెచ్చేందుకు మా విస్తృతిని పెంచుకుంటున్నాము'' అని సంస్థ ఎండీ, సీఈవో నవనీత్ మునోత్ తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ 200కు పైగా శాఖలు ద్వారా కార్యకలాపాలు సాగిస్తోంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

3-1-2024	
విశాఖ	625-00
చిత్తూరు	608-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	585-00
విజయవాడ	585-00
రిటైల్ ధర (డజను)	72.00
2-1-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	582-00
వరంగల్	584-00
రిటైల్ ధర	6.40

రూ.70 వేలకు పుత్తడి!

2024పై జీజేసీ అంచనా

ముంబై: బంగారం ధర ఈ ఏడాది 10 గ్రాములకు రూ.70,000 వద్ద కొత్త గరిష్ఠ స్థాయిని తాకే అవకాశం ఉందని ఆల్ ఇండియా జెమ్, జువెల్లరీ డొమెస్టిక్ కౌన్సిల్ (జీజేసీ) అంచనా వేస్తోంది. ప్రపంచ ఆర్థిక అనిశ్చితులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఇందుకు కారణమని వెల్లడించింది.



'బంగారం సురక్షితమైన పెట్టుబడి. వస్తువుల ధరలు అధికంగా ఉండడం, ప్రపంచవ్యాప్తంగా పెరిగిన వడ్డీ రేట్లను వినియోగదారులు ఎదుర్కొంటున్నారు. ద్రవ్యోల్బణం నుంచి రక్షణకు బంగారం ఒక సురక్షిత సాధనం'' అని విశ్లేషించింది.

సమయపాలనలో హైదరాబాద్ ఎయిర్‌పోర్టు బెస్ట్

- టాప్ 10 గ్లోబల్ విమానాశ్రయాల్లో రెండో స్థానం
- మూడో స్థానంలో బెంగళూరు ఎయిర్‌పోర్టు

న్యూఢిల్లీ: నిర్వహణ పనితీరు, సమయపాలనలో హైదరాబాద్, బెంగళూరు విమానాశ్రయాలు అంతర్జాతీయంగా టాప్ 10 ఎయిర్‌పోర్టుల జాబితాలో చోటు దక్కించుకున్నాయి. హైదరాబాద్ రెండో స్థానంలో, బెంగళూరు మూడో స్థానంలో నిల్చాయి. 2023 సంవత్సరానికి గాను సమయ పాలన పనితీరుకు (ఓటీపీ) సంబంధించి ఏవియేషన్ అనలిటిక్స్ సంస్థ సిరియమ్ రూపొందించిన నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. అమెరికాలోని మినియాపోలిస్-సెయింట్ పాల్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ఈ జాబితాలో నంబర్‌వన్‌గా ఉంది. మధ్య స్థాయి ఎయిర్‌పోర్ట్స్ కేటగిరీలో కోల్‌కతాలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ విమానాశ్రయానికి తొమ్మిదో స్థానం లభించింది.



72 వేల దిగువకు సెన్సెక్స్

బ్యాంకులు, ఆటో, ఐటీ షేర్లలో లాభాల స్వీకరణ ● ప్రపంచ మార్కెట్ల ప్రతికూలతలు

ముంబై: బ్యాంకులు, ఐటీ, ఆటో షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో స్టాక్ సూచీలు మంగళవారం అరశాతం నష్టపోయాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని ప్రతికూల సంకేతాలు సెంటిమెంట్‌పై మరింత ఒత్తిడి పెంచాయి. ఫలితంగా సెన్సెక్స్ 379 పాయింట్లు పతనమై 72 వేల స్థాయి దిగువన 71,892 వద్ద ముగిసింది. నిఫ్టీ 76 పాయింట్లు నష్టపోయి 21,666 వద్ద నిలిచింది. ఆసియా మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం నష్టాలతో మొదలయ్యాయి. ప్రథమార్థంలో నెలకొన్న అమ్మకాల ఒత్తిడితో సెన్సెక్స్ 658 పాయింట్లు పతనమై 71,614 వద్ద, నిఫ్టీ 186 పాయింట్లు క్షీణించి 21,556 వద్ద ఇంట్రాడే కనిష్టాలను తాకాయి. భారీ పతనం తర్వాత ద్వితీయార్థంలో కనిష్ఠ స్థాయిల్లో ఇంధన, ఫార్మా, సర్వీసులు, మెటల్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించాయి. ఫలితంగా సూచీలు దాదాపు సగానికి పైగా నష్టాలు భర్తీ చేసుకోగలిగాయి. బీఎస్ఈ మిడ్, స్మాల్ సూచీలు ఫ్లాటుగా ముగిశాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,602 కోట్ల షేర్లు కొన్నారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,959 కోట్ల షేర్లు అమ్మారు.

రూపాయి 11 పైసలు పతనం



డాలర్ మారకంలో రూపాయి విలువ 11 పైసలు బలహీనపడి 83.32 వద్ద ముగిసింది. దేశీయ ఈక్విటీ మార్కెట్ పతనం, దిగుమతిదారుల నుంచి డాలర్‌కు డిమాండ్ పెరగడం రూపాయి కోతకు కారణం.



మార్కెట్లో మరిన్ని సంగతులు

- ప్రముఖ ఇన్వెస్టర్ రాధాకిషన్ ధమాని, ఎస్‌బీఐ ఫండ్‌లు వేరువేరుగా వీఎస్‌టీ ఇండస్ట్రీస్‌కి చెందిన 1.4% వాటాకు సమానమైన షేర్లను బల్క్ డీల్స్‌లో కొనుగోలు చేశారు. దీంతో వీఎస్‌టీ ఇండస్ట్రీస్ షేరు 20% ఎగసి రూ.4065.30 వద్ద అప్పర్ సర్క్యూట్‌ను తాకింది.
- అమెరికా జనరిక్ మార్కెట్ పుంజుకోవడం, ముడి సరుకు ధర తగ్గడం, కోవిడ్ కేసులు పెరుగుతుండటంతో ఫార్మా షేర్లు రాణించాయి.
- దేశీయ ఐటీ రంగ డిసెంబర్ త్రైమాసిక ఫలితాలు అంతంత మాత్రంగా ఉండొచ్చని బ్రోకరేజ్ సంస్థ జెఫ్రీస్ అవుట్‌లుక్ తెలపడంతో ఐటీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి.
- స్టార్‌లింక్‌తో చేతులు కలపబోతున్నామన్న వార్తలను వొడాఫోన్ ఐడియా ఖండించడంతో కంపెనీ షేరు బీఎస్ఈలో మంగళవారం దాదాపు 6% క్షీణించి రూ. 16 వద్ద క్లోజయ్యింది.

సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు



సాక్షి, హైదరాబాద్: సంక్రాంతి సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని వివిధ ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లను నడుపనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్.రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా రైళ్ల వివరాలిలా..

- ➡ సికింద్రాబాద్-బ్రాహ్మణ్‌పూర్-వికారాబాద్ (07089/07090) స్పెషల్ ట్రైన్ ఈ నెల 7, 8, 14, 15 తేదీల్లో సాయంత్రం 7.45 కు సికింద్రాబాద్ నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11.15కు బ్రాహ్మణ్‌పూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో మధ్యాహ్నం 12.30గంటలకు బ్రాహ్మణ్‌పూర్ నుంచి బయల్దేరి మరుసటి రోజు ఉదయం 8 గంటలకు వికారాబాద్ చేరుకుంటుంది.
- ➡ వికారాబాద్-బ్రాహ్మణ్‌పూర్-సికింద్రాబాద్ (07091/07092) స్పెషల్ ట్రైన్ ఈ నెల 9, 10, 16, 17 తేదీల్లో సాయంత్రం 6 గంటలకు వికారాబాద్ నుంచి బయలుదేరి మరుసటి రోజుఉదయం 11.15 గంటలకు బ్రాహ్మణ్‌పూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో మధ్యాహ్నం 12.30కు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6.30 కు సికింద్రాబాద్ చేరుకుంటుంది.
- ➡ విశాఖపట్టణం-కర్నూల్ (08541/08542) ప్రత్యేక రైలు ఈ నెల 10,11, 17, 18, 24, 25 తేదీల్లో సాయంత్రం 5.35 గంటలకు విశాఖ నుంచి బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం 1.35కు కర్నూల్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో మధ్యాహ్నం 3.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11 గంటలకు విశాఖకు చేరుకుంటుంది.
- ➡ శ్రీకాకుళం-వికారాబాద్ (08547/08548) స్పెషల్ ట్రైన్ ఈ నెల 12, 13, 19, 20, 26, 27 తేదీల్లో సాయంత్రం 5 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9 గంటలకు చేరుకుంటుంది. తిరుగుప్రయాణంలో రాత్రి 8.25 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12.15 కు వికారాబాద్‌కు చేరుకుంటుంది.
- ➡ సికింద్రాబాద్-తిరుపతి (02764/02763) స్పెషల్ ట్రైన్ ఈ నెల 10, 11, 17,18 తేదీల్లో సాయంత్రం 6.40 కి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6.45కు చేరుకుంటుంది. తిరుగుప్రయాణంలో సాయంత్రం 5.15 కు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5.55 గంటలకు సికింద్రాబాద్‌కు చేరుకుంటుంది.
- ➡ సికింద్రాబాద్-కాకినాడ (07271/07272) ప్రత్యేక రైలు ఈ నెల 12వ తేదీ రాత్రి 9 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8 గంటలకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో రాత్రి 8.10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.30 కు సికింద్రాబాద్ చేరుకుంటుంది

'విభజన' కమిటీ మార్గదర్శకాల మేరకే విచారణ

ఏఐఎస్ కేడర్ వివాదంపై తెలంగాణ హైకోర్టు స్పష్టం

- నిర్ణయం తీసుకునే బాధ్యతను డీవోపీటీకే అప్పగిస్తాం
- విచారణ నేటికి వాయిదా వేసిన ఉన్నత న్యాయస్థానం

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన సందర్భంగా ఆలిండియా సర్వీస్ (ఏఐఎస్) అధికారుల కేటాయింపునకు ఏర్పాటు చేసిన ప్రత్యూష్ సిన్హా అడ్వైజరీ కమిటీ మార్గదర్శకాల మేరకే విచారణ చేపడతామని వాద, ప్రతివాదులకు హైకోర్టు స్పష్టం చేసింది. 'రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ కేడర్ వివాదంపై జనవరిలో ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం తీర్పు వెలువరించింది. ఈ తీర్పు సందర్భంగా కమిటీ మార్గదర్శకాలను ధర్మాసనం సమర్థించింది. ఈ మార్గదర్శకాల మేరకు మాత్రమే మేం విచారణ చేపడతాం. కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ (క్యాట్) ఇచ్చిన ఆదేశాలు సరికాదు. వాటిని రద్దు చేసి.. నిర్ణయం తీసుకునే బాధ్యతను సిబ్బంది మరియు శిక్షణ విభాగం(డీవోపీటీ)కి అప్పగిస్తాం. తెలంగాణ వచ్చి దాదాపు 10 ఏళ్లు కావొస్తోంది.. పదేళ్లుగా డీజీపీ అంజనీకుమార్ సహా కేడర్ వివాదం ఎదుర్కొంటున్న అధికారులు ఇక్కడ పనిచేస్తున్నారు. వీరిలో చాలా మంది సర్వీస్ సంవత్సరంలోపు కూడా ఉంది. ఈ అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచిస్తాం' అని జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలీ, జస్టిస్ అనిల్ కుమార్ ధర్మాసనం మంగళవారం స్పష్టం చేసింది.



పదేళ్లుగా కొనసాగుతున్న కేడర్ వివాదం..

2014లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన నేపథ్యంలో కేంద్రం నియమించిన ప్రత్యూష్ సిన్హా కమిటీ నివేదిక ప్రకారం ఏఐఎస్ ఉద్యోగుల విభజన జరిగింది. నాటి నుంచి కొందరు ఐఏఎస్, ఐపీఎస్‌ల కేడర్ వివాదం సాగుతోంది. విభజన సమయంలో పలువురు అధికారులను ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించారు. అయితే వీరిలో కొందరు ఈ కేటాయింపులపై క్యాట్‌ను ఆశ్రయించి.. తెలంగాణలో విధులు నిర్వహించేలా ఉత్తర్వులు పొందారు. క్యాట్ ఉత్తర్వులను కేంద్ర ప్రభుత్వం తప్పుబడుతూ.. తెలంగాణ హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలు చేసింది. ఈ క్రమంలోనే గత జనవరిలో తెలంగాణ సీఎస్ సోమేశ్‌కుమార్‌ను ఏపీకి వెళ్లాల్సిందేనంటూ ఇదే హైకోర్టు సీజే ధర్మాసనం తీర్పునిచ్చింది. అయితే కేడర్, సర్వీస్ సహా ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉన్న దృష్ట్యా తమ పిటిషన్లను విడిగా విచారణ జరపాలని డీజీపీ అంజనీకుమార్ సహా ఇతర అధికారులు కోరడంతో విచారణను సీజే ధర్మాసనం మరో బెంచ్‌కు బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్లపై సోమవారం జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలీ, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది.

అది చట్టరీత్యా ఆమోదం కాదన్న ఏఎస్‌జీ

కేంద్రం తరఫున అడిషనల్ సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) నరసింహ శర్మ వాదనలు వినిపిస్తూ.. ఏఐఎస్ అధికారులు క్యాట్‌ను ఆశ్రయించి కేటాయింపులకు వ్యతిరేకంగా ఉపశమనం పొందడం చట్టరీత్యా ఆమోదయోగ్యం కాదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని సోమేశ్‌కుమార్ తీర్పు సందర్భంగా ఇదే హైకోర్టు పేర్కొందన్నారు. అనంతరం పలువురు ఐఏఎస్‌ల తరఫున న్యాయవాదులు వాదనలు వినిపించారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014లోని సెక్షన్ 80 ప్రకారం అధికారుల కేటాయింపునకు ఏర్పాటు చేసిన ప్రత్యూష్ సిన్హా అడ్వైజరీ కమిటీ మార్గదర్శకాలను ఐపీఎస్‌లు సవాల్ చేశారని న్యాయవాది సుధీర్ నివేదించారు. న్యాయవాది కె.లక్ష్మీనరసింహ, సీనియర్ న్యాయవాది గోదా శివ.. ఐఏఎస్ అధికారుల తరఫున వాదనలు వినిపించారు. నివాసం ఉంటున్న ప్రాతిపదికన ఏఐఎస్ అధికారుల కేటాయింపు సరికాదన్నారు. ఈ విషయంలో నియమాకం నుంచి వాదనలు వినాల్సి ఉంటుందని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం.. తదుపరి వాదనల కోసం నేటికి వాయిదా వేసింది.

రఘురామకృష్ణరాజు పిల్‌పై విచారణ 23కి వాయిదా

- ఈ లోపు నోటీసులు అందుకున్న వారు కౌంటర్లు వేయాలి
- ఆ కౌంటర్లకు పిటిషనర్ సమాధానం దాఖలు చేయాలి
- హైకోర్టు ధర్మాసనం ఆదేశాలు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రజల సంక్షేమ కోసం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న పలు ప్రజా సంక్షేమ పథకాలకు దురుద్దేశాలను ఆపాదించడంతో పాటు వాటి వల్ల పలువురికి లబ్ధి చేకూర్చేలా ప్రభుత్వ నిర్ణయాలు, విధానాలున్నాయని, వాటిపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ నర్సాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై తదుపరి విచారణను హైకోర్టు ఈ నెల 23కి వాయిదా వేసింది. ఈ వ్యాజ్యంలో ప్రతివాదులు 41 మందిలో నోటీసులు అందుకున్న వారందరూ ఈ పిల్ విచారణార్హతపై కౌంటర్లు దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. విచారణార్హతపై కౌంటర్లు దాఖలు చేసిన తరువాత వాటిని రఘురామకృష్ణరాజు తరఫు న్యాయవాది ఉన్నం శ్రవణ్‌కుమార్‌కు అందజేయాలని ప్రతివాదుల తరఫు న్యాయవాదులను ఆదేశించింది. కౌంటర్లు అందుకున్న తరువాత వాటికి సమాధానం (రిప్లై) దాఖలు చేయాలని శ్రవణ్ కుమార్‌ను ఆదేశించింది. ఈ నెల 23న పిల్ విచారణార్హతపై వాదనలు వింటామంది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ మండవ కిరణ్మయి ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.



నోటీసుల జారీపై ఆరా తీసిన ధర్మాసనం..

అంతకుముందు ఈ పిల్ విచారణకు రాగానే, గతంలో తాము ప్రతివాదులకు జారీ చేసిన నోటీసులు ఎవరికి అందాయి, ఎవరికి అందలేదో ధర్మాసనం ఆరా తీసింది. కొందరికి ఈ-మెయిల్ ద్వారా నోటీసులు పంపామని రఘురామకృష్ణ తరఫు సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు తెలిపారు. ప్రభుత్వం తరఫున ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) ఇప్పటికే కౌంటర్ దాఖలు చేశారని అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ వివరించారు. ప్రతివాదులందరికీ నోటీసులు అంది, వారు కౌంటర్లు దాఖలు చేసిన తరువాతే పిల్ విచారణార్హతపై వాదనలు వింటామని గత విచారణ సమయంలో మీరు (ధర్మాసనం) చెప్పారని ఏజీ గుర్తు చేశారు. మిగిలిన అధికారిక ప్రతివాదులందరూ సీఎస్ కౌంటర్‌నే అన్వయింపచేసుకుంటారని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) వేలూరి మహేశ్వరరెడ్డి తెలిపారు. దీంతో ధర్మాసనం నోటీసులు అందుకున్న అనధికారిక ప్రతివాదులందరూ కౌంటర్లు దాఖలు చేయాలని, ఆ కాపీలను పిటిషనర్ న్యాయవాదికి అందచేయాలని ఆదేశించింది.

టీడీపీతోనే స్వర్ణయుగం సాధ్యం

- నేటి నుంచి 'రా కదలిరా' పేరుతో కార్యక్రమాలు
- టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు వెల్లడి
- సైకిల్-గాజు గ్లాసు లోగో ఆవిష్కరణ

సాక్షి, అమరావతి: ప్రభుత్వానికి వ్యతిరేకంగా బుధవారం నుంచి 'రా కదలి రా' పేరుతో కార్యక్రమాలు చేపడుతున్నట్లు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు తెలిపారు. మంగళగిరి టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన సైకిల్ - గాజు గ్లాసు గుర్తులతో కూడిన లోగోను ఆవిష్కరించారు. అచ్చెన్నాయుడు మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం సందర్భంగా ఎన్టీఆర్ ఇచ్చిన 'రా కదలి రా' పిలుపును మళ్లీ ప్రజల్లోకి తీసుకెళ్తున్నామన్నారు. సీఎం జగన్ రాష్ట్రాన్ని చీకటిమయం చేసి ఆంధ్రప్రదేశ్‌ను ఆందోళనప్రదేశ్‌గా మార్చారని ఆరోపించారు. స్వర్ణయుగం తెలుగుదేశంతోనే సాధ్యమనే నినాదంతో ప్రజల్లోకి వెళ్తున్నామని తెలిపారు. ఇకపై అన్ని సభలు తెలుగుదేశం-జనసేన సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతాయని చెప్పారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కలిసి పాల్గొనే సభల వివరాలు త్వరలోనే ప్రకటిస్తామన్నారు. పార్లమెంట్ స్థాయి బహిరంగ సభలు, మేనిఫెస్టో ప్రకటన సభను ప్రత్యేకంగా నిర్వహిస్తామని తెలిపారు. బుధవారం పంచాయతీ సమస్యలపై సర్పంచ్‌లతో రాష్ట్ర స్థాయి సదస్సు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బీసీలకు జరిగిన అన్యాయంపై 4వ తేదీన జయహో బీసీ పేరుతో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 5వ తేదీ నుంచి 29వ తేదీ వరకు అన్ని పార్లమెంటు స్థానాల పరిధిలో చంద్రబాబు బహిరంగ సభలు మొదలవుతాయన్నారు. 5న ఒంగోలు, 7న విజయవాడ, నరసాపురం పార్లమెంట్ పరిధిలో సభలు జరుగుతాయని తెలిపారు. 18వ తేదీన ఎన్టీ ఆర్ వర్ధంతి సందర్భంగా గుడివాడలో భారీ సభ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అధికార పార్టీ నుంచి తెలుగుదేశంలోకి వచ్చేందుకు చాలామంది సంప్రదిస్తున్నారన్నారు.

నేటినుంచి మళ్లీ భువనేశ్వరి పర్యటనలు

స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో చంద్రబాబు అరెస్టయినప్పుడు సానుభూతి కోసం ఆయన సతీమణి భువనేశ్వరి నిజం గెలవాలి పేరుతో చేపట్టిన పర్యటనలను కొనసాగించనున్నట్లు టీడీపీ నేతలు తెలిపారు. మొక్కుబడిగా నిర్వహించిన పర్యటనను చంద్రబాబుకు బెయిల్ వచ్చిన నేపథ్యంలో అర్ధాంతరంగా నిలిపివేశారు. అయితే దీనిపై అన్ని వైపుల నుంచి విమర్శలు రావడంతో వాటిని పూర్తి చేసినట్లు చూపించుకునే పనిలో భాగంగా మళ్లీ పర్యటనలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. బుధవారం విజయనగరం, 4న శ్రీకాకుళం, 5న విశాఖపట్నం జిల్లాల్లో ఆమె పర్యటిస్తారని ఆ పార్టీ నేతలు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధం

వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

వేంపల్లె : కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తెలిపారు. ఆమె తల్లి విజయమ్మ, కుమారుడు రాజారెడ్డి, కుమార్తె అంజలి, కాబోయే కోడలు అట్లూరి ప్రియ, వియ్యంకులు, కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద వైఎస్సార్ సమాధికి నివాళులర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వైఎస్సార్ సమాధి వద్ద తన కుమారుడి వివాహ ఆహ్వాన పత్రికను ఉంచి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా వైఎస్ షర్మిల విలేకరులతో మాట్లాడుతూ తన కుమారుడు రాజారెడ్డికి అట్లూరి ప్రియతో ఫిబ్రవరి 17న వివాహం జరగబోతున్న నేపథ్యంలో తన తండ్రి, దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశీస్సులు పొందేందుకు వచ్చినట్లు చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించడంలో వైఎస్సార్‌టీపీ కీలక పాత్ర పోషించిందని అన్నారు. వైఎస్సార్‌టీపీ పోటీ చేయకపోవడంతో దాదాపు 31 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచిందన్నారు. వైఎస్సార్‌టీపీ చేసిన త్యాగానికి విలువనిచ్చి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ఆహ్వానించారని తెలిపారు. షర్మిల తదితరులు ఎంపీ సీఎం రమేష్‌కు చెందిన రిత్విక్ గ్రీన్ పవర్ అండ్ ఏవియేషన్ ప్రత్యేక విమానంలో కడప ఎయిర్‌పోర్టుకు వచ్చారు.



వైఎస్సార్ సమాధి వద్ద కుమారుడి వివాహ పత్రికను పెడుతున్న వైఎస్ షర్మిల, కుటుంబ సభ్యులు

కాంగ్రెస్‌లో వైఎస్సార్‌టీపీ విలీనం

సాక్షి, హైదరాబాద్ : వైఎస్సార్‌టీపీ తెలంగాణ పార్టీ కాంగ్రెస్‌లో విలీనం కానుంది. గురువారం ఢిల్లీలో ఏఐసీసీ అగ్రనేతల సమక్షంలో విలీనం ప్రక్రియ చేపట్టేందుకు షర్మిల తగిన కార్యచరణ సిద్ధం చేసినట్టు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. మంగళవారం లోటస్‌పాండ్‌లోని పార్టీ కార్యాలయంలో ఆమె ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. కాంగ్రెస్‌లో పార్టీ విలీనంపై నేతలతో చర్చించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్‌తో కలిసి పనిచేయడానికి తనకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. ఒకటి రెండు రోజుల్లో అన్ని ప్రశ్నలకు సమాధానం చెబుతా అని స్పష్టం చేశారు. ఆమెకు ఏఐసీసీలో కీలక పదవి దక్కే అవకాశం ఉందన్నారు. పార్టీ నేతలకూ కీలక పదవులు వస్తాయని షర్మిల హామీ ఇచ్చినట్టు ఆయన పేర్కొన్నారు.

■ తెలంగాణ

ఉప్పల్ సీఎంఆర్ షోరూమ్‌లో భారీ అగ్నిప్రమాదం

ఉప్పల్: హైదరాబాద్‌లోని ఉప్పల్ బస్టాండ్ ఎదురుగా ఉన్న సీఎంఆర్ వస్త్ర దుకాణంలో మంగళవారం రాత్రి భారీ అగ్నిప్రమాదం జరిగింది. 3 నెలల క్రితమే ఈ షాపింగ్‌మాల్ ప్రారంభమైంది. ఈ ప్రమాదంలో షాపింగ్‌మాల్‌లోని రెండు అంతస్తులు పూర్తిగా దగ్ధమయ్యాయి. దీంతో రూ.కోట్లలో ఆస్తి నష్టం సంభవించినట్లు నిర్వాహకులు తెలిపారు. కాగా రాత్రి 9.30 గంటల సమయంలో షాపింగ్‌మాల్‌లో పనిచేసే ఉద్యోగులు, సిబ్బంది విధులు ముగించుకొని ఇళ్లకు వెళ్లిపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరుగలేదు. సుమారు 300 మంది ఉద్యోగులు పని ఈ షాపింగ్‌మాల్‌లో పనిచేస్తున్నారు. రాత్రి 10.15 గంటల సమయంలో సీఎంఆర్ షాపింగ్‌మాల్ నుంచి దట్టమైన పొగలతోపాటు మంటలు వస్తున్నట్లు గుర్తించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందజేశారు. కొద్దిసేపటికే మొదట 4 ఫైరింజన్‌లు అక్కడికి చేరుకున్నాయి. ఆ తరువాత మరో 2 ఫైరింజన్‌లను తరలించారు. సుమారు గంటన్నర తరువాత అతికష్టంగా మంటలు అదుపులోకి వచ్చాయి. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్లనే అగ్నిప్రమాదం జరిగి ఉండవచ్చునని పోలీసులు తెలిపారు. డీసీపీ జానకి నేతృత్వంలో పోలీసులు అక్కడికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.



పశ్చిమగోదావరి జిల్లా ఇరగవరంలో మంగళవారం పింఛన్ పంపిణీ చేస్తున్న మంత్రి కారుమూరి



కృష్ణాజిల్లా మచిలీపట్నంలో రంగనాయకమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ మట్టా స్వప్న



పల్నాడు జిల్లా వినుకొండలో బత్తుల వెంకటేశ్వర్లుకు పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



చిత్తూరు జిల్లా కార్వేటినగరంలో లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి



విశాఖపట్నం జిల్లా గిడిజాలలో లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కలెక్టర్ మల్లికార్జున

క్లుప్తంగా...

నేటి నుంచి క్రాఫ్ట్‌మేళా

సాక్షి, అమరావతి: ఎన్టీఆర్ జిల్లా, విజయవాడలోని మేరీస్ స్టెల్లా కాలేజీ ఇండోర్ స్టేడియంలో హస్తకళాకృతుల ప్రదర్శన(క్రాఫ్ట్ మేళా)ను బుధవారం నుంచి ప్రారంభించనున్నారు. ఈనెల 12వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ మేళాలో దేశంలోని చేనేత వస్త్రాలు, హస్తకళా ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయం నిర్వహించనున్నారు. టస్సర్ సిల్క్, గొల్లభామ, ఎల్లాంపిళ్లై, గద్వాల్, మంగళగిరి చీరలు, నిజామాబాద్ బ్లాక్ పోటరీ, మీనాకరి, కతియావాడి, లెదర్ షెడ్ ల్యాంప్‌లు, ఏటి కొప్పాక బొమ్మలు, వారణాసి లక్క బొమ్మలు వంటి హస్త కళలు, చేనేతల స్టాల్స్ ఏర్పాటు చేస్తారు.

ఎస్‌ఐగా ఎంపికైన సచివాలయ ఉద్యోగి



ఆరిలోవ(విశాఖ తూర్పు): నగరంలోని ఓ డివిజన్ సచివాలయంలో ఉమన్ ప్రొటెక్షన్ సెక్రటరీగా పని చేస్తున్న మహిళా ఉద్యోగి పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఎంపికైంది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నియామకాల్లో జోన్–1 పరిధిలో రిజర్వేషన్ ప్రకారం ఏకైక ముస్లిం మహిళా ఉద్యోగాన్ని ఆమె సాధించింది. బిహార్‌కు చెందిన సహాముద్దీన్ కొన్నాళ్ల క్రితం తన కుటుంబంతో విశాఖ వచ్చి ఆరిలోవ ప్రజాశాంతి నగర్‌లో నివాసం ఉంటున్నారు. ఆయన కుమార్తె సాహిబ్ అంజుమ్ చదువంతా విశాఖలో కొనసాగింది. ఇంటర్మీడియెట్‌లో ఉండగా ఆమెకు వివాహం చేయడానికి తల్లిదండ్రులు ప్రయత్నించారు. ఇందుకు అంగీకరించని ఆమె ఉన్నత చదువులు కొనసాగిస్తానని తెగేసి చెప్పి పట్టుదలతో ఇంటర్మీడియెట్ పూర్తి చేసింది. అనంతరం ఆంధ్రా యూనివర్సిటీలో బీటెక్ చదివింది. తర్వాత నగరంలో ఓ కోచింగ్ సెంటర్‌లో ట్యూటర్‌గా పనిచేస్తూ ఏయూలో ఎం.టెక్ కూడా పూర్తి చేసింది. రాష్ట్రంలో 2019లో భారీఎత్తున చేపట్టిన సచివాలయ ఉద్యోగాల భర్తీలో ఉద్యోగం పొంది ఉమన్ ప్రొటెక్షన్ సెక్రటరీగా ఉద్యోగం సాధించి అంబుసరన్ కాలనీ సచివాలయంలో పని చేస్తోంది. 2021లో ఆమెకు పశ్చిమ గోదావరి జిల్లా మార్టేరు గ్రామానికి చెందిన మహ్మద్ సాదిక్‌తో వివాహమైంది. జోన్–1 పరిధిలో ముస్లిం మహిళా కోటాలో ఒకే ఒక్క ఉద్యోగం ఉందని, 202/300 మార్కులు సాధించి ఆ ఒక్క ఉద్యోగాన్ని దక్కించుకున్నానని ఆమె ఆనందం వ్యక్తం చేశారు. సివిల్స్‌లో ఐఏఎస్ సాధించాలనేది తన లక్ష్యమని అంజుమ్ తెలిపారు.

విదేశాల్లో తెలుగు విద్యార్థులకు ఉచిత బీమా

ప్రవాసాంధ్ర భరోసా బీమా అందిస్తున్న ఏపీఎన్‌ఆర్టీఎస్

సాక్షి, అమరావతి: విదేశాల్లో చదువుకుంటున్న తెలుగు విద్యార్థులకు ప్రభుత్వరంగ సంస్థ ఏపీఎన్‌ఆర్టీఎస్ ఉచిత బీమా పథకాన్ని అందిస్తోంది. ప్రవాసాంధ్ర భరోసా బీమా పథకంలో భాగంగా విదేశాల్లోని తెలుగు విద్యార్థులు, ఉద్యోగులకు బీమా సదుపాయం కల్పిస్తోంది. ఇందులో భాగంగా విద్యార్థులకు బీమా ప్రీమియాన్ని ఉచితంగా ఇస్తున్నట్టు ఏపీఎన్‌ఆర్టీఎస్ అధ్యక్షుడు వెంకట్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేదీలోగా వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. బీమా తీసుకున్న వ్యక్తి ప్రమాదంలో మరణించినా, శాశ్వత అంగవైకల్యం కలిగినా రూ.10 లక్షలు, ప్రమాదంతో సంభవించే గాయాలు, అనారోగ్యం చికిత్సకయ్యే ఆస్పత్రి ఖర్చులకు రూ.లక్ష సహాయం అందుతుందని తెలిపారు. ప్రమాదం/అస్వస్థతకు గురై చదువు కొనసాగించడానికి అనర్హుడిగా గుర్తిస్తే స్వదేశం వచ్చేందుకు సాధారణ తరగతి విమాన చార్జీలతో పాటు మరెన్నో ప్రయోజనాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు ఏపీఎన్‌ఆర్టీఎస్ హెల్ప్‌లైన్ నంబర్ 863-2340678, 85000 27678 (వాట్సాప్)ను సంప్రదించాలని, www.apnrts.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

తెలంగాణ

సింగరేణికి కొత్త బాస్

ఇన్‌చార్జి సీఎండీగా ఎన్. బలరామ్ నియామకం

సాక్షి, హైదరాబాద్/సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణి బొగ్గు గనుల సంస్థ సీఎండీగా తొమ్మిదేళ్లపాటు పనిచేసిన ఎన్.శ్రీధర్ పదవీకాలం గతేడాది డిసెంబర్ 31తో ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆయన్ను బదిలీ చేసింది. ఆయన స్థానంలో సింగరేణి ఫైనాన్స్ విభాగం డైరెక్టర్ ఎన్.బలరామ్‌కు సీఎండీగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించింది. శ్రీధర్‌ను తదుపరి పోస్టింగ్ కోసం రాష్ట్ర సాధారణ పరిపాలన విభాగం (జీఏడీ)లో రిపోర్టు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు.

ఏయూలో పటిష్ట బోధనా వ్యవస్థ

- స్టార్టప్ రంగంలో ఏయూ ప్రగతి అమోఘం
- సీఎం వైఎస్ జగన్ విజనరీ లీడర్
- బంగ్లాదేశ్ డిప్యూటీ హైకమిషనర్ షెల్లీ సలిహీన్



బంగ్లాదేశ్ డిప్యూటీ హైకమిషనర్ షెల్లీ సలిహీన్‌ను సత్కరిస్తున్న ఇన్‌చార్జ్ వీసీ సమత తదితరులు

ఏయూ క్యాంపస్ (విశాఖ తూర్పు): ఆంధ్ర విశ్వవిద్యాలయం పటిష్టమైన బోధన వ్యవస్థను కలిగి ఉందని బంగ్లాదేశ్ డిప్యూటీ హై కమిషనర్ (చెన్నై) షెల్లీ సలిహీన్‌తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం ఆయన ఏయూను సందర్శించి ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య కె.సమతను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం పాలక మండలి సమావేశ మందిరంలో అధికారులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా షెల్లీ మాట్లాడుతూ కోవిడ్ తరువాత డిస్టెన్స్, డిజిటల్ లెర్నింగ్‌పై విద్యార్థులకు ఆసక్తి పెరిగిందన్నారు. స్టార్టప్, ఇంక్యుబేషన్‌రంగంలో ఏయూ మంచి ప్రగతిని చూపుతోందని ప్రశంసించారు. తాను ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశానన్నారు. విజనరీ నాయకుడిగా సీఎం వైఎస్ జగన్ నిలుస్తున్నారన్నారు. రాష్ట్రంలో విద్యా రంగానికి సీఎం జగన్ అధిక ప్రాధాన్యత ఇచ్చి ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. బంగ్లాదేశ్ విద్యార్థులకు ఏయూలో నాణ్యమైన విద్యను అందించడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం సాధించిన ప్రగతిని ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య కె.సమత వివరించారు. ఆచార్య కె.శ్రీనివాసరావు,డాక్టర్ శ్రీనివాస రావు, ప్రిన్సిపాళ్లు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు. వర్సిటీ తరఫున బంగ్లాదేశ్ డిప్యూటీ హై కమిషనర్‌ను సత్కరించారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



వైఎస్సార్ పింఛన్ కానుకను రూ.3వేలకు పెంచిన నేపథ్యంలో మంగళవారం కర్నూలు జిల్లా కొలిమిగుండ్ల మండలంలోని గొర్విమానుపల్లెలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు. – కొలిమిగుండ్ల (నంద్యాల)

వాయుసేనలో శిక్షణాధికారిగా రైతు బిడ్డ

- ఫ్లయింగ్ ఆఫీసర్‌గా ఎంపికైన అనకాపల్లి జిల్లా వాసి
- దేశ రక్షణ విభాగానికి మరో అధికారిని ఇచ్చిన బెన్నవోలు



యుద్ధ విమానం వద్ద వెంకటసాయి

చోడవరం: రైతు బిడ్డ భారతదేశ యుద్ధ విమానాల్లో శిక్షణ ఇచ్చే అధికారిగా ఎదిగారు. తండ్రి వ్యవసాయం చేసుకుంటూ కుమారుణ్ణి భారత సైన్యంలో చేర్పించగా.. తండ్రి కష్టానికి, ఆశయానికి అనుగుణంగా ఆ కుమారుడు 21 ఏళ్లప్రాయంలోనే ఉన్నత స్థానాన్ని అందిపుచ్చుకున్నారు. అనకాపల్లి జిల్లా చోడవరం మండలం బెన్నవోలు గ్రామానికి చెందిన సాధారణ రైతు మజ్జి గౌరీశంకర్, లక్ష్మి దంపతులకు వెంకటసాయి, దుర్గాప్రసాద్ ఇద్దరు కుమారులు. చిన్నతనం నుంచి ఇద్దరూ చదువులో ముందంజలో నిలిచారు. పెద్ద కుమారుడు ప్రాథమిక విద్య చోడవరంలో చదివి, 6వ తరగతిలో విజయనగరం సైనిక్ స్కూల్‌లో చేరారు. అక్కడ ఇంటర్మీడియెట్ చదువుతూ భారతదేశ సైనిక విభాగంలో చేరేందుకు శిక్షణ కూడా పొందారు. దేశ రక్షణ విభాగంలో అత్యంత కీలకమైన నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ) ప్రవేశ పరీక్షల్లో 2019లో ఉత్తమ స్థానం సాధించి ఎన్‌డీఏలో చేరారు. మూడేళ్లపాటు పుణెలో, ఏడాదిపాటు హైదరాబాద్ దుండిగల్ ఎయిర్‌పోర్టులో యుద్ధ విమానాల్లో శిక్షణ పొందారు. ఎన్‌డీఏతోపాటు ఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో బీటెక్ ఇంజినీరింగ్ (ఈసీఈ) కూడా పూర్తిచేశారు. శిక్షణ అనంతరం దేశ రక్షణ విభాగంలో కీలకమైన ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ యుద్ధ శిక్షణలో ఫ్లయింగ్ ఆఫీసర్‌గా భారత రక్షణ శాఖ నియమించింది. మజ్జి వెంకటసాయిని అనకాపల్లి కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి మంగళవారం అభినందించారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన యువకులకు వెంకటసాయి మంచి స్ఫూర్తిగా నిలిచారని ఆయన పేర్కొన్నారు.

దేశానికి సైన్యాన్ని అందిస్తున్న బెన్నవోలు

మారుమూల గ్రామంగా పెద్దేరు నది ఒడ్డున ఉన్న బెన్నవోలు గ్రామం దేశానికి ఎందరో సైనికులను అందించింది. ఆరు దశాబ్దాలుగా గ్రామానికి చెందిన అనేక మంది యువకులు త్రివిధ దళాల్లో చేరి దేశానికి సేవలందించారు. పూర్తిగా వ్యవసాయాధారిత గ్రామమైనప్పటికీ దేశ రక్షణకు ఈ గ్రామం చేస్తున్న సేవ అందరి ప్రశంసలు అందుకుంటోంది.

నా మొదటి ఆశయం ఇదే



చిన్నప్పటి నుంచీ ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో పైలట్‌గా చేరాలని అనుకునేవాణ్ణి. మా అమ్మ, నాన్న కష్టపడి పనిచేస్తూ నా చదువుకు కావలసినవన్నీ సమకూర్చారు. వారి సహకారంతో నా జీవితాశయాన్ని సాధించగలిగాను. దేశానికి సేవ చేయాలన్న నా ఆశయానికి ఫ్లయింగ్ ఆఫీసర్ పోస్టు మరింత దోహదపడుతుంది.

– మజ్జి వెంకటసాయి, ఫ్లయింగ్ ఆఫీసర్

మత్స్యకార 'పథకాల' అమలులో ఏపీ సహకారం భేష్

- కేంద్ర మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి పరుషోత్తం రూపాల
- మత్స్యకారులు, ఆక్వా రైతులతో ముఖాముఖి



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పరుషోత్తం రూపాల చిత్రంలో ఎంపీ బీదా మస్తాన్‌రావు తదితరులు

చిలకలపూడి(మచిలీపట్నం): మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన పథకాల అమలుకు కావాల్సిన సదుపాయాలను కల్పించడంలో ఏపీ ప్రభుత్వ రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారుల కృషి అభినందనీయమని కేంద్ర మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి పరుషోత్తం రూపాల ప్రశంసించారు. ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన పథకాలను లబ్ధిదారులకు చేరవేయడంలో అధికారులు భాగస్వాములు కావాలని సూచించారు. కృష్ణాజిల్లా మచిలీపట్నం సమీపంలోని గిలకలదిండి హార్బర్ వద్ద సాగర్ పరిక్రమ కార్యక్రమంలో భాగంగా మంగళవారం సాయంత్రం మత్స్యకారులు, ఆక్వా రైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. మచిలీపట్నం గిలకలదిండి హార్బర్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేసి మత్స్యకారులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. రాజ్యసభ సభ్యుడు బీదా మస్తాన్ రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమం కోసం రూ. 20 వేల కోట్లు కేటాయించిందని తెలిపారు. కాగా, నందివాడ మండలం రామాపురానికి చెందిన దావీదు, పెదలింగాలకు చెందిన తుమ్మల రామారావు, రవీంద్రబాబు, ప్రవీణ్‌లు కేంద్ర మంత్రికి పరిశ్రమల్లో ఎదుర్కొంటున్న కష్ట, నష్టాలను వివరించారు. మత్స్యరైతుల ఉత్పత్తిదారుల సంఘాలకు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. కేంద్ర మంత్రి సతీమణి సవితబెన్ రూపాల, కేంద్ర ప్రభుత్వ మత్స్యశాఖ జాయింట్ సెక్రటరీ నీతుకుమార్ ప్రసాద్, రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ కె.కన్నబాబు, కలెక్టర్ పి.రాజాబాబు, నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు ప్రతినిధి డాక్టర్ ఎల్‌ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

'కట్టలు' తెగిన అక్కసు

దుర్భిక్ష రాయలసీమ పచ్చబడుతుంటే జీర్ణించుకోలేని రామోజీ?

- గాలేరు–నగరి, హంద్రీ–నీవా ద్వారా కృష్ణా జలాలను గరిష్టంగా రాయలసీమకు తరలిస్తున్న సీఎం జగన్
- రైతుల్లో సీఎం వైఎస్ జగన్‌కు రోజు రోజుకు పెరుగుతున్న మద్దతు
- ప్రజలు చంద్రబాబు మొహం కూడా చూడరన్న భయం
- గాలేరు – నగరి, హంద్రీ – నీవా ప్రాజెక్టుల్లో కమీషన్లకే బాబు పరిమితం
- ఆ ప్రాజెక్టుల పనులు శరవేగంగా చేయిస్తున్న సీఎం జగన్



ఎన్నాళ్లీ.. ఆయకట్టు కథలు

హంద్రీ–నీవా, గాలేరు–నగరి కింద పంపిణీ కాలువలు ఏవీ?

అధికారంలోకి వస్తే రెండేళ్లలో నిర్మిస్తామని జగన్ హామీ • నాలుగున్నరేళ్లలో తట్టెడు మట్టీ ఎత్తిపోయని వైనం

కొద్దిపాటి పనులూ చేయలేక బీడుగా లక్షల ఎకరాల ఆయకట్టు

సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాయలసీమ అభివృద్ధి పథంలో దూసుకుపోతుండటాన్ని ఈనాడు రామోజీరావు సహించలేకపోతున్నారు. ప్రజలు అభివృద్ధి చెందితే చంద్రబాబు మొహం కూడా చూడరన్నది ఆయన భయం. అందుకే సీఎం వైఎస్ జగన్‌పై ఆయన అక్కసు కట్టలు తెంచుకుంది. దుర్భిక్ష ప్రాంతమైన రాయలసీమకు నీరందించి పచ్చటి పైర్లతో కళకళలాడేలా చేస్తుంటే అసత్య కథనాలతో ప్రజలను.. ముఖ్యంగా రైతులను మభ్య పెట్టేలా అసత్య కథనాలు అచ్చేస్తున్నారు.

గత 55 నెలలుగా శ్రీశైలం ప్రాజెక్టు నుంచి కృష్ణా జలాలను గరిష్టంగా ఒడిసిపట్టి గాలేరు–నగరి, హంద్రీ–నీవా, తెలుగుగంగ, ఎస్సార్బీసీల ద్వారా మళ్లిస్తూ దుర్భిక్ష రాయలసీమను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సస్యశ్యామలం చేస్తున్నారు. దీంతో రాయలసీమ రైతుల్లో సీఎం వైఎస్ జగన్‌కు ఆదరణ రోజు రోజుకు పెరుగుతోంది. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు రాజకీయంగా ఉనికి కోల్పోతున్నారు. ఇదే రామోజీ కడుపు మంటకు కారణం. అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు చేసిన తప్పిదాలు, మోసాలు, దోపిడీని కప్పిపుచ్చుతూ.. సీఎం వైఎస్ జగన్‌పై బురదజల్లుతూ పచ్చి అబద్ధాలతో 'ఈనాడు'లో టన్నులకొద్దీ కథనాలను అచ్చేసి, వికృతానందం పొందుతున్నారు. ఈ క్రమంలోనే 'ఎన్నాళ్లీ.. ఆయకట్టుకథలు' శీర్షికన మంగళవారం ఓ కట్టుకథ వండి వార్చారు. ఆ కథనంలో ప్రతి అక్షరంలో సీఎం వైఎస్ జగన్‌పై రామోజీరావు అక్కసు తప్ప.. వీసమెత్తు నిజం లేదు.

ఫ్యాక్ట్ చెక్

కళ్లుండీ చూడలేకపోతే ఎలా?

- ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి 1995లో అధికారాన్ని దక్కించుకున్న బాబు.. ఓట్ల కోసం 1996 లోక్‌సభ ఎన్నికలకు ముందు వామికొండ వద్ద, 1999 ఎన్నికలకు ముందు గండికోట వద్ద మరోసారి గాలేరు–నగరికి శంకుస్థాపన చేశారు. కానీ.. ఆ తొమ్మిదేళ్లలో తట్టెడు మట్టికూడా ఎత్తలేదు.
- వైఎస్ రాజశేఖరరెడ్డి 2004లో సీఎంగా బాధ్యతలు చేపట్టాక శ్రీశైలం నుంచి 38 టీఎంసీల కృష్ణా జలాలను తరలించి ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో 1,55,00 ఎకరాలు, ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1,03,500, నెల్లూరు జిల్లాలో 1,500 వెరసి 2.60 లక్షల ఎకరాలకు సాగు నీరు, 5 లక్షల మందికి తాగు నీరు అందించేలా గాలేరు–నగరి సుజల స్రవంతి పథకాన్ని జలయజ్ఞంలో భాగంగా 2005లో చేపట్టారు. 2009 నాటికే వరద కాలువ, గండికోట రిజర్వాయర్, పైడిపాలెం, వామికొండ, సర్వారాయసాగర్‌ల జలాశయాలతోపాటు ఈ ప్రాజెక్టులో చాలావరకు పనులు పూర్తి చేశారు.
- 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు గాలేరు–నగరి ప్రాజెక్టులో వివిధ ప్యాకేజీల్లో అరకొరగా మిగిలిన పనులు చేస్తున్న కాంట్రాక్టర్లపై 60–సీ నిబంధన కింద వేటు వేశారు. ఆ తర్వాత అంచనా వ్యయాన్ని ఇష్టానుసారం భారీగా పెంచేసి అస్మదీయ కాంట్రాక్టర్లకు అప్పగించి ప్రజాధనాన్ని దోచిపెట్టారు. గండికోట నిర్వాసితులకు పునరావాసం కల్పించకుండా నాలుగైదు టీఎంసీలు తరలించి, ఆయనే పూర్తి చేసినట్లు బీరాలు పలికారు.
- వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే రూ.వెయ్యి కోట్లతో నిర్వాసితులకు పునరావాసం కల్పించడం ద్వారా గండికోటలో 2020–21 నుంచి ఏటా పూర్తి సామర్థ్యం మేరకు 26.85 టీఎంసీలను నిల్వ చేస్తూ.. ఆయకట్టుకు నీళ్లందిస్తూ రైతులకు దన్నుగా నిలుస్తున్నారు. అవుకు వద్ద రెండో సొరంగాన్ని పూర్తి చేసి జాతికి అంకితం చేసి, ప్రస్తుత డిజైన్ మేరకు 20 వేల క్యూసెక్కులను తరలిస్తున్నారు. సర్వారాయ సాగర్, పైడిపాలెం, వామికొండ సాగర్‌లలో మిగిలిన పనులు, 35 వేల ఎకరాలకు నీళ్లందించడానికి డిస్ట్రిబ్యూటరీల పనులను రూ.130 కోట్లతో చేపట్టారు. ఆ పనులు శరవేగంగా సాగుతున్నాయి.
- వాతావరణ మార్పుల వల్ల శ్రీశైలానికి వరద వచ్చే రోజులు తగ్గిన నేపథ్యంలో.. వరద వచ్చిన రోజుల్లోనే గాలేరు–నగరిపై ఆధారపడ్డ ప్రాజెక్టులను నింపేలా కాలువల ప్రవాహ సామర్థ్యాన్ని 30 వేల క్యూసెక్కులకు పెంచుతూ సీఎం వైఎస్ జగన్ చేపట్టిన పనులు వేగంగా సాగుతున్నాయి. ఇవేవీ రామోజీకి కన్పించలేదు.

హంద్రీ–నీవాతో సీమ సస్యశ్యామలం

- గాలేరు– నగరి ప్రాజెక్టు మాదిరిగానే హంద్రీ–నీవా సుజల స్రవంతి పథకానికి 1996 లోక్‌సభ ఎన్నికలకు ముందు ఉరవకొండ వద్ద ఓసారి, 1999 ఎన్నికలకు ముందు ఆత్మకూరు వద్ద మరోసారి శంకుస్థాపన చేసిన చంద్రబాబు.. ఆ తొమ్మిదేళ్లలో ఒక్క అడుగు పని కూడా చేయకుండా రైతులను మోసం చేశారు.
- వైఎస్ రాజశేఖరరెడ్డి 2004లో బాధ్యతలు చేపట్టాక శ్రీశైలం నుంచి రోజుకు 3,850 క్యూసెక్కుల చొప్పున 120 రోజుల్లో 40 టీఎంసీలను తరలించి రాయలసీమ జిల్లాల్లో 6.02 లక్షల ఎకరాలకు సాగునీరు, 33 లక్షల మందికి తాగునీరు అందించేలా హంద్రీ–నీవా సుజల స్రవంతి పథకాన్ని చేపట్టారు. ఆయన హయాంలోనే రూ.6,862.26 కోట్లు ఖర్చు చేసి ప్రాజెక్టులో సింహభాగం పూర్తి చేశారు. హంద్రీ–నీవాకు తొలుత శ్రీశైలం రిజర్వాయర్‌లో 834 అడుగుల నుంచి నీటిని ఎత్తిపోసేలా మల్యాల వద్ద పంప్ హౌస్ నిర్మించిన వైఎస్.. ఆ తర్వాత నీటి మట్టం 795 అడుగుల్లో ఉన్నా హంద్రీ–నీవాకు నీటిని తరలించేలా 2007 ఆగస్టు 31న ముచ్చుమర్రి ఎత్తిపోతల చేపట్టి, 2009 నాటికే 90 శాతం పూర్తి చేశారు.
- 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు హంద్రీ–నీవాలో మిగిలిన పనులు చేస్తున్న కాంట్రాక్టర్లపైనా 60–సీ నిబంధన కింద వేటు వేసి.. ఆ తర్వాత వాటి అంచనా వ్యయాన్ని భారీగా పెంచేసి కాంట్రాక్టర్లకు అప్పగించి కమీషన్లు దండుకున్నారు. జీవో 22 (ప్రైస్ ఎస్కలేషన్), జీవో 63 (పనుల పరిమాణం ఆధారంగా బిల్లుల చెల్లింపు)లను అక్రమంగా వర్తింపజేసి కాంట్రాక్టర్లకు ప్రజాధనాన్ని దోచిపెట్టి, కమీషన్లు వసూలు చేసుకున్నారు. చివరకు తన సొంత నియోజకవర్గం కుప్పానికి కృష్ణా జలాలను తరలించేలా కుప్పం బ్రాంచ్ కెనాల్‌ను కూడా కమీషన్ల కక్కుర్తితో చంద్రబాబు పూర్తి చేయలేదు.
- వైఎస్ జగన్ సీఎం అయ్యాక శ్రీశైలానికి వరద వచ్చే రోజులు తగ్గిన నేపథ్యంలో కేవలం 60 రోజుల్లోనే 40 టీఎంసీలు తరలించేలా హంద్రీ–నీవా ప్రధాన కాలువ సామర్థ్యాన్ని పెంచే పనులు చేపట్టారు.
- హంద్రీ–నీవాలో మిగిలిన పనులను పూర్తి చేయడంతోపాటు హంద్రీ–నీవా, గాలేరు–నగరి ప్రాజెక్టులను అనుసంధానం చేయడం ద్వారా సాగు, తాగునీటిని పుష్కలంగా అందించే పనులకు శ్రీకారం చుట్టారు.
- హంద్రీ–నీవాలో అంతర్భాగమైన కుప్పం బ్రాంచ్ కెనాల్‌లో మిగిలిన పనులను పూర్తి చేసి, ఈ ఏడాదే కృష్ణా జలాలను కుప్పానికి తరలించేలా సీఎం వైఎస్ జగన్ అడుగులు వేస్తున్నారు.
- 2019–20లో 41.93 టీఎంసీలు, 2020–21లో 40.98, 2021–22లో 41.23, 2022–23లో 33.85 టీఎంసీలు (కర్నూలు, అనంతపురం జిల్లాల్లో భారీగా వర్షాలు కురవడంతో నీటిని తరలించాల్సిన అవసరం లేకుండా పోయింది), వర్షాభావ పరిస్థితుల్లోనూ 2023–24లో 15 టీఎంసీలు తరలించడం ద్వారా సాగు, తాగునీరు అందించారు.
- సీమను సస్యశ్యామలం చేసే రెండు ప్రాజెక్టులకూ రెండేసి మార్లు శంకుస్థాపన చేసి, చేతులు దులుపుకొన్న చంద్రబాబు.. రాష్ట్ర విభజన అనంతరం 2014లో అధికారం చేపట్టాక, అప్పటివరకు పనులు చేసిన కాంట్రాక్టర్లను అక్రమంగా తొలగించి, వ్యయాన్ని భారీగా పెంచేసి, నచ్చిన కాంట్రాక్టర్లతో పనులు చేయించి, కమీషన్లు దండుకొన్న విషయం రామోజీకి తెలియంది కాదు. అయినా చంద్రబాబు అక్రమాలపై ఒక్క ముక్క రాయలేదు. ఇప్పుడు సీఎం జగన్ పనులు త్వరితగతిన పూర్తి చేసి, సీమ రైతులకు సాగునీటిని, ప్రజలకు తాగునీటిని అందిస్తుంటే మాత్రం కడుపు మంట రాతలు రాస్తున్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

వేడుకగా బసవేశ్వర రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కంప్లి: కూడ్లిగి తాలూకా చిక్కజోగిహళ్లి సిద్దాపుర గ్రామ ఆరాధ్య దైవమైన బసవేశ్వర స్వామి రథోత్సవం ఆడంబరంగా జరిగింది. కొత్త సంవత్సరంలో దేవుడి దర్శనార్థం భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని రథోత్సవాన్ని తిలకించారు. ఉదయాన్నే ఆలయంలో, స్వామి వారికి పూజా కార్యక్రమాలు జరిగాయి. రథోత్సవానికి ముందుగా బసవేశ్వరుడిని రథం వద్దకు తెచ్చి రథం చుట్టు మూడు ప్రదక్షణలు జరిపించి రథంలో బసవేశ్వరుని ప్రతిష్టించారు. మహిళలు పూర్ణకుంభాలతో వివిధ వాయిద్యాలతో రథోత్సవంలో పాల్గొన్నారు.

ముస్లింలపై అనుచిత వ్యాఖ్యలు తగదు



గంగావతిలోని బస్టాండ్ సర్కిల్‌లో ధర్నా చేస్తున్న దృశ్యం

గంగావతి: ముస్లిం మహిళలపై అనుచితంగా మాట్లాడిన కల్లడ్క ప్రభాకర్ భట్‌పై చర్యలు తీసుకొని బంధించాలని డిమాండ్ చేస్తూ కర్ణాటక ప్రదేశ్ జనతాదళ్(జేడీఎస్) పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం బస్టాండ్ సర్కిల్‌లో ధర్నా చేశారు. ఇటీవల ముస్లిం మహిళల గురించి అసభ్యకరంగా,అగౌరవపరిచే రీతిలో మాట్లాడిన ఆయనను తక్షణం రాష్ట్ర ప్రభుత్వం బంధించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు తమ కార్యాలయం నుంచి అంబేడ్కర్ సర్కిల్ మీదుగా బస్టాండ్ వరకు ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో జేడీఎస్ నేత షేక్ నబి, దుర్గా ప్రసాద్, సలీం, హుస్సేన్‌బీ, శాహిదా బేగం, అమీనాబేగం తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడితో పాట్లు



ట్యాంకర్ ముందు గుమికూడిన లేఔట్ నివాసులు

కంప్లి: హూవినహడగలి తాలూకాలోని నందిహళ్లి లేఔట్‌లో తాగునీటి ఎద్దడితో ఆ ప్రాంతవాసులు అల్లాడి పోతున్నారు. వేసవికి ముందే ఈ పరిస్థితి ఉంటే మరి వేసవిలో ఇంకా ఎంత దారుణంగా ఉంటుందో అని కూలీ కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో అధిక శాతం కూలీ కార్మికులే ఉన్నందున నీరు దొరకడం లేదు. గత్యంతరం లేక సమీపంలోని పొలాల్లోకి వెళ్లి నీరు తెచ్చుకుంటున్నారు. కనీసం కూలీ కార్మికుల కష్టాలను పరిశీలించి వెంటనే సంబంధించిన అధికారులు సక్రమంగా తాగునీరు అందించే చర్యలు తీసుకోవాలని లేఔట్ నివాసులు వీరేష్, శరణప్ప, కొట్రేష్ విన్నవించారు.

6 నుంచి రాష్ట్ర స్థాయి మహిళా సమ్మేళనం



పోస్టర్‌ను విడుదల చేస్తున్న మంజుల తదితరులు

హొసపేటె: మహిళలపై నిరంతరం జరుగుతున్న దౌర్జన్యాలు, హింసను అరికట్టడంతో పాటు మహిళలకు విద్య, ఉపాధి, ఆరోగ్యం, శ్రామిక మహిళలకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత భరోసా తదితర సమస్యలపై దావణగెరెలో ఈ నెల 6, 7 తేదీల్లో 7వ రాష్ట్ర స్థాయి మహిళా సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు ఏఐఎంఎస్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎన్.మంజుల తెలిపారు. మంగళవారం నగరంలోని ప్రెస్ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. బాధిత మహిళల గొంతుకగా నిలిచిన అఖిల భారత మహిళా సాంస్కృతిక సంఘం(ఏఐఎంఎస్ఎస్) దేశ వ్యాప్తంగా పాదయాత్రలు నిర్వహిస్తోందన్నారు. ఈ సందర్భంగా మహిళా సంఘం నాయకురాళ్లు పాల్గొన్నారు.

వైభవంగా మారుతేశ్వర జాతర



రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే, భక్తులు

రాయచూరు రూరల్: తాలూకాలోని సాదాపురలో సోమవారం సాయంత్రం మారుతేశ్వర జాతర, రథోత్సవం వైభవంగా జరిగాయి. రాయచూరు రూరల్ ఎమ్మెల్యే బసనగౌడ, ఏపీఎంసీ అధ్యక్షుడు మల్లికార్జున గౌడ, వందలాది మంది భక్తుల సమక్షంలో రథోత్సవాన్ని నిర్వహించారు.

రామభక్తులకు మాత్రమే ఆహ్వానమా?

- అయోధ్యలో రామాలయ ప్రారంభోత్సవానికి ఆహ్వానం అందని అంశంపై సీఎం అసంతృప్తి



విజయపురలో స్వామీజీ గురునమన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీఎం సిద్దరామయ్య, స్వామీజీలు

గంగావతి: అయోధ్యలో రామ మందిర ప్రారంభోత్సానికి రామభక్తులను మాత్రమే ఆహ్వానించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు ప్రకటించడం విచారకరం అని సీఎం సిద్దరామయ్య పేర్కొన్నారు. ఆయన కొప్పళ తాలూకా బసాపుర విమానాశ్రయం వద్ద విలేకరులతో మాట్లాడారు. ఆహ్వానం అందిన వారు మాత్రమే రామాలయ ప్రారంభోత్సవానికి వెళతారని ఎద్దేవా చేశారు. హుబ్లీలో కర సేవకులు తప్పు చేసినందుకే చర్యలు తీసుకున్నారన్నారు. తప్పు చేసిన వారిని ఊరికే వదిలిపెట్టాలా? అని సీఎం ప్రశ్నించారు.

సిద్దేశ్వర స్వామీజీ సేవలు అనన్యం

రాయచూరు రూరల్: రాష్ట్రంలో జ్ఞానయోగి, ఆధ్యాత్మిక ప్రవక్త, జ్ఞాన యోగాశ్రమ సంచాలకుడు సిద్దేశ్వర స్వామీజీ సేవలు అనన్యమని రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రశంసించారు. మంగళవారం విజయపుర జ్ఞానయోగాశ్రమంలో స్వామీజీ గురు నమన కార్యక్రమంలో ప్రసంగించారు. సిద్దేశ్వర స్వామీజీ అడుగుజాడల్లో నడవాలన్నారు. బసవాది శరణుల అనుయాయులుగా మనందరం మారాలన్నారు.

అతిథి అధ్యాపకుల పర్మినెంట్ అసాధ్యం

రాష్ట్రంలో ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న అతిథి అధ్యాపకులను పర్మినెంట్ చేయడం కష్టసాధ్యమని సీఎం అన్నారు. మంగళవారం కొప్పళ జిల్లా గిణిగెరాలోని హెలిప్యాడ్ వద్ద విలేకరులతో ఆయన మాట్లాడారు. పాదయాత్రలు చేస్తున్న విషయంపై వారితో చర్చలు జరిపామన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి నయాపైసా కరువు సహాయం అందలేదన్నారు. దీనిపై 25 మంది లోక్‌సభ సభ్యులు మౌనం వహించడంపై సీఎం అభ్యంతరం వ్యక్తం చేశారు.

స్థలం లేనందున పిలవలేదు: కేంద్ర మంత్రి జోషి

సాక్షి బళ్లారి: రామ మందిర ప్రారంభోత్సవానికి ముఖ్యులకు వేదిక మీద స్థలం లేకపోవడంతో సీఎం సిద్దరామయ్యకు ఆహ్వానం పంపలేదని కేంద్ర మంత్రి ప్రహ్లాదజోషి పేర్కొన్నారు. ఆయన శనివారం విజయపురలో విలేకరులతో మాట్లాడారు. రామమందిర ప్రారంభోత్సవానికి సీఎంకు ఆహ్వానం అందలేదని మాజీ మంత్రి ఆంజనేయ పేర్కొన్న విషయంపై ఆయన ప్రస్తావిస్తూ దేశంలోని ఏ బీజేపీ ముఖ్యమంత్రికి రామ మందిర ప్రారంభోత్సవానికి ఆహ్వానం పంపలేదన్నారు. కేంద్రమంత్రి అయిన తనకు కూడా ఆహ్వానం అందలేదన్నారు. అంతేగాకుండా సమావేశానికి రాకూడదని కూడా పంపారన్నారు.

జక్కణాచారి సేవలు ఎనలేనివి



కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

హొసపేటె: దేశ సంస్కృతికి గర్వకారణమైన శిల్పకళకు అమరశిల్పి జక్కణాచారి చేసిన సేవలు ఎనలేనివని విశ్రాంత అధ్యాపకులు నాగరాజ పత్తార్ తెలిపారు. సోమవారం బళ్లారి రోడ్డులోని కాళికమ్మ ఆలయంలో ఏర్పాటు చేసిన అమరశిల్పి జక్కణాచారి సంస్మరణ దినోత్సవంలో ఆయన ప్రత్యేక ఉపన్యాసం చేశారు. శిల్పులు వాస్తుశిల్ప కళలో దేశ సాంస్కృతిక, రాజకీయ, విద్యా వారసత్వాన్ని కైవసం చేసుకున్నారన్నారు. అలాంటి శిల్పుల్లో అమరశిల్పి జక్కణాచారి ప్రముఖుడన్నారు. జక్కణాచారి ఒక చారిత్రక వ్యక్తి. అనేక రాజ కుటుంబాల పాలన ఫలితంగా కర్ణాటక శిల్పకళా వారసత్వం ప్రపంచ ప్రసిద్ధి చెందిందన్నారు. రాష్ట్రంలో హొయ్సళేశ్వర్, బేలూరు చెన్నకేశవాలయాలు, విజయనగర సామ్రాజ్య హంపీ తదితర చారిత్రక ప్రదేశాలు ప్రపంచ ప్రఖ్యాతి పొందాయన్నారు. కరునాడ శిల్ప వైభవాన్ని తిలకించేందుకు ప్రపంచ వ్యాప్తంగా పర్యాటకులు వస్తున్నారని తెలిపారు. తహసీల్దార్ విశ్వజిత్ మెహతా, కన్నడ సంస్కృతి శాఖ సహాయ సంచాలకులు సిద్దలింగేష్ రంగన్నవర, జిల్లా కమిషనర్ కార్యాలయం తహసీల్దార్ షణ్ముఖ్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

నిరాడంబరంగా కొత్త వేడుక



పేద పిల్లల మధ్య కొత్త సంవత్సర వేడుకల్లో మహిళా పోలీస్ కానిస్టేబుల్ కల్పనా నాయక్

రాయచూరు రూరల్: చెత్తకుప్పల వద్ద ప్లాస్టిక్ బాటిళ్లను ఏరుకొనే వారి పిల్లల మధ్య జిల్లా జైలులో విధులు నిర్వహిస్తున్న పోలీస్ మహిళా కానిస్టేబుల్ కల్పనా నాయక్ నూతన సంవత్సర వేడుకలను జరిపారు. సోమవారం రాత్రి అల్లమ ప్రభు కాలనీలో పిల్లల మధ్య కేక్ కట్ చేసి వారికి తినిపించారు. ఆనందంగా కేరింతలు, తుళ్లింతలతో ఆడుతూ పాడుతూ చేసుకొనే నూతన సంవత్సర వేడుకల సంబరాలకు స్వస్తి పలికి పేద పిల్లల మధ్య జరుపుకోవడం విశేషం.

జక్కణ్ణ సర్కిల్‌గా పేరు పెట్టండి



జక్కణాచారి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన దృశ్యం

కంప్లి: పట్టణంలోని సర్కిల్‌కు అమరశిల్పి జక్కణ్ణ కూడలిగా నామకరణం చేయాలని డీ.హిరేహాళ్ విశ్వకర్మ జగద్గురువు కాళహస్తేంద్ర స్వామి ఒత్తిడి చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అమరశిల్పి జక్కణాచారి సంస్మరణ దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ జక్కణాచారి చెక్కిన కళను గుర్తించిన ప్రభుత్వం ఆయన పేరిట ప్రభుత్వ పరంగా దినోత్సవం నిర్వహించడం గర్వకారణం అన్నారు. అనంతరం తహసీల్దార్ శివరాజ్ మాట్లాడుతూ ఇతిహాస వాస్తుశిల్పి పరంపరకు శిల్పాల కానుక అపారం, అలాంటి అద్భుత కళను తన చేతిలో మలచి అమర శిల్పి జక్కణాచారిగా ప్రజల హృదయాల్లో నిలిచి పోయారని, వారి కళ నేటికీ అజరామరం అని కొనియాడారు.

హంపీ ఉత్సవాల్ని జయప్రదం చేద్దాం

- ఏర్పాట్ల సమీక్ష సమావేశంలో జిల్లాధికారి దివాకర్



మాట్లాడుతున్న జిల్లాధికారి దివాకర్

హొసపేటె: చారిత్రక విజయనగర సామ్రాజ్య వైభవాన్ని చాటిచెప్పేందుకు ఫిబ్రవరి 2, 3, 4 తేదీల్లో నిర్వహిస్తున్న హంపీ ఉత్సవాలను విజయవంతం చేద్దామని హంపీ ఉత్సవ ఏర్పాట్ల సమితి చైర్మన్, జిల్లాధికారి దివాకర్ సూచించారు. హంపీ ఉత్సవాల నిర్వహణపై తన కార్యాలయ సభాంగణంలో మంగళవారం నిర్వహించిన వివిధ కమిటీల ప్రగతి సమీక్ష సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. అన్ని కమిటీలు తగిన సన్నాహాలు చేయాలని ఆయన ఆదేశించారు. ఈ ఏడాది హంపీ ఉత్సవాల నిర్వహణకు రిసెప్షన్, రవాణా, వసతి, ఆహార, మీడియా, ప్రాథమిక సౌకర్యాలు, తాగునీటి వ్యవస్థ, ఆరోగ్య, పారిశుద్ధ్య, ఎగ్జిబిషన్, స్టేజ్, స్పోర్ట్స్‌తో సహా 20కి పైగా ఏర్పాటైన కమిటీలు కార్యక్రమాన్ని సజావుగా, క్రమపద్ధతిలో నిర్వహించేందుకు పరస్పర సమన్వయంతో పని చేయాలన్నారు. ఉత్సవాల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు, కబడ్డీ, కుస్తీ, సాహస క్రీడలు, రంగోలి పోటీలు, రంగుల సాంస్కృతిక కళా బృందాల కవాతు, ప్రదర్శన తదితర క్రీడా కార్యక్రమాల నిర్వహణకు సంబంధిత అధికారులు త్వరితగతిన చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక కళా బృందాలకు ప్రాధాన్యత కల్పించి జిల్లాలో పగటివేష, గిరిజన సంఘం కళ, వీరగాసె, మహిళా డోలు కుణిత, కోలాట, లంబాణి, హలగె వాదన, యక్ష గానాలతో పాటు పలు స్థానిక కళారూపాలను లక్ష్యంగా చేసుకుని కన్నడ, సాంస్కృతిక శాఖ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈఓ సదాశివ ప్రభు, అదనపు జిల్లాధికారి అనురాధ తదితరులు పాల్గొన్నారు.

చేనేతలను ప్రోత్సహించాలి



మేళాను ప్రారంభిస్తున్న జిల్లాధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా తదితరులు

బళ్లారిటౌన్: చేనేతకారులు తయారు చేసిన వస్త్రాలను కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించాలని జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జెడ్పీ సీఈఓ రాహుల్ సంకనూరు పేర్కొన్నారు. మంగళవారం గాంధీభవన్ ఆవరణలో జవళి శాఖ అభివృద్ధి నిగమ, జిల్లా పంచాయతీ, కావేరి హ్యాండ్‌లూమ్స్ తదితర శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి చేనేత మేళా వస్త్రసిరిని ప్రారంభించి మాట్లాడారు. నేటి ఆధునిక పరిజ్ఞాన యుగంలో చేనేత వస్తువులకు ఆదరణ కరువైందన్నారు. దీన్ని గుర్తించి ప్రభుత్వం కూడా చేనేతకారులను ఆదుకొనే దిశలో పలు పథకాలను ప్రవేశ పెడుతోందని గుర్తు చేశారు. కాగా రాష్ట్రంతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి దాదాపు 60 చేనేత సంఘాలు ఈ ప్రదర్శనలో పాల్గొని తాము తయారు చేసిన వస్త్రాలను 20 శాతం ప్రభుత్వ ప్రోత్సాహ రాయితీతో అమ్మకాలు చేపట్టారు. ఈ నెల 15 వరకు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రదర్శన ఉంటుందని జవళి శాఖ జేడీ వీరేష్ దవలే తెలిపారు. కార్యక్రమంలో కావేరి హ్యాండ్‌లూమ్స్ అధ్యక్షులు బీజీ గణేష్, మాజీ అధ్యక్షులు విరుపాక్షప్ప, ఉపమేయర్ జానకి, చేనేత వర్గ నేతలు బ్రహ్మయ్య, దేవానంద, కార్పొరేటర్ విక్కీ, అధికారులు మారిముత్తు, లింగరాజు, విఠల్ పాల్గొన్నారు.

వేతన బకాయిల కోసం ధర్నా



ఆందోళనలో పాల్గొన్న జెస్కాం ఉద్యోగులు, సిబ్బంది

రాయచూరు రూరల్: జిల్లాలోని మాన్వి జెస్కాం విభాగంలో విధులు నిర్వహిస్తున్న జెస్కాం సిబ్బంది, ఉద్యోగులు బకాయి వేతనాలు చెల్లించాలని కేపీటీసీఎల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గురురాజ్ డిమాండ్ చేశారు. మంగళవారం మాన్వి జెస్కాం కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టి మాట్లాడారు. మాన్వి తాలూకాలో 8 విభాగాల్లో విద్యుత్ బిల్లులు వసూలు చేయలేదనే కారణంతో 90 మంది సిబ్బంది, ఉద్యోగుల వేతనాలను పెండింగ్‌లో పెట్టడం తగదన్నారు. ఈ విషయంలో రాయచూరు జెస్కాం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆందోళనకారుల వద్దకు వచ్చి సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఆటలాడుతూ అనంత లోకాలకు..

- నీటి తొట్టిలో పడి చిన్నారి మృతి

సాక్షి బళ్లారి: నీటి తొట్టిలో పడి ఓ చిన్నారి మృతి చెందిన ఘటన మంగళవారం చిత్రదుర్గ తాలూకా హుళియారులో జరిగింది. వివరాలు.. మహారాష్ట్రకు చెందిన దత్త, జాధవ్ అనే దంపతులు హుళియారులో నివాసం ఉంటున్నారు. వారికి ప్రియా(2) అనే కుమార్తె ఉంది. ఆ బాలిక ఆటలాడుతూ నీటి తొట్టిలో పడిపోయింది. చిన్నారి కనిపించకపోవడంతో తల్లిదండ్రులు ఇంటా బయటా వెతికారు. చిన్నారి నీటి తొట్టిలో పడిన విషయం తెలుసుకొని వెంటనే వెలికితీసి ఆస్పత్రికి తరలించారు. అయితే పరీక్షించిన వైద్యులు అప్పటికే చిన్నారి ఊపిరాడక మృతి చెందినట్లు ప్రకటించడంతో కుటుంబ సభ్యుల ఆక్రందన మిన్నంటింది.

విద్యుత్ షాక్‌తో లైన్‌మెన్ మృతి

చిత్రదుర్గ జిల్లా మొళకాల్మూరు తాలూకా ఓబుళాపుర గ్రామంలో విద్యుత్ లైన్‌మెన్ మృతి చెందిన ఘటన జరిగింది. మల్లికార్జునగౌడ విద్యుత్ స్తంభాన్ని ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ వైరు తాకడంతో షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకొన్న వెంటనే పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కాగా మృతుల బంధువులను స్థానిక ఎమ్మెల్యే ఎన్‌వై. గోపాలకృష్ణ పరామర్శించి ఓదార్చారు.

ఆగని ఆన్‌లైన్ మోసాలు

- అమాయకులపై కేటుగాళ్ల పంజా
- ముగ్గురికి రూ.15.61 లక్షల బురిడీ

హుబ్లీ: ఆన్‌లైన్‌లో మోసకారి మాటలతో దండిగా డబ్బులు సంపాదించవచ్చని అమాయకులను నమ్మించి మోసగించే ఘటనలకు ఎంత చైతన్యం చేసినా బాధితులు మోసపోతూనే ఉన్నారు. తాజాగా నగరంలో ఒకే రోజు రూ.26 లక్షలకు పైగా ముగ్గురు బాధితులు పోగొట్టుకున్నారు. వివరాలు.. ఏసీఓ డిస్కవరీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఇచ్చే టాస్కలను అధిగమిస్తే ఇంట్లోనే కూర్చొని ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చని నమ్మించి ఓ స్థానిక వ్యక్తి నుంచి రూ.15.61 లక్షలను కేటుగాళ్లు తమ ఖాతాలోకి బదలాయించుకొని వంచించిన ఘటన ఇది. విద్యానగర్‌కు చెందిన ప్రశాంత కులకర్ణి బాధితుడు. సదరు కంపెనీ పేరిట ఎస్ఎంఎస్ పంపి పరిచయం చేసుకున్న గుర్తు తెలియని వ్యక్తి యూట్యూబ్ చానల్ లింక్‌ను షేర్ చేసి, సబ్‌స్క్రైబ్ చేయడంతో పాటు స్క్రీన్‌షాట్ పంపిస్తే డబ్బులు సంపాదించవచ్చని నమ్మించారు.

ఈ క్రమంలో ఇచ్చిన టాస్క్‌ను పూర్తి చేసిన నేపథ్యంలో రూ.150, రూ.2000, రూ.2800 ఇలా డబ్బులను బాధితుడి ఖాతాలోకి వేసి తమ బుట్టలోకి వేసుకున్నారు. ఆ తర్వాత దశలవారీగా మొత్తం బాధితుడి ఖాతా నుంచి రూ.15,61,924 బదలాయించుకొని వంచించినట్లు బాధితుడు సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు. మరో ఘటనలో రెట్టింపు డబ్బులు గడించవచ్చని ఆశ చూపి నగరంలోని నేహా పర్వీన్ అనే మహిళ రూ.7.64 లక్షలను పోగొట్టుకుంది. టెలిగ్రాంలో పరిచయం అయిన గుర్తు తెలియని వ్యక్తి ఆ మహిళ వ్యాట్సాప్ నెంబర్ తీసుకున్నాడు. తర్వాత వ్యాట్సాప్‌లో డబ్బులు పెట్టుబడి పెడితే ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించి విడతల వారీగా రూ.7,64,260 తమ ఖాతాలోకి బదలాయించుకొని మోసగించినట్లు ఆమె సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది. మరో ఘటనలో డబ్బులు పెట్టుబడి పెడితే అధిక లాభాలు అంటూ వ్యాట్సాప్‌లో పరిచయం చేసుకొన్న వ్యక్తి మాటలు నమ్మిన స్థానిక రాబియా అనే మహిళ రూ.3,94,136లను పోగొట్టుకొని సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ల్యాబ్ టెక్నీషియన్‌పై చర్యకు వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న కార్యకర్తలు

రాయచూరు రూరల్: కల్మల పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న లేడీ ల్యాబ్ టెక్నీషియన్‌పై చర్యలు చేపట్టాలని మహర్షి వాల్మీకి నవ యువక సంఘం కార్యకర్తలు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా ఆరోగ్య అధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనలో సంచాలకుడు శరణ నాయక్ మాట్లాడారు. కల్మల పీహెచ్‌సీకి వివిధ పరీక్షల నిమిత్తం వచ్చిన రోగులకు పరీక్షలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్న ఆమెపై చర్యలు చేపట్టాలని కోరుతూ స్థానికాధికారి కృష్ణమూర్తికి వినతిపత్రం సమర్పించారు.

నియామకాల్లో అక్రమాలను అరికట్టరూ..



వినతిపత్రం సమర్పిస్తున్న కార్యకర్తలు

రాయచూరు రూరల్: ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీలో జరుగుతున్న అక్రమాలను అరికట్టాలని ఏఐడీఎస్ఓ కార్యకర్తలు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద చేపట్టిన ఆందోళనలో సంచాలకుడు చెన్నబసవ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలోని 12 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. ఎన్ఆర్ఈజీ పనులను 200 రోజులకు పెంచాలని, రూ.600 కూలీ ధరలను ఇవ్వాలన్నారు. ఒపెక్, రిమ్స్, పీహెచ్‌సీల్లో కాంట్రాక్ట్ పద్ధతిపై నియామకాల్లో అక్రమాలపై విచారణ జరపాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

లారీ, బైక్ ఢీ- ఒకరు మృతి

- మినీ బస్సు బోల్తా.. 10 మందికి గాయాలు
- విద్యార్థులకు తృటిలో తప్పిన పెనుప్రమాదం



మృతి చెందిన లైన్‌మెన్



బోల్తా పడిన లారీ



బోల్తా పడిన మినీ బస్సు

సాక్షి బళ్లారి: చిత్రదుర్గ జిల్లాలో మంగళవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి చెందగా, 10 మంది విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. తృటిలో విద్యార్థులకు పెనుప్రమాదం తప్పింది. చిత్రదుర్గ జిల్లా హొసదుర్గ తాలూకా మల్లప్పనహళ్లి సమీపంలో విద్యార్థులు వెళ్తున్న మినీ బస్సు డ్రైవర్ అదుపు తప్పి బోల్తా పడటంతో విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. అదృష్టవశాత్తు విద్యార్థులకు ఎలాంటి ప్రాణహాని జరగకపోవడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకొన్నారు. ఈఘటనపై హొసదుర్గ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా జిల్లాలో మరో రోడ్డు ప్రమాదంలో బైక్, లారీ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్రంగా గాయాలయ్యాయి. లైన్‌మెన్‌గా పని చేస్తున్న సిద్దాపుర గ్రామానికి చెందిన రంగస్వామి(40) అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. ఈఘటనపై చెళ్లకెరె పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రిటైర్డు జవాన్‌కు సన్మానం

కేజీఎఫ్: భారత సైన్యంలో 28 ఏళ్ల పాటు సుదీర్ఘ సేవలు అందించిన అనంతరం రిటైరై వచ్చిన సుబ్రమణి అనే మాజీ జవాన్‌కు ఘన స్వాగతం లభించింది. కేజీఎఫ్ రైల్వేస్టేషన్‌లోకి రాగానే కుటుంబసభ్యులు, నగరసభ సభ్యులు కరుణాకరన్ తదితరులు మైసూరు పేటా తొడిగి స్వాగతం పలికారు. సైన్యంలో ప్రముఖంగా నేర్పించేది క్రమశిక్షణ అని, సైన్యంలో విధులు నిర్వహించినందుకు ఎంతో సంతోషంగా ఉందని రిటైర్డ్ జవాన్ సుబ్రమణి అన్నారు.

కరవే నేత విడుదలకు వినతి

శ్రీనివాసపురం: కన్నడలో నామఫలకాలను ఏర్పాటు చేయాలని ధర్నా చేస్తుండగా అరెస్ట్ చేసిన కరవే రాష్ట్ర అధ్యక్షుడు నారాయణగౌడ, కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కరవే కార్యకర్తలు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు మేడిహాళ రాఘవేంద్ర మాట్లాడుతూ కన్నడ భాష రక్షణ కోసం పోరాటాలు సాగిస్తున్న కరవే రాష్ట్ర అధ్యక్షుడు నారాయణగౌడను అరెస్టు చేయడం సరికాదన్నారు. అనంతరం తహసీల్దార్ సుధీంద్రకు వినతిపత్రం సమర్పించారు. ధర్నాలో కస్తూరి కర్ణాటక జనపర వేదిక యువ రాష్ట్ర అధ్యక్షుడు టి.సుబ్రమణి, ప్రధాన కార్యదర్శి సునీల్‌కుమార్, కాశీ విశ్వనాథ్, చిరంజీవి పాల్గొన్నారు.

రామజన్మభూమి ఆందోళన కేసులో ఒకరి అరెస్ట్



మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ రేణుకా సుకుమార

హుబ్లీ: లాంగ్ పెండింగ్ కేసులో కోర్టు ఆదేశాల మేరకు ఒక నిందితుడిని అరెస్ట్ చేశాం. ఈ విషయంలో ప్రభుత్వ ఒత్తిళ్లు ఏమీ లేవని జంట నగరాల కమిషనర్ రేణుకా సుకుమార స్పష్టం చేశారు. ఆమె మంగళవారం మీడియాతో మాట్లాడారు. లాంగ్ పెండింగ్ కేసులపై దర్యాప్తు చేయడం, చర్యలు తీసుకోవడం సాధారణమే అన్నారు. ఇందులో ప్రత్యేకత ఏమీ లేదు. ఇది అన్ని జిల్లాల్లో జరిగేదే అన్నారు. సుమారు 20 నుంచి 30 ఏళ్ల పాత చీటింగ్, డ్రగ్స్, రాబరీ కేసుల్లో దర్యాప్తు జరుపుతున్నామన్నారు. కోర్టు సూచనల మేరకు ఎల్‌ఓపీ కేసులపై దర్యాప్తు జరిపి నిగ్గు తేలుస్తున్నామన్నారు. ఇది పోలీస్ శాఖలో కోర్టు సూచనల మేరకు జరిగే సాధారణ ప్రక్రియ అని సమర్థించుకున్నారు. రామమందిర ఆందోళన వేళ కరసేవకు ముందు డిసెంబర్ 5, 1992లో హుబ్లీలో ఘర్షణ జరిగిందని గుర్తు చేశారు. ఆ ఘర్షణలో ఓ అంగడికి నిప్పుపెట్టారు. ఈ కేసులో 9 మందిపై హుబ్లీ టౌన్ పోలీసులు ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. దీనిపై 31 ఏళ్ల తర్వాత ఒకరిని అరెస్ట్ చేశాం అని కమిషనర్ అన్నారు. కాగా ఈ విషయమై అప్పటి ఆందోళనకారుడు రాజీవ్ రామదాస్ మాట్లాడుతూ రామజన్మ భూమి కోసం మేం 1989 నుంచి పోరాటం కొనసాగిస్తున్నామన్నారు. 1992లో మేం అరెస్టుకు గురయ్యాం. ఇప్పటి నేతలందరికీ ఆ పోరాట వివరాలు తెలియవు. మా గురించి అవగాహన లేదు. మళ్లీ ఇన్నేళ్లకు హుబ్లీ టౌన్ పోలీసులు తమను స్టేషన్‌కు పిలిపించి విచారించారు. ఏసీపీ తమపై పాత కేసు ఉందని తెలిపారు కాదు అన్ని కేసులు ముగిశాయని సమాధానం ఇస్తే లేదు, కేసు పెండింగ్‌లో ఉందన్నారన్నారు. గతంలో 2017లో పాటిల్ అనే పోలీస్ అధికారి సూచన మేరకు ముందస్తు బెయిలు ఇచ్చినట్లు ఇప్పటి అధికారులకు అవగాహన లేదని రాజీవ్ ధర్మదాస వివరించారు.

6 నుంచి మాధవ తీర్థుల మహా సమారాధన

కోలారు: హంసవాహన పరమాత్మ పరంపర జగద్గురు శ్రీమన్మధ్వాచార్య మూల మహా సంస్థాన తాలూకాలోని తంబిహళ్లి శ్రీ మన్మధతీర్థ శ్రీమఠంలో శ్రీశ్రీ 108 శ్రీ ప్రసన్న శూర మాధవతీర్థ మహా సమారాధన మహోత్సవాలను ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. 6న పూర్వారాధన, 7న ఏకాదశి, 8న ద్వాదశి, 9న త్రయోదశి ఉత్తరారాధన కార్యక్రమాన్ని గురువుల బృందావనంలో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రీమఠం భక్తులు ఈ పవిత్ర ఉత్సవంలో పాల్గొని భగవంతుడి కృపకు పాత్రులు కావాలని కోరారు.

పట్టాల కోసం రైతుల ధర్నా



రైతులతో మాట్లాడుతున్న ఏసీ హేమంత్

కంప్లి: కురుగోడు సమీపంలోని మల్లప్ప చెరువు భూమిలో పంటలు సాగు చేస్తున్న రైతులకు పట్టాలను అందించాలని ఒత్తిడి చేస్తూ గత 40 రోజులుగా చేస్తున్న ధర్నా స్థలానికి అసిస్టెంట్ కమిషనర్(ఏసీ) హేమంత్ విచ్చేసి రైతులతో చర్చించారు. చెరువులో అక్రమంగా సాగు చేయడంపై ఎవరూ అనవసరంగా అడ్డు పడకపోయినా ధర్నా చేయడం సరికాదన్నారు. 50 ఏళ్లుగా ఉన్న సమస్యకు ఒక్క రోజులో పరిష్కారం దొరకదన్నారు. భూ దాఖలాలు ఉంటే జిల్లాధికారితో చర్చిస్తానన్నారు. అనంతరం రైతాంగం మాట్లాడుతూ ఏళ్ల తరబడి చెరువు భూమిలో సాగు చేస్తూ జీవిస్తున్నామని, వారిలో ఎస్సీ, ఎస్టీలు కూడా ఉన్నారన్నారు. సాగు చేస్తున్న రైతాంగానికి పట్టాల కోసం జిల్లాధికారి, ఇన్‌చార్జ్ మంత్రితో చర్చించేందుకు వేదిక ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ప్రముఖ మార్గాల్లో ర్యాలీ నిర్వహించారు. హెచ్ఆర్ నవీన్‌కుమార్, వీఎస్ శివశంకర్, గాళి బసవరాజ్, సోమయ్య, శంక్రప్ప, అమీన్ సాబ్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

మెగా టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేయండి



మాట్లాడుతున్న లక్ష్మిరెడ్డి

రాయచూరు రూరల్: నగరంలో మెగా టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేయాలని రాయచూరు కాటన్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మిరెడ్డి డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో 7 చోట్ల మెగా టెక్స్‌టైల్ పార్కుల ఏర్పాటుకు ఆమోదం తెలిపిందన్నారు. రాయచూరులో పార్కు ఏర్పాటుపై ఎంపీలు, ఎమ్మెల్యేలు చొరవ చూపాలన్నారు. తమిళనాడులో విరుదునగర్, తెలంగాణలో వరంగల్, గుజరాత్‌లో నవసారి, మధ్యప్రదేశ్‌లో ధారా, ఉత్తరప్రదేశ్‌లో లక్నో, మహారాష్ట్రలోని అమరావతిలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పత్తి అధికంగా పండించే రాయచూరు, యాదగిరి జిల్లాలకు మెగా టెక్స్‌టైల్ పార్కు మంజూరు చేయాలన్నారు.